శ్రీ బాలాజీ

శ్రీ మద్విరాట్ పోతులూరి

# వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర


## దివ్యస్తోత్రాలు - నిత్యపూజ - దర్శనీయ స్థలాలు




కె.వీరబ్రహ్మాచారి

# శ్రీ మద్విరాట్ పోతులూరి
# వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర

## దివ్యస్తోత్రాలు-నిత్యపూజ-దర్శనీయ స్థలాలు



సంకలనం

**కె. వీరబ్రహ్మాచారి**

-: ప్రచురణ :-

శ్రీ మద్విరాట్ పోతులూరి  వీరబ్రహ్మేంద్రస్వామి వారి
జీవిత చరిత్ర

సంకలనం : కె.వీరబ్రహ్మాచారి

ముద్రణ : 2013

వెల :

ప్రచురణ :
శ్రీ బాలాజీ పబ్లికేషన్స్
విజయవాడ

# శ్రీ మద్విరాట్
# పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు



ఈ గ్రంథాన్ని బహూకరించినవారు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మొదటి ప్రకరణము | 7 |
| 2. | రెండవ ప్రకరణము | 25 |
| 3. | మూడవ ప్రకరణము | 45 |
| 4. | నాల్గవ ప్రకరణము | 55 |
| 5. | ఐదవ ప్రకరణము | 61 |
| 6. | ఆరవ ప్రకరణము | 69 |
| 7. | ఏడవ ప్రకరణము | 75 |
| 8. | ఎనిమిదవ ప్రకరణము | 83 |
| 9. | తొమ్మిదవ ప్రకరణము | 100 |
| 10. | పదవ ప్రకరణము | 108 |
| 11. | పదకొండవ ప్రకరణము | 119 |
| 12. | పన్నెండవ ప్రకరణము | 127 |
| 13. | పదమూడవ ప్రకరణము | 128 |
| 14. | పద్నాల్గవ ప్రకరణము | 133 |
| 15. | శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సుప్రభాత స్తోత్రమ్ | 146 |
| 16. | శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రపత్తి స్తోత్రమ్ | 151 |
| 17. | శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి మంగళహారతి | 158 |
| 18. | శ్రీ వీరబ్రహ్మం గారి మాలాధారణ దీక్షా విధానం | 159 |
| 19. | శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి అష్టకమ్ | 162 |
| 20. | శ్రీ వీరబ్రహ్మం గారి పూజావిధానము | 164 |
| 21. | శ్రీ వీరబ్రహ్మం గారి వీర నామములు | 171 |
| 22. | శ్రీ వీరబ్రహ్మం గారి పాటలు | 177 |
| 23. | శ్రీ బ్రహ్మంగారి మఠం-పరిసరాల్లోని దర్శనీయ స్థలాలు | 179 |



## శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వాముల వారు

ప్రస్తుత మఠాధిపతులు అతి చిన్న వయసులోనే మఠాధిపత్యము వహించి మఠాభివృద్ధికి కృషి చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి సారస్వతాన్ని ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తెచ్చిన ఘనత వీరిదే. వీరి హయాములోనే నిత్య అన్నదాన పథకము ప్రారంభించారు. యాత్రికుల సౌకర్యార్థం వసతి గృహాలు నిర్మింపజేశారు. వీరికి పలుచోట్ల తులాభారములు, కిరీటధారణలు, కంకణ ధారణలు భక్తులు జరిపారు. ప్రతియేటా వీరబ్రహ్మేంద్రస్వామి వారికి సంబంధించిన ఉత్సవాలు, పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తూ, బ్రహ్మంగారి మఠానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చారు.





శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి పాత్ర ధరించిన

డా॥ నందమూరి తారకరామారావు గారు

# శ్రీ మద్విరాట్
# శ్రీ పోతులూరి వీరబ్రహ్మం గారి జీవిత చరిత్ర

## మొదటి ప్రకరణము

### 1. శ్రీ వీరబ్రహ్మంగారి అవతార నేపధ్యం

అది విజయనగర సామ్రాజ్యము వైభవముగా వెలుగొందుచున్న కాలము. అయినప్పటికీ ఆనాటికీ కలి ప్రభావము ఎక్కువయై ధర్మమునకు హానికలుగుట ప్రారంభమైనది. అన్యమతముల వారి దౌష్ట్యముల వలన గో, శిశు హత్యలు, స్త్రీల అత్యాచారాలు మిక్కుటముగా జరుగుచ్నువి. మ్లేచ్ఛుల ఆక్రమణలోని రాజ్యాలలో దేవాలయములన్నీ విధ్వంసము గావించబడినవి. దినదినమునకు పాపులసంఖ్య అధికముగా జొచ్చెను. ఇటువంటి పరిస్థితులను చూచి ధర్మదేవత ఎంతో వ్యధచెందుతూ ఒకనాడు వైకుంఠములోని శ్రీహరివద్దకు వెళ్ళి స్వామితో! భూలోకములో జురుగుచున్న ఆకృత్యములన్నీ ఏకరువుపెట్టి ఆయనను తిరిగి భూమిమీద దుష్ట శిక్షణ శిష్టరక్షణ కోసము అవతరించమని ప్రార్ధించినది.

భూదేవి ప్రార్ధనను ఆలకించిన విష్ణువు ఆమెకు అభయమిచ్చి ఆమె కోరిన విధముగానే భూమిపై అవతరించెదనని మాటఇచ్చి ఆమెను సాగనంపెను. అతదుపరి శ్రీహరి సత్యలోకవాసియైన బ్రహ్మదేవుని, కైలాసపతియైన పరమేశ్వరుని, తన సన్నిధానమునకు పిలిపించి, వారితో 'ఓ బ్రహ్మా! శంకరులారా! మనకు ఈకలియుగములో తిరిగి అవతారం ధరించవలసిన అవసరము ఏర్పడినది. ఇప్పుడే ధర్మదేవత నా సన్నిధికి

విచ్చేసి, దక్షిణాంధ్రదేశములో జరుగుచున్న ఆకృత్యములు, ధర్మహాని గోహత్యలు, దేవాలయ విధ్వంసముల గురించి చెప్పి వాపోయినది. ఆమెకు నేను అవతారము ధరించి ధర్మ స్థాపనచేయుదునని మాట ఇచ్చియున్నాను. అయితే పూర్వమువలె నేను ఒక్కడినే అవతరించిన సరిపోదు కనుక మనము ముచ్చరమూ మూడు వేర్వేరు రూపాలలో అవతారములు ధరించవలసిన అవసరమున్నది"అని వారితో సంభాషించెను.

శ్రీహరి వచనములను వినిన బ్రహ్మశంకరులు తాముకూడా అవతరారములను ధరించుటకు సిద్ధపడి ఏఏ అవతారములు ధరించవలెనో తెలుపమని తిరిగి శ్రీహరిని ప్రార్థించిరి. అంత శ్రీహరి బ్రహ్మను చూసి ఓ సత్యలోక నాయకా బ్రహ్మదేవా! నీవు దక్షిణాపధములో విశ్వాత్మకుడు మాయమేయి అనేని విశ్వబ్రాహ్మణ దంపతులకు అన్నాజయ్య అనే పేరుతో వారి కుమారుడిగా అవతరించు ఆ తరువాత నీవు బ్రహ్మనందుడనే పేరుతో క్షేత్రములన్నీ తిరిగి ధర్మబోధచేయుచూ, అందరినీ ఉద్ధరిస్తూ, జీవితాన్ని కొనసాగించు అని పలికెను.

తదుపరి కైలసాధిపతియైన శంకరునిచూచి! సాంబశివా! నీవు వారణాసి పట్టణాన్ని ఏలే విజయసింగు అను రాజు ఇంటిలో ఆనందయోగిగా అవతరించు అని చెప్పి వారితో నేను " ఆంధ్రదేశమున త్రిలింగదేశమనే ప్రాంతములోని నందికొండ అనే నగరములో పాపఘ్నిఅనే మఠమున్నది. ఆ మఠములలో నివసించుచూ నిరంతరము హరిభక్తి కలిగియున్న యనమదల వీరభోజాచార్యుడు, వీరపాపమాంబ అను విశ్వబ్రాహ్మణ పుణ్యదంపతులు గలరు. వారికి కుమారుడిగా నేను అవతరించెదను. భూలోకములో నేను వీరంభొట్లు, వీరప్ప, వీరబ్రహ్మము

అను మూడు పేర్లతో వ్యవహరించబడతాను. కాలక్రమములో నేను మహాతోపోనిష్టా గరిష్టుడనై నా తల్లియైన వీరపాపమాంబకు జ్ఞానోపదేశమును చేసి హరిహరిపురం అనే ప్రాంతములో, ఆనందాశ్రమములో సూర్యోపాసన చేయుచూ వుండెదను. ఇక మీరు మీమీ లోకాలకు వెళ్ళి మీ అవతారములు ధరించుటకు సిద్ధముగా నుండండని" పలికెను.

అంత బ్రహ్మ ! శంకరులిరువురూ శ్రీహరి వచనములువిని ఆయనకు నమస్కరించి తిరిగి తమతమ లోకములకు పయనమై వెళ్ళిరి.

## ౨. శ్రీహరి కలియుగమున జన్మించుట

శ్రీనివాసుడును, ఆదిమధ్యాంతరహితుండగు శ్రీహరి బ్రహ్మాండపుర వాసులగు ప్రకృతాంబా పరిపూర్ణయాచార్యులకుపుత్రుడై అవతరింపదలిచెను. ప్రకృతాంబా పరిపూర్ణయాచార్యులు విశ్వబ్రహ్మవంశీకులు. ఆ దంపతులు సంతానహీనులై మిక్కిలి చింతించుచుండిరి. అట్లుండగా ఒకనాడు ప్రకృతాంబ, భర్తయగు పరిపూర్ణయాచార్యులకు నమస్కరించి "ప్రాణవల్లభా" "అపుత్రస్యగతిర్నాస్తి" అను వేదవాక్యంబును మీకు దెలియకపోలేదు, కనుక మనము సంతానప్రాప్తికై తీర్థయాత్రజేయుట మంచిదని నా అంతరాత్మ హెచ్చరించుచున్నది. కనుక మన మొకసంవత్సరము తీర్థయాత్ర జేయుట మంచిది" అనగా ఆమె భర్త అందుకు సమ్మతించెను.

ఆ దంపతులంతట మంచిదినము నిర్ణయించుకొని శుభలగ్నమున ప్రయాణమై తీర్థయాత్ర జేయబోయిరి వారనేక దినంబులు పలుయాత్రల జేయుచు, పుణ్యతీర్థములగ్రుంకుచు పవిత్రనదీనదంబుల స్నానమాడుచు,

మహాపుణ్యక్షేత్రంబగు కాశీక్షేత్రమును చేరిరి. అచ్చట కొన్నాళ్ళుండగా ప్రకృతాంబకు గర్భధారణ చిహ్నములు తట్టెను. అందుకామె సంతసించుచు ఆ సంగతి భర్తకెరింగింపగా అతడును సంతోషించెను. అచ్చటినుండి వారు ప్రయాణమై జన్మస్థానమునకు పోదమని వెళ్ళుచుండగా ఒకానొకఅడవిలో నిర్జన ప్రదేశంబున ప్రకృతాంబకు ప్రసవవేదన ప్రారంభమై ఒక మగశిశువును ప్రసవించెను.

## ౩. ప్రకృతాంబ శిశువును అత్రిముని అప్పగించుట

ఆ అడవిలో అత్రిమహాఋషి ఆశ్రమము నేర్పఱచుకొని తపమాచరించుచు శిష్యులకు వేదసారంబు బోధించుచుండెను. ఆ మునీంద్రు డొకనాడు స్నానార్థమై నది కేగెను అతడు నదియొద్దను సమీపంపగనే అందుండిన మహావృక్షచ్ఛాయన పత్రంబులపై శిశువును బరుండబెట్టుకొని ఒకానొకదీనురాలు దుఃఖించుచుండగని తల్లీ! నీవెవతవు? ఎందులకై ఈ ఘోరాటడవికి విచ్చేసితివి నీ భర్తయెవరు. ఆతడెచ్చటికేగెను. ఈ శిశువు ఇంతకుమునుపే జన్మించినటులున్నది. నీ సంగతులన్నియు నాకు విశదీకరింపుము” అనెను.

అందులకాయువతి మునీంద్రా నేను సంతానహీనురాలినై నా భర్తతో గూడ సంతానమును బడయగోరి పుణ్యక్షేత్రంబుల దర్శించుటకును, పుణ్యతీర్థముల దర్శించుటకు, పుణ్యనదీనదంబుల గ్రుంకులిడుటకును వచ్చితిని, కాశీక్షేత్రంబున కొంతకాలము విశ్వేశ్వరుని సేవించగా, వారి అనుగ్రహంబున గర్భము దాల్చితిని. నిజవాసంబున కేగుట మంచిదని పోవుచుండ ఇచ్చటికి వచ్చునప్పటికి నాకు ప్రసవవేదన ప్రారంభమై నాకు పురుష శిశువు జన్మించెను. ఈశిశువు జన్మించినలగ్న

ప్రభావమేమోగాని శిశువు అవతరింపగనే నాభర్త పరలోకమున కేగెను. ధర్మపత్ని పతితో గూడ మరణింపవలసినది విధియైయున్నది కదా. నేనన్న ఈ శిశువును వదలలేక ఏమి చేటుయకు దోపకున్నాను. మేము విశ్వబ్రాహ్మణులము. ఇదే నాశిశువును మీ కప్పగించితిని మీ యిష్టము అని సమీపములోని నదిలోబడి ప్రాణములు త్యజించెను.

## 4. వీరభోజయాచార్య దంపతులు సంతానప్రాప్తికై గోవిందుని ప్రార్థించుట

నందికొండ సమీపమున నుండు పాపఘ్ని మఠమున విశ్వబ్రాహ్మణుడగు వీరభోజయాచార్యుడు తన ధర్మపత్నియగు వీరపాపమాంబతో కాపురమొనరించుచుండెను. అతడు పాపఘ్ని మఠాధిపతియైనా దేవబ్రాహ్మణభక్తుడు సదా శ్రీమన్నారాయణుని ధ్యానించుచుండెను అతడు అతిధిసత్కారమునకు పేరుప్రఖ్యాతి చెందినవాడు.

అతడు సత్యధర్మములు తప్పక బీదసాధుల ప్రేమించుచువారి కనేకవిధముల సాయపడుచుండెను. ముప్పొద్దుల దేవతార్చన చేయక తీర్థమునుగూడ పుచ్చుకొనకుండెను. అతని భార్య వీరపాపమాంబ సుగుణఖనియై సదాచారసంపన్నురాలై, భర్తయే దైవమని నమ్మి పూజించెడిది. పరమపతివ్రతయు దైవభక్తురాలునునై పతికి అన్నివిధములదగిన భార్యయనిపించుకొని యుండెను. ఆ మహాతల్లికి సంతానము లేకపోయెనేయను చింతతప్ప ఇతర చింతలేకుండెను.

ఇట్లుండ ఒకానొకదినంబున వీరభోజయాచార్యుడు గృహమున లేని సమయమున ఒక మహాపురుషుడువచ్చి వీరపాపమాంబను చూచి

"భగవతీ భిక్షాందేహి" యని తలవాకిటి నిలిచెను అతనిని జూడగానే వీరపాపమాంబ అపరిమితానందభరితురాలై జలపూర్ణకలశంబుతో వెళ్ళి యాతని పాదంబుల గడిగి యా జలంబుల శిరముపై జల్లుకొని లోపలికిరండని తోడ్కొనిపోయి ఉచితాసనముపై గూర్చుండగోరెను.

ఆ మహాపురుషుడు పీఠముపై గూర్చుండి తల్లీ! నీవు సంతానము కలుగలేదని ఖిన్నురాలవై సదా సంతానమునాసించి శ్రీహరిని పూజించుచుంటివి, నీకును నీ భర్తకును వృద్ధాప్యము వచ్చినదికదా నీకు గర్భధారణ శక్తిచాలదు అయినను నీకు సుపుత్రప్రాప్తికలదని తెలిసికొంటిని శ్రీహరికి మీయందనుగ్రహము కలిగినది. ఆయనే మీ కుమారుడుగా అవతరించును, నీవు చింతింపకు" మనెను.

అపుడు వీరపాపమాంబ స్వామీ! నాకు గర్భధారణ ఉత్పత్తిలేదని ఇపుడేకదామీరంటిరి, నాకు సంతాన మెట్లు కలుగును. అదియును గాక శ్రీహరియే మాఇంట పుత్రుడై జన్మించునంటిరి మీమాట విశ్వసింప మందురాయనెను. అందులకామహాపురుషుడు జననీ! నన్నేల సంశయించెదవు నామాటలురిత్తపోవు శ్రీమన్నారాయణమూర్తి మీ ఇంటికి మీపుత్రుడుగా రాగోరి అపుడే అవతరించియుండెను. అతడు ఒక దివ్యపురుషుని ఆశ్రమమున పెరుగుచున్నాడు. నీవు భర్తలతో గూడ దివ్యక్షేత్రములు దర్శించినయాత్రలజేయవలసిన కాలము సమీపించినది. ఆ యాత్రల చేయునపుడు మీకుమారుడు మీకు లభించును అని చెప్పుచు అంతర్ధానమైపోయెను.

అంతలో కార్యార్థమై బయటికి వెళ్ళిన వీరభోజయాచార్యుడు విచ్చేసెను. భర్తనుజూచినదే వీరపాపమాంబ ఆనందముతో ఎదురేగి

లోపలికి పిలిచికొనిపోయి నాధా! మనభాగ్యమేమందును ఇంతకుముందే మన యింటి కెవరో దివ్యపురుషుడు విచ్చేసెను. ఆ మహానుభావులు శ్రీహరియే మన ఇంటికి మనకుమారుడై వచ్చుట కపుడే భువిలో జన్మించినాడట, మనము తీర్థయాత్ర లందజేయ బోయినచో మనకాబాలకుడు లభించునట ఒక నిమిషముందు వచ్చియుండినచో ఆ మహానుభావునితో మీరు మాట్లాడి యుండవచ్చునని పలికి మనము తీర్థయాత్రల చేయబోవుటకు దగిన సుముహూర్తమును నిర్ణయింపుడనెను.

అందుకు వీరభోజయాచార్యుడు ప్రియా! నీవు మిక్కిలి అదృష్టవంతురాలవు ఆ మహాపురుషుడు శ్రీ హరియో, పరమేష్టియో లేక సదాశివుడో యైయుండును, ఆతని దర్శించి ఆతిధ్యమిచ్చు భాగ్యము లేకపోయెనే యని చింతింపవలసి యున్నది. అయినను అతని మాటలను మనము వృధాచేయరాదు అని తీర్థయాత్రల జేయబోవుటకు సంసిద్ధుడయ్యెను.

## 5. వీరభోజయాచార్య దంపతులు తీర్థయాత్రలకు వెళ్ళుట

ఆరీతిగా కొన్నాళ్ళు గడిచిన తర్వాత వీరభోజయాచార్యుడు ఒక వైదిక బ్రాహ్మణుని రావించి తాను భార్యా సమేతముగ యాత్రలు జేయ బోవుటకు దగిన సుదినమును నిర్ణయింపుమనెను. ఆ విప్రుడు దినవార నక్షత్రలగ్నయోగంబుల పరిశీలించి ఒక దినమును నిర్ణయించిపోయెను. అపుడా దంపతులు బ్రాహ్మణుడు నిర్ణయించి దినమున వారికి కావలసిన వస్తువులు మూటగట్టుకొని బయలుదేరి దినమొక మజిలీచేయుచు ప్రయాణము సాగించుచుండిరి.

వీరపాపమాంబా వీరభోజయాచార్యులు మొదట శ్రీశైలమును దర్శించి మల్లికార్జునునిపూజించిరి. అచ్చటనుండి బయలుదేరి కృష్ణాగోదావరి నదులలోమునిగి ద్రాక్షారామమునుచేరిరి. అచ్చట ద్రాక్షారామలింగేశ్వరుని అర్చించి జగన్నాథమునుజేరిరి. అచ్చట జగన్నాయకుని పరిపరివిధముల సేవించి, సుభద్రాదేవిని పూజించి, సరస్వతి తీర్థమున స్నానముచేయ నుద్దేశించి యచటకేగి ఆ తీర్థమున గ్రుంకి అది అత్రిమహాముని ఆశ్రమ భూమియని తెలిసికొని ఆ మునిని దర్శింపబోయిరి.

## 6. అత్రిమహాముని అనుగ్రహముతో పుత్రుని పొందుట

ఆ దంపతులు అడవిలోని ఫలపుష్పములను సేకరించి అత్రిమహాముని ఆశ్రమమునుజేరి, ఋషిపుంగవునికి సాష్టాంగ నమస్కారము లొనరించిరి. అపుడాఋషి వీరపాపమాంబ శిరముపై పుష్పములవేసి "దీర్ఘసుమంగళీ భవ సుపుత్రప్రాప్తిరస్తు" అని ఆశీర్వదించెను. అందులకా దంపతులు కరముల ముకుళించి సవినయముగా నిట్లనిరి. స్వామీ! కొన్ని దినముల క్రింద ఒకానొక దివ్యపురుషుడు మా గృహమునకు విచ్చేసి మేము వృద్ధులమగుటచే మాకు సంతానము కలుగదని సెలవిచ్చెను. మీరిట్లాశీర్వదించితిరి. దీనికి మీ రేమందురో సెలవిండని ప్రార్థించిరి.

అందులకాముని దివ్యదృష్టిని బరికించి "ఆర్యా! మీ పలుకులు సత్యేతరములుగావు. ఆ మహాపురుషుడు శ్రీమన్నారాయణుడేకాని వేరుకాడు. మీరాయనను దర్శించితిరి కావున మీ జన్మముతరించినది అయ్యా! ఆ మహాపురుషుడు మీకు పుత్రుడు లభించునని యానతిచ్చెనా లేదా" యనెను.

అందుకు వీరపాపమాంబ మునికులతిలకా! ఆదివ్యపురుషుడు మాకు యాత్రలుజేయు యోగంబున్నదనియు అపుడు మాకొక మహాత్మునిదర్శనము లభించుననియు సెలవిచ్చెను ఆప్రాప్తము మాకెవరివలన ఎప్పుడు సిద్ధించునోకదా! యని వచించినంతనే, అత్రిమునీంద్రుడు తల్లి! నీవు ధన్యురాలవుఅని ప్రక్కనుండిన శిష్యులలో నొకరినింజూచి ప్రకృతి గర్భముక్తాఫలంబగు శిశువును తెమ్మనెను. అతడు వెంటనే పర్ణశాలలో నిద్రించుచుండిన బాలకునిదెచ్చి మునిపుంగవుని కరములయందుంచెను. అత్రి ఆబాలుని ముద్దిడుకొని వీరపాపమాంబ కొసగి పతివ్రతా తిలకమా! ఈ యర్భకుడు సామాన్య బాలుడుకాడు. శ్రీమన్నారాయణాంశమున అవతరించిన దివ్యపురుషుడు విశ్వబ్రాహ్మణవంశమునకు జెందిన ప్రకృతాంబా పరిపూర్ణ యాచార్యులకు జన్మించినావాడు ఈ శిశువు యింతవరకు గోక్షీరములవలన పెంచబడెను. వీనిని తీసుకువెళ్ళి మీ పుత్రుడుగా పెంచుకొనండని చెప్పి పంపెను.

## 7. శ్రీ వీరబ్రహ్మం గారి జననము - బాల్యము

అత్రిమహామునివలన పుత్రునింబడిసి ఆతని పాదపద్మములకు సాగిలపడి ఆశీస్సులబొంది సెలవుదీసికొనియర్భకుని ఒడిలోపెట్టుకొని వీరభోజయాచార్యుడు ముందునడుచు చుండగా, వీరపాపమాంబ యతని ననుసరించి పోవుచుండెను. ఈరీతి దినమొకమజిలియొనరించుచు కొన్ని దినంబులలో తమ నివాసంబగు పాపఘ్ని మఠమును జేరినవారైరి.

నిజవాసంబును జేరినదే వీరభోజయాచార్యుడు తన బంధుమిత్రులను రావించి తామొనరించిన తీర్థయాత్రలను గురించి తెలుపుచు అత్రిమహాముని దర్శంబును ఆమహానుబావుడు ఒసగిన యర్భకుని

వృత్తాంతమును వివరించి ఆ బాలునకు తగిన నామకరణము జేయు సంకల్పించి ఆచార్యుల రప్పించి నామకరణ మహోత్సవమునకు తగిన ముహూర్తమును నిశ్చయించి, యెవరి గృహంబులకు వారిని బంపించెను.

నామకరణ మహోత్సవమునకు ముందటిదినము భార్యభర్త లిరువురును ఏ పేరు పెట్టిన బాగుండునని యేనామముస్ఫురింపనందున యోచించుచు రాత్రి పరుండి నిద్రపోయిరి. వారు గాఢనిద్ర పరవశులై యుండ అర్ధరాత్రిగడిచిన తదుపరి శ్రీహరి స్వప్నంబున దర్శనమిచ్చి "ఓ వీరభోజయాచార్య! నేనే నీకుమారుడను కాగోరి నీయింటికి వచ్చితిని కనుక నీవు నాకు రేపటిదినము వీరప్పయ, వీరంబొట్లు లేక వీరబ్రహ్మము" అను నామముతోనీ యిష్టము వచ్చిన పేరుపెట్టవచ్చును. అయినను నాకు కడపట నిలుచునది "వీరబ్రహ్మము" అను పేరే సుమా అని అంతర్హితుండయ్యెను.

అంత తెల్లవారగనే తన స్వప్నవృత్తాంతమును భార్యకు చెప్పిన ఇద్దరును గలిసి వీరబ్రహ్మము అను పేరుపెట్టనిశ్చయించుకొనిరి. ఆనాడు ఉదయము నుండి మంగళవాయిద్యములు మ్రోగుచుండ పురోహితులను, పండితులను, జ్యోతిష్యులను, కవులును, గాయకులును, బంధుమిత్రాదులు రాగా సమంత్రకంబుగా నామకరణ క్రతువును ముగించి అందరియెదుట "వీరబ్రహ్మము అనునామమునిడిరి. అపుడు వీరభోజయాచార్యుడు అందరిని తగినట్లు సత్కరించి పంపించెను.

అంతట వీరపాపమాంబ కుమారరత్నంబగు వీరబ్రహ్మమును అల్లారుముద్దుగ పెంచుచుండ యర్భకుడగు బాల వీరబ్రహ్మము. చిన్నతనము నుండి శ్రీకృష్ణ పరమాత్మ వలె బాల్యచేష్టలను చేయుచూ, ఒక సంవత్సరము

వయసు వచ్చినంతనె వడివడిగా నడచుట, ముద్దుముద్దు మాటలాడుట ప్రారంభించెను. అయిదు వత్సరముల ప్రాయము వచ్చునాటికి ఎన్నో విషయములను గ్రహించగలిగి తన యొక్క చేష్టలతో తల్లిదండ్రులను, ఇరుగుపొరుగు వారందరినీ ఎంతో ఆశ్చర్యచకితులను చేసెను.

ఈరీతి బాలుడగు వీరబ్రహ్మము తల్లిదండ్రులనేగాక గ్రామవాసులందఱును ఆనందింపజేయుచు అందరిచే మిక్కిలి ప్రేమింప బడుచుండెను. వీరబ్రహ్మము అయిదేండ్ల బాలుడగునప్పటికి అతని తండ్రి వయోవృద్ధుడై నందున దినదినమునకు తనబలంబులు సన్నగిల్లుచుండ కొంతకాలమునకు వీరభోజయాచార్యుడు తన దేహమును చాలించి స్వర్గమును జేరుకొనెను.

అపుడు అతని ధర్మపత్నియగు వీరపాపమాంబ పతివియోగ దుఃఖము భరింపలేక, పతితో సహగమన మొనరింప సిద్ధపడెను. అపుడా ఊరి పెద్దలు, పిన్నలు, పండితులు, గ్రామాధికారులు ఏకముఖమున ఆమెకడకువచ్చి చిన్న వీరబ్రహ్మమును దిక్కులేనిపక్షిగా నొనరింపవలదని అనేక ప్రకారంబుల బ్రార్థించి సహగమన విరక్తురాలింగావించిరి.

అందుకామె వీరప్పయ్యకొఱకే జీవింపవలసి వచ్చెను. అపుడామె భర్తకు విద్యుక్తముగ అపరక్రియల ముగించి, దివ్యసుందరాకారుడగు చిన్న కుమారుని బాల్యక్రీడలజూచి, పతివియోగ దుఃఖమును మరచి ఆనందించుచుండెను. ఆ తల్లి ఉదయమే బాలకులకు స్నానముచేయించి నొసట విభూతిరేఖల దిద్దినచో చూచెడివారికి సత్యలోకము నుండి ఆ బ్రహ్మయే బాలకుని రూపము వచ్చెనాయని. యనిపించుచుండి తల్లిచూడ ఆనంద సముద్రమున మునిగి తేలుచుండెను.

## 8. శ్రీ వీరబ్రహ్మం గారి విద్యాభ్యాసము

తదుపరివీర పాపమాంబ బాలుడు పంచవర్షప్రాయుడైనందున అతనిని ఒక గురువు నొద్ద విడిచి విద్య నేర్పింపదలచెను. లోకము బాలునకు విద్య నేర్పింపనిచో "ముండపెంచిన బిడ్డ, మొగత్రాడు లేనిఎద్దు" ఒకటేనని పలుకుదురు, తానే తండ్రి తల్లియై వీరబ్రహ్మమును విద్యావంతుని జేయక తప్పదని తీర్మానించుకొనెను.

ఆమె ఒక శుభమూహూర్తమును విచారించి సకలశాస్త్ర పురాణములు చదివి పండితుడనిపించుకొన్న గురుసత్తముని రావించి గురుసత్తమా! మన వీరప్పుడు తండ్రిలేని బిడ్డయని మీరెరుంగుదురు. బాలునకు యైదేండ్లు నిండినవి ఇదియే విద్యాభ్యాసమునకుదగిన వయసుకదా. విద్యాహీనుడగు వాడెట్టివాడైనను పశువులతోసమానమని పెద్దలందురు కనుక నా యందు దయయుంచి ఈకుమారుని మీయాశ్రమమునందుంచుకొని విద్యావంతుని జేయుడు" అని ప్రార్థించెను.

అందులకా గురుసత్తముడు "తథాస్తు" అని దీవించి అమ్మా! నీ కోర్కెను నెరవేర్చెదను, ఈ బాలుని ముఖమునజూడ సకల విద్యాపారంగతుడు కాగలడనితోచింది. నేనీ బాలుని నా ఆశ్రమమునకు పిలుచుకొని పోయెదను. గురుకులవాసము పూర్తియగులోపల సకలవిద్యల నేర్పి మరల నీపుత్రుని నీ కర్పించెదను భయపడవలదనెను, అప్పుడు తల్లి కుమారుని జూచి నాయనా! గురువుగారి వెంటబోయి వారు నేర్పెడివిద్యల నేర్చుకొని వత్తువాయనెను. అందులకు బాలుడు కరముల జోడించి అని తల్లికి నమస్కరించి ఆమెదీవెనలగొని గురుదేవుని వెంట గురుకులవాస మొనరింప బయలుదేరెను.

ఆ గురుసత్తముడు వీరబ్రహ్మమును తన ఇంటికి పిలుచుకొని పోయి తన పుత్రునికంటె ఎక్కువ ప్రేమతో ఆదరించుచు ఒక శుభదినంబున తనయెదుట కూర్చుండబెట్టుకొని నాయనా! నీకు ముందుగ “గురు” అను రెండక్షరముల యందలి గూడార్థమును దెలిసికొనవలెను దాని నెరింగిచెద వినుము. గు–అనగా అంధకార. రు–అనగా తేజస్సు లేక ప్రకాశము గురువు అనగా ఒక మానవుని అంధకారము నుండి బయటికిలాగి ప్రకాశముతో గూడిన స్థితికి తెచ్చెడి వాడని అర్ధము.

అట్టిగురుసత్తముడు పక్షపాతములేక నిర్మల హృదయడను, శాంతస్వరూపుడును, త్రికరశుద్ధి గలిగినవాడును దయ ప్రేమసత్యములకు నెలవైనవాడుగను నుండవలయును. అతడు వాచాలుడును, కామక్రోధ మదమాత్సర్యములకు లోబడనివాడుగను నుండవలెను. అట్టి యుత్తమగుణములు గలవానిని గురువుగ భావించవలెను.

ఇక శిష్యుడు అననేమో వివరింతును వినుము. అన్ని వర్ణముల వారును సకలవిద్యల నభ్యసించుటకు అర్హులై యుందురు. అట్టివారును తమ గురువును దైవముగానమ్మి శ్రద్ధతో అతడు బోధించు నీతిని, చదువులను విని నేర్చుకొనుచుండవలెను. అని వీరబ్రహ్మమునకు నీతుల బోధింప, నతడు గురువును భక్తితో సేవించుచు ఆ గురుమహారాజువల్ల నేర్వదగిన విద్యల నభ్యసింపగలిగెను.

ఆరీతి వీరబ్రహ్మము గురుకులమున సకలవిద్యలనేర్చి, ఒకానొక దినమున గురువు సన్నిధికేగి “గురునాధా! తాము నాయందు కరుణగలిగి సకలవిద్యల బోధించితిరి, మీ ఋణమును దీర్చ నాచేతగాదు ఇక నాకు సెలవొసంగినచో వృద్ధురాలైయున్న నాతల్లి కడ కేగెద” ననెను.

ఆ మాటలకు గురువు సంతోషితస్వాంతుండై “నాయనా! నీకు శుభమగుగాక” అని ఆశీర్వదించి తల్లికడకు బోనాజ్ఞ యిచ్చెను. అంతట వీరంబొట్లయ్య గురువు పాదపద్మములకు భక్తితో నమస్కరించి గురువు తనకుతోడుగా పంపిన సహచరులతో సంతోషముగ మాట్లాడుచు, తన ఊరికివెళ్ళి తల్లిసేవ జేయుచుండెను.

## 9. శ్రీ వీరబ్రహ్మం గారు తల్లికి జ్ఞానోపదేశమును చేయుట

ఆరీతి వీరబ్రహ్మము తన తల్లికికి సేవ లొనరించుచుండెను. అప్పటికి అతడు సుమారు పండ్రెండు సంవత్సరములుదాటిన బాలుడాయెను. అంతలో నతనికి దేశసంచారమొనరింపవలెనని కోర్కె జనింపగా అతడు తల్లికి నమస్కరించి “అమ్మా నాకు తాపసవృత్తి నవలంబించి దేశసంచారము వెళ్ళవలెనను కోరిక జనించినది, దేశసంచార మొనరించినగాని ప్రపంచజ్ఞాన మలవడదు, నన్ను “కూపస్తమండూకమువలె మన మఠముదాటి బయటికి బోనియకుండుట మంచిదికాదు దయయుంచి నాకు ఆజ్ఞయిమ్మని” ప్రార్థించెను.

అందుకు వీరపాపమాంబ నాయనా! నేను సంతానరహితనై పరితపించుచు శ్రీహరిని పరిపరివిధముల ధ్యానింపగా నిన్ను ప్రసాదించెను. ఇపుడు నీ తండ్రియు పరమపదించెను. ఇప్పట్టున నన్ను దిక్కులేని దానినొనరించి దేశయాత్రలకేగెద ననుచుంటివి. ద్వాదశవర్షప్రాయమెక్కడ దేశయాత్రలెచ్చట. ఈపిచ్చి కోరికలు మానుము. దేశయాత్ర అష్టకష్టములలో నొక్కటి ఇపుడు నీవు కష్టపడనేల. ఇచ్చట నీకేకొఱతయు లేదుగదా? “నక్క యెక్కడ నాగలోక మెక్కడ” అనునట్లు నీకీ విపరీతపు కోరిక యేల జనించెనో తెలియరాకున్నది, నీ దేశయాత్ర మిగుల

కష్టపరంపరలతో గూడుకొని యుండును. నీవు కావలయునని కష్టముల నొడిగట్టగోరుచుంటివి. అందులకు త్రికరణశుద్ధిగా నేను సమ్మతింపజాలను నిన్ను విడిచి నేనొక నిమిషమైనను జీవింపజాలను ఇన్ని దినములు తపించి నిన్ను బడసినందులకును, నిన్ను అతిప్రేమతో పెంచి పెద్దజేసినందుల కిదియాఫలము, నన్ను నడియేటముంచి పోజూచెదవా? ఈ బుద్ధి నీకెట్లు జనించెనో నాకు స్ఫురింపకున్నది.

ఈ మాటలు నీవు బుద్ధిపూర్వకముగ పలుకుచుంటివా లేక నీయందు పిచ్చిదయ్యము ప్రవేశించి యిట్టిమాటలు పల్కించుచున్నాదా! నీ మాటలు నాకు కర్ణకఠోరములుగా నున్నవి. అట్టిమాటలు నేను ముమ్మాటికి విననొల్లను నీవు ఒకసారి కన్నులమూసికొని, హృదయముపై చేయునిడి నీ యంతరాత్మనుద్దేశించి నీవాడు పలుకులలో న్యాయమున్నదేమో తెలుసుకొనుము. నాన్నా! నీ పలుకులవిన్నచో నాగుండె లదరిపోవుచున్నవి. నా దేహము కంపించుచున్నది. నా కన్నులు గిరగిర తిరుగుచున్నవి నాకు కన్నులు కనబడుటలేదు. చెవులు వినుటలేదు. నీవు నన్ను వదలిపోయిన నాప్రాణములు నిక్కముగ నిలువదని వడంకుచు క్రింద కూర్చుండెను.

అపుడు వీరబ్రహ్మము తనలో యిట్లాలోచింప సాగెను. ఈమె యింకను అజ్ఞాన కడలిలోబడి దిక్కుతోచకున్నది. ఈమె మాయాలోకమును గుర్తింపలేక అమాయకురాలై పరితపించుచున్నది. ఇక నేను తడవుచేయక తల్లికి జ్ఞానోపదేశ మొనరింపవలెనని తల్లిజూచి "మాతా! ఏ దుఃఖించెదవు", నీవు లోకాధిపత్యమును వహింపగల తనయుని పొంది సామాన్య మానవుల తల్లివలె దుఃఖించెదవేల, ఆది అంతములేని లోకపీఠము నధిరోహించి, మానవులచే పూజల గొనదగిన నాకీ మఠమునందలి పీఠమేల

సర్వమానవసేవ యొనరించి వారిని తరింపచేయగల శక్తి నాయందుండ, తల్లివగు నీ సేవయొనరించి నిన్ను తరింపజేయజాలానా.

అమ్మా! నీవు నేను అనెడి భేదభావమును గలిగియుండగూడదు. నాది అనునది యీసృష్టియందెవరికీలేదు. తల్లీ! మనము చూచుచుండగనే ఎందరో జన్మించిరి. ఎందరో చనిపోయిరి. తండ్రిచచ్చిన కుమారుడును, కుమారుడు మరణించిన తండ్రియు కొంతసేపు విలపించి తదుపరి మరచిపోవుటయేకాని ఒకరు మరణించిన వారివెంట నా యనువాడు మరణించుట లేదు. కనుక యీ లోకమున నా అను దానిని పూర్తిగా మరచిపోవుట లెస్స. కనుక నీవుకూడ నా మఠము, నా కుమారుడు అను దానిని మరచిపోవలెను.

ఓ మహాతల్లి! జీవాత్మ పరమాత్మ అనునవి రెండు కలవు. వానిని గురించి వివరించెద వినుము.

జీవాత్మా – జీవాత్మ యనగా అజ్ఞానముతో కూడిన జీవుడు ఇది మానవలోకమున పుట్టి సర్వజీవకోటిని ఆవరించియుండును. దానికే ప్రాణమని పేరు జీవాత్మ నావరించియుండుమాయ అనగా అజ్ఞాన మెపుడు వీడిపోవునో అపుడు జీవాత్మ పరమాత్మలో జేరినదగును.

పరమాత్మ – పరమాత్మ అనగా పరిశుద్ధజ్ఞానముతో కూడిన జీవుడు లేక ప్రాణి దానికి నా నీ అను భేదముండదు. పరమాత్మయను దానికి జనన మరణాదులుండవని తెలిసికొనుము.

తారకము – అమ్మా! నీకు తారకమునుగూర్చి చెప్పెదను వినుము. తారకమువలన పరమాత్మను తెలసికొన వీలుబడును దీనిని పరమాత్మ

నుపాసించు యోగమనియు పిలుతురు. ఇది పరిశుద్ధ జ్ఞానోదయమున లభించును. ఇది మానవులను సంసార మహాసముద్రమునబడి దారిగానగ మునుగుచు దేలుచు పరితపించునట్టి వారికిపడవయై, సముద్రమును దాటించి మోక్షమార్గమును చూపును. ఈ తారకమునకు పంచముద్రలుగలవు వానిని 1. ఖేచరి, 2. భూచరి, 3. మధ్యమ, 4. షణ్ముఖ, 5. శాంభవీ ముద్రలని పిలుతురు.

ఈ పంచముద్రల నెఱింగి వానిద్వారా ప్రణవశబ్దంబు వలన బరగిన చిణిద, చిణి, చిణినాద, తాళనాద, వేణునాద, భేరీనాద, మృదంగ, మేఘ, మున్నగునాదముల వరుసదప్పక వినందగుచు చూపులో బిందువును గాంచుటయే ఉకారమనంబడును. అందు గోచరించు కళయే మకార మనబడును. ఈనాదబిందుకళను గూడినదగు "ఓం" కారశబ్దమే తారకమనబడును ఇట్టి తారకమును కనిపెట్టి సర్వాంతర్యామియగు పరబ్రహ్మను గుర్తించి బ్రహ్మానందమున లీనమై పోవువారే దుఃఖరహితు లగుచున్నారు. కనుక ఓ తల్లి! నీవును పరబ్రహ్మసంధానము గుర్తించి బ్రహ్మానందముచే ఈ మాయాప్రపంచమును మరచి అమనస్కవైనచో ఆ పరబ్రహ్మమును చేరెదవనెను.

అమ్మా! వేయేల నావచనముల మిథ్యయని భావింపవలదు. నీ తనయుని మాటల బ్రహ్మవాక్కులని తెలిసికొనుము. "తల్లి! నీవు ఒక క్షణము కన్నుల మూసికొని వెంటనే తెఱచి చూడమనగా" ఆమె ఆవిధముగా చేసెను. వెంటనే ఆమె యెదుట కుమారుడగు వీరబ్రహ్మం స్థానంలో ఒక మహాదివ్య పురుషుడు కనబడెను.

## 10. శ్రీ వీరబ్రహ్మం గారి విశ్వరూప దర్శనము

శ్రీ వీరబ్రహ్మం గారి భీకరాకారమును గనినంతనె వీరపాపమాంబ గడగడ వడంకుచు కరముల జోడించి నాయనా! నేను మాయకులోబడి నిన్ను నాపుత్రుడనియు, సామన్య మానవబాలుడవనియు దలచితిని, ఆనాడు అత్రిమునీంద్రుడు నిన్ను నాకర్పించునపుడు "అమ్మా! ఈ బాలుడు మాయాగర్భ జనితుడనియు, మానవ గర్భమునందుండి వెడలినవాడు కాడనియు, శ్రీమన్నారాయణమూర్తి అంశమున ప్రకృతికి జన్మించెనని చెప్పగా వింటిని. ఆ మాటలు అప్పుడే మరచితిని, అందలి గూడార్ధము ఇపుడు బయటపడినది. "తండ్రీ! లోకోశ్వరుడవగు నీవెక్కడ మానవురాలగు నేనెక్కడ, సాక్షాద్భగవంతుడవగు నిన్ను నా తనయునిగా భావించుట నాతప్పు. తండ్రీ నీరూపమును గనజాలకుంటివి మరల నీ నిజస్వరూపమును ధరించుము" అని ప్రార్థింప "ఓయమ్మా! భయపడకుము మరల క్షణము నీకన్ను మూసికొనిన వెంటనే తెరచిచూడు" మనగా వీరపాపమాంబ యట్లే చేసెను. ఆమె తిరిగి కన్నులదెరచులోపల వీరబ్రహ్మము గారు తల్లికి నమస్కరించుచు నిలబడియుండెను.

అతడు తల్లిని చూచి జననీ! యిపుడు నీవు చూచిన విశ్వరూపమును గురించినగాని, నన్ను గురించికాని ఇతరులతోననకుము. నేను నిజముగ నీపుత్రుడనే సుమా. శ్రీహరి మానవతియింట జన్మింపలేదా. అతడు అగ్నిహోత్రము నుండియే వెలువడినట్లు నేను ప్రకృతాంబ నుండి వెలువడితి నంతయేకాని వేరుకాదు అని ఆమెతో పలికెను.

ఓ జననీ! నీ విపుడు పరబ్రహ్మమును దెలిసికొనియుందువు. ఇక నాకు దేశసంచారముజేయుచు దివ్యక్షేత్రంబులకేగి మహాపుణ్య తీర్థంబులలో

స్నానమాచరించి అచ్చటచ్చటపతితులకు జ్ఞానోమార్గోపదేశం బొనరించుచు ధర్మానురక్తుల చేయబోవుటకు అనుజ్ఞనిమ్మని ప్రార్థించెను. అందులకామె నాయనా! సర్వేశ్వరుడవగు నీకు నేను సెలవిచ్చెడిదాననా, నీ యిష్టము నీవెపుడు కోరిన యపుడే వెళ్ళుము అని తన సమ్మతిని తెలిపెను.

## రెండవప్రకరణము

### 1. శ్రీ వీరబ్రహ్మం గారి దివ్యక్షేత్ర సంచారము

వీరంబొట్లయ్య తల్లికి విశ్వరూపదర్శన భాగ్యము లభింపజేయగనే ఆమె అజ్ఞానతిమిరముపోగా కుమారునకు దేశయాత్ర గావించుటకు ఆజ్ఞయిచ్చి ఆశీర్వదించెను. అపుడు వీరప్పయ్య తల్లిదండ్రులు బాల్యమున తనకు బెట్టిన యాభరణములను, దివ్యకనక వస్త్రములనువదలి కాషాయవస్త్రముల ధరించి కంఠమున రుద్రాక్షమాలయు, కరమున జపమాలయు ధరించినవాడై పాలభాగమున విభూతిరేఖలు మెరయుచుండ తల్లికి నమస్కరించి ముందు దక్షిణదేశమును జూడ నిచ్చవహించినవాడై పాపఘ్ని మఠమును వదలిబోయెను.

అతడు తిరుపతి, శ్రీకాళహస్తి కంచి, చిదంబరము, శ్రీరంగము, కుంభకోణము, మధుర మున్నగు దివ్యస్థలంబుల తిలకించి, తదుపరి రామేశ్వరమును చేరెను, అచ్చట ధనుష్కోటికివెళ్ళి మహోదధి సంగమమున స్నానమాచరించి రామేశ్వరమున రామలింగేశ్వరుని సేవించి, అచ్చట కొన్ని దినముల నిలిచి యాత్రలజేయు నెపమున వచ్చిన పతితులకు ధర్మమార్గమును ఉపదేశించుచుండెను.

తదుపరి కొనాళ్ళకు అక్కడినుండి బయలుదేరి దర్భశయమును నవపాషాణములు దర్శించి, కన్యాకుమారివరకుగల క్షేత్రములకు బోయి హరిహరపురంబునుజేరెను. హరిహరపురంబునందు గల దివ్యాలయంబుల దర్శించి దేవతలనారాధించి ఒక నిర్జనప్రదేశమున తపోనియతిం గూర్చుండి, దీక్షవహించి, సూర్యోపాసనాత్పరుండై బ్రహ్మానందముననుండెను. ఆతండారీతి కొంతకాలము అచ్చటనే నిలిచియుండెను.

## ౨. ఆనందభైరవయోగిగా శివుడు అవతరించుట

కలియుగ కైలాసంబన తగిన వారణాసి మహానగరమైయుండెను. కాశిరాజ్యమును పూర్వమునుండియు క్షత్రికావంశ సంభూతులగు రాజులు పరిపాలించుచుండిరి. ఆనాడు కాశీనగరమును విజయసింగు అను వీరుడు పరిపాలించుచుండెను.

విజయసింగున కెంతకాలమైనను సంతానము గలుగకుండెను. అతడు భార్యతోగూడ ఎన్నియోవ్రతముల నొనరించెను. తీర్థయాత్రలజేసి సకల దేవతల నారాధించియు ప్రయోజనమావంతయు గలుగనందున శ్రీపార్వతీవల్లభుని సంతాన ప్రాప్తికై సదా ధ్యానించుచచుండెను. అట్లుండగా ఒకానొక రాత్రి విజయసింగుని సతి గాఢనిద్రాపరవశురాలైయుండగ పార్వతీరమణుడు స్వప్నమున దర్శనమిచ్చి "అమ్మా నీవు పుత్రులు లేరని చింతింపకుము. త్వరలో నీ గర్భమున నేనే జన్మించెదను" అని సెలవిచ్చి అంతర్ధానయ్యెను.

అంత కొన్నాళ్ళకు విజయసింగుభార్య గర్భవతియయ్యెను. భార్యభర్తలిద్దరును శంకరుని వరమువలన పుత్రుడు జన్మించునని సంతోషముతో పొంగిపోవుచుండివారు సదా ఈశ్వరధ్యానమున కాలమును

బుచ్చుచుండిరి. అట్లుండగా రాజుభార్యకు క్రమముగా నవమాసములు దాటెను. అపుడు పూర్ణ గర్భవతియగు రాజుభార్యకు పదవ మాసమునందొక శుభలగ్నమున గర్భవేదన ప్రారంభమై ఈశ్వరాంశసంభూతుడగు కుమారుడు జన్మించెను.

విజయసింగు సాంబమూర్తి అనుగ్రహమున పుత్రరత్నమును పొందినందుకు సంతసించినవాడై పదుకొండవదినమున మంగళస్నానమును చేయించి పూజ్యులగు పురోహితులను బంధుమిత్రులను రావించి ఒక సుముహూర్తంబున అపురూపమున జన్మించి ఆనంద సముద్రమునందేలి యాడించెడి శిశువునకు "ఆనందుడు" అను నామమునిడెను.

## 3. ఆనందసింగు బాల్యము

ఆనందుడు దినదిన ప్రవర్ధమానుడై శుక్లపక్ష చంద్రునివలె సర్వకళలతో నొప్పి తల్లిదండ్రులకేకాక ఆ పురవాసులందఱకు ఆనందమును కలిగించుచుండెను. విజయసింగు 'ఆనందున'కు అన్నప్రాశన, కర్ణరంధ్రోత్సవము క్రమముగసాగించి పంచవర్ష ప్రాయుడై నంతనే విద్యాభ్యాసము చేయించెను, రాజకుమారుడు గురుకుల వాసమునజేరి సద్విద్యలన్నింటినేర్చి మరల తండ్రి గృహమునకు విచ్చేసెను.

గురుకులము నుండి తిరిగిరాగానే విజయసింగు తన కుమారునికి క్షత్రియోచితమైన విద్యలను నేర్పి వీరునిగా తీర్చిదిద్దెను. ఈ విధముగా కొంతకాలము గడిచిన తరువాత ఆనందసింగుకు పదునెనిమిది వత్సరముల ప్రాయము నిండెను. తండ్రి కుమారునకు పట్టాభిషేకము చేయనిశ్చయించి జ్యోతిష్యులను పిలిపించి వారిని తగిన ముహూర్తమును చూడమని

ఆజ్ఞాపించెను. అంత జ్యోతిష్యులందరూ ఆనందసింగు జాతకమును బాగుగా పరిశీలించి ఏకగ్రీవముగా విజయసింగుతో "మహారాజా నీకుమారునకు ఏవిధముగా చూసినను రాజయోగము లేదు. ఇతడు భవిష్యత్తులో గొప్ప యోగికాగలడని" విన్నవించిరి. ఆ మాటవిని విజయసింగు అంతాదైవలీల అని భావించి వూరుకుండెను.

## 4. ఆనంద సింగు వేటకువెళ్ళి గోవును సంహరించుట

ఇదిట్లుండ కొన్నిదినముల తరువాత ఒకనాడు ఆనంద్‌సింగు తన మిత్రులతో కలిసి అడవిలోని క్రూరమృగములను వేటాడుటకు వెళ్ళెను. అడవిలో అతను వీర విహారము చేయుచూ క్రూరమృగములను వేటాడసాగెను. ఆ సమయములో ఆ అడవిలోని ఒక సరోవరము దగ్గరకు ఒక ఆవు నీరు త్రాగుటకు వచ్చెను. ఆ సమీపములోనే ఒక వ్యాఘ్రము ఆవును గమనించుచూ ఆవు నీరుత్రాగా పైకి రాగానే దానిని భక్షించుటకు నిశ్చయించుకొనెను. ఆవు నిండుగా నీరు త్రాగి సరోవరం వెలుపలకి రాగా పొదలో దాగున్న పెద్దపులి అకస్మాత్తుగా ఆవుపైకి లంఘించెను. ఆవు అంబాఅని గట్టిగా అరిచెను అదే సమయములో అటువైపుగా సంచరించుచున్న ఆనందసింగు వ్యాఘ్రంబారి నుండి గోవును రక్షించవలెనని భావించి వ్యాఘ్రముపై బాణమును ప్రయోగించగా ఆ బాణము గురితప్పి పొరపాటున గోవుకు తగిలి ఆ గోవు వెంటనే ప్రాణములు విడిచెను.

ఆ దృశ్యముచూసి ఒక్కసారిగా ఆనందసింగు కుప్పకూలిపోయెను. అయ్యో! నేనెంత పాపాత్ముడను గోహత్యను చేసితిని. ఘోరపాపము చేసితిని. నా పాపమునకు నిష్కృతి లేదు. ఇకనేను రాజ్యమునకు ఎటుల తిరిగివెళ్ళను. నాజీవితము ముగిసిపోయినది అని పరిపరి విధాల దుఃఖించ సాగెను.

అదిచూసి అతనితో వచ్చిన మిత్రులు ఓరాజా ఇది తెలియక జరిగిన తప్పిదము కనుక మీకు ఏ దోషము అంటదు కనుక తమరు దుఃఖము పొందవలసిన పనిలేదు అని ఓదార్చిరి. తిరిగి అందరూ కలిసి నగరమునకు వచ్చి మహారాజు గారైన విజయసింగుతో జరిగిన వృత్తాంతమంతయూ వివరముగా తెలియజేసిరి.

## 5. విజయసింగు పండితులను సంప్రదించుట

ఆనందసింగు గృహమునుజేరి దుఃఖించుచు తండ్రిపాదములపై వ్రాలి "తండ్రి! నేను మహాపాపకార్య మొనరించితిని ఆపాపము ఊరక పోవునదిగాదు. అందుకు నేను నా ప్రాణమర్పించిన సరిపోవును. కనుక నేను అగ్నిప్రవేశ మొనరించుట కనుజ్ఞయిండు" అని అరణ్యములో జరిగిన విషయములను పూసగ్రుచ్చినట్లు వినిపించెను.

విజయసింగపుడు నాయనా! దుఃఖింపవలదు. ఇది తెలిసిచేసిన పాపముకాదు. తెలియక చేసిన పాపమునకు ప్రాయచ్ఛిత్తము వుండకపోదు. ప్రమాదము జరిగిన పాపము నిన్ను బాధింపదు. భయపడకుమని ఓదార్చి ఒక సేవకుని పంపి పండితుల పిలుచుకొని రమ్మనెను.

అంతట పండితులువచ్చిరి విజయసింగు పండితుల సభనేర్పాటు గావించి వారికి ఆనందుని పాపకార్యము నెరంగించి దానికి తగిన పరిహారమును యోజించిచెప్పుడని ప్రార్థించెను. అపుడు పండితులందఱు ఏకాంతమునజేరి శాస్త్రపరిశోధన గావించి రాజునుచూచి "ప్రభూ! గోహత్యాపాపము ప్రమాదముననేమి మరిదేనివలనగాని జరిగిన ఊరక వదలునదికాదు మేము శాస్త్రముల పరిశోధించి చూచితిమి. ఆ పాపము

చేసిన వారు కొంతకాలము దేశసంచామొనరించుచు దివ్యక్షేత్రములకేగి మహాపురుషుల దర్శించి వారిని సేవించినచో సరిపోవునని తెలియచెప్పిరి. అదివిని రాజు చింతాక్రాంతుడయ్యెను.

## 6. ఆనంద సింగు ఆనందయోగిగా మారుట

ఒకనాడు ఆనందసింగు తండ్రి వద్దకు వెళ్ళి "తండ్రీ మీరు బాధపడవలదు. నేను పండితులు చెప్పిన విధముగా పుణ్యక్షేత్ర సందర్శనముచేసి మహాపురుషులను సేవించి తద్వారా నేను చేసిన గోహత్యా పాపమును పోగొట్టుకొనెదను. ఆ విధముగా చేయనిచో నేను చేసిన పాపము మన వంశము వారందరినీ భాధించును" కనుక మీరు నాకు తీర్థయాత్రల చేయఅనుమతి నివ్వవలసినది" అని కోరెను. ఇక చేయునదేమి లేక విజయసింగు కుమారుడికి అనుమతినిచ్చెను. అంత ఆనందసింగు ఒక శుభముహూర్తమున గంగానదిలో స్నానమాచరించి, కాషాయ వస్త్రములు, విభూదిరేఖలు, రుద్రాక్షమాల ధరించి, ఒక యతీశ్వరుడుగా మారి ఆనందయోగి అను నామముతో తీర్థయాత్రలు చేయసాగెను.

## 7. ఆనందయోగి శ్రీ వీరబ్రహ్మమును దర్శించుట

ఆ విధముగా ఆనందయోగి కాశీనగరమును వదలి తీర్థముల దర్శించుచు గోకర్ణము, పుండరీకము, శ్రీశైలము, మహానందియాగంటి మొదలగు దివ్యక్షేత్ర సందర్శనానంతరము హరిహరపురంబును జేరి అందొక నిర్జనప్రదేశమునంజేరి భగవంతునిగూర్చి తపమొనరింప సంకల్పించి తగినస్థలమును వెదకుచుండగా ఒకానొక ఏకాంతస్థలమున యోగ నిష్టాపరవశుడైన ఒక యోగీంద్రుడు కనంబడెను.

అతనిని జూడగానే ఆనందయోగి అతడు దివ్యపురుషుడని గ్రహించెను ఆ మహాపురుషునివలన గోహత్యపాపము పోగొట్టుకొను ఉపాయము నెరుంగవచ్చు నని భావించి తపోనిష్ఠలోనున్న యతని పలుకరించినచో తపోభంగ మొనరించిన పాపము సంభవించునేమోయని భయపడి అతనియెదుట భగవంతుని ధ్యానించుచు గూర్చుండి యుండెను.

## 8. శ్రీవీరబ్రహ్మంగారు ఆనందయోగిని పరామర్శించుట

అంతట వీరప్పయ్య యోగనిష్టనుండి మేల్కొని తనయెదుట గూర్చుండి భగవధ్యానములో నిమగ్నుడైయున్న యోగిని గని "ఆనందభైరవయోగీ! నీరాకకై ఎదురుచూచుచుంటిని. నీవు కాశినగరమున విజయసింగు కుమారుడవై జన్మించినది. నే నెఱుంగదును. నీవు ప్రమాదవశాత్తు గో హత్య నొనరించితివి. అది ప్రమాదముకాదు. ఇది సర్వేశ్వరుని సంకల్పము. నిన్ను నాకడకుపంపుటకే భగవంతుడు ఆసంఘటనను గల్పించెను. నీవు చింతింపవలదు దైవాంశజనితులను గోహత్యాపాతకము సర్వదా కష్టముల పాలొనరింపదు. అదియునుగాక నీవు పరమేశ్వరుడవై ఆయన సంకల్పమున కాశీనగరమున అవతరించితివి. నీపేరు ఆనందసింగు, ఆనందయోగిగా కాక ఇకనుండి భగవంతుడు సంకల్పించిన "ఆనందభైరవయోగి అను నామంబున వెలయుచుండుము" అని పలికెను.

అది విని ఆనందభైరవయోగి సంతోషముతో వీరప్పయ్యకు సాష్టాంగదండ ప్రణామము ఆచరించి అతని పాదములబట్టి, మహాత్మా! నీవుమానవుడవు కావని నాకు తోచుచున్నది. శ్రీహరి తన దివ్యావతారమును ఈ రీతి ధరించి వచ్చునటులున్నది. ఓ భగవత్స్వరూపా! నాయందు

దయయుంచి నన్ను బాధించెడు గోహత్యపాపము నుండి తరించు మార్గమును చెప్పి రక్షింపుడని ప్రార్థించెను.

అందుకు వీరప్ప నాయనా! నీవు సామాన్య మానవుడవు కావనియు, పరమేశ్వరుని యింతకుముందు చెప్పితిని మానవగర్భమును జన్మించిన కారణమున నీవుశంకరావతారుడవయ్యు గోహత్యాపాపమును అనుభవింపక తప్పకున్నది. అయినను విచారింప బనిలేదు నీవు తురుష్కుడవై జన్మించినచో యీ పాపము పరిహారము కాగలదనెను.

## 9. ఆనందభైరవయోగికి శ్రీ వీరబ్రహ్మం గారు మంత్రోపదేశము చేయుట

అప్పుడు శ్రీ వీరబ్రహ్మం నాయనా! నీసంశయము లన్నిటిని పటాపంచ లొనరించు మంత్రము నుపదేశించెద వినుము అని...

### శ్రీ వీరనారాయణ మంత్రం

**సంకల్పం :** ఆచమ్య.....పూర్వోక్తఏవంగుణ విశేషణవిశిష్టాయాం శుభతిథౌ శ్రీమత... గోత్రస్య.... నామధేయస్య....మమధర్మ పత్నీసమేతస్య. సకుటుంబానాం క్షేమస్థైర్య విజయాయురారోగ్యయైశ్వర్యాభి వృద్ధ్యర్థం - ఇష్టకామ్యార్థ సిధ్యర్థం, చతుర్విధఫల పురుషార్థ సిధ్యర్థం శ్రీ వీరబ్రహ్మదేవతా ముద్ధిస్య. శ్రీ వీరబ్రహ్మ దేవతా ప్రీత్యర్థం, శ్రీ వీరబ్రహ్మేశ్వర దేవతా మహామంత్రో పాసనం కరిష్యే.

అస్యశ్రీ వీరబ్రహ్మస్తోత్రమంత్రస్య పరబ్రహ్మఋషిః, దేవిగాయత్రీ ఛందః, శ్రీవీరనారాయణో దేవతా, 'హాం'బీజం, 'సం' శక్తిః, శ్రీ వీర నారాయణ ప్రసాద సిద్ధ్యర్థం జపేవినియోగః

| అంగన్యాసం | | హృదయన్యాసం |
|---|---|---|
| ఓం శాం అగుష్ఠాభ్యాంనమః | - | ఓం శాం హృదయాయ నమః |
| ఓం శీం తర్జనీభ్యాంనమః | - | ఓం శీం శిరసే స్వాహా |
| ఓం శూం మధ్యమాభ్యాంనమః | - | ఓం శూం శిఖాయై వషట్ |
| ఓం శైం అనామికాభ్యాంనమః | - | ఓం శైం కవచాయహుం నమః |
| ఓం శౌం కనిష్టికాభ్యాం నమః | - | ఓం శౌం నేత్రత్రయాయౌషట్ |
| ఓం శః కరతల కరపృష్టాభ్యాంనమః | - | ఓం శః అస్త్రాయ ఫట్ |

*భూర్భువస్సువరో మితి దిగ్బంధః*

## స్తోత్రమంత్రం

**వీరంవీరభయాది తత్త్వభరితం వీరాసనం గురుం**
**వీరశ్రేష్టనుతం విరించి వినుతం వీరాధివీరం హరిం**
**వీరేంద్రం ఘనయోగి మానసచరం వేదాంత విద్యాకృతిం**
**వీరాచార్యమహం భజామి సతతం శ్రీవీరనారాయణం**

నాయనా! ఆనందయోగీ ఈ స్తోత్ర మంత్రమును నీవు నిత్యము శ్రద్ధగా జపింపుము. తద్వారా నీవు క్రమముగా నీవు దశవిధనాదములను వినగలిగినచో పరబ్రహ్మమును తెలిసికొనగలవు. ఆ దశవిధనాదములు ఏవియోచెప్పెదను వినుము.

## దశవిధనాదముల వివరణము

దశవిధనాదములనగా కర్ణములందుండు దేవ వాద్యములని తెలయదగును. అవి :- వీటిని వినగలిగినచో మంత్రము సిద్ధించును.

1. జలధిఘోష　　2. భేరినాదము
3. మద్దెలనాదము　　4. మృదంగనాదము
5. ఘంటానాదము　　6. కాహళనాదము
7. కింకిణీనాదము　　8. వేణునాదము
9. భ్రమరనాదము　　10. ఓంకారనాదము

అంతట ఆనందభైరవయోగి స్వామీ ! మీ దివ్యమంత్రోపదేశము వలన నేను తరించినవాడనైతిని. నాకు సెలవిచ్చియెట కేగమందురో యానతిండనగా వీరంభోట్లయ్య నాయనా! “నీవు ఐహికవాంఛల పోరాడి ప్రకృతిని మరచి యోగమార్గమున ఆనందమయుండవై సమాధినిష్టవహించి మరొకజన్మము నెత్తబొమ్ము. ముందు నీ జననీజనకుల సేవకొన్నాళ్ళు చేసి, తదుపరి రాజయోగముల రాజ్యపాలన మొనరించి సజ్జనాళిని దయతో చూచుచుండుము, ఇక పొమ్మనగా” ఆనందభైరవయోగి తన జన్మస్థానమగు కాశీనగరమునకు తిరుగు ప్రయాణము జేసెను.

## 10. శ్రీ వీరబ్రహ్మం బనగానపల్లె జేరుట

హరిహరపురమున వీరంభొట్లయ్య తర్వాత కొంతకాలము తపోనిష్టనుండి అక్కడినుండి మరల తీర్థయాత్రనొనరింప బయలుదేరెను. అచ్చటనుండి కందవోలున కేగితుంగభద్రలో స్నానమొనరించి నదినిదాటి అలంపూరునకేగి బోగులాంబను సేవించి అచ్చటి నుండి శ్రీశైలమున కరిగి మల్లికార్జునుని సేవించి కొన్నిదినము లచ్చట గడిపి, అచ్చటినుండి మహానందిక్షేత్రమున కరిగి అచ్చట మహానందీశ్వరుని గొల్చి, ఓంకారమునకేగి యందలి సరోవరమున మునిగి నల్లమల్లలో ప్రయాణమొనరించుచు ఆహోబిలమును చేరెను. అప్పుడు శ్రీమదహోబిల

నరసింహస్వామిని దర్శించి కొన్నిదినములుండెను. అచ్చటనుండి కణ్వాశ్రమమును అగస్త్యుని యాశ్రమమున చూచి గండి కోటచేరి, అచ్చట తురుష్కులచే నాశన మొనరింపబడిన మాధవుని ఆలయమునుగని విచారమున మునిగి, అక్కడి నుండి విరూపక్షమున కేగి, విరూపాక్షరాయలను సేవించి మరల పండరీపురమున కేగి పండరీనాథుని దర్శించి, చంద్రభాగలో స్నానము చేసి త్వరితగతి పయనించి చివరికి బనగానపల్లె జేరెను.

## 11. శ్రీ వీరబ్రహ్మం గారు గోపాలకుడగుట

వీరప్పయాచార్యులు బనగానపల్లె జేరెను అతడచ్చట జేరునప్పటికి సాయంకాలమైనది. ఆ ఊరిలో నతనికి తెలిసిన వారెవరును లేకుండిరి. అపుడతడు కానిమ్మని అందలి లేర్రేటిలో స్నానమొనరించి అనుష్టానమును ముగించి గ్రామములో ప్రవేశించెను.

అతడు గ్రామమునందొకచోట నిలువక దిరిగి తిరిగి తన్నెవరును పలుకరింపనందున యెట్టె కేలకొక కాపువారి గృహముగడ నిలచి ఎవరినేమియు నడుగక, ఆ యింటి చెంగటనుండు ఒక తిన్నెపై గూర్చుండెను. అతడు విభూతిరేఖలతో శంకరునివలె గాన్పించుటచే దారిని బోవువారు అతడై ఎవరై యుండునా? అని నిలిచి చూచి యెవడోపిచ్చివాడని పలుకరింప బోవుచుండిరి. అంతలో చీకటిపడెను. వీరప్పయ్య యెవరిని కాని అన్న మడుగుక ఆ తిన్నపై బరుండి నిదురించెను.

## 12. గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంట పనికి కుదురుట

వీరబ్రహ్మం నిదురించిన అరుగు ఒక కాపువారిది, ఆ ఇంటి యజమానురాలిని గరిమిరెడ్డి అచ్చమ్మయని పిలుచుచుండిరి. ఆమె సద్గుణ

సంపన్నురాలు, దానికితోడ గోసంపదయు గావలసినంత యుండెను. ఆమె దైవభక్తురాలును, బీదలపట్ల దయగలదై వారికియున్నంతలో దానధర్మముల జేసెడిది. ఆమె ఒక గోసంరక్షణశాల నేర్పాటుచేసియుండెను. అందు పెక్కు గోవులు, దూడలు నుండెడివి. ఆమెకు భూవసతియుచాలగలదు. ఆమె పనులన్నింటిని జూచుకొనజాలక గొందఱపనివారిని జీతమునకు కుదిరించుకొనియుండెను. ఎంతజీతమిచ్చినను పనివారు పనివారే. ఆమె వేకువఝామున లేచిపనివారిని నిదురలేపుట అలవాటు. అటులనే ఆ దినమున అచ్చమ్మ వేకువఝామునలేచి తలవాకిలిదీసి చూడగా ఇంటియరుగు మీద ఒక యువకుడు గూర్చుండియుండె.

ఆ యువకుని విగ్రహము అచ్చమాంబ నాకర్షించె. ఆమె అతనిని జూచి నాయనా! నేను గోసంరక్షణశాలను గలిగియున్నాను. ఆ గోవులను చక్కగ జూచుకొనువారు లేకుండిరి. ఈ దినమునుండి నీవు ఆపనిని నిర్వహింపుము నీవు గోపాలడవు కాబట్టి ఆ పనిని చక్కగ నిర్వర్తింపగలవని నమ్మితివి. నీవు విశ్వబ్రాహ్మణుడనంటివి. నీకు భోజనసదుపాయముల జేయవలయును. అది నాధర్మము నీవు వంట జేసికొనుటకు అలవాటు పడియుంటివికదా? అని ప్రశ్నించెను.

అందులకతడు అమ్మా! నేను విశ్వబ్రాహ్మణుడను కాబట్టి ఈవిశ్వమునందలి అన్నిజాతులవారి యింటను భుజించుటకలవాటు పడియున్నాను అదియుగాక దినమొకఊరుగా తిరుగునేను అన్నివిధముల ఆహారమును తినగలను, నేను దేశద్రిమ్మరనై కడకు నీయింట గోపాలకుడనై చేరాను. నాకు మీ ఇల్లే తాత్కాలిక స్వగృహము. నాకు జీతమక్కరలేదు ఇత ఆహారము నొసంగి గోచిగుడ్డ నొసంగిన జాలును. అటులన్న

ఎల్లకాలము నేను నీయింట నుండజాలను, సమయము వచ్చినపుడు యిచ్చటనుండి పోగలవాడననెను. అందులకు అచ్చమాంబ నాయనా! నీమాట విన్న నాకేలనో అపరిమిత ఆనందముకలుగుచున్నది. నీవు నన్నాకర్షించితివి. నీయందేదో మహాత్మ్యముండునటుల దోచెడివి. నీవు నిక్కముగ మానవుడవేనా? నీముఖమునుండి దివ్యతేజస్సు వెడలుచున్నది నీవు ఒక మహాపురుషుడవై కాన్పించు చుంటివి. ఔరా! ఇట్టివానికి నేను యజమానురాలనా? అన్న వస్త్రమునిచ్చి కాపాడుశక్తి నాకుగలదా? అన్నా నిన్ను గోపాలునిగా నియమించుశక్తి నాకులేదు. ఈయింటికి నీవే యజమానివై అందఱివలన పనులను గొనుచుండు మనెను. అందుకు వీరబ్రహ్మం తల్లీ! అంతటి బాధ్యతకు నేను వహింపజాలను. నేను గోపాలక వృత్తిని మాత్రము జేయగలననెను.

అచ్చమ్మ యోజించి నాయనా! నీయిష్టము వచ్చినపని జేయుము ఆలమందకు నిన్ను యధికారిగా నొనరించితిని ఉదయమున నీకు చలిదియన్నమును మూటగట్టి ఇచ్చెదను దానిని తీసికొని ఆవులను, దూడలను తోలుకొని సమీపమున నుండు యడవిలో మేపుకొని చీకటి బడకముందే ఇల్లు జేరుచుండుము. ఎందులకందువా? ఆసమీపమునందొక కొండయున్నది. అందుగుహలుకలవు. ఆ గుహలలో కొన్ని దుష్ట మృగములుండును. ఎమరిన అవి గోవులనో దూడలనో బట్టుకొని పోయితినుచుండును. ఏమరియుండిన అవి నిన్ను గూడ చంపగలవు అని దినకార్యక్రమును నిర్ణయించెను.

వీరబ్రహ్మం ఆనాటినుండియే గోపాలకుండయ్యెను అతడాదినము అచ్చమ్మ ఇచ్చిన అన్నపుమూటను గొనినత్వరగా కొండకేగి ఆ గోవులను

దూడలను ఒక పచ్చికబయలున నిలిపి వానిచుట్టు ఒక ఎల్లగీతను గీచి తన యిష్టము వచ్చినపనిలో నిమగ్నుడైయుండి సాయంకాలము యజమానురాలి యాజ్ఞ ననుసరించి ఆలమందను ఇంటికి జేర్చుచుండెను. ఇది వీరప్పయ్య అనుదినము చేసెడిపనియై యుండెను.

ఆరీతి గొన్ని దినములు జరిగిన పిదప వీరంబొట్లయ్య యెప్పటియట్లు గోవుల నడవికి తోలుకొనిపోయి పచ్చిక బయలున తాను గీచిన ఎల్లలో నిలిపి ఎటకో వెళ్ళుచుండెను. అతడు అందున్న ఒకానొక తాటిచెట్టును సమీపించి పైకిజూడగా యాతాటివృక్షము క్రిందికి వంగెను. ఆ చెట్టునకు నిడుపు వెడల్పుగల ఆకులుండుటచే దనకుగావలసిన ఆకుల గోసికొనినంతనె తాటిచెట్టు మరల నెప్పటివలనే నిలిచెను.

## 13. శ్రీ వీరబ్రహ్మం గారు కాలజ్ఞాన రచన ప్రారంభించుట

అంతట వీరబ్రహ్మం అచ్చమ్మ ఇచ్చిన అన్నపుమూట నందొక గోతిలో బడవైచి ప్రక్కనుండిన గురిజారి చెట్టునుండికొన్ని ముండ్లను బెరికికొని తనకడనున్న తాటియాకులతో గుహను ప్రవేశించెను. అతడా గుహలో నొకసమప్రదేశమున గూర్చుండి తాటియాకులపై గురిజారి ముండ్లతో నేమోవ్రాయుచు వ్రాసిన యాకులను అచటనే భద్రపరచి చీకటిపడకముందే మరల గుహనుండి బయటకివచ్చి గోవులతోలుకొని అచ్చమ్మ గృహమును జేరుచుండెను.

ఒకానొక దినమున వీరప్పయ్య యెప్పటివలెనే ఆవులను యడవికి తోలుకొనిపోయి ఎల్లగీతలో జేరినంతనే తాను తాటియాకులను గిరిజారి ముళ్ళనుగొని గుహ లోపలికేగెను. అంతలో గొన్ని క్రూరమృగంబులు

ఆవులను చంపి తిననెంచియచ్చటికి వచ్చినవి. అవి గోవుల చుట్టుగీచిన గీతను గని దానిని దాటి లోపలికేగ ప్రయత్నించి చేతగాక, అవి గీతదాటి వచ్చినచో చంపుదమని పొంచియుండెను.

ఆదృశ్యమును దారిన బోయెడు కొందఱు చూచిరి. ఔరా! పాపము అచ్చమ్మ దిక్కులేనివాడని దారినబోయెడి వానిని దగ్గర జేర్చి అన్నవస్త్రముల నొసంగి ఆలమంద నతని స్వాధీనముచేసి వానిని చక్కగ మేపగోరెను. అతడు సోమరియై ఆవులను వదలి యెటకో పోయినాడు. ఆవులను చంపపులులు మున్నగునవి పొంచియున్నవి. అయినను ఈ పులులుగోవులపై బట్టి చంపకజూచుచు నిలబడియున్నవి. అందేమో రహస్యమున్నది. పశు లకాపరియు గనబడుటలేదు. ఈ సంగతి అచ్చమ్మకెరింగింతమని అనుకొనుచు బోయిరి.

## 14. అచ్చమ్మ శ్రీవీరబ్రహ్మం గారిని పరీక్షించుట

ఆ బాటసారులు అడవిలో జూచిన దృశ్యమును అచ్చమ్మకు తెలిపి అమ్మా! నీవు పెంచెడి గోపాలకుని నమ్మవద్దు. అతడు ఆవులను బొత్తిగా మేపుటలేదు. ఆవులను అడవిలోదోలి తానెచ్చటికో బోవును. ఈ దినము మేము ఆ దారిన వచ్చుచుండగా గోవుల చంపుటకై పులులు చిరుతపులులు మొదలగు అడవి జంతువులు పొంచియుండజూచితిమి. అలమేపరి కొఱకు వెదకితిమి కాని అతడు కనబడలేదు. ఈదినమా పులులు ఎన్ని ఆవుల చంపునో తెలియదు, ఉన్న సంగతిజెప్పితిమి. నీయిష్టమని వారు గృహములకు వెళ్ళిరి.

అంతట అచ్చమ్మ ఒంటరిగ గూర్చుండి యిట్లాలోచింపదొడగెను. ఔరా! వీరిమాటలు నమ్మవచ్చునా, వీరప్పయ్యా సోమరిపోతు కాదు.

అతనిననుమానించుటకు దగినకారణ మొక్కటియు లేదు. అతడు నాయిల్లుజేరినదాదిగా నాకు సకల ఐశ్వర్యములు వృద్ధియగుచున్నవి. ఇక ఆవులన్నచో ప్రతిసంవత్సరము ఈతిబాధలతో మరణించుచుండెను. అతడు వచ్చినప్పటినుండి ఆవులమందతోనే గాక తక్కుంగల పశువులలో గూడ నేదియు జచ్చినది లేదు. అతడు ఆవుల మేపక యెందోజనుచున్నాడను వీరిమాటలను నమ్ముటకు వీలులేదు. అతడు ఆవులను మేపకున్నచో అవి బక్కచిక్కిబోయి యుండవలెనుగదా, అటులజరుగలేదు. అవి దినదినము బలిష్టములై చియ్యబట్టియున్నవి ఇపుడు నాయిల్లు గోక్షీరముల వలన పాలసముద్రమును బోలియున్నది. అయినను బాటసారుల మాటల పరీక్షింపవలయును, వారూరకఅతనిపై నిందమోపుదురా? క్రొత్తవానిపై పగ సాధింపదలచిరా, అతడు నాతోదప్ప యితరులతో మాట్లాడలేదు. ఏమైనాగాని రేపు అతనికి దెలియకుండ అడవికేగి పరీక్షించెదనని తీర్మనించుకొనెను. అంతలో సాయంకాలము కాగానే వీరప్పయ్య ఆవులమంద వెంట యింటికివచ్చిచేరెను అచ్చమ్మ అతనినిగని సంతోషించెను.

ఆనాటిరాత్రి భోజనానంతరము అచ్చమ్మ నాయనా! వీరప్పయ్యా! నేను వేకువలేచి ఆవల గ్రామమునకు వెళ్ళిరావలసిన పనియున్నది. సాయంకాలమువఱకు నేను రాను నీవు యెప్పటివలెనే ఆవులమందను అడవికి దోలుకొనిపోయి మేపుకొనిరమ్ము అంతలో నేనుకూడ రాగలననెను. అందుకు వీరప్పయ్య మంచిది అటులనే జేయుదునని శయనింపబోయెను.

ఆనాటిరాత్రి అచ్చమ్మ వేకువఝామునలేచి వీరప్పయ్య నిదుర మేల్కొనకముందె బయలు దేరిపోయి రవ్వలకొండ సమీపమున పొదలలో దాగియుండెను. అంతట వీరబ్రహ్మం యెప్పటివలెనే ఆలమందలతో వచ్చి

ఎప్పటివలెనే పచ్చిక బయలునందాపి దానిచుట్టు గీతగీయుచుండగా పొదలోనుండిన అచ్చమ్మ చూచెను. అతడావల తాటిచెట్టును సమీపించి పైకిచూడగా ఆ చెట్టుక్రిందికి వంగినంతటనే వీరప్పయ్య తనకు గావలసినన్ని తాటాకుల గోసికొని గురిజారి ముండ్లను బెరికికొని తన గుహలోనికి బోయెను. అతని చర్యలను గమనించుచుండిన అచ్చమ్మ ఆశ్చర్యముతో ముక్కుపై వ్రేలిడుకొనెను. అంతలో ఒక పెద్దపులి ఒక చిఱుతపులివచ్చినవి. అవి రెండును ఆవులచుట్టు గీచిన గీతవరకు వెళ్ళి భయపడి దాటి పోవెరచి కొంతసేపు మందచుట్టు తిరిగి అడవిలోకే వెళ్ళిపోయినవి.

అచ్చమ్మ పొదనుండి వెలుపలికి వచ్చి బాటసారులు చెప్పిన మాటలన్నియు సత్యమని, అయినను వీరప్పయ్య ఆ కొండగుహలో యేమిచేయుచున్నాడో చూతుమని బోయి మెల్లగాచప్పుడు చేయకుండ గుహలోదూరెను. ఆమె కొంతలోపలికి వెళ్ళగనే వెలుగు కాన్పించెను. ఆ వెలుగు వీరబ్రహ్మం కన్నులనుండి వెలువడినది. ఆ వెలుగులో గూర్చుండి అతడు గురిజారి మంటినిగొని తాటాకుపైయేమియోవ్రాసి ఆకుముగియగనే రెండవయాకుగొని వ్రాయుచు ఆ దినముకోసిన తాటాకులన్నింటిని వ్రాసి ముగించి ఒక కట్టగా కట్టి తిరిగి చూచెను.

అంతవఱకు నిశ్శబ్దముగా చూచుచుండి అచ్చమాంబ అతడు తిరిగి చూడగనేపోయి అతని పాదములపైబడి యిటులనసాగెను. ఓ సర్వేశ్వరా! నీవు నివురు గప్పిన నిప్పులవలె నిజరూపమును జూపక పిచ్చివేషమున దిరుగుచు నాయింటికికేలవచ్చితివి, అకటా! నీవు భగవత్స్వరూపుడవని తెలిసికొనకపోతిని సామాన్యమానవుడని నిన్ను పనుల కాపరి నొనరించి పాపమొనరించితిని, నీవు శ్రీ గోవిందుడవేకాని

మానవుడవు, కావు మహానుభావా! నీవీకలియుగమున పాపవినాశ మొనరింపనవతరించిన రమారమణుడే యగుదువు ఆదిమధ్యాంతరహితా! అనాథరక్షకా! వైకుంఠవాసా ఆపద్బాంధవా! నాతప్పుల క్షమించి నాకు మోక్షము నొసంగుము నాకీ సంచారమును వలదు నాయందు దయయుంచినాకు సద్గతుల గలిగింపుమనెను.

అందుకు వీరప్పయ్య "అమ్మా! నీపరీక్షముగిసినదిగదా అదే చాలును అమ్మా! నేనొకపిచ్చివాడనేకాని భగవంతుడగాను, మీబోటి ధనవంతులు సుఖముగనుండినకదా నాబోటి వెఱ్ఱివారును బ్రతుకుట నీవు లేకున్న నాగతియేమైయుండనోగదా నాకు ఆశ్రయ మిచ్చితివి. పని గల్పించితివి. నీపుత్రునివలె దయతో నాదరించుచుంటివి. నాకేకొదవయు లేకుండజేయు నీవు నాకు యజమానురాలవై యుండినా పాదములుబట్టి ప్రార్థించుట ధర్మముకాదు. నా పాదముల వదలుమనెను".

ఆమాటలు అచ్చమ్మ పరమాత్మ స్వరూపుడవగు వీరప్పయ్యా! నన్ను పిచ్చిదాని నొనరింపకుము. నీమాటలన్నిటిని నేవిననొల్లను నీవు నాకు బ్రహ్మోపదేశ మొనరించి తరింపజేతువని మాటయిచ్చిననే కాని నీపాద పద్మములను వదలననెను. అందుకు వీరంబొట్లయ్య "అమ్మా! భయపడవలదు నేను నీయింటికి వచ్చినది నీకు బ్రహ్మోపదేశమిచ్చి తరింపజేయుటకే గాని వేరుకాదు. నీవు తరించుకాలము రాకుండుటచే నేనూరక జూచుచుంటిని. నిన్ను నాభక్తురాలి నొనరించుటకే నీయింటికి వచ్చినవాడను బ్రహ్మోపదేశమీయకుందునా, అమ్మా! మూడవదినమున మనము యాగంటి క్షేత్రము కేగవలెను. ఆదినమున నీకు బ్రహ్మోపదేశమిచ్చెదను. ఈ సంగతి ఇతరులతో అనకుము, నాకంటెముందె

నీవు యిల్లు జేరబొమ్ము, ఆవల నేను యెప్పటివలెఆలమందను దోలుకొని యింటికి వత్తుననగా" అచ్చమ్మ సంతోషముతో గృహమున కేగెను.

## 15. అచ్చమ్మకు బ్రహ్మోపదేశము చేయుట

శ్రీ వీరబ్రహ్మం రెండవనాటి రాత్రి శయనించుటకు పూర్వము అచ్చమ్మగారిని చూచి అమ్మా! రేపటిదినమే మూడవదినము కదా. వేకువనలేచి యాగంటి క్షేత్రమున కేగుటకుదగిన ప్రయాణసన్నాహము నొనరింపవలెనని చెప్పెను. అందుకామె తండ్రి! నేనింతకముందే ఆయేర్పాటుల పూర్తిజేయించితినని ప్రత్యుత్తర మొసంగెను.

ఇరువురును వేకువఝాముననిదుర మేల్కొని కాలకృత్యముల తీర్చి ప్రయాణము సాగించి ఉదయము సుమారు యెనిమిది గంటలకు యాగంటిని చేరిరి. ఇద్దరును అందలి తీర్థముల స్నానమాడి యాంగటీశ్వరుని పూజించిరి. అనంతరము వీరప్పయ్య అచ్చమ్మ ఈశ్వరుని సన్నిధిని పద్మాసనమునువేసి కూర్చుండుమని యిటుల పలికెను.

"తల్లీ! "ఓం నమశ్శివాయ"అనునదే పంచాక్షరీమంత్ర యనబడును దానిని మనోవాక్కాయశుద్ధిచే జపించినచో తప్పక మోక్షములభించును అందుకు సందేహింప పనిలేదు. ఆమంత్ర వివరమును వినుము. పంచాక్షరీ మంత్రములోని ప్రథమాక్షరమగు ఓం అను శబ్దమునుండి పుట్టిన యీ ప్రపంచమున ద్వితీయాక్షరమగు "న" అను శబ్దము కాలమును సూచించును. తృతీయాక్షరమగు "మ" శబ్దము స్వయం ప్రకాశకుడగు పరబ్రహ్మాను సూచించును. ఆవలచతుర్థపంచమాక్షరములగు "శివం" అను శబ్దమునకు శాశ్వతము అను అర్థముండును.

అనగా ఈ పంచాక్షరీ "ఓం నమశ్శివం అను దానికి ఈ ప్రపంచమందలి కాలమున, స్వప్రకాశమును గల పరబ్రహ్మస్వరూపమే స్థిరమైనదని భావము. కనుక ఈ మంత్రమును త్రికరణశుద్ధిగా జపించినచో నీవు తరింపగలవు అమ్మా! నీకింకొక్క రహస్యమును జెప్పెదవినుము. **"ఓం హ్రీం క్లీం శ్రీం శివాయ బ్రహ్మణేనమః"**. అను నీపన్నెండు వర్ణములతో నొప్పెడి మంత్రమును ద్వాదశాక్షర మంత్రమందురు. ఈ మంత్రమునందు మహాశక్తి యున్నది. ఆ ప్రభావ మనంతము కనుక ఆమంత్రరాజమును గూడ జపించినచో మోక్షమును సాధింపగలవు.

అదియుగాక నీకు మఱియొక పరమరహస్యంబును వెల్లడింతును. నీవు పూర్వజన్మమున నన్ను గూర్చి తపంబొనరించితివి ఆ తపఃఫలము ఆ జన్మమున నన్ను గాంచలేకపోతివి అవల కొంతకాలమునకు ఆ శరీరమును వదలి ఈ బనగానపల్లెలో గరిమరెడ్డిగారి ఇల్లు జేరియుంటిని. నీవు పరమపతివ్రత, భూతదయాపశ్చాత్తాపముల కలిగి బీదల ప్రేమించుచుండవు. ఇది నేనెరింగి ఈ అవతారమున నీకు తరుణోపాయమును గలిగింపగోరియే నిన్ను వెదకుచువచ్చి నీయిల్లు జేరితిని. నీకు సేవకుడనై సేవించితిని, మన సంకల్పములు జరిగినవి. ఇంతటినుండి నీవు అనందమయుడగు పరబ్రహ్మను ధ్యానించుచుండుమనెను".

అప్పుడు అచ్చమ్మ బ్రహ్మంగారికి నమస్కరించి, ఆపద్బాంధవా! అనాధరక్షకా! ఆదిమధ్యాంతరహితా! నాకు తరుణోపాయము నెరిగించితివి. ఇక మనము మన గ్రామమునకు తిరిగిపోదము తామింతటి నుండి గోపాలవృత్తి జేయక, గోపాలన మొనరింపవలెను అని యాగంటీశ్వరుని ప్రార్థించి ప్రయాణమై రాత్రి చీకటిపడునప్పటికి బనగానపల్లె చేరిన వారైరి.

అంతట అచ్చమ్మ మరునాడు బనగానపల్లెలో వీరప్పయ్యకొఱకు ఒక మఠమును నిర్మింప గోరెను. ధనవంతులకును త్యాగధనులకును సాధింపరానిది లేదుకదా, ఆమె ఒకరికి పదిమందిని పనివాండ్ర నియమించి కొద్దిదినములో మఠమును పూర్తిజేయించి వీరప్పయ్యనందు ప్రవేశపెట్టెను. అపుడు వీరప్పయ్య ఆమఠము ప్రక్కన ఒక పాతరనుగట్టింపమని తానింతకుముందు గుహలో వ్రాయుచుండిన తాటియాకుగ్రంథములను ఆపాతరలో బెట్టించి దానిపై అరుగును గట్టించెను. అంత కొన్నాళ్ళకు ఆ అరుగురాళ్ళ సందునుండి యొక తింత్రి నీ(చింత)వృక్షము పుట్టెను. వీరప్పయ్య అప్పటినుండి ఆ మఠమును గూర్చుండి కాలజ్ఞానము వ్రాయుచు అచ్చమ్మకు ధర్మోపదేశ మొనరించు చుండెను.

## మూడవ ప్రకరణము

### 1. బ్రహ్మ అన్నాజయ్యగా అవతరించుట

దక్షిణదేశమున విశ్వబ్రాహ్మణ కుటుంబము విశ్వాత్మకుడు కొంత ప్రసిద్ధికెక్కి యుండెను. అతనికి మాయమేయియను భార్యయుండెను. ఆ దంపతులకు సంతానము లేనందున విచారసాగరమున మునింగి పుత్రసంతానము నొసంగుమని శ్రీ మహావిష్ణువును ధ్యానించుచు దివ్యక్షేత్రముల కేగి దేవతలదర్శించుచు పుణ్యనదీనదంబుల గ్రుంకులిడుచుండిరి. అంతకొన్నాళ్ళకు శ్రీమన్నారాయణమూర్తిస్వప్నమున దర్శనమిచ్చి మాయామేయితో "అమ్మా! పుత్రులులేరని పొగలకు. త్వరలో నీకు బ్రహ్మయే పుత్రుడుగా జన్మింపగలడు" అని చెప్పి అదృశ్యుడాయెను.

అటుపిమ్మట కొన్నిదినములకు మాయామేయి గర్భమును ధరించెను. అంతటివరకు ఆమె తన స్వప్నవృత్తాంతము భర్తయగు విశ్వాత్మకున కెఱిగించక స్వప్నము నిజమోకాదోయను ననుమానముతో నూరకుండెను. ఎపుడు తన గర్భచిహ్నమును పొడజూపెనో అపుడు ఆమె సంతోషమును పట్టజాలక భర్తనుజూచి "కొన్నిదినముల క్రిందట గోవిందుడు కలలోకనబడి బ్రహ్మ తనగర్భమున జన్మించునని చెప్పి సంతానములేదని విచారింపవలదని చెప్పెను నాకల కల్లయగునేమోయని ఆ సంగతి మీకెఱింగింపక దాచియుంచితిని అందుకు క్షమింపుడని" భర్తను ప్రార్థించెను.

ఆ స్వప్నము ననుసరించి ఇపుడు నాకు గర్భ చిహ్నములు పొడచూపినవని చెప్పగా విశ్వాత్మకుడు సంతోషించి సత్పుత్రుని బయడగోరి భగవదారధన మొనరించుచు కాలము గడిపెను అరీతిగొన్నాళ్ళు జరుగుచుండగా మాయామేయి గర్భము దినదినాభివృద్ధి జెందుచు సంపూర్ణ గర్భముగ మారినది. అంతలో పదవ మాసమున మాయామేయికి గర్భవేదన ప్రారంభమై ఒకానొక శుభలగ్నమున మగశిశువును ప్రసవించెను.

## 2. అన్నాజయ్య బాల్యము

ఆరీతి మగశిశువు జన్మింపగనే విశ్వాత్మకుడు జ్యోతిష్కులను రావించి జాతకుని యోగమును గురించి తెలుపుమనియడిగెను. అందుకు జ్యోతిష్కులు దీర్ఘాలోచన మొనరించి అయ్యా! మీకుమారుడు యోగపురుషుడగును. అతడు మహాయోగియై సన్యాసాశ్రమమును స్వీకరించి దేశములదిరుగుచు బోవునే గాని మీయింట నుండడని చెప్పిరి. అందులకొక ప్రక్క సంతోషము మరియొకవంక విచారమునగలవాడై దైవజ్ఞుల సత్కరించి

పంపెను ఆవల పదునొకండవ దినమున పురోహితుని పిలిపించి "అన్నాజయ్య" అని నామకరణ మొనరించిరి. మాయామేయీ విస్వాత్మక దంపతులు తమ పుత్రరత్నమునకు అన్నాజయ్య అని నామకరణ మొనరించి యానందిచుచుండిరి. ఆ శిశువు దినదినము శుక్లపక్షచంద్రునివలె పెరుగుచు తల్లిదండ్రులకు సంతోషమును గలిగించుచుండెను. అతని ముఖమున బ్రహ్మతేజస్సు విరాజిల్లుచుండుటచే ఆ ఊరి పిన్న పెద్దలు ఆ బాలుడు తప్పక మహాపురుషుడగునని చెప్పుచుండిరి.

అన్నాజయ్యక్రమముగ పెరుగుచు అయిదేండ్లబాలుడయ్యెను. అపుడతనికి విధ్యాభ్యాస మొనరింపదలచి ఉపాధ్యాయుని రప్పించి అక్షరాభ్యాస మొనరించిరి. ఆ బాలుడు సహితము వినయవిధేయతలతో ఉపాధ్యాయుడు చెప్పెడి దానిని శ్రద్ధతో విని నేర్చుకొనుచు తోడి బాలురకంటె మిన్నయైయుండెను. అన్నాజయ్యతోడి బాలుర జేరిఆట్లాడుకొనక సదా ఏకాంతమున జేరి యోచించుకొనుచుండెను. అతనిచర్యలు జూచి తల్లిదండ్రులే గాక గ్రామవాసు లందఱును దైవజ్ఞుల వాక్కులను తప్పవనుకొనుచుండిరి.

అన్నాజయ్య ఆ గ్రామమునకు ఏ సన్యాసి వచ్చినను ఏ యోగి వచ్చినను వారి వెంటదిరుగును వారి మాటలను శ్రద్ధతో వినుచుండెను. అతడు సదా సన్యాసులవలె ఆనందించుచు తిరుగుచు ఒక్కొక్కనాడుఇంటికి గూడరాక సన్యాసులవద్దనే కాలం వెళ్ళబుచ్చుచుండ, విశ్వాత్మకుడు అతడిని వెదకి యింటికి కొనిపోవుచుండెను. అతని చర్యల దిలకించి జనులందరూ ఆ బాలుని అన్నాజయ్య యని పిలుచుటకు బదులు "బ్రహ్మానందుడు" అను మారుపేరు పిలుచుచుండిరి.

## 3. అన్నాజయ్య సన్యాసాశ్రమ స్వీకారము

ఆలాగు కొన్నాళ్ళుజరిగిన పిమ్మట ఒకానొక దినమున తల్లితండ్రుల కడకేగి నమస్కరించి జననీ జనకులారా! మన ఊరిలోని దేవాలయమున కొక యోగిపుంగవుడు వచ్చియున్నాడు. అతడు మహాత్మునివలె గనబడుచున్నాడు. నాకు సన్యాసాశ్రమమును గైకొనవలెనను యాశగల్గినది గనుక నాయందు దయయుంచి నాకాజ్ఞయిండు, అని ఆయోగి నడుగగా ఆయన నన్నుచూచి నాయనా! నీ తల్లితండ్రుల యాజ్ఞ వడసివచ్చినచో నీకు సన్యాసదీక్ష నొసంగెదనని చెప్పియున్నాడు. మీరేమైనననుడు నాకు ఈ ఊరిలోగాని, ఈ యింట గాని యుండుటకు యిష్టపడలేదు. నన్ను బలవంత మొనరించి ఇంట నిలువగోరినను నిలువను, ఇది దైవసంకల్పము గాన నాయందనుగ్రహించి నాకోర్కెను దీర్చుమని బ్రతిమాలెను.

పుత్రుడి మాటలు విని విశ్వాత్మకుడు దీర్ఘముగ యోచించి "ఔను", దైవజ్ఞులు కూడ ఈ బాలునకు సన్యాసయోగము తప్ప గృహస్థయోగము లేదని చెప్పిరి. ఆరీతిగనే వీనికి బుద్ధి జన్మించినది. ఇది బ్రహ్మ సంకల్పమేయగును. ఇందుకు వగప బనిలేదు" అని కుమారుని జూచి నాయనా! నీ యిష్టము నీవు కోరినట్లు సన్యాసదీక్ష గైకొనవచ్చును. అని చెప్పగా అన్నాజయ్య తల్లిదండ్రులకు నమస్కరించి వారి ఆశీస్సును అనుజ్ఞబొంది గృహమును వదలిపోయెను. అతడు దేవాలయములో నుండిన యోగీంద్రుని కడకేగి నమస్కరించి, మహాత్మా నాకు సన్యాసదీక్ష నొసంగుడనగా నతడు మంచిది రమ్మని ఏదో చెవిలో చెప్పికన్నులు మూసికొమ్మని అన్నాజయ్య కన్నుల దెరచులోపల అదృశ్యుడైపోయెను.

## 4. అన్నాజయ్య బనగానపల్లెకి వెళ్ళుట

అన్నాజయ్య యువకదశలోనే సన్యాసమును స్వీకరించినతర్వాత మరల తల్లిదండ్రులనుగాని, తనగృహమునుగాని చూడరాదని, స్వగ్రామము వదలి దేశసంచారమునకు బయలుదేరిపోయెను. అతడు సదా దైవధ్యానపరుడై తీర్థయాత్రలజేయదలచెను. అతడు రామేశ్వరము, ధనుష్కోటి, కన్యాకుమారి, మధుర, శ్రీరంగము, కుంభకోణము, చిదంబరము, పక్షితీర్థము, కంచి, తిరుపతి, శ్రీకాళహస్తి, అహోబిలము, మహానంది, ఓంకారము, శ్రీశైలము మొదలగు పుణ్యస్థలముల దర్శించి ఆయాదేవతల సేవించి యాగంటీశ్వరుని సన్నిధికిజేరెను. అక్కడ తపమాచరింపదగిన చోటులు వెదకుచుండెను. తాను తిరిగి పుణ్యస్థలముల యందు ఎందరో మహాపురుషులను జూచెను.

తాను చూచినవారిలో సన్యాసులు, యోగులు, సిద్ధులు, దిగంబరులు యుండిరి. అందరితో మాటలాడెనుగాని ఎవరును అన్నాజయ్యను సంతృప్తి పరచలేదు. ఒకనాడు అన్నాజయ్య స్వామిగుడిలో గూర్చుండి యుండగా ఎవరో ఒక యోగి అచ్చటికి వచ్చి స్వామీ! మీరుబనగాన పల్లెకు వెళ్ళలేదా, అక్కడా దైవాంశ సంభూతుడగు వీరంబొట్లయ్య అని యోగియున్నాడు. గరిమిరెడ్డి అచ్చమ్మకు ధర్మోపదేశ మొనరింపగానామె ఆయనభక్తురాలుగ మారిపోయినది. వీరప్పయ్య పాపులకు ధర్మమార్గము బోధించుచు పరమపావనుల నొనరించుచున్నాడు అని చెప్పి తన దారిని పోయెను. అప్పటినుండి ఏలకో అన్నాజయ్యకు బనగానపల్లెకుబోవలెనని కుతూహలము జనించెను. ఆయోగినిచూచి మరికొన్ని వివరముల దెలిసికొందమని చుట్టుప్రక్కల వెదకిచూచెను కాని

ఎవరును అతనికంటబడలేదు. అందుకతడు కడుంగడు విచారించి సరి యిక యిందుండరాదు బనగానపల్లె మఠమున కేగి ఆ మహాపురుషుని శిష్యుడనయ్యెదనని ప్రయాణమైపోయెను.

## 5. అన్నాజయ్య శ్రీ వీరబ్రహ్మం గారిని దర్శించుట

అన్నాజయ్య యాగంటినుండి ప్రయాణమై బనగానపల్లె చేరెను అచ్చట కొందరివలన అచ్చమ్మగారి గృహమును దెలిసికొని పోయెను అతడు భయభక్తులతో లోమఠమున జొచ్చి జింక చర్మముపై గూర్చుండి తాళపత్రముల మీద యోచించి వ్రాయుచుండు పురుషునిగని యతడే శ్రీవీరబ్రహ్మమై యుండును. అని భావించి ఆయనకి వెంటనే సాష్టాంగ నమస్కార మొనరించి దేవాధిదేవా! ఆదిమధ్యాంతరహితా! ఆపద్బాంధవా! శరణాగతబిరుదాంకా! శరణు నాకు సద్గతి గలిగింపవేయని శరణు వేడెను.

అపుడు వీరప్పయ్య అయువకుని జూచి "నాయనా! అన్నాజయ్యా! లెమ్ము నేను నీరాకకై యెదురు చూచుచు కాలము గుడుపుచుంటిని ఇప్పటికి నాసంకల్పము నెరవేరినది" అనెను అందుకు అన్నాజయ్య దేవా నేను మిమ్మెపుడును దర్శించి యుండలేదు నేను మీకు పరిచయుడనుగాను, అట్టిచో నాపేరు మీకెట్లు తెలిసెను. అవిగాక మీ మాటలను వినిన నాకేమియు అర్థమగుట లేదు. అందేదో అంతరార్థము లేకపోలేదు. నేను వయసున చిన్నవాడైనను అనేక దివ్యస్థలము దర్శించి ఆయాదేవతల నారాధించి మహాతీర్థముల మునిగి అనేక యోగపురుషుల సేవించితిని. ఆ పురుషులలో నొకరుగూడ మిరానతిచ్చినట్లు పలికిన వారుకారు. నాజన్మ తరించినందున గాబోలు మిమ్ముల దర్శింపగలుగు భాగ్యము కలిగెను.

దయామయా! నన్ను నీ శిష్యునిగానెంచి నాజన్మము తరించునట్లు చేయుడనగా వీరప్పయ్య నాయనా! చింతింపకుము రేపటిరాత్రి, వేకువన నీకు కొన్ని రహస్యములు నెరిగింతును. ఇది నీమఠమగును నిన్ను కాలమే తెచ్చినదనెను.

## 6. అన్నాజయ్యకు వీరబ్రహ్మం గారు తన అవతార రహస్యమును తెలుపుట

ఆనాడు అన్నాజయ్య పగలంతయు నిమిషమొక వత్సరముగా గడిపెను. అంత రాత్రికాగానే స్నాన మొనరించి మఠమున గూర్చుండి యుండెను. ఎందరో భక్తులును భక్తురాండ్రును వచ్చి వీరప్పయ్యను సేవించి, ఆయన చెప్పుధర్మసూత్రముల విని పోవుచుండిరి. సుమారు నడిరేయి కావచ్చినను భక్తులచ్చటనుండి పోకుండిరి. అంతలో అచ్చమ్మవచ్చి, స్వామి వారికి విశ్రాంతిగొను సమయమైన దనగా, యక్కడవారక్కడనుండి లేచి బయటకి వెళ్ళిరి. అచ్చమ్మయు వెళ్ళెను అంతట అన్నాజయ్య లేచి దిక్కుల జూడసాగెను.

అపుడు శ్రీవీరబ్రహ్మం అన్నాజయ్యకు రమ్మని కనులతో దెలిపెను. అపుడు భక్తి వినయముతో స్వామి సన్నిధికేగి కరముల జోడించి కూర్చుండెను. అపుడు వీరబ్రహ్మం యిటులనెను.

“ఓ అన్నాజయ్యా! నీవుప్రస్తుతము అజ్ఞానిగా వున్నావు. ఈ కలియుగమున కలుషములను రూపుమాపుటకు శ్రీహరినైన నేనువీరప్ప అనే నామముతో అవతరించినాను. ఆనందభైరవుడనే యోగిగా ఈశ్వరుడు కాశిలో అవతరించగా, నీవు బ్రహ్మస్వరూపుడవు. అన్నాజయ్యపేరుతో ఇక్కడ అవతరించినావు.

ఇంకను వివరముగ తెలిపెద వినుము శ్రీవిష్ణువునగు నేను మాయాగర్భమున జన్మించి, పాపఘ్ని మఠాధిపతియగు మరల వీరపాపమాంబా వీరభోజయాచార్యుల పుత్రుడననిపించుకొంటిని. ప్రథమమున నన్ను వీరప్పయ్య యని పిలుచుచుండిరి. ఆపేరుననే యిటకు నరుదెంచితిని. ఇప్పటి నుండి కొన్ని దినంబులు వీరంభొట్లయ్య యనుపేరు వహించి యుందును ఆవల వీరబ్రహ్మము అను పేరుతో మరియొక చోట పాపుల పావనుల నొనరింపనుంటిని.

పరమేశ్వరుడే కాశీనగరమున విజయసింగు కుమారునిగా జనించెను. అతనిని అనందసింగు అని పిలుచుచుండిరి. అతనిని నా ప్రధానశిష్యుడుగ నొనరించుకొనదలచి నన్ను జేరునట్లుచేసితిని. అతడు కొన్ని దినములకుముందు నన్ను దర్శించి జ్ఞానోపదేశమునుబొంది తానుచేసిన గోహత్యా పాపమును పోగొట్టుమని ప్రార్థింపగా ఆ పాప పరిహారార్థము త్వరలోనీవీ యవతారమునుజాలించి వేరొకచోట మతాంతర వంశమున జన్మింపవలసియున్నది. అంతవరకు నీవు మరల నీతల్లిదండ్రులజేరి రాజ్యమును పాలించుచు రాజయోగమున నుండుమని పంపితిని. అతడు నాకు ప్రియశిష్యుడై జన్మించుకాలము రాగలదు.

ఇక నీవు దక్షిణదేశమున మాయామేయీ విశ్వాత్మక దంపతులకు పుత్రుడుగా జన్మించితివి. తల్లితండ్రులు నీకు అన్నాజయ్య అని పేరునిడగా, జనులందరూ నిన్ను బ్రహ్మానందుడని పిలుచుచుండిరి. ఓ అన్నాజయ్యా! ఈ విషయము లన్నియు నాకు ముందుగానే తెలియును. నేను నీకొరకే యీమఠమునగని పెట్టుకొని యుంటిని అందులకే నీవు వచ్చుచుండగనే అన్నాజయ్యా! రమ్మని పిలిచితిననగా, అన్నాజయ్య సంతసించి స్వామి మరికొన్ని సంశయములను నాకున్నవి దయచేసి తెలుపుడని కోరగా బ్రహ్మంగారు రేపురాత్రి సమయమందు చెప్పెదను అని ముగించెను.

## 7. శ్రీ వీరబ్రహ్మం గారు చెప్పిన తమ పూర్వజన్మ వృత్తాంతం

అన్నాజయ్య మరునాడు పగలంతయు మిక్కిలి కష్టముతోగడుపుచు యెపుడు సూర్యుడస్తమించునా, యెపుడు అర్ధరాత్రమగునా యని వేచియుండెను. రాత్రి యైనంతనేయతడు స్నానమొనరించి ఫలహార మొనరించి మఠమునందు గూర్చుండి వీరప్పయ్య నామజప మొనరించు చుండెను. ఎందరో భక్తులువచ్చి వీరప్పయ్య దివ్యవాణిని విని పోవుచుండిరి. అంతలో అచ్చమ్మవచ్చి స్వామి విశ్రాంతిగొనువేళ యైనదనగా అందరు వెళ్ళిరి. అపుడు వీరప్పయ్య అన్నాజయ్యను పిలిచి నాయనా! నీ సంశయమేమో చెప్పుమనెను.

అన్నాజయ్య "స్వామి! మీ రెప్పుడును తాటాకులపై యేదో వ్రాయుచుందురు. ఆ పుస్తకము పేరేమి? అందే విషయముల వ్రాయుచుండిరి?" దయయుంచి చెప్పమని పలికెను. అపుడు వీరంభొట్లయ్య "నాయనా! ఆ గ్రంథమునకు "కాలజ్ఞానము" అను పేరిడితిని, కాలత్రయము అనగా జరిగినది జరుగునది జరగబోవు కాలములని తెలియును. త్రికాలములలో జరిగిన జరుగుచున్న జరగబోవు విషయములను పూసగ్రుచ్చినట్లు ఈ గ్రంథమును వివరించుచుంటిననెను". అందుకు అన్నాజయ్య "దేవా! నాయందు దయయుంచి ముందు జరిగిన దైవీక విషయములను దెలుపుడ"నగా మంచిదనెను.

ఓ బ్రహ్మానందా! అన్నాజయ్యా! ఇపుడు విజయనగర సామ్రాజ్యాధీశులలో గడపటివారు నరపతివంశరాజులగు రామరాయ తిరుమలరాజుతో ఆరాజ్యమంతరింపగా, హిందూ మత ద్వేషులగు తురుష్క ప్రభువులు ప్రబలి, దేవబ్రాహ్మణ స్త్రీ శిశు గోహత్యల నొనరించుచుండిరి.

ఈ పాపకార్యముల జూడజాలక పాప వినాశన మొనరింపదలచి ఆనందభైరవ యోగి అన్నాజయ్యల జన్మింపజేసి నేను చిన్నతనమున వీరప్పయ్య యనియు, ఆవల వీరంబొట్లయ్య యనియు బరగి యిందుంటిని. త్వరలో నేనిచ్చటనుండి వేరొక చోటికి బోయి"వీరబ్రహ్మము" అను పేరుతో గృహస్థుడనై యుందును అపుడెందరో శిష్యులు నన్ను జేరుచుందురు. వారందఱుకు ధర్మోపదేశము లొనరింతును.

అంత అనందభైరవ యోగి తన యవతారమును జాలించి నాకు శిష్యుడుగ జన్మించును. ఆవల మేమిరువురు దేశసంచార మొనరించుచు పతితుల పరమపావనుల నొనరింతుము. ఆవల నేను జీవసమాధినొంది నాకు బదులు నాకు శిష్యుడై జన్మించు ఆనందభైరవయోగిని నామఠమునకు అధికారిగ జేతును. అనంతరము మరల ధర్మ సంస్థాపనార్థము వీరభోగవసంతరాయులు అను పేరుతో అవతరించువాడు నేడు సాంధ్రసింధువేదమును చదివి అనందాశ్రమ శిష్యుడనై యుండి కార్తీక బహుళ తదియనాడు దివ్యదేహమున అవతరించుదును.

అనుచుండ బ్రహ్మానందుడు! స్వామీ! ఆనందాశ్రమ మననేమో నేను గ్రహింపజాలకుంటిని. దయయుంచి తెలుపుడనగా వీరంబొట్లయ్య నాయానా! వినుము అనుచూ ఇట్లు చెప్పనారంభించెను.

బ్రహ్మానందా! జాగ్రత్ స్వప్న సుషుప్తులను మూడును అవస్థాత్రయము లనంబడును. అవస్థాత్రయమును పంచకోశ వ్యతిరిక్తము, పంచకోశ వివరణము, స్థూలాంగ సూక్ష్మాంగ కారణాంగ వివరముల దెలిసికొన్నచో ఆనందాశ్రమమునశిష్యత్వము వహింపనర్హత గలుగును అని తెలిపిరి.

అది విని బ్రహ్మానందుడు, స్వామీ! మీ దివ్యసూక్తుల వినినందున నా సంశయములుదీరినవి. ఇక మీరు విశ్రమింపుడు అని నమస్కరించి శయనింప వెళ్ళెను. వీరంభొట్లయ్య కాలజ్ఞానమును రచింపబోయెను.

## నాలుగవ ప్రకరణము

### 1. వీరబ్రహ్మం గారు అచ్చమ్మ పుత్రునకు దృష్టి ప్రసాదించుట

స్వామి పిలిచిన తోడనే అన్నాజయ్య స్వామీ! ఇదే వచ్చితినని సాగిలపడి మ్రొక్కి చేతులు జోడించుకొని యెదుట పద్మాసనము వేసుకొని కూర్చుండెను అపుడు స్వామినాయనా! నిన్నటిరాత్రి నీకు నా పూర్వపు అవతారముల రహస్యమును వినిపించితిని, అనగా నాకాలజ్ఞానములో భూతకాల విషయములందు చాలవఱకు వివరించితిని ఇక ప్రకృతము జరుగుచున్న యంశముల వివరింతును వినుమనుచుండగా అచ్చమ్మ పుత్రునితో వచ్చెను.

అచ్చమ్మ అంధుడగు తన పుత్రుడు బ్రహ్మానందరెడ్డిని చేయిబట్టి మెల్లగ నడిపించుకొని వచ్చెను. అది చూచి వీరంభొట్లయ్య తల్లీ! ఇదియేమి? ఈ బాలుడెవడు? ఈతనికి దృష్టి యెట్లు పోయినదని ప్రశ్నించెను.

అందులకామె స్వామీ! ఈ బాలుడు నా ఏకైకపుత్రుడు అతని వీర బ్రహ్మానంద రెడ్డియని పేరు పెట్టితిని. జన్మించునపుడీ బాలుడు అందరివలెనే జన్మించెను. అందచందములన్నియు అమరియుండుట మీరు చూచుచుంటిరి ఇతనికి ఉన్నటులుండి కనుల దృష్టి పోయినది. ఎన్ని చికిత్సలనో జేయించితిని ఎందరు దేవతలకో మ్రొక్కితిని దృష్టిరాలేదు మీరు అవతార పురుషులు, మా గృహమును మమ్ములను రక్షించుటకు

గదా మీరువచ్చితిరి. ఈ నా కుమారుని అంధత్వమున కేదికారణమో సెలవిచ్చి వీనికి దృష్టినొసంగుడు మీచేత కానిదీప్రపంచమున లేదు" అని సవినయముగ వేడుకొనెను.

అందులకు స్వామీ "అమ్మా! ఇన్ని దినములు నాకీవిషయమేల చెప్పకుంటివి. ఈ బాలుడు పూర్వజన్మమున సద్గుణవంతుడై యుండియు బాలస్నేహితుల వెంటాడుకొనునపుడొక కపోతము బాలురచేతికి చిక్కెను. అపుడు నీకుమారుడు బాల్యచాపల్యంబున ఆకపోతము రెండుకన్నుల నొకముంటిపాబొడిచి ఎగురవేసెను. కన్నుల కోలుపోయిన ఆపక్షి యెటుబోవుటకును తెలియక అందండెగురుచుండగ డేగ వచ్చి తన్నుకొనిపోయి చంపెను. ఆ పాపఫలమిప్పు డితనికి సంభవించినది. అతడు ఆపక్షి కన్నుల బొడిచిన పిమ్మట సద్గుణయుతుడు కాబట్టి తన పాపకార్యమునకై పరితపించి ఇకనెన్నడు నిట్టిపని చేయునని పలికెను. ఆ సద్గుణమే ఇపుడీతనికి దృష్టినీయగలదు". నాయనా! బ్రహ్మానందరెడ్డి! ఇటువచ్చి కన్నుల దెరువుమనెను. ఆ బాలుడు కన్నులదెరచి చూపు వచ్చినదని గంతులిడ సాగెను.

అంత అచ్చమ్మ తండ్రీ! మాయదృష్టము పండినది. లోకరక్షకా! నీవల నాపుత్రుడు ధన్యుడాయెను. అని పరిపరి విధంబుల స్తుతించు చుండగా స్వామి! నన్నేల స్తుతించెదవు. ఇది నా ధర్మము నాధర్మము నేను నెరవేర్చితినంతియేకాని ఎక్కువ సేయలేదు అమ్మా! నీకుమారునకు "పంచాక్షరి మంత్రోపదేశ మొనరించెదను" ఆ మహామంత్రమును నిశ్చల మనస్సుతో జపించిన సకల కార్యములు సిద్ధించును అని ఆ బాలుని దక్షిణ కర్ణమున "ఓం నమశ్శివాయ" అని మూడుసార్లు చెప్పి నాయనా!

నీవీ మంత్రరాజమును జపించుచు నీతల్లినితోడను, ఈ అన్నాజయ్యతోను ఈమఠమునందలి భక్తులకు భక్తిమార్గమును జూపుచుండుము. నేను త్వరలో వేరొకచోటికి పోవలసియున్నది. అపుడు మీరు మఠమునందొక శివలింగమును ప్రతిష్టచేయించి, నాకు బదులు పూజలొనరించుచుండుడు. త్రిమూర్తులవలె అన్నాజయ్య అచ్చమ్మ, బ్రహ్మానందరెడ్డి అను మీరు ముగ్గురు ఈమఠమునకధికారులై పాపుల తరింపజేయుచుండుమని చెప్పగా, చిత్తమని చెప్పివారు విశ్రమింప వెళ్ళినారు.

## 2.బనగానపల్లె నవాబు బ్రహ్మంగారిని ఆహ్వానించుట

అచ్చమ్మ కుమారుడు బ్రహ్మానందరెడ్డి తనకు చూపువచ్చిన వెంటనే అందుకు కారణమయిన వీరబ్రహ్మము గారిని పరిపరి విధాలుగా ప్రార్థించి ఆయనకు నిత్యం సేవలు చేస్తూ కాలం గడపసాగాడు. ఒకనాడు బ్రహ్మానందరెడ్డి తన మిత్రులను, బంధువులను చూడవలెనని భావించి, బ్రహ్మంగారి అనుమతితో తన బంధుమిత్రుల గ్రామాలను సందర్శించుటకు పోయెను. అక్కడ బ్రహ్మానందరెడ్డి బంధుమిత్రులందరూ అతనినిగాంచి అతనికి చూపుతెప్పించిన మహాపురుషుడు శ్రీవీరబ్రహ్మంగారని తెలుసుకొని వారి మహత్యమును ఊరూవాడా ప్రచారము చేసిరి.

ఆవిధముగా బ్రహ్మముగారి మహత్యము బనగానపల్లి నవాబు చెవిన పడినది. అంత నవాబు వీరబ్రహ్మము గారిని దర్శించి తానుకూడా వారి అనుగ్రహమును పొందవలెనని భావించి, వారిని దర్శించుటకు తగిన సమయమును వారినే తెలియచేయమని ఒక సేవకుని పంపెను. ఆ సేవకుడు బ్రహ్మంగారి వద్దకు వచ్చి నవాబుగారు తమని దర్శింప గోరుచున్నారని విన్నవించగా బ్రహ్మంగారు వానితో "నేను రేపు ఉదయం

నిత్యపూజ అనుష్టానము తరువాత నవాబు వద్దకు వచ్చెదనని" తెలుపుము అని చెప్పెను. అంత ఆ సేవకుడు తిరగి వెళ్ళి బ్రహ్మంగారు చెప్పిన వాక్యములను నవాబునకెరిగించగా అతడు ఎంతో అనందముతో బ్రహ్మంగారి రాకకు తగిన ఏర్పాట్లు చేయమొదలిడెను.

## ౩. శ్రీ వీరబ్రహ్మం గారు రాజనగరానికి వెళ్ళుట

ఆ మరునాడు నవాబు వేకువఝామున లేచి తాను అంతఃపుర స్త్రీలను స్నానమొనరింపుమని తానును జలకమాడి, సేవకులరావించి మీరు నాపల్లకీని బాగుగ శుభ్రపరచి పట్టుపాన్పును తలగడలనందిడి పుష్పమాలతో జక్కగ నలంకరించి మంగళవాయిద్యములతో మఠమునకేగి స్వామిని బిలుచుకొని రమ్మనెను. వారటు లొనరించి మంగళవాయిద్యములతో పోయిరి.

అంతలో నవాబు దర్బారును అలంకరింపజేసి స్వామిరాకకై ఎదురు చూచుచుండెను. ఆవల కొంత సేపటికి వీరంబొట్లయ్య పల్లకిలోగూర్చుండి నవాబు నగరునకు వచ్చుచున్నాడను వార్త వినవచ్చెను ఆ మాటలు విని పురజనులా వీధిని రెండుప్రక్కల బారులుదీరి నిలుచుండిరి తమయొడిలో పువ్వులనిడుకొని యుండిరి. కొందఱు మిద్దెలమీద నిలిచి స్వామిని దర్శించి పుష్పవర్షము గురుపింప గనిపెట్టియుండిరి.

అంత స్వామివారిరాక నెరంగించు మంగళారావములు వినబడెను. బోయీలు పల్లకిని మోయుచు "వీరంభొట్లయ్యకు జై" యని నంతనే ప్రజలందరు మిన్ను ముట్లునట్లు జయజయ శబ్దము లొనరించిరి. రాజబాటన పల్లకి పోవుచుండగా వారిప్రక్కన బారులు తీరిన పురుషులు పుష్పముల జల్లుచుండిరి మిద్దెలపై నిల్చిన స్త్రీలు స్వామి పల్లకిపై ప్రసూన వర్షములు కురిపించుచుండిరి అంతలో కోటద్వారము సమీపించెను.

అపుడు నవాబు దర్భారునుండి పరిగిడుచువచ్చి కోటప్రధాన ద్వారమున నిలిచి పల్లకి వచ్చినంతెనే వంగి సల్లాములు చేయుచు పల్లకిని పట్టుకొని దర్బారు మందిరమునకు దీసికొని వెళ్ళి స్వామిని సింహాసనముపై గూర్చుండ నియమించి ప్రసూనములచే తయారుచేయించిన కిరీటమును తలపైనిడి, గులాబిపూల మాలచే కంఠము నలంకరించి, చేతులు జోడించి ఆజ్ఞయని నిలుచుండెను.

అపుడు వీరంభొట్లయ్య "నాయనా!నీవు పూర్వజన్మమున నా భక్తుడనై యుండినందున యీ జన్మమున రాజవంశమున జన్మించితివి, ఆ సంగతి నాకు ముందుగ తెలియును అందులకే నీవు నన్ను జూడ పాదచారిగ వత్తునని చెప్పిపంపినను నాభక్తుని గృహమునకు నేనే రాదలచి వత్తునని చెప్పిపంపితిని నీవు ధన్యుడవు సుమా!" అనునంతలో నవాబుస్వామీ! మీపలుకులలోని మర్మము నెరింగితిని తాము నా రాజ్యములోనికి వచ్చినందులకే కాక నా మందిరమునకు వచ్చినందుల కెంతయో ఆనందించుచుంటిని మీరు నాకోర్కెను నెరవేర్పగోరుచున్నాను భక్తులకోరిక తీర్చుట మహాత్ముల ధర్మము మీరు నాతోగూడ అంతఃపురమునకు విచ్చేసి జానానాస్త్రీలతో నేచేయు సత్కారమును బొందుటయేగాక విందు, స్వీకరించవలెననగా స్వామి మంచిది పోదము రమ్మని అతనివెంట జనానాకు వెళ్ళెను.

అంతలో అంతఃపురమున రాజాజ్ఞననుసరించి మధుర పదార్థములను గాక, గోమాంసముతో జేయించిన పదార్థముల నొక బంగరు పల్లెమునందిడి పట్టు వస్త్రముతో కప్పి ఒక పీఠము ముందు పెట్టియుండిరి. ఈ సంగతి నవాబుకు తెలియును కాబట్టి స్వామి లోపలికి బోయినంతనే

స్వామిని పీఠముమీద గూర్చుండ నియమించిరి. అంతలో జనానా స్త్రీలు, నవాబు స్వామియెదుట గుర్చుండగా పల్లెములోని పదార్థములపైన గుడ్డకప్పి తెచ్చి వారిముందు పెట్టిరి. అపుడు నవాబు స్వామి వారిని ముందు భోజనమునుతిని ప్రారంభింపుడనియు, ఆవల తాము భుజింతుమనియు చెప్పెను.

అపుడు వీరబ్రహ్మం నవ్వుచు " నాయనా! నీ అతిథినై వచ్చి నీ ఆతిథ్యమును స్వీకరింపకుందునా, ఏల సంశయించెదవు" అని ప్రక్కన యుండిన వెండిపాత్రలోని నీటినిగొని ఆ పట్టుగుడ్డ కప్పిన పళ్ళెముపై ప్రోక్షించెను ఆశ్చర్యపడి నవాబే ఆపట్టు గుడ్డను తీయగా తట్టనిండుగ నానావిధ ఫలములుండెను. అపుడు వీరంభొట్లయ్య నాయనా ఇక నేను భుజింతును. మీరును భుజింపవచ్చునని వారి పళ్లెములపై నీటిని జల్లగనే వారి పదార్థములన్నియు ఫలములగ మారిపోయినవి.

ఆ వింతదృశ్యాన్ని నవాబు చూచి స్వామికి సాష్టాంగ నమస్కారమొనరించి " ప్రభూ! దాసుని తప్పు దండముతో సరి" యందురు నేను మాయాంధకారమగ్నుడై నన్ను నేనెరుంగక మీబోటి అవతారపురుషుల పరీక్షింప గోరినందులకు క్షమింపుడు. నన్ను మాయాసముద్రమునుండి బయటికి లాగి తరింపజేయుడని పరిపరి విధముల ప్రార్థించెను". అందుకు స్వామి నవాబును దగ్గరకు రమ్మని కుడిచెవిలో మూడుసార్లు ఊది నీవు ధన్యుడవు పొమ్మనెను.

అంత అందఱును ఆ పదార్థముల నారగించి లేచిరి అపుడు నవాబు ఒక బంగరు పళ్ళెరమునందు కొన్ని నవరత్నముల నిడి పట్టు కావి వస్త్రములతో గూడ సమర్పించెను. ఆ పళ్ళెరము నందుకొని

బ్రహ్మంగారు నాయనా! నిన్ను నా భక్తునిగా స్వీకరించితిని, నీవువచ్చి నాకాలజ్ఞానమును వినిపోవుచుండుము. నీకు జయమగుగాక. అని దీవించి లేచి మరల పల్లకిలో గూర్చుండగా బోయీలు మోసికొనిపోయి స్వామిని మఠమున తిరిగి చేర్చిరి.

## ఐదవ ప్రకరణము

### 1. శ్రీ వీరబ్రహ్మంగారు కాలజ్ఞానమును వివరించుట

ఒకానొకదినంబున బనగానపల్లెనవాబు తన సేవకుని పిలిచి ఓయీ నీవేగి మఠంబుననుండు స్వామివారితో మీ శిష్యుండగు నవాబు మిమ్ము దర్శించి తాము రచించుచున్న కాలజ్ఞానమును వినుటకు రాదలచెను. మీ ఉత్తరువునకై కాచియున్నాడని చెప్పుము, అతడేమి చెప్పునో తెలిసికొని రమ్మని నన్ను పంపెనని చెప్పుము. నీవు ఆ మఠమున వారి సన్నిధిలో వినయముగ మాట్లాడమని చెప్పి పంపెను.

సేవకుడు ఏలినవారి యాజ్ఞ ననుసరింతునని మఠమునకేగి స్వామికి నమస్కరించి మహానుభావా! మా నవాబు మీతో తమ కాలజ్ఞాన వివరముల దెలిసికొనగోరిరి. అందులకు తగిన సమయమును దెలిసికొని రమ్మనిరి. తమరేమి ఆజ్ఞ యిత్తురో సెలవిండు. ఆ యుదంతమును ప్రభువు కెరింగింతుననెను. అందురు వీరబ్రహ్మంగారు నాయనా! మంచిది ఈ దినము రాత్రి భక్తులందరు వచ్చినపుడు నవాబును రమ్మనుమని చెప్పెను. అందులకా సేవకుడు చిత్తమని సలాము చేసిపోయెను.

సేవకు డేగి స్వామి అజ్ఞను రాజునకెరింగించెను. నవాబు యెపుడు రాత్రియగునాయను చింతచే రాచకార్యముల నెల్లవదలి కాచుకొని

యుండెను. అంతట రాత్రికాగానే నవాబు బయలుదేరి, ముందు సేవకుడు బోవుచుండ నతని ననుసరించి పోవుచు, మఠమును జేరెను. అతడేగు నప్పటికి స్వామివారు జింక చర్మముపై గూర్చుండి యుండెను. ఒకప్రక్క అచ్చమ్మ అన్నాజయ్యయు, రెండవ ప్రక్క బ్రహ్మానందరెడ్డియు గూర్చుండి యుండిరి. బ్రహ్మానంద రెడ్డి ప్రక్కన ఒక చర్మమును బరచియుండిరి. ఎదుట కొందఱు భక్తులు నిశ్శబ్దముగ గూర్చుండియుండిరి. అంతలో నవాబువచ్చి వంగి మూడుసార్లు భూమిని దాకునట్లు సలామొనరించి నిలిచెను. అపుడు స్వామి నవాబుని చూచి నాయనా! ఇటురమ్ము బ్రహ్మానందరెడ్డి ప్రక్కనునుండిన కృష్ణాజినముపై గూర్చుండుమని కన్నులతోజెప్పెను. అపుడు నవాబచ్చుట గూర్చుండగా వీరబ్రహ్మం యిట్లు చెప్ప దొడంగెను.

## ౨. శ్రీ బ్రహ్మం గారు నవాబుకు కాలజ్ఞానం బోధించుట

నాయనలారా! పూర్వము ఆదినారాయణమూర్తి సకల భువనంబుల రక్షింపదలచి.

**శ్లో॥ యదా యదా హి ధర్మస్యగ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం**

ఈ ప్రపంచమునందెపుడు ధర్మము నశించి అధర్మము హెచ్చుపెరుగునో అపుడు అధర్మము యెక్కుడైన చోట తానవతరించి అధర్మమును నశింపజేయుదునని ఆనతిచ్చి యుండెను. ఆ మహావిష్ణువు అంశమున అవతరించిన నేను పాపాఘ్ని మఠమున, వీరప్పయ్య అను నామముతో బెరిగితిని ఆవల ఈ బనగానపల్లెజేరి వీరంబొట్లయ్య అను నామమున బిలువబడుచుంటిని. అనగా యిపుడు భూత, వర్తమానకాల

విషయములకడు సూక్ష్మముగ వెల్లడించితిని. ఇక ముందు వీరబ్రహ్మము అను పేరుతో మరియొకచోట వెలసి పాపుల పరమపావనులను నొనరింపనున్నాను.

అన్నాజయ్యా! నీకు నేనింతకుముందే నాభూతకాల అవతారముల గూర్చి చెప్పియే యుంటిని. వర్తమానకాలమును కడుసూక్ష్మముగ నెరింగించితిని ఇపుడు భవిష్యత్ కాలమున జరగబోవు విషయము లనేకములుగలవు. అన్నిటిని తెలుపుటకు చాల దినముల పట్టును. ఇపుడు కొన్నింటిని మాత్రమే వివరింతును. నిశ్చల మనస్కులై వినుడు. అని కాలజ్ఞాన విషయాలు వారికి చెప్పుట ప్రారంభించెను.

పాపులును దుర్మాదాంధులును తమలో తామె కలహించి హతులగుటచే కొంత భూభారముతగ్గును. విజయవాడలో శక్తిరూపిణిగా కనకదుర్గ జన్మించి కొందరిని రూపుమాపును. పర్వత శిఖరములపై మహా అగ్నిజ్వాలను పుట్టును. ఆజ్వాలలు గొందరిని రూపుమాపి భూభారము తగ్గించును. ఆలయములలోని దేవతా విగ్రహములు పల్లెలు పట్టణములపై నాట్యమాడును. దక్షిణ దేవాలయమున కంచికామాక్షియు, కర్నాటక దేశమున కాశీమాతయు, అరవదేశమున వీరభద్రుడును, నందిమండల రాజ్యమున నాగేంద్రుడును, చిన్న పెద్దలను భేదముచూపక నాశన మొనరించుటచే మరికొంత భూభారముతగ్గును. శ్రీశైల మల్లికార్జునుని ఆలయమున పొగమంటలెగయును. అది వీరభోగవసంతరాయులు పుట్టుటకు ఆనవాలు అని ఆకాశవాణి పలుకును.

అంతగొన్నాళ్ళకు బాణముల వర్షము కురియును. అపుడు అరవదేశమున కాళీభైరవ పంపులు జనించిశీతలవాయువులు వీచుటచే

ఆ బాలవృద్ధులు తలలు పగిలి మరణింతురు. అంతట జనులలో బొబ్బరోగములు, కంఠమాల, రాచ వ్రణము, భంగదరరోగములు, నోటిపుండ్లు, జన్మించుటచే జననాశనమగును. జనులలో ఉన్నటులుండి హృదయచలనమాగి మరణములు జరుగుచుండును.

మరికొంత కాలమున గగన భాగమున నాలుగు నక్షత్రంబులు జూపట్టును. అంత ధనుష్టాధ్వని వినిపించుటచే దానివలన అనేకులు మరణింతురు. పశుజాలము ఆకసమును జూచి యరచును. భూమి పెళపెళారవములచే పగిలిభయంకర శబ్దము చేయుటచే జననాశనమగను. ప్రజలు రచ్చ లెక్కి అయ్యో! మాగతి ఏమని పలువిధముల మొత్తుకొని చత్తురు. దేవియనుశక్తి బొబ్బలిడును. బసవేశ్వరునికి కంటనీరుగారును, అర్ధరాత్రివాయసములరచును. అత్యధిక వింతలు చెలరేగి పగలు నక్షత్రములు వెలిగి ఆకసమున వింత నవ్వులు పుట్టుటచే జనసముదాయము నశింపగలదు.

నాయనలారా! ఆవల కొన్నాళ్ళకు శ్రీశైలమునభ్రమరాంబికా ఆలయమున ఒక మొసలిచేరి రెండుదినములుండి మేక యరపరచి అదృశ్యమైపోవును. శక్తులు కడకు వ్యాఘ్రరూపమున జనుదెంచి జనుల జంపును. కుమారస్వామి తనగుడి తలుపులు బిగించుకొని తీయకుండును. అంతలో మలయాళదేశమున మందపాలుడను వానరము జనులతో మాట్లాడుట తటస్థంచును, తాటిపర్తిలో మేక మనిషివలె మాట్లాడగలదు. అంత గంగా యమున సరస్వతి నదులుపొంగును అప్పుడు రామదుర్గమునందొక, రామచిలుక వీరధర్మముల బోధించును. కుంభకోణమున గోవును సంహరింతురు. గోలకొండలో కొంగ

మాట్లాడసాగును. కంచిలోని గరుడధ్వజమును కదలింతురు. కురుకొండలో వీరాంజనేయులు కోపోద్దీపితుడై నాలుగు తాటిమానుల పొడవు పెరుగును. అప్పటికి కొంత జనము నశించును.

ఆవల మల్లికార్జునుడు కన్నులనుండి నిప్పుల గురిపించును, బసవేశ్వరుడు భీతిచే గడగడ వడంకును. అతనినోట భీకర శబ్దములు పుట్టును. సూర్యమండలమునుండి నిప్పుకణములు గురియును. కొండలరాయుని వీలూరి పాడుపడిపోవును. శ్రీతిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయమున మ్లేచ్ఛులు ప్రవేశింతురు. పలుచోట్ల కపిధ్వజములనుండి భయంకరారవములు వెలువడును. భూమండలము దద్ధరించును, అంత తిరువళ్ళూరు వీర రాఘవస్వామి దేహమునుండి చెమ్మటలు గ్రమ్మును. దివ్యక్షేత్రములన్నియు తురుష్కుల వశమగును. ఆరీతిగా కొంతభూభారము తగ్గును అనగా ఇప్పటికి జననాశనమగును. అమావాస్యనాడు చంద్రోదయముకాగా, అర్ధరాత్రి సూర్యోదయమగును. ఆకాశము రక్తమువలె ప్రకాశించును. అందువలన దుర్మార్గులగు జనులు చాలవఱకు నాశనమై భూదేవి భూభారమును తగ్గును.

అష్టాదశవర్ణములవారు గణపతిమంత్రము నుపాసించుటచే పురములందు రక్తవర్షములు గురియగలవు. లచ్చిగోడుగోడున దుఃఖించును. సముద్రముప్పొంగును. ఇందువలన అనేక జనులు ప్రాణములు కోల్పోదురు. అందు కొంతవరకు మరల ధర్మము నిలుచును. ప్రజలందఱు సుఖంబుండుదురు. సస్యములు బాగుగా ఫలించును. అన్ని వర్ణములవారును సుఖంబుగనుందురు. అదియునుగాక కలియుగమున నాలుగువేల అయిదు వందల ముప్పది రెండు వర్షములు జరుగగా నందన సంవత్సరము

వచ్చును. అపుడు గొప్ప కఱువు సంభవించి భూకంపము కలుగును. నక్షత్రములు రాలును. కృష్ణా తీరమునందొక భూసురునింట హత్యజరుగును. ఆ హత్యను గూర్చి పశువు సాక్ష్యము పలుకగలదు. ఆదిగాక మీకు మరొక గుఱుతు చెప్పెదను. కలియుగమున నాలుగవేల ఆరు వందల డెబ్బదియైదు సంవత్సరములకు భవనామ సంవత్సరమున పినాకీనీనది అధికమగు వెల్లువలో మునుగుటచే ముడు దినములు పూజలు జరుగును.

అంతియేకాదు. ఇంకను చెప్పెదను వినండి మార్కాపురము వద్ద భూమినుండి సువర్ణ వృషభమును తీయుదురు. అయిదేండ్ల బాలుడు అయిదు వేదముల చదువు కాలమురాగలదు. ప్రతిగ్రామమునకు నక్కలు కూయుచుండగా రాత్రింబవళ్ళు గుంపులై గ్రద్దలు కూయుచుండును. ఆకసమునధర్మదేవత ఆర్భటించును. అంతలో విషగాలి కొట్టగా పార్వతి కంట నిప్పులురాలును. బసవేశ్వరుడు కన్నీరు గార్చును. మహాదేవుడు జడలెగురునట్లు నాట్యముచేయుచు పర్వత శిఖరాగ్రమందలి ఉక్కుకంభము మీది ప్రతిమ మాట్లాడగలదు. ఏలూరులో గుగ్గిళ్ళరాయుడు గజముచే చంపబడును. తిరుపతి కొండపై తురకలు చిందులు త్రొక్కుదురు.

ఈ విధముగా కలియుగము నలుమూలలనేకవింతలు బుట్టుటచే జననాశనము తప్పదు అదియుగాక చెప్పెదవినుడు.

అంతట వీరశైవులకును వీరవైష్ణవులకును మత కలహములు గలుగును. ఆ కలహములు దీర్చుకొనుటకు శ్రీశైలమందుండు ఋషులకడకు పోవుదురు. ఆఋషులు చేసెడి పరీక్షలో విష్ణుభక్తులు పాతాళగంగను తీసికొని రాజాలనందున శివభక్తులు తాము తెచ్చెదమని తీసికొనివత్తురు. అందుకు వీరవైష్ణవులు సిగ్గుచే దలలువంచుకొనగా

పాతాళగంగ నుండి ఓంకారశబ్దము జనించును. అపుడు సప్తసముద్రములు, నదీ నదములు మానవ శరీరముల ప్రవహించు రక్తము స్థంభించిపోవును. అపుడు నాభక్తులు తప్ప తక్కినవారు నశింతురు. అవియేకాదు ఇంకను వినుడు...

మూడు కాళ్ళ ఆవు మగవానిని ఈనును. వాడు మనుష్యులతో మాట్లాడి రాగములు తీయును. ఆకసమున పచ్చని రంగుతో మనుజుని యాకారము కనబడును. అప్పటికి బళ్ళారిలోని భాగ్యమంతయు తొలగిపోవును. బొబ్బిలి జనులు తబ్బిబ్బులగుదురు. రాచస్త్రీలకు సంకటికూడ కఱవగును. సిద్ధేశ్వరమున ఒక మహాఋషి పుట్టును. అపుడు పిడుగులరాలును. రక్తవర్ణముగల నాలుగుచుక్కలుపుట్టును. అందొక కుక్కకు మూడు తోకలుండును.

అంత సువర్ణముఖి నదియందు కొందఱుమహాత్ములుద్భవింతురు. అపుడు నాయుడుపేటలోని ధనవంతులు నశింతురు. కోతులు రాగముతీసి పాటలుపాడును. తిరుపతికి పశ్చిమమునయుండిన బిలములో పదునెనమండ్రు వైష్ణవులు, ఇరువదినాలుగు గుఱ్ఱములు జన్మించి జనులను సంహరింతురు. స్త్రీలను పురుషులు విక్రయింతురు. స్త్రీలు పురుషులకు యెదురు తిరిగియిష్టము వచ్చినట్లు తిరుగుదురు. అధర్మగర్భముల గాంచివారు స్త్రీ శిశుహత్యలజేయుదురు. కురుక్షేత్రము బుక్కాపురము, రాయచూరు, యాదగిరినగరము పున్నావళి, ఓరుగల్లు, కల్బగిరి, ఆదవాని అరవరాజ్యము. వెలుగోడు నాశనమైపోవును. పశ్చిమదిక్కు ధూమకేతువు జన్మించును. దానితోక యిరువది బారల వెడల్పుండును. ముప్పదిమూడు దినములలో నది సర్వజనులకు గోచరంబగును. అపుడు పుణ్యాత్ములకు సూర్యబింబము

నందొక పురుషరూపము కనబడును. ఆకసము నెఱ్ఱనగును. ఆవు లాకసమును జూచి యఱచుచుండును. నింగినుండి భయంకరధ్వని వినిపించును.

నాయనలారా! నాకాలజ్ఞానము పూర్తిగా వివరించుటకు వీలుపడదు. దానిని వినుటకే కొన్నిదినములు పట్టును. ఇప్పటికిది చాలును, మున్ముందు అన్నాజయ్య నా కాలజ్ఞానమును లోకాలకు వెల్లడిచేయవలసి వచ్చును. ఇక మీకు మరికొన్ని ముఖ్యాంశములను వివరింతును వినుడు.

నేను కలియుగము అయిదువేలయెనిమిదివందల సంవత్సరములు గడిచిన తర్వాత "శబల" యను గ్రామమునందొక బ్రాహ్మణవంశము నందవతరించెదను. అపుడు నన్ను "వీరభోగవసంతరాయులు అని పిలుతురు. అపుడు దూర్మార్గును, పాపులను దండించి, ధర్మపరాయణుల నొనరింతురు. అపుడు కృతయుగధర్మము నడువగా నేనా అవతారమును విరమించి వైకుంఠమును జేరుదును.

ఇక జరుగుటకు యింకను చాలా సంవత్సరములగును. ఆ అవతారము జరుగుటకు ముందు జరుగ గల నిదర్శనములు మరికొన్ని వివరింతును. నా భక్తురాలగు గరిమిరెడ్డి అచ్చమ్మ వంశమే నిలవకుండ బోవును. ఆమె గో గణమంతయు మరణించును. గోపాలకుడైన నేను వ్రాసిన కాలజ్ఞానమును అచ్చమ్మ యింటియందొక పాతరయందు కలదు. కలియుగమున వీరభోగవసంతరాయుడు అవతరించుటకుముందు ఆపాతరపై ఒక చింతచెట్టు మొలచును. ఆ చింతచెట్టు వీరభోగ వసంతరాయులు పుట్టకముందు చేమంతిపువ్వులను బూసి వికసించును. అదియుగాక అతడవతరించుటకు ముందు 'జుఱ్ఱేడు' పొంగి బనగానపల్లె

చాలాభాగము నాశనమగును. నవాబు రాజ్యమునుగోలుపోవును. ఇంకను ఎన్నియో నిదర్శనములున్నవి ముఖ్యమైన దానిని వివరింతును.

ఆవల అన్నాజయ్యనుచూచి నాయనా! నేను బనగానపల్లెను వదలి వేరొకచోటికి వెళ్ళు సమయము సమీపించినది. ఎందులకనగా శంకరావతారుండగు ఆనందభైరవయోగి తన అవతారమును జాలించెను. అతడు నాకు ప్రియశిష్యుండై జన్మించునటుల ముందే ఏర్పాటుజేసియుంటిని. ఆరీతి అతడు వేరొక చోట జన్మించును. అతనిని మత ద్వేషులయింట జన్మింపజేసి, మతవిరోధియగు నాతనిని హిందూమతమున పుట్టించి పాపులకు ధర్మమునుపదేశించునట్లు చేయుదును.

నీవు, అచ్చమ్మ ఈ మఠమునందు భక్తులకు ధర్మముల నుపదేశించుచుండండి. ఈ మఠమున నీకు అధికారాన్ని, కాలజ్ఞానమను గ్రంథమును నీస్వాధీనమొనరించితిని. దానిని ప్రజలలో ప్రచారము గావించుటకు నీపని. ఇక మీరందఱు విశ్రమింపబొండు అని చెప్పగా నవాబు తన మందిరమున కేగుచు స్వామీ! నేను మీశిష్యుడను, కనుక ఈ మఠమునందు సదా పూజలు జరుగగలందులకై కొన్ని భూముల నిత్తునని వెళ్ళెను. అచ్చమ్మ స్వామిని విశ్రమింపకోరి, వారినుండి శెలవు గైకొనెను. అందరూ వారివారి ఇండ్లకు కేగిరి.

## ఆఱవ ప్రకరణము

### 1. శ్రీ వీరబ్రహ్మంగారు బనగానపల్లె వదులుట

ఒకానొకదినము రాత్రి వీరబ్రహ్మంగారు తాను గృహస్త్రాశ్రమమును స్వీకరింపదలచి, శ్రీలక్ష్మిని కలియుగమున మానవుల గృహమునందు

అనగా విశ్వ బ్రాహ్మణులయింట జన్మించునట్లు సంకల్పింపగా, ఆమె భూమిపై అవతరించెను. అంత స్వామి ఆమెను వివాహమాడగోరి తగిన నెలవును నిర్ణయించుకొనుటకు రాత్రి ఎవ్వరికి తెలియకుండ లేచి ప్రయాణము సాగించెను.

అతడు బయలుదేరి కొత్తపేటకేగి అక్కడనుండి కోవెలకుంట్లకేగి అందుండు రంగనాథస్వామిని సేవించి, మెల్లగా కుముద్వతీనది ప్రక్క గ్రామముల తిలకించుచు బోవుచుండెను. అట్లు బోవువాడు దారిలోని కుందునదిలో స్నానమొనరించి, దేవతార్చన చేయుటకు సమీపమునందొక గుడి కూడా లేకుండుటచే నది మధ్యంబునకేగి మునిగి చేతికివచ్చిన శిలను బట్టి లేపెను. అది యొక నల్లని రాయియైయుండెను.

## 2. బ్రహ్మంగారు అరచేతితో విగ్రహమును చేయుట

ఆ ఱాతిని ఎడమచేతియందిడుకొని దాని వంకజూచుచు సమంత్రకంబుగా ప్రాణప్రతిష్టజేసి పూజించి, జపమొనరించి, తదుపరి దానిని ప్రవాహమున వదలెను అంతలో ఆరాయి చిన్న విగ్రహముగా మారి నీళ్ళమీద తేలియాడుచు బోవుచుండెను. అంతట శ్రీ వీరబ్రహ్మం నదీనగర్భము నుండి వెలుపలికి వచ్చి రాత్రికి సమీపమునందుండు గ్రామమును జేరుకొనెను. ఆ ఊరిలో తానెవరి గృహమునకు పోక ఒక దేవాలయమున విశ్రమించెను.

ఆనాటిరాత్రి ప్రొద్దుపోయిన తర్వాత ఆకసమంతయు నల్లని మేఘములచే గప్పబడెను. గంభీర ఘోషణములు మానవుల గుండెయలదురునట్లుండెను. అంతలో చిన్న చిన్న చినుకులు ప్రారంభము కాగా అపుడపుడు మెరుపులు తళుక్కుమని కనుల మూయించుచుండెను.

ఆ చీకటిలో ఏదియు గానబడుటలేదు. ప్రపంచమంతయు కాటుక కొండలతో నిండెనా అన్నట్లుండెను. వర్షము మెల్లమెల్లగా వృద్ధియైముందు బిందుబిందువులుగను పిదప దారపు పోగులవలెను అటుపిమ్మట నింగినుండి ఏకధారగా కురియుచుండెను. ఆరీతి రాత్రియంతయు కుండతో బోసినట్లు వర్షము కురియుటచే వాగులు వంకలు నదులు గుంటలు జలపూర్ణములై ప్రవహించుచుండ తెల్లవారునప్పటికి వర్షము నిలిచెను. ఆకసము నిర్మలమై కనంబడెను.

## 3. అరచేతి విగ్రహము ఆల్లాడుపల్లె చేరుట

కుముద్వతీ నదిప్రవాహమున మునుగుచు దేలుచు పోవుచుండిన విగ్రహము ఆరాత్రివర్షమయముచే గలిగినవెల్లువ వలన గొట్టుకొనిపోయి ఒకగ్రామముకడ నదిగట్టునానుకొనియుండు మడుగులో నిలిచెను.

ఆ విధముగా మడుగులో నిలిచిన విగ్రహము ప్రాణముపోసుకుని ఒక బాలుడి రూపాన్ని ధరించినది.ఆ బాలుడు నిత్యమూ, ఆ మడుగు వద్దకు పశువులు తోలుకు వచ్చే గోపబాలకులతో కలసి ఆడలాడుకునేవాడు. ఆటల అనంతరము తిరిగి వారందరూ చూస్తుండగానే ఆ మడుగులోనికి వెళ్ళి అదృశ్యుడయ్యేవాడు. గోపబాలకులంతా ఈ విషయమును గురించి గ్రామములోని పెద్దలకు తెలియచేయగా అందరూ అదివిని ఎంతో ఆశ్చర్యమును పొంది ఈ విషయమును పరిశీలించుటకు మడుగు వద్దకువెళ్ళిరి. వారు కూడా కొత్త బాలుడు మడుగులోకి దూకి అదృశ్యుడై పోవటమును గమనించిరి. వారికి ఇదంతా ఒక మాయలా అనిపించినది.

ఆనాటి రాత్రి గ్రామపెద్ద కలలో ఆ కొత్త బాలుడు దర్శనమిచ్చి నా పేరు వీరభద్రుడు. నేను మిమ్ములను రక్షించుటకు వచ్చినాను.

రేపు ఉదయము మీరు మడుగులో వెదికిన నేను ఒక శిలావిగ్రహముగా మీకు దొరకుదును. దానిని మీరు మీ ఊరినందు ప్రతిష్ఠించి ఆలయమును నిర్మించండి. మీకు శుభము కలగును. అని చెప్పి మాయమయ్యెను.

## 4. అల్లాడుపల్లెలో దేవాలయ నిర్మాణము

అంత తెల్లవారగనే గ్రామాధికారి గ్రామ పెద్దలను పిలిపించి స్వప్నవార్తల దెలిపి వారియభిప్రాయమును దెలుపుడనెను. అందఱును మంచిది ఈ దినము అందరము ఆ విగ్రహమును వెళ్ళి వెదుకుదుము. ఆ విగ్రహము లభించినచో జెప్పబనిలేదు. మనము మన గ్రామము తరించినవార మగుదుము అని అందరును స్నానమొనరించి, పరిశుభ్ర వస్త్రములు ధరించి పశులబాలుర వెంటనిడుకొనిపోయిరి. అపుడు బాలలందరూ వాగులోదూకి యెప్పటివలననే జలక్రీడల బ్రారంభించిరి. ఆ దినము క్రొత్తబాలుడు రాలేదు. కారణమేమో తెలియుట లేదు. అందరను యోచించిరి. అపుడు గ్రామాధికారి తాను మడుగులోదూకి మునిగి నంతటనె అతనిచేతికొక శిలావిగ్రహము దొరికెను. అతడు బయటకివచ్చి చూడగా ఒక దివ్య సుందర విగ్రహమైయుండెను. అందరును సంతోషముతో గంతులువేయ సాగిరి.

అపుడు గ్రామాధికారి ఒక బాలుని పిలిచి పరుగిడి పోయి మంగళవాయిద్యములను తప్పెట్టవాండ్రను, పనివాండ్రను పగటిదివిటీలతో రమ్మంటినని చెప్పుమనెను. ఆ బాలుడు సంతోషముతో వాయువేగమున పరుగిడి వారికావార్త నందించెను. అపుడు మంగళవాయిద్యములు తప్పెటలు కొమ్ములు మ్రోగించుచు గ్రామ ప్రజలు గుంపులై పగటి కాగడాలతో వచ్చి మడుగు వద్దకు జేరిరి.

అంతట ఒక పీఠమునగూడ దెప్పించి ఆపీఠముపై విగ్రహమునిడి మంగళవాయిద్యములతో సమీపమునయున్న ఒక చిన్న వనమునందు గుడిని కట్టించి యోగ్యముగ నుండునని అచ్చటికి వెళ్ళిరి. అచ్చట ఆపీఠము నొక చెట్టునీడన బెట్టించి ఒక బ్రాహ్మణునితో నిత్యపూజలనొనరించుచుండుట కేర్పాటు చేసిరి.

ఆ మరునాడే గ్రామ పెద్దలందఱును ధనమును ప్రోగుచేసి పనివాండ్రను రప్పించి ఆలయ నిర్మాణమునకు శుభముహూర్తమును జూచి పునాదులవేయించిరి. పనివాండ్రును మిక్కిలి కుతూహలముతోను శ్రద్ధతోను పని జేయుచు దివ్యమగు ఆలయమును గట్టిరి.

అంతటగ్రామ పెద్దలు దైవజ్ఞులను పండిత బ్రాహ్మణులను రప్పించి ఆ శిలావిగ్రహమును ఆలయమున నిలిపి ప్రాణ ప్రతిష్ఠ నొనరింపుమనిరి. అందుకు వారు సరియని, ఒక మూహూర్తమును నిశ్చయించి, ఆ విగ్రహమునకు ప్రాణప్రతిష్ట మొనరించి "వీరభద్రస్వామి" అని పిలుచుచుండిరి.

(ఈ దేవాలయము ప్రొద్దుటూరు నుండి మైదుకూరునకు పోవు రాజబాట ప్రక్కనయున్నది. ప్రతి సంవత్సరము గొప్ప తిరునాల జరుపుచుందురు. భక్తులువచ్చిముడుపులను మ్రొక్కుబడులను చెల్లింతురు. కొందఱు సంతాన ప్రాప్తికై ప్రార్థించి తమ ప్రార్థన నెరవేర్చినందులకు తమ శిశువులకు "వీరభద్రుడు" అని నామకరణ మొనరించుచుందురు.)

## 5. శ్రీ వీరబ్రహ్మంగారు వీరభద్రుని దర్శించుట

అల్లాడుపల్లె సమీపమున ఆలయనిర్మాణము ముగిసెను. ఆ వార్తలు చుట్టుప్రక్కల గ్రామములకు వ్యాపించెను. అందందు గ్రామములలో

సంచరించెడి వీరంభొట్లయ్య కాకథవిన్నవించిరి. ఆయన తాను కుముద్వతి ప్రవాహమున వదలిన శిలావిగ్రహమని దెలిసికొనెను. అచ్చటికివెళ్ళి ప్రజలకు విగ్రహారాధనమును గుఱించి, ప్రచారముచేయ సంకల్పించెను. అచ్చటనుండి బయలుదేరి మరునాడు అల్లాడుపల్లె గ్రామమునజేరెను. గ్రామాధికారివలన జరిగిన విషయములన్నిటిని గ్రహించెను. అచ్చటినుండి బయలుదేరి కుందునదిలో స్నానముచేసి ఆలయమును జేరి వీరభద్రుల ధ్యానించి సంతోషముతో అందున్న సత్రమున విశ్రమించెను.

అతడు ప్రతిదినము కుముద్వతీనదిలో స్నానమాచరించి అనుష్టానముల దీర్చి, అందొకమూల గూర్చుండి తపోనియమను పాటించి, జపమొనరించుట నిత్యకార్యక్రమముగా యేర్పరచుకొనియుండెను. ఇట్లుండ ఒకనాటి రాత్రి వీరభద్రుడు స్వప్నమున కనబడి యిట్లనెను, “ఓ సర్వేశ్వరా! నీవు లోకోపకారివై జన్మించిన నారాయణస్వరూపుడవు. నీకు నేను కావలయునని కుందునదిలో దొరికితిని. నాకు ప్రాణప్రతిష్ట అరచేతి యందిడుకొని చేసితివి. ఆవల ప్రవాహమున వదలతివి. ఆ ప్రాణప్రతిష్ట మహిమ ఈరీతి పరిణమించినది. నేను వీరభద్రుడను నామంబున పిలువబడుచుంటిని నీవ వీరబ్రహ్మవు, మన ఇరువురుకు భేదమావంతయి లేదు నాకు“పోతులూరు” అను మరియొక నామము వాడుకలోనుండును. కొంతకాలమునకు నేను నీవు గృహస్తధర్మమునందుండగా నీయింట నీ అర్ధాంగికి కుమారుడనై జన్మింతును. అపుడు నీవు నాకు “పోతులూరయ్య” అని నామకరణ మొనరింపుము” అని చెప్పి అంతర్ధానమయ్యెను.

## శ్రీ వీరబ్రహ్మంగారు కంది మల్లయ్యపల్లె చేరుట

వీరబ్రహ్మం గారు దువ్వూరు గ్రామము తనకు తగినదిగా లేదని తెలిసికొనెను. అచ్చటినుండి వనిపెంట, బద్వేలు, పోరుమామిళ్ళ, కలసపాడు గ్రామాములు జూచి కడపట కంది మల్లయ్యపల్లెకు పోయెను. ఏ కారణమునచో ఆ గ్రామము వారికి నచ్చినది అతడు ముందొక చావడిలోజేరి వడ్రంగము పని చేయుచు రైతుల మన్ననబడసి జీవించుచుండెను. అతడు తన పేరు వీరబ్రహ్మమని చెప్పినందున ఆపేరనే బిలుచుచుండిరి. అతడు చూచుటకు జడలు గడ్డము పెంచుకొనియుండుటచే గొందరు వెఱ్ఱివానిగ నెంచిరి. కొందఱు వెఱ్ఱి వీరబ్రహ్మమనియు పిలుచుచుండిరి. వీరబ్రహ్మము కొన్నిదినములకు ప్రజాదరణకు పాత్రుడై ఒక గృహమును నిర్మించుకొని ఆ గ్రామంలోనే యుండెను.

# ఏడవ ప్రకరణము

## 1. పెద్దకొమెర్లలో శ్రీలక్ష్మి జన్మించుట

పెద్దకొమెర్ల ఒక సామాన్యమగు గ్రామము. ఆ గ్రామమున క్షత్రియులు లేకుండిరి కాని బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, వైశ్య, శూద్ర జాతులవారుండిరి. అందు విశ్వబ్రాహ్మణులతో శివకోటయ్యయనునతడు తన కులవృత్తిచే జీవించుచుండెను. అతడు విద్యావంతుడును, సదాచార సంపన్నుండును. దేవబ్రాహ్మణ భక్తిగలవాడుగా యుండెను. అతడు బీదల ప్రేమతో నాదిరించువాడు. సాధుపుంగవులు, యోగులు, సన్యాసులు, భైరాగులు మొదలగువారిని జూచిన సత్కరించి పంపుచుండెను. అతని ధర్మపత్ని భర్త కనుసన్నలలో మెలగుచు, ధర్మపత్నియను నామమును

సార్ధకమొనరించుకొనెను. ఆదంపతులకు సంతానము లేదను కొఱత తప్ప ఇతర కొఱత లేకుండెను.

సంతానము లేకపోయెనే యని దంపతులిద్దరును సంతాన ప్రాప్తికై దివ్యక్షేత్రముల దర్శించిరి. పుణ్యతీర్థముల సేవించిరి. పావన నదీ నదంబుల గ్రుంకిరి, మహాత్ములదర్శించిరి ఏమియు ప్రయోజనము లేకపోయెను నాడు "ఆ పుత్రస్యగతిర్నాస్తి" అని పెద్దలు వచించిరి పుత్రులు లేనివారికి పున్నామ నరకము తప్పదందురు. ఏమిచేయుదుము మన వంశ మింతటితో నిలిచిపోవునేయని ఆ దంపతులు పరితపించుచుండిరి.

అంతనొకనాడు శివకోటయ్య శ్రీలక్ష్మీవల్లభుని నామ జప మొనరించుచు శ్రీలక్ష్మీమనోరమణా! అనాధరక్షకా! ఆపద్బాంధవా! ఏల నీకు నాపై కరుణరాకున్నది. నేనే పాపకార్య మొనరింపలేదే, అట్టి నాయందు నీకేల కరుణ జనింపకున్నది. అన్నిభాగ్యముల నొసంగితివిగాని సంతానభాగ్యమిచ్చితివి కాదు. సంతానము లేనివాడు చచ్చినవాని కంటే హీనుడుకదా కామితార్థ ప్రదాయకా! నాకు సంతానమునొసంగి నావంశము నుద్ధరింపుమని ప్రార్థించుచు నిదురబోయెను.

అతనిభార్య సంతానములేదని అతనికంటె భాదపడుచుండెను. ఆరాత్రి ఆమె శ్రీలక్ష్మిని కలశరూపమున అర్చించి ధూపదీపనైవేద్యముల నొసంగి తల్లీ! ఎన్ని దినములు నన్నిట్లు గొడ్డురాలుగ నుండనిత్తువు! నేనేపాప మొనరించితిని. నాకేల సంతానము నొసంగకుంటివి కోరిన కోర్కెలదీర్చు మహాతల్లీ! నాకొక పుత్రునొసంగరాదా నీనామమునే సదా జపించినందుల కిదియా నీవు చూపెడి దారి. తల్లీ! ఒక పుత్రునినొసంగి నన్ను ధన్యురాలి నొసరింపుమని ప్రార్థించి నిద్రించెను.

ఆరీతి భార్యభర్తలు దైవముల ప్రార్థించి నిద్రించిరి. అంత రాత్రి శ్రీలక్ష్మి స్వప్నమునందిరువురుకు ఒకేసారి దర్శన మిచ్చి "మీరిక సంతానములేదని విచారపడవలదు. మీకు పుత్రసంతాన ప్రాప్తిలేదు. నేను మీయింట మీకుమార్తెనై జన్మింతును. నాకు గోవిందమాంబ" అను నామము నిడుము మీకు శుభమగుగాక అని ఆశీర్వదించి అదృశ్యమైపోయెను.

## ౨. శ్రీ గోవిందమ్మ జననము

అంతట శివకోటయ్య వేకువఝామున స్వప్నానంతరము నిదురమేల్కొని తన స్వప్నవృత్తాంతమును భార్యకు తెలిపెను. అపుడాతని భార్య అశ్చర్యమును వెళ్ళడించుచు నాథా! మీ స్వప్నమునిజమా? నన్ను పరిహసించుట లేదు కదా!" అనెను శివకోటయ్య తరుణీ! నీతో పరిహాసములా సత్యమునే వచించితిని అనెను. అందుకామె అటులైన అట్టి కలయే నాకును కలిగినది. శ్రీలక్ష్మి తానే నా గర్భమున కూతురుగ జన్మింతునని చెప్పి అదృశ్యమయ్యె ననెను. అందుకు శివకోటయ్య చిరునవ్వు నవ్వుచు నాకును శ్రీలక్ష్మియే దర్శనమిచ్చినది. పుత్రసంతాన ప్రాప్తిలేదు. నీ కుమార్తెనై జన్మింతును నాకు "గోవిందమ్మ" అని పేరు పెట్టుమని చెప్పిపోయెను. అయ్యో! ఇదేమి వింత, నాకును అట్లే చెప్పినదని ఆమె సంతోషమును పట్టజాలకుండెను.

అంత మరుసటి నెలలోనే శివకోటయ్య భార్యకు నెల తప్పినది ఆమె లోపల సంతసింపుచు భర్తతో చెప్పకుండెను. ఆవల రెండవనెల గడిచి మూడవనెలవచ్చెను. అపుడామె భర్తను పిలిచి నాథా! నాలో గర్భచిహ్నాములు జూపట్టుచున్నవి శ్రీలక్ష్మీకటాక్షము కలిగినటులున్నది. అని పలుకగానె శివకోటయ్య తనలో సంతసించి మనకోర్కె నెరవేరునేమో

చూతమనెను. అంతలో శివకోటయ్య భార్యకు క్రమమున నవమాసములు నిండెను. ఒక శుభలగ్నమున ఆమె స్త్రీ శిశువును ప్రసవించెను.

అంతట దంపతులు శ్రీలక్ష్మి తమయింట జన్మించెనని సంతోష సాగరమున నోలలాడుచుండిరి. అంత పదునొకండవ దినమున ఆఊరి పురోహితుని దైవజ్ఞులను గ్రామ పెద్దలను పిలిపించి తన కుమార్తెకు "గోవిందమ్మ" అను పేరు పెట్టిరి. శివకోటయ్య బ్రహ్మణులను దైవజ్ఞులకు దక్షిణ తాంబూలాదులతోడను, మిగిలిన వారిని తాంబూలము తోడను సత్కరించెను.

## 3. శివకోటయ్య గోవిందమ్మకు పెండ్లి చేయ గోరుట

గోవిందమ్మ పండ్రెండేండ్లు దాటగనే ఆమె తల్లి శివకోటయ్యతో నాథా! మనబిడ్డ గోవిందమ్మకు పదమూడవయేడు పడినది. ఆమెకు వివాహప్రయత్నము చేయకుండుట సరికాదు. తగిన వరుని విచారింప ప్రయత్నింపుడు, మనమే వరుని నిశ్చయించినను శ్రీయును, కులమును, రూపును, ప్రాయము, శుభలక్షణము, బంధుత్వము, విద్యాశ్రేయముల గలవానిచే చూడవలసి యుండును. ఇక మీరు ఆలస్యము చేయవలదని పలుమారు చెప్పెను.

అందుకు శివకోటయ్య మంచిదని తన బంధుమిత్రులతో తగినవానిని విచారించుచుండెను. ఎందరో తల్లిదండ్రులు తమ కుమారులను పిలిచికొనివచ్చి గోవిందమ్మకు జూపించుచుండిరి. గోవిందమ్మ యెవరిని జూచినను తనకు నచ్చలేదని చెప్పుచుండెను. ఎందరో విశ్వబ్రాహ్మణ యువకుల రూపగణ సంపదలతో నొప్పువారు వచ్చి గోవిందమ్మ తమను వరింపనందున తిరిగిపోవుచుండిరి.

ఒకనాడు శివకోటయ్య తన భార్యతో మాట్లాడుచు గోవిందమ్మను పిలిచి "తల్లీ! మాకు ఎంతకాలమో సంతానము లేకుండెను. ఎందరు దేవతలనో మ్రొక్కితిమి. అనేక క్షేత్రముల కేగితిమి దివ్యతీర్థముల సేవించితిమి. పుణ్యనదీ నదుల గ్రుంకులిడి వచ్చితిమి. ఏమియు ప్రయోజనము లేకపోయెను. అంత శ్రీలక్ష్మీనారాయణుల ననేక విధంబుల ప్రార్థింపగా శ్రీలక్ష్మి స్వప్నమున దర్శనమిచ్చి, తానే మా ఇంట పుత్రికయై జన్మింతునని చెప్పి మాయమై పోయెను. ఆమె వాక్కులు ఫలవంతములాయెను. ఆమె మాకు గోవిందమ్మ పేరుతో జన్మించినది. అమెయే నీవు. శ్రీలక్ష్మి ప్రసాదలబ్ధయగు నీకు తగిన వరుని దెచ్చి పెండ్లి చేయవలెననియెందరినో వెదకి తెచ్చితిమి కాని నీవు ఒక్కరిని కూడ వరింపకుంటివి ఇక మా చేత కాకున్నది ఎన్నిదినములని నీకు పెండ్లి చేయకయుండగలము. "అమ్మా! నీవే నీకు తగిన భర్తను ఎన్నుకొనుము. అతనికే నిన్ను యిచ్చి పెండ్లి చేసెదము" అని చెప్పగా గోవిందమ్మ పలుకక వంటయింటిలో ఏమో పని యున్నట్లుపోయెను.

## 4. గోవిందమ్మ తన భర్తను తానే నిర్ణయించుకొనుట

గోవిందమ్మ తల్లిదండ్రులు తన వివాహ విషయమై దిగులుపడి చింతాక్రాంతులైయుండుటకు తానుగూడ విచార పడసాగెను. అకటా! నావలన తల్లిదండ్రుల కెంతయో బాధగ నున్నది. నేనేమి చేయగలను నాకు భగవంతుడే దిక్కు, శ్రీలక్ష్మీకాంతుని ఆనతిపై రమాదేవి తనే నా రూపమున జన్మించినట్లు నా తల్లిదండ్రులనిరి. అటులైన లక్ష్మికి భర్త కావలసినవాడు నారాయణమూర్తికదా. అతని నెట్లెరుగుదును ఓ శేషతల్పా! ఆదిమధ్యాంతములు లేనివాడా, ఆశ్రిత జనరక్షకా! నేను నిన్ను ఆశ్రయించితిని.

నిన్నే నా భర్తగా నెన్నుకొంటిని. అన్యులను కలనైన జూడజాలను. నీవు వచ్చి నన్నువరించి పెండ్లియాడిన సరిలేకున్నక నిట్టులే అవివాహితనై బ్రహ్మచారిణిగానుండి, నిన్ను వేరొక జన్మముననైన భర్తగా చేపట్టుదునే కాని, యీ జన్మమున ఇతరులను పెండ్లాడజాలను అని మైమరచి నిదురపోయెను.

ఆనాటి రాత్రి ఆ గోవిందమ్మకు శ్రీలక్ష్మివల్లభుడు స్వప్నమున దర్శనమిచ్చి "గోవిందమ్మ! నీవు విచారింపనలదు నీకు దగిన భర్తను నేనేకాని యితరు లెట్లగుదురు, నేనే నీ భర్తను కాగలను. అందుకు లక్ష్మి నీరూపమున మానవుల యింట జన్మించినట్లు, నేనుకూడ కలియుగము నందు మానవుడనై జన్మించియున్నాను. నేనే నిన్ను వెదకికొనుచు వచ్చి పెండ్లియాడెదను. ఇంతటితో నీ విచారమును మాని నీ జననీ జనకులకు నా నిర్ణయమును తెలిపి, చింతింపవలదని చెప్పుము" అని పలికి తిరోహితుడయ్యెను.

అంతలో గోవిందమ్మకు మెలకువ వచ్చినది తనయెదుట ఎవ్వరును లేకుండిరి. ఆమె ఆశ్చర్యపడి నిక్కముగ ఆ నారాయణమూర్తియే తన్ను వివాహమాడుననినమ్మెను. శ్రీగోవిందుని తప్ప ఇతరులను పెండ్లియాడుట ధర్మంకాదనుకొనెను. తెల్లవారిన తర్వాత తండ్రి తన వివాహవిషయము మాట్లాడినయెడల తాను గోవిందుని తప్ప అన్యుల వివాహమాడనని ఖండితముగ జెప్పెదను. అటుపిమ్మట వారి యిష్టము ఈ నా సంకల్పము భగవంతుని సంకల్పము ఇందుకు తిరుగులేదని నిశ్చయించుకొనెను.

## 5. గోవిందమ్మ స్వప్నవృత్తాంతము

మరునాడు తెల్లవారగనె గోవిందమ్మ తన స్వప్న వృత్తాంతమును తల్లిదండ్రుల కెరింగింపదలచి మరల సిగ్గుచే వూరకుండెను. అంతట శివకోటయ్య దూరపుచుట్టము ఒకరు తన కుమారునకు గోవిందమ్మ నిచ్చి పెండ్లిజేయుటకు పెండ్లిపెద్దగా వచ్చెను. అపుడు పెండ్లికుమారుని జూచుటకు గోవిందమ్మను పిలుచుటకు తల్లితండ్రులిద్దరు బోయిరి.

తల్లిదండ్రులు పెండ్లికుమారుని విషయమును చెప్పబోగా గోవిందమ్మ "జననీ జనకులారా! నా వివాహమునకై మీరెందుల కింతయాతురత నాకు తగిన వరుని మీరు తేజాలరు. నాయనా! నీవేకదా లక్ష్మీదేవి నీపుత్రికయై జన్మించనదని చెప్పితివి. అనగా శ్రీలక్ష్మి రూపమును గొని మీ కుమార్తెగా జన్మించినది, శ్రీలక్ష్మి శ్రీవిష్ణువును వివాహమాడవలెనే గాని ఇతరులనెట్లు పరిణయమాడగలదు. లక్ష్మినగు నేను నారాయణునే పెండ్లియాడుదురు గాని యితరుల కన్నెత్తియైన జూడనొల్లను. ముందువచ్చిన వారిని యేదోనెపమున బంపివేయుడనెను. శివకోటయ్య వెళ్ళి వారికి తామిపుడు గోవిందమ్మకు పెండ్లిజేయదలపలేదనగా వారు తమ ఊరికివెళ్ళిరి.

అంతట శివకోటయ్య గోవిందమ్మ కడకు వెళ్ళి "తల్లీ శ్రీలక్ష్మి మానవరూపమున మాయింట జన్మించినది సత్యము. ఆ లక్ష్మియే నీవుయయిన, నీవు మానవగర్భమున జన్మించితివి. మానవరాలవగు నీవు శ్రీమన్నారాయణుని ఎట్లు పెండ్లాడగలవు అది సంభవమగునా! అందనిపండు కఱ్ఱుజాచనేల సాధ్యమగు కోరికకోరదగును కాని అసాధ్యమగు కోరికలగోరరాదుకనుక బాగుగ యోచించి మన బంధువులలో నొకరిని తగినవానిగా జూచితెత్తుము ఆ యువకుని పరిణయమాడి మా విచారమును

పోగొట్టుము. నీ తల్లి నీవు ఆ వివాహితవై యుండినందున కృశించి పోవుచున్నది". అనెను.

ఆమాటలకు గోవిందమ్మ సిగ్గునుమాని, ధైర్యము వహించి ఇటులనెను. నాయనా! నేను గోవిందుని వివాహ మాడగోరుట సాధ్యపడదా! ఎందులకు సాధ్యపడదు, లక్ష్మిని గోవిందమ్మగా పుట్టించినవాడు తాను గూడ మానవుడై లక్ష్మికాంతుడు జన్మించి, నన్ను వివాహమాడ రాగూడదా శ్రీలక్ష్మి గోవిందమ్మగా మానవలోకమున జన్మించుట ఎట్లు సాధ్యమైనదో అట్లే శ్రీవిష్ణుమూర్తి మానవాతారమున జన్మించివచ్చి నన్ను పరిణయ మాడగలడు. వేయేల శ్రీరమాకాంతుడు నాకు స్వప్నమున దర్శనమిచ్చి తానేవచ్చి నన్ను వివాహమాడెదనని ఆనతిచ్చియున్నాడు. ఇది సత్యము ఇంతటినుండి మీరు నా వివాహమును గూర్చినభాద్యత వహించనక్కరలేదు అని ఖండితముగ చెప్పెను.

## 6. శివకోటయ్యకు విష్ణువు కలలో కనిపించుట

శివకోటయ్య గోవిందమ్మ మాటలకు బదులు చెప్పలేకపోయెను. ఆమె పలుకులలో యదార్థముండునని యతనికి తోచెను. ఇక గోవిందమ్మను పెండ్లి విషయమైయేమియు ప్రశ్నింపరాదని తీర్మానించుకొనెను. అతడుతన భార్యతో కూడ గోవిందమ్మ పెండ్లి విషయమైయున్న విచారమును మరచి నెమ్మదిగ నుండుమనెను. అమెయు మంచిదని యూరకుండెను. శివకోటయ్య ఎంతో ధైర్యము వహించి యుండెను. కాని హృదయములో భయములేకుండ పోలేదు. అతడు చేయునది లేక సదా భగవంతుని గూర్చి ప్రార్థనచేయుచు తన విచారమును బోగొట్ట గోరుచుండెను. అతడొక నాటి రాత్రి గోవిందమ్మకు తగిన భర్తయెటుల లభించునాయని యోచించి యోచించి

నిదురబోయెను. అతడు గాఢనిద్రా పరవశుడైయుండగా శ్రీ రమారమణుడు స్వప్నమున దర్శనమిచ్చి ఇటులనెను. శివకోటయ్యా! నీభక్తికి జాల సంతసించితిని నీ పుత్రికయగు గోవిందమ్మ పెండ్లివిషయమై నీవును నీ భార్యయు చాల దిగులుపడి యుంటిరి. ఆ దిగులునుమానుడు ఆమెను నేను త్వరలో వచ్చి పెండ్లియాడుదును" అని తిరోహితుడాయెను. అంతట శివకోటయ్య నిదురనుండి లేచి కలను గురించి భార్యను దిగులుపడవలదని చెప్పెను. వారిరువురు ఆ స్వప్న ఫలమునకై గనిపెట్టుకొని యుండిరి.

## ఎనిమిదవ ప్రకరణము

### 1. వీరబ్రహ్మము గారు మహిమలు చూపుట

వీరబ్రహ్మము ప్రజలకు, ఆవిధముగా పిచ్చివానివలె ఏదో యోచించుచు, పరధ్యానముగా కనబడెడివాడు. రైతులు తమకు సేద్యపుసామానుజేసి యిమ్మన్న సరిసమయమునకు ఇవ్వక కాలమును వృధాగడుపుచుండెను. వారు వీరయ్యా పగలంతయు పనిచేయక సోమరివలె తిరుగుదువు, ఇక రాత్రియున్న అసలే పనిచేయవు మాకు సామానులతో పనియుండునపుడు వానిని జేసి ఇయ్యకున్న నెట్లు అని మందలింప వారితో మీ సామాన్లు కావలసినపుడడుగుడు అపుడేయిచ్చెద ననుచు ఎవరడిగిన వస్తువును వారికి అదుగో అచ్చట సిద్దముచేసి పెట్టితిని తీసికొని పొమ్మనుచుండెను. వారు పోయిచూచిన ఆ వస్తువు సిద్ధముగ నుండెడిది అదియుగాక ఆ సామానుకూడ యితర వడ్రంగుల కంటె బాగుగజేయబడి యుండెడిది. అది చూచి రైతులు వీరయ్య ఎపుడును పనిచేయకయే మన పనిముట్లను యిచ్చుచుండెను అదెటుల వీలుపడును అతనియందేదియో

శక్తి యుండినటులున్నది అని అనుగొనుచుండిరి. గ్రామ పెద్దలీసంగతిని తెలిసికొని, యతడు వెఱ్ఱివాడు కాడనియు యోగపురుషుడై యుండుననియు దలచిరి. అందఱును వీరయ్యకు "పెండ్లియైన పిచ్చకుదురును" అనునట్లు అతనిని బెండ్లి చెసికొనుము. కావలసిన ధనమును మేమిత్తుము. ఇటుల ఒంటరిగ నుండవలదు. ఈవిధమున బ్రహ్మచారివిగనున్నచో నీ వంశము ఏట్లు నిలుచును అని తొందర పెట్టుచుండిరి.

## ౭. వీరబ్రహ్మంగారు వివాహం చేసుకొనుటకు నిశ్చయించుట

ఒకనాడు వీరబ్రహ్మము గ్రామ పెద్దలనుజూచి తాను పెండ్లి కూతురును వెదకుటకు బోవుచుంటిని, పెండ్లి చేసుకొను వరకు రాను నా యింటిని గనిపెట్టి యుండుడనగా వారు మంచిది నీవు ఏ విచారమును లేక పోయిరమ్ము నీకు ధనము వలదా, ధనములేకున్న పిల్లనెవరిత్తురు కావలసిన ధన మిత్తుము తీసుకొని పొమ్మనిరి.

అందుకు వీరబ్రహ్మము నాకు ధనమవసరము లేదు. ధనము లేకున్న పెండ్లి కాదా, నాకా భార్య కాగోరి ఒక కన్య నాకొరకు పరితపించుచున్నది ఆమెను పెండ్లి చేసుకొనివత్తును. మీరు జింతింపవలదని అనగా, ఆ గ్రామాధికారి వీరయ్యా! నీ పిచ్చిమాటలు వదలవుగదా మా మాటలు వినుము. ఈ కాలములో ధనములేనివానిని కన్నెత్తియైన చూడరు "ధనమూలం మిదంజగత్" అనుట నీకు తెలియదా యనెను. అందుకతడు నాకు ధన మక్కరలేదని వెళ్ళెను.

వీరయ్య దినమొక ఊరికిబోవుచు కలసపాడు, పోరు మామిళ్ళ బద్వేలు వనిపెంట, దువ్వూరు మైదుకూరు మొదలగు గ్రామములదాటి అల్లాడుపల్లె జేరెను. అచ్చట గొన్ని దినములుండి వీరభద్రుని సేవించి

అచ్చటనుండి ప్రొద్దుటూరి కేగి రామేశ్వరమున రామలింగని దర్శించెను. అచ్చటనుండి జమ్మలమడుగు చేరి పినాకిని నదియందు స్నానమొనరించి ఆరాత్రి యందే గడిపెను.

## 3. శ్రీవీరబ్రహ్మంగారు పెద్ద కొమెర్ల జేరుట

జమ్ములమడుగులోనున్న వీరబ్రహ్మము గారు వేకువఝామున లేచి, పినాకినీ నదిలో స్నానముచేసి, అనుష్టానమునుదీర్చి సుమారు ఉదయము పదిగంటలకు పెద్దకొమెర్ల గ్రామమును చేరిరి. ఆ ఊరిలో విశ్వబ్రాహ్మణులున్నారని అతడెరింగియు వారి యింటికి పోక దారిలో ఒక బావిప్రక్కన నుండు సత్రములో బసచేసెను. అతడు గడ్డముతోను, మాసినతలతోను, జీర్ణవస్త్రములతోడను సత్రము ముంగిట కూర్చుండి యుండగా జనులు చూచి యెవరో పిచ్చివాడని కొందఱును, యోగియని కొందఱును, బిచ్చగాడని కొందఱును, పరిపరివిధంబుల చెప్పుకొను చుండిరి. ఆవార్త ఊరిలోని పిన్న పెద్దల కందరికి దెలిపెను. అతనిని జూచుటకు పెద్దవారును, వారివెంట చిన్న వారును వచ్చి పోవుచుండిరి. శివకోటయ్యకూడ అతడెవరో విచారింతమని వచ్చుచుండ గోవిందమ్మ కూడా యతనివెంట బోయెను. శివకోటయ్య వచ్చి సత్రమునందుండిన యోగిని చూచెను అతనితో యిటులనెను.

అయ్యా! మీదేవూరు. మీ తల్లిదండ్రులెవ్వరు. అన్నదమ్ములెవరైనా వున్నారా. మీరు ఏ కులమునకు చెందినవారు అనే విషయములను తెలిసికొనగోరుచున్నాను అని పలికెను. అది విని బ్రహ్మంగారు నా నామము వీరబ్రహ్మము నేను విశ్వబ్రాహ్మణుడను దేశసంచారము చేయుచూ ఇచటకు

వచ్చితినని బదులిడెను. ఆ మాటలువిని ఆనందపడిన శివకోటయ్య, స్వామిని తన ఇంటికి అతిధిగా రమ్మని ఆహ్వానించగా, స్వామి తగిన సమయము వచ్చినపుడు తానే వచ్చెదనని బదులుచెప్పి పంపెను.

## 4. చచ్చిన రెడ్డిని బ్రతికించుట

అట్లుండ పెద్ద కొమెర్లలో ధనవంతుడగు రెడ్డియుండెను. అతనికొక కుమారుడుండెను. ఆ కుమారుని యల్లారు ముద్దుగా బెంచుచుండిరి. అతనికి యుక్తవయస్సు వచ్చియుండగా వివాహము చేయదలపెట్టియుండిరి. అంతలో నాయువకుడున్నట్లులుండి మరణించెను. అందుల కారెడ్డియతని భార్యయుమిగుల దుఃఖించుచు అకటా లేక లేక ఒక పుత్రుడు జన్మించెను. అట్టి వానిని చూడజాలకకాలమృత్యువు తన పొట్టనిడుకొనెను. ఇక యింతటితో మా వంశమంతమైనట్లేనని పలుతరంగులు వాపోవుచుండ చుట్టుప్రక్కలవారతని నోదార్చుచుండిరి.

అంత కొందరు పాడెకట్టి చచ్చినవానిని బరుండ బెట్టి స్మశానమునకు గొనిపోవుచుండిరి. వారు వీరబ్రహ్మమున్న సత్రము ముందు అపాడెను మోసుకొని పోవుచుండిరి. అది చూచి వీరబ్రహ్మము నాయనలారా! ఇదేమి ధర్మము బ్రతికినవారిని కాటికి గొనిపోవుచుండిరి. ఈఊర బ్రతికినవారిని గూడా సమాధి చేతురాయనెను. అందుకు వారతడు పిచ్చివాడనియు పిచ్చివాని మాటలతో బనియేమియని కాటికిబోయి పాడెకు గట్టిన తాళ్ళను విప్పినంతనె రెడ్డి కుమారుడు లేచి కూర్చుండి, మీకు మతిపోయినదా? నన్ను కాటికి గొనిరానేల? అని దారి పట్టి తన యింటికి బోవుచుండెను.

అతడు పోవుచుండగా సత్రమునందు కూర్చుండి యుండిన వీరబ్రహ్మము నాయనా! చచ్చియు బ్రతికినవాడవు రమ్ము కూర్చుండుము, నీవు తొలిజన్మమున నా భక్తుడవై యుండినందున యీదినము నీవు మరణింతువని తెలిసికొని యిటకు వచ్చితిని. నిన్ను కాటికి గొనిపోయినపుడు చూచి నీవు బ్రతుకవలెనని సంకల్పించితిని, అటులనే బ్రతికివచ్చితివి ఇక నీకు భయములేదు శుభమగుగాక, పొమ్ము అనగా అతడింటికేగెను.

అంత కొంతసేపటికి కాటికి శవమును తీసుకొని వెళ్ళిన వారు తిరిగి యింటికిపోవుచు సత్రము వద్దనున్న ఆ యోగిని చూచి నమస్కరించి స్వామీ! మీ మాట యధార్థమైనది మా రెడ్డి కుమారుడు బ్రతికినాడు ఇది మీ ప్రభావము తప్ప మరేదియుగాదు అని నమస్కరించి వెళ్ళిరి.

అంత పెద్దరెడ్డి పరుగిడువచ్చి వీరబ్రహ్మం గారి పాదముల మీద వ్రాలి "స్వామీ! మీ యనుగ్రహమున నా చచ్చిన కుమారుడు బ్రతికివచ్చెను మీరు శ్రీమన్నారాయణమూర్తియై మాఊరికి వచ్చితిరి. నావంశమున నిలిపిన మీకు నేనేమి చేయగలను. నాకు కావలసిన ధనమున్నది ఆధనములో మీరుకోరినంత యిచ్చుటకు సిద్ధపడివచ్చితిని. దయయుంచి మాయింటికివచ్చి మమ్ముద్ధరింపుడు" అని పరిపరి విధముల బ్రార్ధించెను. అందులకు బ్రహ్మంగారు నాయనా నాకు నీ ధనముతో బనిలేదు నాకు గావలసినచో వలసినంత ధనము నాకురాగలదు. ఇంటికి వెళ్ళి సుఖముగానుండు. నీ కుమారునికిక భయములేదు పొమ్మనెను. ఈ యోగీశ్వరుని మహిమ నిమిషములో గ్రామమంతయు వెల్లడియయ్యెను. శివకోటయ్య ఆశ్చర్యముతో యోచింపసాగెను.

## 5. బ్రతికినవానిని చంపి తిరిగి బ్రతికించుట

పెద్దకొమెర్ల గ్రామమందొక శివాలయముండెను. ఆ శివునకు బ్రహ్మయ్యను తంబళ్ళ (వాడు) పూజారియై యుండెను, అతడు విద్యావంతుడైన భగవద్భక్తుడుగానుండెను అతడు సత్రములోని యోగి పుంగవుని యద్భుతశక్తిని మహాత్మ్యమును విని సత్రమునుజేరి స్వామీ! మీరు సత్రము నందుండుట మంచిదికాదు నేను శివాలయమున పూజారిని. నన్ను బ్రహ్మయ్య యందురు దయయుంచి శివాలయమున రండు మీకు గావలసిన సౌకర్యముల గూర్చెదననగా సరియని యతనివెంట శివాలయమున కేగినవాడాయెను.

మరునాడు పెద్దకొమెర్లలో నుండిన దుర్మార్గుల కొందరు క్రొత్తగావచ్చిన యోగిని అవమానపరచి పరుగిడిపోవునట్లు జేయదలచిరి. ఈ సన్యాసి చచ్చినవారిని బ్రతికించునట, ప్రపంచమునందు జరిగెడియెన్నియో యద్భుతములను వింటిమి, ఎందరినో దివ్యపురుషులజూచితిమి, ఒక్కరును చచ్చినవారిని బ్రతికించినవారు లేరు. ఒక భగవంతునకు తప్ప చచ్చినవారిని బ్రతికించువారు శక్తియుండదు ఇతడు భగవంతుడెట్లగును. ఎవరో పిచ్చిపుల్లయ్య మనఊరికివచ్చి అందరను మోసగింపనున్నాడు. ఇతడు ఇంద్రజాలము తెలిసిన వాడుగనుండును. బహుశామాయవిద్య నేర్చియుండును ఇతనితంత్రములు సాగనియ్యరాదని నిశ్చయించిరి.

అంత వారొక పాడెను సిద్ధముచేసి బ్రతికియుండిన తమమిత్రుని దానిపై బరుండబెట్టి యొక క్రొత్త గుడ్డనుగప్పి త్రాళ్ళచే గట్టి నాలుగు ప్రక్కల నలుగురు మోయుచుండ గొందరు గోడుగోడున యేడ్చుచు శివాలయముందుండి వెళ్ళుచుండిరి. ఈ కపట నాటకమునాడు వారి

దుర్మార్గమును గ్రహించి వీరబ్రహ్మంగారు శివాలయమును సమీపించుటకు ముందే బ్రహ్మయ్యతోగూడ వచ్చి చూచుచుండెను. అంతలో పాడెను మోసికొని వచ్చినవారు కొందరు స్వామీ! ఈ యువకుడున్నట్లుండి మరణించెను. దయయుంచి యితనిని బ్రతికింపుడనిరి.

అంత బ్రహ్మంగారు నవ్వుచు "ఔరా! ఈ యువకుడు మరణించెను! పాపము ఆయుస్సు తీరినది కాబోలు బ్రతికినవానిని జచ్చినవానిగా జేయుశక్తి పరులీయూరునుండరని యిపుడు తెలిసికొంటిని, పాపము అతడు చచ్చినాడు కాటికికొనిపొండు" అనగా వారు బిరబిర వెళ్ళిరి. అంత బ్రహ్మంగారు బ్రహ్మయ్యకు వారు పన్నిన యుక్తినంతయు జెప్పి వారికి బుద్ధివచ్చినట్లు చేసితిని ఇక లోపలికి పోదమురమ్మనిరి పిలుచుకొనిపోయిరి.

అంత గొంతసేపటికి ఆ దుష్టులు పాడెను గట్టిన త్రాటిని సడలించి తమ స్నేహితుని లెమ్మనిరి. అతడు దీర్ఘనిద్రజెందియుండెను. అందరును యెంత లేపినను వాడు లేయకుండెను. అతని ముక్కుకడచేతినిడి శ్వాసయాడనందున చచ్చెనని తీర్మానించిరి. అతని తల్లిదండ్రులేమందురో యని దిగులుపడి దిక్కులు జూచుచుండిరి.

అంతలో ఆ చచ్చిన యువకుని వృద్ధ జననీ జనకులు వచ్చి కుమారుడు చచ్చియుండుటజూచి "ఓరి దుర్మార్గులారా నా కుమారుని జంపితిరి మీరు ఆ యోగిపుంగవుని పరాభవింపవలయునని మాట్లాడుకొనుట విని ఆపని చేయవద్దని చెప్పినను వినక చేసితిరి. మా వాడు మీతోజేరి ప్రాణముల బాసెను అకటా! మాగతియేమి, వయోవృద్ధులము, మాకు గంజిపోయు దిక్కుకూడలేదే అని బిరబిర శివాలయమున కరిగి అందున్న బ్రహ్మం గారి పాదములపై బడి

"మహానుభావా! ఆ దుర్మార్గులు మిమ్ము నవమానింపదలచిరి. మేమెంతయో మందలించితిమి సరి మేమేమియుజేయమనిరి. అటు పిమ్మట మాకు దెలియకుండ మాకుమారుని బిలుచుకొని పోయినటులున్నది. ఈ పాపిష్టి వెధవలు యీ గ్రామమునందదుగువారు లేక సదా ఇట్టిదుర్మార్గపుపనుల జేయుచునే యుందురు. వారివలన మా కుమారుడు మరణించెను. అందువలన వృద్ధులమగు మేము ద్రిక్కులేక జూడవలసి వచ్చినది, వారు బాగుగనే యున్నారు. కాని మా పుత్రుడు చచ్చియున్నాడు, వాడు తప్ప మాకు గంజిపోయువారుకూడ లేరు స్వామీ! ఇదంతయు మీకెగ్గుదలచినందున జరిగినది. ప్రాణములతో పాడెపై ఊరక మరణించునట్లు నటించువాడు, చచ్చుటకు గారణము వేరుండదు, దయయుంచి వృద్ధులమగు మాపై కరుణగలిగి, పుత్రభిక్ష పెట్టుమని కన్నీరుతో యాతని పాదముల కడిగి వదలకుండిరి.

అపుడు బ్రహ్మంగారు వారితో ఆ పాడె నిటకు గొనిరమ్మనుడని చెప్పెను. వారు వడిగాపోయి, ఆ యువకుని పాడెను తీసికొని వచ్చి శివుని ఆలయము బయటపెట్టి, తలలువంచుకొని నిలిచియుండిరి. అపుడు బ్రహ్మంగారు లోపలినుండి బ్రహ్మయ్యతోగూడ బయటికివచ్చి తన కమండలములోని ఉదకమును ఆ పీనుగుపై చల్లిరి. ఆ యువకుడు వెంటనే లేచి "ఔరా! నేనిచ్చటికెట్లు వచ్చితిని" అని ఆశ్చర్యపడుచుండగా అతని తల్లిదండ్రులు జరిగిన సంగతి వానితో చెప్పిరి.

అతడు వెంటనే స్వామిపాదములమీద వ్రాలి తప్పును క్షమింపగోరి దుర్మార్గుల మాటలవిని మీకపరాధము జేసినది నిజము "దాసుని తప్పు దండముతో సరియని" మీ రెరుంగకపోలేదు. అని వేడుకొనగా బ్రహ్మంగారు

"నాయనా! ఇక మీదట దుర్మార్గుల జేరకుము. మహాత్ముల బరీక్షింప గోరకుము. తల్లినీదండ్రుల పూజింపుము. నీకు శుభమగును పొమ్ము" అనగా నతడు లేచి నమస్కరించి తల్లిదండ్రులను ఇంటికి బిలుచుకొని పోయెను. దుర్మార్గులు చెప్పకనె వెనుదిరిగిరి. వీరబ్రహ్మము బ్రహ్మయ్యతో గూడ శివాలయము లోపలికేగెను.

## 6. వీరబ్రహ్మంగారు బ్రహ్మయ్యకు జ్ఞానోపదేశం చేయుట

ఒకనాడు శివాలయము పూజారి అయిన బ్రహ్మయ్యగారు ఆలయంలో విశ్రాంతిగా కూర్చునియున్న వీరబ్రహ్మంగారితో "అయ్యా! నాకు కొన్ని సందేహములున్నవి దయతో వానినితెలియజేయండి. మనుషులకు నిత్యదైవధ్యానం చేసుకొనుట శ్రేయస్కరమా లేక? బ్రహ్మజ్ఞానము పొందుట శ్రేష్టమా? అని అడిగెను. అందులకు బ్రహ్మంగారు బ్రహ్మయ్యతో ఇలా చెప్పనారంభించిరి". బ్రహ్మయ్య! ఇతరులు నీకు ఏది చేసినచో ఆనందమగునో అటులనే నీవు కూడా ఇతరులు ఆనందపడు కార్యములు చేయవలెను.

ఇతరులను తనతో సమానునిగ జూచువారు త్వరలో నన్ను అంతర్ముఖంబున నిర్గుణునివలెను, పరాన్ముఖమున సగుణునిగాను, ఊనచక్షవునకు రూపమువలెను చూచుదురు. జ్ఞానచక్షువునకు రూపరహితుడుగా కనబడి సంపూర్ణానందమును గలిగింపకలవాడను నేనే సుమా. అజ్ఞానులు నన్ను ప్రేమతో గూడిన భక్తిచే ధ్యానింతురేని, వారికి ప్రసన్నుండనై వారి కోరికల నన్నింటిని దీర్పగలను. భక్తులను నా బిడ్డలవలె జూచి రక్షింపగలను. యోగులైన వైరాగ్యమార్గము నవలంభించిన వారిని మిత్రులుగాను, జ్ఞానమార్గావలంబులను సమానులుగను జూతును. భక్తి

మార్గముననుండు బిడ్డలును, వైరాగ్య హఠయోగాదిమార్గముననుండువారే జాతివారైనను,జ్ఞానులు,వృద్ధులైన వారియందు"అహము"అనునది యుండదు.

కనుక మానవులందరూ వాయు వేగమున మించిన వేగముతో పరుగులిడు మనస్సును పరుగెత్తకుండా ఆపివేసి తదేక దీక్షతో లక్ష్యమును చూచిన చాలును. ఇక ఈ రోజుకి ఈ బోధనచాలు. సమయము వచ్చినపుడు నా కాలజ్ఞానమును నీకు వివరించెదనని చెప్పి అతనిని సాగనంపెను.

## 7. పెద్దకొమెర్లలో కాలజ్ఞానమును బోధించుట

ఒకనాడు క్రొత్తగావచ్చిన యోగిపుంగవుడు శివాలయముతో తన కాలజ్ఞానమును బోధించునని వార్తలు వ్యాపించెను. ఆవార్తలు చెవినిసోకగనే గ్రామములోని పిన్న పెద్దలు వేళకుముందె శివాలయమును జేరిరి. శివకోటయ్య తన భార్యబిడ్డలతో గూడ శివాలయమును కేగి యుండెను. గోవిందమ్మ తల్లిదండ్రులకు సమీపమున యోగికి ఎదురుగా పద్మాసనము వేసికొని కూర్చుండియుండెను. అందరు వచ్చిరని చెప్పినంతట వీరబ్రహ్మము కాలజ్ఞానములోని విషయముల నిట్లు దెలుప మొదలిడెను.

**ఓ భక్తుజనులారా రాబోవుకాలమున ఎన్నియో విచిత్రములు జరుగును.**

- ధర్మమునకు హానికలిగి అధర్మము హెచ్చుమీరును.
- కుమారులు తమ తల్లిదండ్రులను సేవకులుగా వినియోగించుకుందురు
- బ్రాహ్మణులందరూ తమ స్వధర్మమును విడిచి ఇతరులకు దాసులై సేవలుచేయుదురు.
- బ్రాహ్మణేతరులందరూ వారిని చూచి ఆహాహా అని పరిహాసము చేయుదురు.

- దేవాలయములను దర్శింపక జనులెల్లరు దైవదూషణ చేయుచుందురు.
- పంచములు వేదశాస్త్రములు పలుకుచుండగా, బ్రాహ్మణులు వాటిని వినుచుందురు.
- నిమ్నకులముల వారు పూజారులగునుండుదురు.
- ఎద్దులు కట్టకుండనే బండ్లు నడుచును.
- ఎడ్లు దున్నకుండనే పొలములు పండును.
- తైలములేకుండా దీపాలు వెలిగేను.
- జలముచేత దివ్వెలు వెలిగేను.
- నలబదిరోజులుపాటు కాశీక్షేత్రం పాడుపడినదగును.
- తల్లిమాటలు విషమగును.
- పెండ్లాము మాటలు తీపిగనుండును.
- భూమిలోనుండి ఓంకారధ్వని వినిపించును.
- బనగానపల్లిలో పాతరమీద మొలచిన చింతచెట్టుకు వింతగా చేమంతిపూలు పూయును. అంతలోనే అవి మల్లెలగును.
- విషవాయువు పుట్టి జనులందరిని పరిమార్చును.
- వర్ణసంకరములు చాలా జరుగును.
- భర్తలను తిట్టుచూ భార్యలు వారిని వదిలి వేరేవారితో పోవును.
- నన్ను నమ్మినవారికి నాశనములేదు, నన్ను నమ్మనివారు నశింపగలరు. అని కాలజ్ఞానమును బోధించి వారితో ఇక ఈ రోజునకిది చాలును. తిరిగి మరొకమారు బోధచేయుదును. అందరూ ఇంటికి మరలండి అని చెప్పెను.

అతడు ఆ మాటలు పలికినంతనె జనులెల్లరును భయభక్తులతో స్వామికి నమస్కరించి తమ స్వగృహములకేగిరి. శివకోటయ్య భార్యను బిడ్డను పిలుచుకొని తనయింటి కరిగెను.

## 8. గోవిందమ్మ యోగిని వరించుట

కాలజ్ఞానమును విని యింటికేగి రాత్రి భోజనము చేయునపుడు శివకోటయ్య యోగిచెప్పిన విషయములు నిక్కమోకాదో అతడొక పిచ్చివాని రూపముతో నుండెను. అతని మాసిన తలయుగడ్డము గుడ్డలుజూచిన అసహ్యముగ నున్నాడనెను. అందుకుగోవిందమ్మ వెంటనే తండ్రీ! ఏమట్లనుచుండిరి. అతనిని నేజూడలేదనుకొంటిరా, అతడు నాకు దివ్యమంగళ విగ్రహుడై కాన్పించెను. అతనికంటె సుందరరూపుని మీరు జూడలేరు. అతని జూచినప్పటి నుండియు నాకతని వివాహమాడవలెనను కోరిక జనించినది. అతడు కాలజ్ఞానమును వినిపించునపుడు ఆయన కెదురుగ గూర్చుండి యుండిన నన్నే చూచుచుండును. ఆతనిని దప్ప నే నితరుల బెండ్లాడను" అని యూది పలికెను.

అందుకు శివకోటయ్య బిడ్డా! అతడు దరిద్రుడు. అతడు దిక్కు లేనివాడట, కూటికిలేక ఊరూరు తిరుగుచు మనయూరికి వచ్చినాడు. అట్టివానినా నీవు కోరుట. ఎందరో ధనవంతులైన యువకులను, అందచందములలో నొప్పు విద్యావంతులును వచ్చినప్పుడు వారిని కన్నెత్తిచూడక పోతివి. ఇపుడొక సన్యాసిని పెండ్లియాడదలచుట బాగులేదనెను. గోవిందమ్మను తన అభిప్రాయమును మార్చుకొమ్మని చెప్పి ప్రొద్దుపోయినందున శయనింప బోయెను.

ఆనాటిరాత్రి శివకోటయ్యకు శివాలయమున వున్న యోగి సుందరాకారుండై దర్శనమిచ్చి శివకోటయ్యా! నన్ను సామాన్యునిగా భావింపవలదు నీబిడ్డను కోరియే నేనీఊరికి వచ్చితినిగాని ఊరకరాలేదు నా మహిమ నీబిడ్డ కనిపెట్టినది కాని నీవు తెలిసికొన లేదు, నీబిడ్డ కోర్కెను దీర్పమని" యదృశ్యుడాయెను.

ఉదయము లేచినతోడనే తన కలనుగూర్చి భార్యకుచెప్పి, గోవిందమ్మను శివాలయములోని యోగికి యిచ్చి వివాహము చేయుదమని శివకోటయ్య పలికెను. అతడు విశ్వబ్రాహ్మణుడనని ముందెచెప్పినాడు. గోవిందమ్మయు అతనినే ప్రేమించినది ఆమె అదృష్ట మెటులున్నదో చూతము ఆమె కోరికను నెఱవేర్చుట తన ధర్మమని శివకోటయ్య భావించెను.

## 9. శివకోటయ్య శ్రీ వీరబ్రహ్మంగారిని ఆహ్వానించుట

శివకోటయ్య మరునాడు స్నాన మొనరించి భార్యతోగూడ శివాలయమున కేగి యోగివర్యునిజూచి "మహాత్మా మిమ్ము మేము దెలిసికొనలేక పోతిమిగాని మాపుత్రిక గోవిందమ్మ తెలిసికొనినది అట చూడ మీరును ఆమెకును పూర్వజన్మమున ఏదియో సంబంధముండెనని తోచుచున్నది. ఆమె మిమ్ముదప్పనన్యుల వివాహమాడనని పట్టుపట్టినది. మీ రామె నంగీకరింపకున్నచో నామె బ్రహ్మచారిణిగ నుండనిశ్చయించినది. కనుక దయయుంచి మీరామెను పరిణయమాడ గోరుచుంటిమి మాగృహమునకు రండు ముహూర్తమును నిశ్చయించి వివాహ మొనరింతుమనెను.

అందుకు వీరబ్రహ్మము అయ్యా! నేను దరిద్రుడను. దిక్కు లేనివాడను, అందరిచేతను వెర్రివాడనని యనిపించుకొనుచున్నాను

అట్టివానికి నీ బిడ్డనిచ్చి వివాహ మొనరింతునంటిరి ఇది నిజమా, మీకును మీఇల్లాలికిని. మీ కూతురునకును సమ్మతమేనా యనెను. అందుకు శివకోటయ్య అయ్యా! మేమందరమును సమ్మతించితిమి. మమ్ము సంశయింపబనిలేదు దయచేసి మా యింటికి రండు ఈ శివాలయము నందుండనక్కరలేదు అని బ్రతిమాలెను.

అంత వీరబ్రహ్మము మంచిది మీకు సమ్మతమైనచో వివాహమాడెదను. కాని యీదినము రాను. నేను మీతో యింతకుముందే "గతికిన అతకదు" అని చెప్పితిని. కనుక మీ రేగి సుముహూర్తము నిశ్చయించి, అన్ని ఏర్పాటుల నొనరింపుడు ముహూర్తదినమున వత్తుననగా వారు సంతోషముతో బోవుచుండిరి. అటు పోవువారిని బ్రహ్మంగారు మరలబిలిచి అంతకుముందు సిద్ధముచేసియుంచిన యొక చిన్నమూటనిచ్చి తాను వచ్చి యడిగినపుడు దాని నిమ్మనెను వారు సమ్మతించి పోయిరి.

బ్రహ్మయ్య చూచి స్వామీ! అదేమి, ఆ మూటను నిన్నటిదినము నాచే సిద్దము చేయించితిరి. అదిచెడి యెందుకు బనికిరాక యుండెను. అట్టిదాని నిచ్చిన వారేమను కొందురోకదా యనెను. అందు కాతడు నవ్వి తలయూచి పలుకకుండెను.

## 10. గోవిందమ్మతో శ్రీ వీరబ్రహ్మంగారి వివాహము

శివకోటయ్య భార్యసమేతుడై వీరబ్రహ్మ మొసగిన మూటను గొనిపోయి యిల్లుచేరెను. అతడా మూటనొక గట్టుమీద నిడి గోవిందమ్మను పిలిచి " అమ్మా! నీవివాహమును నిశ్చయించుకొని వచ్చితిమి. నీవు నిర్ణయించుకొన్న వరునితో మాట్లాడి అతని సమ్మతమును వడసి వచ్చితిమి.

కనుక నీ విచారమును మానుము" అనగా గోవిందమ్మ చిఱునవ్వుతో తలవంచుకొని లోపలికేగెను.

ఆదినము మధ్యాహ్నమే శివకోటయ్య పురోహితుని రప్పించి గోవిందమ్మ పెండ్లి నిశ్చయించితిమి. సమీపముహూర్తమును నిర్ణయింపుడని కోరెను. అతడు పంచాంగమును చూచి లెక్కించి అయిదవనాడు మంచి ముహూర్తమున్నదని చెప్పెను. శివకోటయ్య ఆ బ్రహ్మణునకు దక్షిణ తాంబూలాదుల నొసంగి పంపెను.

ఆ దినమే పెండ్లి పత్రికలు తయారు చేయించి, తగిన మనుష్యుల నేర్పాటుచేసి, తన బంధుమిత్రుల నాహ్వానింపబంపెను ఇంటికి సున్నము కొట్టించి ఎఱ్ఱమట్టి పట్టెలదీర్పించెను. పెండ్లికి గావలసిన సొమ్ములను నూతన వస్త్రములను దెచ్చుటకు దగిన ఏర్పాట్లు గావించెను. వివాహము లైదుదినములు జరుపుటకు నిశ్చయించి, అందుకు గావలసిన భోజన వస్తువుల దెచ్చుటకు కొన్ని బండ్లను పంపించెను.

ఇంటిముందు బండిగడలను నాటించి దిట్టమగు తడికలతో విశాలమగు పందిరి వేయించెను. ఆ పందిరిని పచ్చతోరణములతోను వివిధవర్ణ కాగితముల పూలదండలతోడను అలంకరించెను. ఒక్కొక్క గుంజను ఒక్కొక్క అరటికంబమునునాటించి టెంకాయ చెట్టు పట్టల దెప్పించి కట్టించెను. ఆభూ భాగమునంతయు చదును చేయించి నీళ్ళజల్లి దిట్టముచేసి, గోమయముచే నలికించి, పంచవర్ణముల ముగ్గులు దిద్దించియుండెను. జనులు కూర్చుండుటకు మేదరి చాపల దెప్పించి వేయించెను. దానితో పెండ్లియింట నలంకరించుట పూర్తియయ్యెను.

ఆవల కళ్యాణమండపమును ప్రత్యేకముగ నిర్ణయించి చక్కగ నలంకరించి, మంటప మధ్యమున చక్కని పీటలవేయించెను.

మంటపమునకు ముందుభాగమున హోమగుండమును దాని కిరుప్రక్కల పురోహితులు కూర్చుండుటకు తగిన ఆసనముల నేర్పాటు చేయించెను.

శివకోటయ్యపై పనులు జేయించుచుండ నతనియర్ధాంగి పెండ్లికి గావలసిన పిండివంటల సిద్ధముచేసెను. అంత వివాహదినమున కొకదినముముందు శివకోటయ్య బంధుమిత్రులు బండ్లు కట్టించుకొని వచ్చిదిగిరి. అతడు ముందుగనె యెవరికి దగిన బసలను వారి కొసగు యేర్పాటులు జేసినందున పనివారు వారికి తగిన బస జూపించిరి.

మరుదినము వేకువఝాము నుండియు శివకోటయ్య మందిరమున మంగళవాయిద్యములు ప్రారంభమాయెను. శివకోటయ్య బంధువులతోడను మిత్రులతోడను బయలుదేరి మంగళ వాయిద్యములతో శివాలయమునకేగి, వీరబ్రహ్మము నాహ్వానించి పిలుచుకొనివచ్చి మంగళస్నానము జేయించి పట్టుపుట్టములగట్టించిరి. అతనికి నుదుట విభూతి రేఖలదిద్ది తిలకమునుబెట్టిరి. అంతలో పెండ్లికూతురును చక్కగ నలంకరించిరి. వధూవరుల దోడ్కొని వచ్చి కళ్యాణమంటపమున కూర్చుండబెట్టిరి.

పురోహితుడు గణపతి ప్రార్థనతో ప్రారంభించి సమంత్రకంబుగ వివాహతంతు జరిగించుచుండెను. అంత నొక వెండి పళ్ళెరము దెచ్చి పెండ్లికుమారుని పాదములనందిడగా, శివకోటయ్య భార్య వెండికలశముతో దెచ్చిన జలమును పోయుచుండ, శివకోటయ్య వీరబ్రహ్మము కాళ్ళను కడిగి కన్యాదానము జేసెను. అంతట మంగళవాయిద్యములు మ్రోగించుచుండ వీరబ్రహ్మము గోవిందమ్మకు మంగళసూత్రమును గట్టెను. బంధుమిత్రులును ఊరిలోని పెద్దరైతులును, వధూవరులకు, వస్తువులను,

వస్త్రములను, ధనమును చదివించిరి. శివకోటయ్య బ్రాహ్మణులకు భూరిదక్షిణ లొసంగ, వారు వధూవరులను ఆశీర్వదించి గృహముల కరిగిరి. శివకోటయ్య గ్రామవాసుల సత్కరించి పంపెను.

అంతట శివకోటయ్య బంధుమిత్రులను భోజనమునకు లెమ్మనగా అందరువచ్చి ఆకులముందు గూర్చుండిరి. వధూవరులను ప్రత్యేకపీటలపై గూర్చుండబెట్టిరి. అపుడు వీరబ్రహ్మము మామగారిని పిలిచి తానాడొసగిన మూటలోని పదార్థముల నందఱకు వడ్డింపగోరెను అతడామాటలను భార్యతో జెప్పగా ఆమె భర్తను లోపలికిరమ్మని కనులతో బిలిచెను. అతడు లోపలికేగిన తోడనే యామె "నాథా! నేను మీకు దెలియకుండ మొన్నటిదినమున ఆ మూటను విప్పిచూచితిని అందు పాసిపోయిన అన్నములో పురుగులుండుటను చూచి మన కేలనని మరల గట్టిపెట్టితిని మనము దాని నెటుల వడ్డింపదగును" అనెను.

అతడు వెంటనే యాసంగతి అల్లునకు తెలుపగా అతడు చిఱునవ్వు నవ్వుచు "మామా! ఆమూటను దెచ్చినాయెదుట విప్పిచూడుడు" అనెను. అందుకతడు మరల లోపలికేగి మూటనుతెచ్చి అల్లుని యెదుట నిడెను. అతడు తన యుద్ధరణితో కలశములోని తీర్థమును చేతిలో పోసి ఆమూటపై జల్లి "మామా! మూటను విప్పుము" అనగా శివకోటయ్య మూటను విప్పి చూచెను. ఆశ్చర్యము ఆ మూటలో నానావిధములగు భక్ష్యభోజనములు ఉండెను. ఆ పదార్థములను ముందు వడ్డించి, తర్వాత మీరు తయారు చేయించిన పదార్థములదెమ్మనెను.

ఆ మూటలోని పదార్థముల దీసి తట్టలోనిడగా, మరియొక తట్టెడు మూటలో వృద్ధియగుచుండెను. ఆరీతిగావచ్చిన వారి ఆకులన్నింటిలో

వడ్డించినా ఆ మూటలోని పదార్థములు తగ్గకుండట చూచి, అందరును ఆశ్చర్యపడిరి. కడకు శివకోటయ్య చేయించిన వంటలతో పనిలేకపోయెను.

అపుడు వీరబ్రహ్మము, మామగారిని పిలిచి, ఆయన తయారు చేయించిన వస్తువులలో కొంచెము కొంచెము తనయాకున వడ్డించి, మిగిలినదానిని గ్రామములోని బీదవారలకు బెట్టుమనెను. అందుకతడు సమ్మతించి, భోజనానంతరము బంధువులకు తాంబూలాది సుగంధ వస్తువుల నొసంగి, ఆవల బీదల రప్పించి అన్నదానమును చేయించి సంతసించెను.

ఆ విధముగా సకల జనామోదముగా వివాహమును ముగించి, నాటిరాత్రి చక్కగా నలంకరింపబడిన శకటము మీద వధూవరుల గూర్చుండబెట్టి ఉత్సవము చేసిరి. ఆ మరుదినము శివకోటయ్య బంధుమిత్రులను వారి వారి గ్రామములకు బంపెను. వీరబ్రహ్మము అత్తగారి గృహమున గొన్ని దినములుండి తదనంతరము తన గ్రామమగు కందిమల్లయ్య పల్లెకు బోదలచెను. అపుడు శివకోటయ్య కుమార్తెకు అల్లునికి నానావిధ వస్తువస్త్రభూషణాదు లొసగిపంపెను.

## తొమ్మిదవ ప్రకరణము

### 1. వీరబ్రహ్మంగారు కంది మల్లయ్యపల్లెకు తిరిగి వచ్చుట

పెద్దకొమెర్లనుండి వీరబ్రహ్మము వివాహానంతరము అత్తమామల దీవెనలంది ధర్మపత్ని గోవిందమాంబతోగూడ స్వగ్రామంబగు కంది మల్లయ్యపల్లెకు వచ్చి, స్వగృహమున గోవిందమ్మతో కాపురము చేయుచుండెను. ఆ గ్రామజనులందరు వీరయ్య ఒక ఇంటివాడైనందులకు

సంతోషించిరి. క్రొత్తకాపురము గనుక యేలోటుపాటులు లేకుండ గ్రామపెద్దలేగాక, అమ్మలక్కలుకూడ వారి కేకొదువలేకుండ వలసిన వస్తువుల దెచ్చియిచ్చుచుండిరి.

వివాహానంతరముగూడ వీరబ్రహ్మము తన తపోనియమముల వదలక సదా దైవచింతనలోనే మునిగియుండెను. గ్రామస్తులు మన వీరయ్యకు పెండ్లియైనను పిచ్చికుదరలేదనుచుండిరి. వీరబ్రహ్మము వారిమాటల లెక్కచేయక తన వడ్రంగపు వృత్తిని నిర్వహించుచు సంసారము చేయుచుండెను.

## ౨. జాతరలో వీరబ్రహ్మంగారు తన మహిమ జూపుట

అంతట కొన్నాళ్ళకు గ్రామనాయకులు గ్రామజాతరజేయదలచిరి. అందుకు వలసిన ధనమును చందాలుద్వారా వసూలు చేయదలచి వీరబ్రహ్మము యింటికికూడ యితర యిండ్ల వారివలెనే చందా నిర్ణయించిరి ఆరుసుము (తీరువా) అతడు చెల్లించవలసి యుండెను. అదియుగాక గ్రామాధికారి వీరబ్రహ్మమును జూచి "పెద్దమ్మ" కొక రథమును సిద్ధము చేయమనగా మంచిదని చేయుదునని వీరబ్రహ్మం బదులు చెప్పెను.

గ్రామజాతర దినమువచ్చెను వీరబ్రహ్మము అప్పటికిని యింటితీరువా చెల్లించలేదు. అదియుగాక గ్రామదేవత కొఱకు చేయమన్న రథము ప్రారంభింపక వృధాకాలము గడుపుచుండెను. పగలంతయు దేవరపూజను మహావైభవముతో జరిపి, ఆ తరువాత గ్రామాధికారి తలారులను పిలిచి వీరన్న యింటికి వెళ్ళి రథమును తీసికొని రమ్మనెను. తలారులు పోయి వీరబ్రహ్మము గారినడగగా రథము చేయలేదు. చేసి యిత్తుననెను. తలారు తిరిగివచ్చి అతనిమాటలు గ్రామాధికారికి తెలుపగా,

అతడు మండిపడుచు "ఔరా! వీరయ్య కెంత గర్వముపట్టినది, చందా ధనము నీయకపోవుటయే గాక అమ్మవారి రథమును చేయలేదట అకటా! రథము లేక అమ్మవారిని సాగనంపుటెట్లు అని భయపడి తలారులతో వీరయ్యను పిలుచుకొని రమ్మనెను.

తలారులు పోయి పిలవగానే వీరబ్రహ్మము లేచివచ్చెను. గ్రామాధికారి వీరబ్రహ్మమును చూచి కోపముతో వీరయ్యా నీకు మూడుదినములు ముందుగజెప్పినను రథమును జేయలేదట. ఇపుడు అమ్మవారిని సాగనంపవలసిన వేళయైనది. రథము లేక యామెను సాగనంపు టెట్లు ఇక గతియేమి? అమ్మగారి కోపము వచ్చినచో గ్రామమునే నాశనము చేయుననెను. అందుకు వీరబ్రహ్మము నవ్వుచు అమ్మవారు రథము లేదన్న నడిచి పోవును. అందుకు మనము భయపడనేల ననెను. ఆ మాటలకు గ్రామాధికారి మండిపడుచు నీవు పిచ్చికూతలు గూయకుము అమ్మవారెట్లు నడచిపోవును. ఎక్కడ నైనను జూచితివా, మాకేల అమ్మవారిని పొలిమేర దాటించుట నీపనియనెను. అందుకు వీరబ్రహ్మము మంచిదని అమ్మవారి గుడియెదుట నిలిచి "ఏమమ్మా! రథములేనిది నడువలేవా? పొలిమేర జేరబోయెదవా లేదా" యని గద్దించగా గుడిలోని యమ్మవారు గుడగుడ నడచి అందరికంటె ముందే పొలిమేర జేరెను.

అందరును నిశ్చేష్టులై దిక్కుతోచక నిలిచిరి. గ్రామాధికారి చేతులు జోడించి "స్వామీ! అపరాధము చేసితిని. క్షమింపుడు. మీరు భగవదాంశ సంభూతులుగనున్నారు" అనగా! వీరబ్రహ్మము నాయనా! చింతింపకుము. జాతరను శాంత మొనరింపుము. భయములేదు. నేను వెళ్ళెదనని యింటికేగెను.

## 3. పోలేరమ్మతో నిప్పు తెప్పించుట

ఒకనొకనాడు ఉదయములేచి ఊరికి వెలుపలనుండు చిన్న వనమునకు బోదలచి వీరబ్రహ్మము బయలుదేరెను. అతనికి చుట్టగాల్చుట అలవాటుగానుండెను. అపుడు చుట్టను చేతబట్టిపోవుచుండగా పోలేరమ్మ గుడిదగ్గఅగొందరు ఊరి పెద్దలు కూర్చుండి మాట్లాడుచుండిరి వారు వీరబ్రహ్మమును జూచినతోడనె లేచి నమస్కరించి రండు కూర్చుండు" అని పిలువగా సరియని పోయి కూర్చుండెను. అతడు కూర్చుండి చేతనున్న చుట్టను గాల్చుటకై అగ్నికొరకు బ్రయత్నించెను. అక్కడయుండిన వారికడనిప్పును చేయు సాధనములు లేకుండెను. దారిలోబోవువారిలో ఒకరిద్దరిని అడిగిచూచిరి, ఒక్కరును చుట్టను ముట్టించుటకు నిప్పును దేజాలకపోయిరి.

అపుడు అక్కడివారిలో నొకడు లేచి స్వామీ! మీ చుట్టను నాచేతికిండు మాయింటికిపోయి నిప్పును గాల్చికొనివత్తును, లేకున్న యొకనుగ్గున నిప్పు నిడుకొని వత్తుననెను. అందుకు బ్రహ్మము నవ్వుచు నాయనా! నిప్పుకొరకు నీవు యింటికి బోవలెనా! వలదు. నిప్పును తెప్పించెదనుచూడుమని పోలేరమ్మ విగ్రహము తట్టుచూచి "పోలేరి! చుట్టగాల్చుకొనుటకు నిప్పును గొనిరమ్ము" అనెను. ఆ మాటకు వారు ఆశ్చర్యపడి చూచుచుండ గుడిలోని దేవతా విగ్రహము బాలిక రూపమున నుగ్గుపై నిప్పును బెట్టుకొనివచ్చి వీరబ్రహ్మంచేతికిచ్చి గుడిలోనికి వెళ్ళెను. ఈ చిత్రమును గాంచి గ్రామజనులు ఆశ్చర్యపడిరి. ఆరీతి వీరబ్రహ్మము మహాత్మ్యములు దినదినము చుట్టుప్రక్కల గ్రామములకు వ్యాపించెను.

## 4. వీరబ్రహ్మం గారు భార్యతో తీర్థయాత్రలు చేయుట

వీరబ్రహ్మము కందిమల్లయ్యపల్లెలో గోవిందమ్మతో సంసారయాత్ర జరుపుచుండ నాతనికి దేశక్షేత్ర తీర్థయాత్రల కేగవలెనను తలంపు కలిగెను. తన యభిప్రాయమును గోవిందమ్మ కెరిగించెను. ఆమె నాథా! మీరొకరే తీర్థయాత్రల కేగెదరాయని ప్రశ్నించెను. అందుకతడు భార్య లేక జేయు దివ్యక్షేత్ర తీర్థయాత్రలు నిష్ప్రయోజనమగును. కనుక మన మిద్దరము గలిసియే యాత్రల జేయబోదమని తీర్మానించెను.

ఒకానొక శుభదినమున భార్యాభర్తలు తీర్థయాత్రలకు బయలుదేరిరి. ఆ ఊరిలోని చిన్న పెద్దలను శిష్యులను వారిని గొంతదూరము సాగనంపి తిరిగివచ్చిరి. అంత నాదంపతులు ప్రయాణము సాగించిరి.

ఆరీతి తీర్థయాత్రలు జేయుచు శ్రీశైలమున దారిబట్టి పోవుచుండనొక విచిత్రము జరిగినది ఆదంపతులుపోవుచుండదారి ప్రక్కన ఒక రోగపీడితుడగు బ్రాహ్మణుడు పడియుండెను. అతడు దాహము దాహము అనివాపోవు చుండెను. చుట్టుప్రక్కల యెవ్వరును లేకుండిరి. ఔరా! ఆశ్చర్యముగ నున్నది. ఇది నిర్జనప్రదేశము అటవికుల సహితము లేకుండిరి. ఇట్టిస్థలమునం దీతడుండుట వింతగున్నది. ఇతడుమాయా పురుషుడై యుండునా యని యనుకొనుచు కొంతదూరమున నుండు జలాశయముకేగి, సహజదయార్ద్రహృదయుడగు వీరబ్రహ్మము తన కమండలమునిండ నీటిని గొనివచ్చి ఆ బ్రాహ్మణుని దాహముదీర్చెను. అపుడా బ్రాహ్మణుడు మెల్లగలేచి కూర్చుండి “నాయనా! నా దాహముదీర్చి పుణ్యంనార్జించితివి. నీఋణము ఈ జన్మమున దీర్చుకొన జాలను. త్వరలో నీకుమారుడనై జన్మించి నీ ఋణమును దీర్చెదను” అని

గోవింద నామస్మరణ జేయుచు క్రింది వ్రాలి విగతజీవుడాయెను. గోవిందమ్మ కందిమల్లయ్య పల్లెకు వచ్చిన తర్వాత భర్తకు ఆ సంఘటన జ్ఞాపకపరిచెను.

## 5. గోవిందమ్మ గర్భము దాల్చుట

ఈ విధముగా వీరబ్రహ్మము గోవిందమ్మతో గలిసి దేశయాత్ర తీర్థయాత్రల ముగించుకొని కందిమల్లయ్యపల్లె జేరిన తర్వాత గొన్ని దినంబులలో గోవిందమ్మకు గర్భమును ధరించిన సూచనలుపొడజూపెను ఆమె సంతోషముతో దినములు గడుపుచుండ క్రమముగా నవమాసములు నిండి పదవమాసం ప్రారంభించెను. వీరబ్రహ్మము తన కార్యక్రమము ననుసరించి నిత్యానుష్టాన జపతపము లాచరించుచుండెను.

అంతనొక శుభదినంబున గోవిందమ్మ మగశిశువును బ్రసవించెను. అపుడు వీరబ్రహ్మము నావార్తపెద్ద కొమెర్లలో నుండు తన అత్తమామలకు దెలిపెను. వారును నామకరణం నాటికి కందిమల్లయ్యపల్లెకు వచ్చిరి. అంత పదునొకండవ దినమున పురోహితుని రప్పించి శాస్త్రోక్తముగ తమ మనుమనికి "సిద్ధిలింగయ్య" యని నామకరణము చేసిరి. సిద్ధిలింగయ్య ముద్దులు మూటగట్టినట్లుండెను. శిశువు దినదిన ప్రవర్ధమానుడై బాలచంద్రునివలె వృద్ధియగుచుండెను. అంతట శివకోటయ్య గోవిందమ్మను చూచి "అమ్మా! మాకు నీవుతప్ప ఇతర సంతానము కలుగలేదు కదా. ఇంతటితో మావంశము నిలిచిపోవును. కనుక నీ ప్రథమ సంతానమును మాకొసంగినచో బాగుండును. మా వంశము నుద్ధరించినట్లగును. నీ భర్తతో యోచించి చెప్పు" మనిరి గోవిందమ్మ భర్తతో ఆ విషయమై యోచించెను. అందు కతడు సమ్మతించెను.

## ౬. శ్రీ వీరబ్రహ్మంగారి సంతానం

సిద్దలింగయ్యకు సంవత్సరము దాటిన తర్వాత శివకోటయ్య భార్యాసమేతముగ వచ్చి ఆ బాలుని గొనిపోయి పెంచుకొనుచుండిరి. అంతలో గోవిందమ్మ రెండవగర్భమును ధరించెను. ఆగర్భమునందలి శిశువు క్రమముగ వృద్ధియగుచుండ పదవమాసమున గోవిందమ్మ ప్రసవవేదన ప్రారంభమై శుభలగ్నమునందు పురుషశిశువును బ్రసవించెను. పదిదినములు దాటగనే గోవిందమ్మ భర్తతో మన శిశువునకు పేరు పెట్టవలసియున్నది కదా ఏపేరు బాగుండుననెను.

అందుకు వీరబ్రహ్మము దీర్ఘాలోచన మొనరించుచు సతీ నీకు జ్ఞాపకమున్నదా! ఈ బాలుని ముఖము మనమానాడు శ్రీశైలారణ్యము దప్పియని బాధపడుచుండిని బ్రాహ్మణుని ముఖమునేపోలియున్నది. అతడు మరణించుచు మన యింట కుమారుడనై జన్మింతుననెను. అతడే ఈ బాలుని రూపమున జన్మించినట్లున్నది. అతడు మరణించునపుడు గోవింద నామస్మరణ జేయుచు నసువులు బాసెను కనుక ఈబాలునకు "గోవిందయ్య" అను పేరు పెట్టుదమని యట్టులే నామకరణ మొనరించిరి.

ఆ తరువాత గోవిందమాంబ కాలక్రమంలో యిద్దరు కుమారులను గనెను. ఆ కుమారులలో మూడవవానికి శివరామయ్య, నాల్గవవానికి ఓంకారమయ్య అను నామములనిడిరి. ఆవల మరికొంతకాలమునకు గోవిందమ్మ యైదవసారి గర్భమును ధరించెను.

ఒకనాటి రాత్రి గోవిందమ్మ నిద్రించుచుండగా అల్లాడు పల్లె వీరభద్రస్వామి స్వప్నమున దర్శనమిచ్చి "తల్లీ! ఈసారి నీ గర్భమునందు

నాయంశమున మరల కుమారుడు జన్మించును ఆ శిశువునకు "పోతులూరు" అని పేరు పెట్టుడని యంతర్ధానమయ్యెను.

గోవిందమ్మ ఉదయము నిదురలేవగనే భర్తను పిలిచి రాత్రి స్వప్నమును వీరభద్రుడు పలికిన మాటలను వినిపించెను. అందుకు వీరబ్రహ్మము అవును. ఆ వీరభద్రుడే నాకును ఎన్నో దినముల క్రిందట తాను నా కుమారుడై జన్మింతుననియు, ఆ కుమారునకు పోతులూరను పేరు పెట్టుడనియు జెప్పియుండెను. కనుక మనమీసారి జన్మించు పుత్రునికాపేరు పెట్టక తప్పదు" అనెను. ఆవల కొన్నిదినములకే గోవిందమ్మ మరల కుమారునిగనగా ఆ శిశువునకు పోతులూరయ్యయను పేరుపెట్టిరి. అంత మరికొంత కాలమునకు ఒక కుమార్తె జన్మింపగా ఆమెను వీరనారాయణమ్మయని పిలుచుచుండిరి.

వీరబ్రహ్మము సంతానములో జ్యేష్టపుత్రుడు పెద్దకొమెర్లలో శివకోటయ్య దత్తపుత్రుడై పెరుగుచుండెను. గోవిందయ్యకు బద్వేలు సమీప గ్రామమందు కొలమలపేటలో గిరియమ్మయను కన్యను తెచ్చి పెండ్లిచేసిరి. శివరామాచార్యులకు ఉత్పలమఠము అను గ్రామమునుండిన పాపమ్మ అను కన్యనుదెచ్చి వివాహమొనరించిరి. ఓంకారమయ్య పెండ్లియనంతరము పోతులూరయ్యకు కొలములపేట యందే పార్వతమ్మయను ఆమెను తెచ్చి పెండ్లిచేసిరి. ఆవల అందరకంటె చిన్నదియగు వీరనాయణమ్మను సదాచారసంపన్నుడగు విశ్వబ్రాహ్మణ యువకునికిచ్చి పెండ్లిచేసి యుచిత వస్త్రాభరణముల నొసగి, భర్తవెంట కాపుర మొనరించుటకు అత్తగారింటికి పంపిరి.

## 7. శ్రీ వీరబ్రహ్మం గారికి భక్తులు మఠమును కట్టించుట

అంతట వీరబ్రహ్మము గారు ఏకాంతస్థలమును చేరి తపమాచరించుటకు తగిన స్థానమును గురించి ఆలోచించ సాగిరి. ఆ సంగతి వారి శిష్యులును, భక్తులును తెలిసికొనిరి. వారు వెంటనే స్వామివారు నిర్ణయించినచోట భూగర్భమునందొక మందిరమును కట్టించి చుట్టు ప్రాకారమును నెలకొల్పి భక్తులకు శిష్యులకుగావలసిన సత్రములను విడిదులను గూడ కట్టించి, పడమట ఒక కొలనును త్రవ్వించిరి. భక్తులు వీరబ్రహ్మముగారేమికోరినా, దానిని భక్తితో సమర్పించుచుండిరి. ఆరీతిగా ఏ విచారమును లేక సదా దైవచింతనజేయుచు బ్రహ్మముగారు మఠమున తాను తపమాచరించుకొనుటకై నిర్మింపబడిన మందిరమున ఏకాంతమున తపమొనరించుచు కాలము గడుపుచుండెను. వారి భార్యపుత్రులు ఏ విచారమును లేక తండ్రిసేవలు జేయుచుండిరి. గోవిందయ్య, పోతులూరయ్య బాగుగ చదివి అసమాన పాండిత్యమును సంపాదించిరి.

# పదవ ప్రకరణము

## 1. ఆనందభైరవయోగి సిద్దయ్యగా జన్మించుట

ఇదిలా వుండగా కడప జిల్లాలో బద్వేలు తాలూకాలో ముడుమాలయను గ్రామము కలదు. ఆ గ్రామమునందు మహ్మదీయులు అనేకులుండిరి అందు ఒక "దూదేకుల లేక పింజారి" తెగవారు కూడ గొందరుండిరి. ఆ దూదేకుల వారిలో పీరుసాహేబు, ఆదంబీ యను భార్యతో కాపురమొనరించుచుండెను.

అతడు మహమ్మదీయ మతస్థుడైనను హిందూ మతమునకు విరోధికాడు. హిందువులన్నను, హిందూ మతమన్నను ద్వేషింపక ప్రేమించుచుండెను. అతడు బీదవాడైనను కులవృత్తియుగు దూదేకుల పనిని విడువక న్యాయ మార్గమున ధనమార్జించి యే లోపము లేకుండ కాపుర మొనరించుచుండెను. ఆదంబీ భర్తకు దగిన భార్యయనిపించుకొని పీరుసాహేబు కనుసన్నలలో మెలగుచుండెను. ఆ దంపతులకు సంతానములేదను లోపముతప్ప ఇతర విచారములేకుండెను.

పీరుసాహేబు ఆదంబీతోకూడ మహమ్మదీయ యాత్రలుజేసి వచ్చెను. అనేక దిగంబరులను, ఖాజీలను, ఫకీరులను సంతాన ప్రాప్తికై సేవించియు లాభము లేకపోయెను. ఇక మనకీ జన్మమున సంతానము కలుగదని నిరాశజెందియుండిరి. అట్లుండగా ఒకనాటిరాత్రి పీరుసాహేబు గాఢనిద్రలోనుండగా కాశీ విశ్వనాథుడు దర్శనమిచ్చి యిట్లుచెప్పెను. "నాయనా! పూర్వము నేను కాశీలో క్షత్రియ కుటుంబమున జన్మించితిని ప్రమాదమున నేను గోహత్యచేయుట తటస్థించినది ఆ పాపపరిహారార్థము తీర్థయాత్రల జేయుచుండ ఒక మహాపురుషుడు దర్శనమిచ్చెను. అతని పాదములకు నమస్కరించి గోహత్యపాపము బోవు మార్గము నుపదేశింపుమంటిని అందుకాయన నాయనా! ఈ పాపం యూరకపోదు. నీవు మహమ్మదీయుడవై జన్మించిన ఆ పాపము పోవును. అని చెప్పగా నేను నీకు పుత్రుడనై జన్మింప దలచితిని" అని పలికి అదృశ్యుడయ్యెను.

అంతలో పీరుసాహేబు మేల్కొని స్వప్న వృత్తాంతమును ఆదంబీకి తెలిపి సంతోషించుచుండెను. అంత గొన్ని దినములకు నిజముగ ఆదంబీ గర్భవతి యయ్యెను. హిందూదేవుడు స్వప్నములో కనబడి తనయింట

జన్మింతునని చెప్పిన విషయమును యితర మహమ్మదీయులకు దెలిసిన ద్వేషింతురని ఎవరికిని దెలుపకుండిరి. అంతలో ఆదంబీకి పదియవనెలలో మగశిశువు జన్మించెను. పీరుసాహెబు సిద్దపురుషుని అనుగ్రహమున జన్మించిన శిశువుకు "సిద్ధయ్య" అని పేరు పెట్టెను.

సిద్దయ్యకు అంతలోపదునాలుగు పదునై దేండ్లవయసువచ్చెను. అతడు మహమ్మదీయుల పలుకులను లెక్కపెట్టక సదా దైవధ్యానములో మునిగియుండెను. అతడు తల్లిదండ్రులను జూచి మీరు మాంసము తేరాదు మాంసమును భుజింపకూడదు. అట్లుచేసిన నేను ఇంటిలో భుజింపనని పట్టుపట్టెను.

సిద్దయ్య సదా పరధ్యానములో నుండుటయు, దైవచింతనలో నిమగ్నుడై యుండుటయును జూచి అతడు గొప్పభక్తుడుగా మారిపోవునని హిందు, మహమ్మదీయులు తలచిరి. సిద్దయ్య మూడుమాలలో నుండుట కిష్టపడక ఎక్కడికైనవెళ్ళి ఒక గురువును సంపాదించుకొన తీర్మానించుకొనెను.

## 2. సిద్దయ్య వీరబ్రహ్మము గారిని దర్శించుట

సిద్దయ్య సదా పరధ్యానములోనుండి హిందూ మతపద్ధతుల నవలంబించుటజూచి పీరుసాహే బతనిని తమమార్గమునకు త్రిప్పదలచి పెండ్లిచేసిన సరిపోవునని ఆ ప్రయత్నము చేయుచుండెను. ఆ సంగతి గ్రహించి సిద్దయ్య ఎవరికి తెలుపక ఎచ్చటకైనబోయి గురూపదేశమును పొంద సంకల్పించియుండగా, ఒకనాడా ఊరికి కొందరు భక్తులు వచ్చి దేవాలయము నందుండుట జూచెను. అతడు వారికి నమస్కరించి "అయ్యా! తామెచ్చటి కేగుచుండిరి" అని ప్రశ్నించెను.

అందులకా భక్తులు నాయనా! మాది చాలా దూరదేశము. కందిమల్లయ్యపల్లెలో దైవాంశ సంభూతుడగు సిద్ధపురుషుడున్నాడని తెలిసినది. అతని మఠమును జేరి ఆతని శిష్యులమై ఉపదేశమును పొందుటకు వెళ్ళుచున్నామని చెప్పిరి. అందుకు సిద్దయ్య స్వామీ నేనుకూడ మీవెంట వచ్చెదను నాకుగూడ అతనిచే ఉపదేశము చేయించుడని బ్రతిమాలెను. అందుకు వారు నాయనా! నీవు బాలుడవు ఇంకను కొన్నాళ్ళు తలిదండ్రుల ఆజ్ఞలో నుండుము. కొంతకాలం గృహస్థుడై యుండి, తదనంతరము గురూపదేశమునకు బ్రయత్నింపుమనిరి. సిద్ధయ్య అయ్యా! ఆ సంగతులన్నియు చెప్పబనిలేదు మీ రెపుడు ప్రయాణమై పోదురో చెప్పడనగా, వారు రాత్రి యీ గుడియందుండి రేపు ప్రొద్దు పొడిచినతోడనే బయలుదేరుదుమనిరి. అంతట సిద్దయ్య ఏమియుననక ఇంటికిపోయి రాత్రి ఎట్లో కాలముగడపి తెల్లవారకముందె గుడికేగి చూడగ నందొక్కరును లేకుండిరి.

అందుకు సిద్దయ్య చాలా విచారపడి, “ఔరా! భక్తులు నన్ను మోసగించిపోయిరి. వారిననేల? నేను ఆలస్యముగ వచ్చితిని కాబోలు వారు ప్రొద్దుపోవునని ముందే బయలుదేరి పోయియుందురు. నేను వేగముగ నడిచియో పరుగెత్తియోపోయిన వారిని గలిసికొన వచ్చునని యెవ్వరికి జెప్పకుండ వారు వెళ్ళిన మార్గంలో ప్రయాణించెను.

## 3. బ్రహ్మంగారి భార్యాబిడ్డలు సిద్దయ్యను తిరస్కరించుట

ముడుమాల వదలి సిద్దయ్యభక్తుల గలిసికొనవలెనని వాయు వేగమున బరుగిడసాగెను. అతడు యౌవనదశయందుండుటచే ఆయాసపడక పరుగెత్తుచు, దారికడ్డమునవచ్చిన వారినడిగి కందిమల్లయ్యపల్లెకు దారి

తెలిసికొనుచు, ఎవరైన భక్తులు ముందు పోవుచుండిరా యని యడిగి లేదన్నచో నిరాశజెందుచు కడకు కందిమల్లయ్యపల్లె జేరెను.

అతడు ముడుమాలలో తనకు గనబడిన భక్తులకై సత్రము లన్నింటిని గాలించి చూచెను ఒక్కరుకూడ కనులబడలేదు అందుకు సిద్దయ్య "ఔరా! ఆ భక్త లెచ్చటికి వెళ్ళిరి. నాతో కందిమల్లయ్యపల్లెకు బ్రహ్మముగారి శిష్యులగుటకు వెళ్ళుచున్నామని చెప్పిరికదా. వారచ్చటికి వచ్చినట్లులేదు. ఎచ్చటికి వెళ్ళియుండురు వారు మాయమగుట జూడ వారు నన్నిటకుబోయి బ్రహ్మముగారి శిష్యుడవగుమనిబోధించుట కట్లు వచ్చిన దివ్య పురుషులైనట్లున్నది. ఇదియు నామేలునకై జరిగినది. అనిమెల్లగా బ్రహ్మముగారి మఠమును సమీపించి సింహద్వారముకడనిలిచెను.

సింహద్వారమున నిలిచిన సిద్దయ్య ఔరా! నేను మహమ్మదీయుడను, స్వామివారిని దర్శింప లోపలకేగుటకనుమతి ఇత్తురోలేదో అయినను భగవదాంశ సంభూతుడగు గురువునకు కులమతభేదము లుండవందురు. ఏమైన కానిమ్ము లోపల ప్రవేశింతును" అని మెల్లగా లోపలికేగి వ్యాఘ్రాసనముపై పరబ్రహ్మ స్వరూపముతో వెలుగుచుండిన వీరబ్రహ్మమును జూచి సాష్టాంగ నమస్కార మొనరించి లేవకుండెను. అపుడు వీరబ్రహ్మము కనులదెరచి "ఆనందభైరవ యోగీ వచ్చితివా?" అని మరల కన్నుల మూసికొని పలుకకుండెను.

సిద్దయ్య తన్ను పిలువలేదని లేవక సాగిలపడియేయుండెను. అంతలో గోవిందమ్మ వచ్చి మహమ్మదీయుడు మఠమును బ్రవేశించెను. అతనిని వెలుపలి కేగుమనెను. ఆమాటలు విని గోవిందయ్య వచ్చి "ఓరీ! మహమ్మదీయుడా! మా అనుమతిలేక మఠమునెట్లు జొచ్చితిని లేచిపోయెదవా

లేదాయని గద్దించి పలికెను. సిద్ధయ్య స్వామీ! మహమ్మదీయుడనగు నేను మనుష్యుడనే కదా. స్వామిని గురువుగా భావించి ఆయన పాదసేవ చేయుటకు వచ్చితిని. నాకు తల్లియు దండ్రియు గురువు అన్నియు ఆయనయే, నాప్రాణమునైన బాపెదగాని గురుపాదసేవ వదలి పోజాలననెను. అంతలో పోతులూరయ్య లేచివచ్చి “ఓరీ! నీచా! నీవు మ్లేచ్ఛుడవు గోవధచేయుదువు మతవిరోధివి, నాస్తికుడవు నీసేవలు మహాపురుషుడగు మాతండ్రి స్వీకరింపడు పోయెదవా లేదా!” యని మెడబట్టి వెలుపలికి గెంటెను.

## 4. శ్రీ వీరబ్రహ్మం గారు సిద్దయ్యను అనుగ్రహించుట

అలా పోతులూరయ్య మెడబట్టి త్రోయగా సిద్దయ్య క్రిందపడి లేచి మరల పరుగిడుచువెళ్ళి స్వామిపాదములపై వ్రాలి “శ్రీమన్నారాయణావతారా! అనాధరక్షకా! పతితపావనా మిమ్ము నా గురుదేవునిగా భావించి మీ పాదకములముల సేవింప వచ్చితిని మీరు నిరాకరించినచో మీ పాదములకడ ప్రాణముల వదల సిద్దపడితిని. మీరు నిక్కముగ నన్ను త్యజించినచో నామాటను నిలుపుకొనగలను. మీ కుమారులు నన్ను పలువిధములు దూషించి వెలుపలికి త్రోసిరి. కడపటిసారి మిమ్ముల ప్రార్థించుచుంటిని. మీనోటినుండి నన్ను శిష్యునిగా జేసికొనుటకు వీలుపడదని మాట వెలువడిన మరునిమిషమే నా ప్రాణములుండవని నమ్ముడు. నాచావు బ్రతుకులు నేడు తేల్చవలసిన వారు మీరేననెను.

వీరబ్రహ్మంగారికి సిద్దయ్య తనకడకు శిష్యుడు కాగోరి వచ్చునని తెలియును. అతడే తనకు దగిన శిష్యుడనియు సిద్దయ్య ద్వారా అనేకులకు జ్ఞానోపదేశము చేయించవలసియున్నదని తెలియును. అయినను సిద్దయ్య

దృఢసంకల్పమును పరిక్షించి తన కుమారులకును, ప్రజలకును సిద్ధయ్య గొప్పతనమును చాట నిశ్చయించెను.

అంతట స్వామి తన కుమారులగు గోవిందయ్య పోతులూరయ్యను పిలిచి "నాయనలారా! మీరితనిపై కోపించి దుర్భాషలాడిరి. మెడబట్టి వెలుపలకు త్రోసి, మతాంతరుడని నిందించితిరి. అయినను అతడు నన్నే నమ్మియున్నాడు. అతని శాంతస్వభావమును జూడుడు మానవులకు గావలసినది ధైర్య శాంతగుణములే, అట్టి గుణములు ఈతనియందు మూర్తీభవించుచున్నవి. మీరిద్దరును శాంతమును గోలుపోతిరి అతడు మీకంటె ఎక్కువేకాని తక్కువవాడుకాడు. నాకు గుణము కారణము కాని కులముతో పనిలేదు. ఈతడే నాకు తగిన శిష్యుడు. ఇతనిని మీరు మీ సోదరునిగా జూచుకొను"డనగా వారూ అట్లే అనిరి.

## 5. శ్రీ వీరబ్రహ్మం గారు సిద్ధయ్యకు బ్రహ్మోపదేశము చేయుట

ఒకానొక దినమున సిద్దయ్య బ్రహ్మంగారి పాదసేవ జేయుచుండగా బ్రహ్మంగారు ప్రేమతో నాయనా! ఇప్పటి నుండి నీ విచారములన్నియు పటాపంచలైపోవును. నీవు నిజమగు భక్తుడవు. భక్తునకు సుఖదుఃఖములుండవు, అతనికి బాహ్యప్రపంచముతో సంబంధముండరాదు. నీకు బ్రహ్మోపదేశ మొనరింపదగు ముహూర్తమే తెంచినది. నీవు స్నాన మొనరించి పరిశుద్ధుడవై రమ్ము. రక్తమాంస పురీషములతో నిండిన నీదేహమును మంత్రములతో నింపి పవిత్ర మొనరించెదననగా వెంటనే సిద్దయ్య స్నానమొనరించి విభూతిదాల్చి గురుదేవుని మ్రోల కూర్చుండెను.

అపుడు వీరబ్రహ్మంగారు సిద్దయ్యను నాయనా! పద్మాసనము వేసి కూర్చుండి నన్ను చూచుచుండుమని అతని తలపై తన చేతినిడి

నొసట మూడుసార్లు తుడిచి నాయనా! నీపూర్వపు వ్రాతతుడిచి మరల వ్రాసితిని నీ నాలుకనుజూపుమని బీజాక్షరముల లిఖించి వీపును తడువుచు నాయనా! నీకు మంత్రోపదేశ మొనరించెదని యాతని చెవిలో **"ఓం హ్రీం క్లీం శ్రీం శివాయబ్రహ్మణే నమః"** అను మంత్రమును మూడుసార్లు పలికెను.

సిద్దా! నీ చిత్తమును చెదరనీయకము నే జూపెడి లక్ష్యమును దృష్టిసారించి చూడుము. అవల అంతర్లక్ష్యంబును గని మనస్సును వాయువును స్థంభింపజేసి భ్రూమధ్యంబున దృష్టి నిలిపి పరంజ్యోతిని గనుము.

## బహిర్లక్ష్యము

నాయనా! పైరీతి దృష్టిని అచంచల మొనరించినచో నాలుగు అంగుళముల మేరలో కైవల్యంబనునదియు, ఆఱు అంగుళములలో ధూమ్రంబనునదియు, ఎనిమిదంగుళములలో వరుణకాంతియు, గోచరమగును, అదేజ్యోతి మరల పన్నెండంగుళముల దూరమున పీతవర్ణంబుగ నుండును. ఈయైదు వర్ణంబుల గనినంతనేనీశిరమునెత్తి ఏకాగ్ర చిత్తుడవై చూచినచో చంద్రునివంటి వెలుగుతో జ్యోతికానంబడును. అపుడు ఆఱుద్వారములను చేతి వ్రేళ్ళచే బంధించి, మనస్సును జ్యోతిలో లీనమొనరించిన, ప్రణవనాదము వినదగును దీనిని మరువక సాధన జేయుము.

## మధ్యమ లక్షణము

ఆవల అచంచల దృష్టితో మరికొంతసేపు చూచిన సూర్యచంద్ర నక్షత్ర ప్రకాశమును, మెరుపుతో గూడిన పంచభూతములు గోచరమగును

అటులనే మరికొంతసేపు చూచుచుండిన, ఆ జ్యోతియందు పంచవిధ అకాశంబులు గనంబడును. ఆ పంచవిధ అకాశంబులలో తన్మయత్వము జెందుటయే మధ్యమ లక్షణము

## అంతర్లక్ష్యము

తదుపరి ఏకదృష్టితో ముక్కు చివర భాగమును జూచినచో ఆ జ్యోతి రసంబునకాశ్రయమై గోచరించును ఆ జ్యోతియే భ్రూమధ్యమున సచ్చిదానంద చిహ్నములను సాక్షి స్వరూపం బయటికి కనబడుచుండును. ఆ రీతి భ్రూమధ్య జ్యోతియందు "పరమాక్ష హైరణ్య"ములను రెండును, స్పటిక వర్ణమున వాయుస్థాపనమందుండి వెలువడును. అపుడది తారక మనిపించుకొనును. ఆ తారక యోగముననుదినము నభ్యసించినచో స్థిరత్వము సిద్ధించును. స్థిరత్వము సిద్ధించినచో అంతరాత్మ పరమాత్మతో నేకమగునట్లు జేయునగును. ఈ యోగమువలన సాధింపరానిది లేదు. ఇది అంతర్లక్ష్యంబనంబడును.

కనుక సిద్ధా! పై పద్ధతుల ననుసరించి నీవు తారక యోగము నభ్యాస మొనరించుచుండుము. మఠమున నీకు ప్రత్యేక వసతి గల్పింతును. అచ్చటి కితరులురారు. నీవు యోగాభ్యాసము, భగవధ్యానమున నొనరించిన పిదప నాకడ నుండుము నీకు మరికొన్ని యిత విషయములు నేర్పుచుందు ననగా సిద్దయ్య గురువు నానతి చొప్పున జేయుచుండెను.

## 6. సిద్దయ్యను వివాహం చేసుకోమని ఆదేశించుట

ఒకనాడు వీరబ్రహ్మం గారు సిద్దయ్యను చేరబిలిచి నాయనా! గృహస్థాశ్రమ ధర్మముల నాచరించువారు "ధర్మార్థకామమోక్షములు" అను

చతుర్విధ పురుషార్థముల కర్తులైయుందురు అట్టి గృహస్థు లిహపర లోకములలో గూడ సుఖింతురు. సంవత్సరమున కొకసారి అనగా పితృ దినమున పిండప్రదానము చేతను, తిలోదక దానముల వల్లను పితృదేవతలు తృప్తిపరచగా, అందుకు పితృదేవతలు సంతసించి వానికి సుఖమును గలిగింతురు. మానవుడు సదా తన కర్మఫలము వలన వివిధ యోనులయందు పుట్టి చచ్చుచుండును అట్టి మానవుడు కర్మము వదలి స్వాతంత్ర్యముగ జీవింపజాలడు.

కనుక నీ విపుడు మానవజన్మము నున్నావు. ఈ జన్మము దొరకుట కష్టము. ఇపుడు నీవును నావలననే గృహస్థాశ్రమమును స్వీకరింపక తప్పదు ముందు గృహస్థుడై ఆ ధర్మముల నిర్వర్తించినచో తర్వాత వానప్రస్థాన సన్యాసాశ్రమము కర్త్వాడ వగుదువు కనుక నీవు ఇపుడే వారిని సేవించి వివాహమాడి జననీజనకులకు ఆనందసాగరమున నోలలాడించుము. గృహస్థు కేవలము అన్నింటిని తనపైన వేసికొని విపరీతకార్యములకు గడంగక తామరాకుపై నుండు జలబిందువువలె చరించుచుండవలెను. ఈ నాయాజ్ఞ ననుసరించి తల్లిదండ్రుల కడకేగుమనెను.

## 7. సిద్ధయ్య వివాహం చేసుకొనుట

అంతట సిద్ధయ్య స్వామీ! మీ ఆనతి మీర నేనెంతటివాడను. మీ యిష్టము ననుసరించి తల్లితండ్రుల జేరివారికి సేవజేయుచు వివాహమాడి వారికి సంతసము గలిగించెదను. నేను పోయినతోడనే ఈ మహమ్మదీయుని పీడవదలెనని సంతసింపక, సదా మీకరుణామృతమును నాపై జల్లుచు నన్ను తరింపజేయు భారము మీదే. నేను మిమ్ము వదలిపోయినను పోకున్నను నొకటే. నా దేహము మాత్రము ముడుమూలలో

నుండును. కాని నాప్రాణము మీ పాదముల నాశ్రయించి యుండుట నిక్కము. నేను ప్రతిదినము రాకపోయినను వారమునకొకసారియైన వచ్చి మీ పాదసేవ చేయకుండ ఉండజాలను పాలముంచినమ నీటముంచినను మీరేగతియని స్వామి పాదములకు సాగిలబడి సెలవు గైకొనిపోయెను.

సిద్దయ్య ముడుమాల కరిగి, యింటికి వెళ్ళినతోడనే జననీజనకుల పాదములకు నమస్కరించెను. అతనిని జూచిన తోడనే తల్లి “నాయనా! ఎపుడు వచ్చితివి అన్నమెచ్చట తింటివి. అయ్యో! కడుపులోపలికి పోయినదే రమ్ము ఇపుడే వంట సిద్దము చేసితిని. తండ్రీ నిన్నుజూచు భాగ్యము లభించునందులకు అల్లాకు పదివేలు సలాము”లనెను.

అంతట సిద్దయ్య స్నానముచేసి గురధ్యానానంతరము భుజించి కూర్చుండెను సిద్దయ్య వచ్చిన సంగతి విని బంధు మిత్రాదులు వచ్చి చూచి చాల సంతసించిరి. అంతట పీరుసాహేబు తన బంధువులు ఇంటిబిడ్డను తెచ్చి వివాహమొనరింపదలచెను. ఆకన్యక తల్లిదండ్రులు కూడా సమ్మతించిరి. ఒక శుభదినమున ఆదాంబీ దంపతులు సిద్దయ్య వివాహమును వైభవముగ జరిపిరి. వివాహానంతరము సిద్దయ్య భార్యసమేతముగ వెళ్ళి గురువును దర్శించి కానుకల సమర్పించి అశీస్సులబొంది తిరిగి వచ్చిరి.

సిద్దయ్య గృహస్థుడయ్యె గురువును విడువజాలక పలుమారు ఆయన సేవజేయుటకు బోవుచుండెను. ఒక్కొక్క సారి పోయిన నెలల తరుబడి గురువును వదలి రాకుండుటచే పీరుసాహేబు భార్యతో గూడ వెళ్ళి ఇంటికి దోడ్తెచ్చుచుండెను.

# పదునొకండవ ప్రకరణము

## 1. శ్రీ వీరబ్రహ్మం గారి ఉత్తరదేశ సంచారం

శ్రీ స్వాములవారొక దినము సిద్ధయ్యను చూచి "సిద్ధా! నాకు ఉత్తరదేశ సంచార మొనరింపవలెనని బుద్ధి పుట్టినది. అందుకు తగిన సన్నాహమొనరింపుడు. సపరివారముగ బయలుదేరవలె"ననగా సిద్ధయ్య అన్నీ సిద్ధము చేయించెను.

ఒక శుభదినమున వీరబ్రహ్మేంద్రస్వామి సపరివారముగ బయలుదేరెను. స్వామి అంగరక్షకుడును ప్రియశిష్యుండునగు సిద్ధయ్య స్వామి ప్రక్కనుండెను. అందరును కందిమల్లయ్య పల్లెనుండి కదలి గిద్దలూరు, కంభము మార్కాపురములాదిగాగల గ్రామములలో మజిలీలు చేయుచు, జనులకు సన్మార్గముల బోధించుచుండిరి. స్వామి వారు వచ్చు సంగతి తెలిసికొని గ్రామవాసులు మంగళవాయిద్యములతో ఎదురేగి ఆహ్వానించి పిలుచుకొనిపోయి తగిన విడిది నేర్పాటు జేయుచుండిరి. స్వామివారికి భిక్షల నేర్పాటు చేసి సగౌరవముగ సాగనంపుచుండిరి. అలాగు ప్రయాణమును చేయుచు గుంటూరు, విజయవాడ, ఖాజీపేట మున్నగు పట్టణములు దాటి గోలుకొండ రాజ్యములోని సికిందరాబాదు చేరిరి.

అచ్చట తాత్కాలిక మఠమును గుదిరించుకొనిరి. అక్కడి ప్రజలు స్వామిని ఆహ్వానించి తగురీతి సన్మానించిరి. విశ్వబ్రహ్మణులు తండోప తండములుగ వచ్చి స్వామిని దర్శించి, బిక్షలకుదగిన ఏర్పాటు జేయుచుండిరి. ఒకనాడు సికందరాబాదు విశ్వబ్రహ్మణులందరు సభగావించి స్వామివారికి గొప్ప ఉత్సవము జేయ తీర్మానించుకొనిరి.

ఆ సంగతి విని పట్టణవాసులు గృహములను, నగరమును చక్కగ అలంకరించిరి. ప్రతి వీధికి రెండు ప్రక్కల పచ్చతోరణములు కట్టించిరి. గృహములకు వివిధ వర్ణముల కాగితముల మాలలతో అలంకరించి వీధులు చక్కగ శుభ్రము చేయించిరి. స్వామి వారికి పల్లకి గూర్చుండ నియమించి, నగర ప్రధానబాటలయందు ఉత్సవము చేసిరి.

ఒకనాడొక విశ్వబ్రహ్మణ పండితుడు స్వామి కడకరుగుదెంచి "స్వామి! నేనొక విషయము తెలిసికొనవలెనను బుద్ధి జనించుటచే మీకడకు వచ్చితిని. ఆ విషయమును వివరించి నా చిరకాల సంశయముల దీర్చవలెననగా స్వామి నాయనా! నీ కోరిక నెరుంగుదురు. నీవు "లక్ష్యత్రయముల" వివరములను తెలిసికొనదలచి వచ్చితివిగదాయన యతడు తన మనస్సులో దలచినదానిని నెట్లు దెలిసికొనెనని అచ్చెరు వందెను. అంతట స్వామి యా విశ్వబ్రాహ్మణుని జూచి నాయనా! ఇటు వచ్చి కూర్చుండుమనెను. అతడువచ్చి సమీపమున కూర్చుండగనే స్వామి, సిద్దా! నేను నీకు కందిమల్లయ్య పల్లె మఠమున నందొకనాడు లక్ష్యత్రయముల గూర్చి చెప్పితిని అది నీకు జ్ఞాపకమున్నదో లేదో తెలిసికొనవలెను ఏదీ ఆ వివరము నతనికి తెలుపుము చూచెదననెను. అంత సిద్దయ్య "లక్ష్యత్రయముల" గూర్చి చక్కగా ఉపన్యసించగా ఆ విశ్వబ్రాహ్మణుడు సంతసించి నిజగృహంబున కరిగెను.

## 2. బ్రహ్మం గారిని హైదరాబాదు నవాబు ఆహ్వానించుట

అంత మరునాడు విశ్వబ్రాహ్మణ పండితుడు హైదరాబాదునకేగి నవాబును దర్శించి 'సర్కార్! కందిమల్లయ్య పల్లె మఠాధిపతియగు వీరబ్రహ్మేంద్రస్వాములవారు సపరివార సమేతముగ సంచారము

బయలుదేరి ఇపుడు మన సికందరాబాదు వేంచేసిరి. అతడు పతితులకు జ్ఞానోపదేశ మొనరించి పావనులుగ చేయుచున్నాడు. అతడు భగవంతుని అవతారమని లోకము భావించుచున్నది. స్వామివారు మహత్మ్యం నెరింగి మహమ్మదీయుడగు సిద్దయ్య హిందూధర్మముల ననుసరించి, వారికి ముఖ్య శిష్యుడై యున్నాడు. నేను స్వామిగారిని నా సంశయముల తీర్పగోరగా నతడు తన శిష్యుడగు సిద్దయ్యతో నా సందేహములు తీర్పించెను. మనస్సున స్వామి వారి నగడదలచిన దానిని వారు ముందే దెలిసికొని నాకు తన శిష్యునిచే బోధింపజేసిరి. మీరు కూడ స్వామిని దర్శించుట మంచిది" అని చెప్పెను.

అపుడు నవాబు వీరబ్రహ్మేంద్రస్వామి వారిని జూచి యాతని మహత్మ్యమును దెలిసికొన గోరెను. తాను సికిందరాబాదుకు వెళ్ళుటకు బదులు శ్రీస్వామి వారిని హైదరాబాదుకాహ్వానించుట మంచిదని భావించెను. అతడు వెంటనే నగరమంతయు వివిధగతుల నలంకరింప ఉత్తర్వుల జేసెను. ఆహ్వాన పత్రమును తయారు జేయించి తన పండిత సభలో ప్రధాన పండితుని వెంట కొందఱు పెద్దమనుష్యులు బోయి స్వామివారిని హైదరాబాదుకు ఆహ్వానించి రండని చెప్పెను. రాజాజ్ఞ ననుసరించి పల్లకిని చక్కగా నలంకరించి సేవకులచే మేనాను మోయించుకొని సికిందరాబాదునకేగి స్వామివారిని దర్శించి నవాబు ఆహ్వాన పత్రికను సమర్పించిరి.

## 3. శ్రీ వీరబ్రహ్మం గారు హైదరాబాదుకు పోవుట

రాజపండితుడు హైదరాబాదు నుండి రాజభటులచే పల్లకిని మోయించుకొని సికిందరాబాదునకు వచ్చి చేరెను. అతడు స్వామివారి

సన్నిధికేగి వినయపూర్వకముగ నమస్కరించి నవాబుగారొసగిన ఆహ్వాన పత్రమును చదివి వినిపించి స్వామివారు చూపిన ఆసనముపై గూర్చుండెను.

అంతట స్వామి సిద్దా! మనము హైదరాబాదునకు బోవలసియున్నది. సర్వమును సిద్ధమొనరింపుడనగా, సిద్దయ్య స్వామి ఉత్తరవును పాలించి సిద్ధమొనరించితినని మనవి చేసెను. అంతట వీరబ్రహ్మముగారు నవాబు పంపిన డోలీలలో గూర్చుండగా తక్కినవారు పల్లకివెంట వీరబ్రహ్మేంద్రస్వామి వారికి జై! యనుచు జయనినాదము లొనరించుచు బోవుచుండిన పల్లకిముందు నవాబుచే పంపబడిన మంగళ వాయిద్యములును, విజయదుందుభులు మున్నగు వాయిద్యములు చెలరేగి, మెల్లగ పల్లకి సాగుచు హైదరాబాదు ప్రధాన ద్వారమును సమీపించెను.

స్వామివారు నగరద్వారమును సమీపించుచుండెనని తెలిసికొని నవాబు మంత్రి మున్నగువారితో గూడ ఎదురేగి, స్వామిని ప్రసూనమాలచే అలంకరించి రాజభవనమునకు పిలిచికొనిపోయి వారికొఱకు సిద్ధము చేయించిన వసతి గృహమున ప్రవేశపెట్టి, వారి పూజాదులకు కావలసిన సమస్తవస్తువులను తెప్పించి స్వామివారిని పరీక్షింపదలచి, దీపారాధనకు కావలసిన తైలమును పంపకుండెను.

## 4. శ్రీ వీరబ్రహ్మం గారు నీటితో దీపాన్ని వెలిగించుట

అంతట స్వామివారు స్నానమొనరించి మడివస్త్రముల ధరించి అనుష్టాన మొనరించి సిద్ధా! పూజకు సర్వము సిద్ధ పరచితివా యనెను లందుకు సిద్దయ్య గురుదేవా! నవాబు వారు దీపారాధన లేకుండ పూజలొనరింప గోరినట్లున్నదనెను అందుకు స్వామి “ఔను. అతను మనల పరీక్షింపదలచియే అటులొనరించెనని నే నెరుంగుదును.” అని రాజభటునితో

దీపారాధనకు గావలసిన నూనెను తీసికొని రమ్మనెను. ఆ భటుడేగి నవాబుగారిని దర్శించి, ప్రభూ స్వామివారు దీపారాధనకు గావలసిన నూనెదెమ్మని" పంపెను అని చెప్పగా అందుకు నవాబు సరియని ఒకమూత గల పాత్రనిండుగ జలమును నింపి యిచ్చి తీసుకొని పొమ్మనెను. ఆ సేవకుడు దానిని తీసుకొని పోయి పూజామందిరము ద్వారముకడనుండి తైలమును తెచ్చితిననెను.

అపుడు స్వామి, నాయనా! నీవు నవాబుగారి వద్దకు వెళ్ళి వారితో పూజ జరుగుచున్నది. తీర్థ ప్రసాదములు సేవించుటకు స్వామి మిమ్ము రాగోరెనని చెప్పుము" అనెను. ఆ సేవకుడు స్వామి మాటలను నవాబు వద్దకు వెళ్ళి ఆయనతో జెప్పగా, అతడు శుచియై బ్రహ్మంగారి పూజా మందిరముకడకు వచ్చెను. అతనిని చూచి స్వామి "రాజా! నీవు పంపిన నూనెపాత్రనందలి నూనెతో నీవే స్వయుగ దీపమును వెలిగింపవలెను. దీపము సెమ్మలో వత్తులను మాత్రము వేయించితి" ననెను.

ఆ మాటలువిని నవాబు తబ్బిబ్బులై బిక్క మొగము వైచి దిక్కుల జూచుచు జేతుల నలుపుచు తలవాల్చెను. అది చూచి స్వామి "నాయనా! ఎందులకు సంశయించెదవు ఇది పరీక్షా సమయము కదా, ఆలస్యముచేసిన పూజా సమయము మించును. ఆ నూనెతో నీవు దీపముల వెలిగింపుమనెను అంతట నవాబు చేయక తప్పదు కానిమ్మనీ తాను పంపిన పాత్రములోని నీళ్ళను దీపపు సెమ్మనిండుగ పోసి, అగ్గిపుల్లలు గీచి వత్తులను ముట్టించగా అతడాశ్చర్య పడునట్లె సాధారణ నూనె పోసిన దీపముకంటె ఎక్కువ కాంతితో ఆ దీపములు వెలుగుచుండెను.

అపుడు స్వామి “నాయనా! నీ పరీక్ష ముగిసినదా” అనెను. అపుడు నవాబు స్వామి పాదములకు నమస్కరించి, క్షమింపకోరి తన హృదయమును నిర్మల మొనరించుకొనుటకట్లు చేసితినని చెప్పెను అందుకు స్వామి తనలో నవ్వుకొని పూజను ముగించి నవాబు తీర్థప్రసాదముల నొసగి నాయనా! దీనిని అంతఃపురము నందలి నీ వారి కందరికిని యిమ్ము, నీవు భోజనానంతరము వచ్చినచో కాలజ్ఞానమును వివరించి నీ సంశయము లన్నింటిని దీర్చెద” ననెను.

## 5. బ్రహ్మం గారు నవాబునకు కాలజ్ఞానము బోధించుట

అంతట నవాబు భోజనమైనతోడనే కొంతసేపు విశ్రమించి ఫలహారమును గొని యొక సేవకునిబిలిచి ఓయీ! నీవేగి స్వామి యేమి చేయుచున్నారో చూడుము. వారు నిద్రించుచుండిన తొందరచేయక రమ్ము ఒకవేళ వారూరక గూర్చుండియుండిన ఆజ్ఞయైనచో నవాబుదర్శింప గోరుచున్నా” డని చెప్పుము ప్రత్యుత్తరమునకై కాచికొనియుండుడనెను. ఆ సేవకుడు స్వామి బసకు వెళ్ళి మరలివచ్చి ప్రభూ! స్వామివారు తన శిష్యుడగు సిద్దయ్యను కూర్చుండబెట్టుకొని మాటలాడుచుండగా నేనేగి సలా మొనరించి మీ పలుకుల మనవి చేసితిని. వారు మిమ్ము రాగోరుచున్నారని చెప్పెను అప్పుడు నవాబు పాదచారియైవచ్చి నేలకుదాకి మూడు సలాము లొనరించి నిలుచుండెను. అపుడు స్వామి రాజా! కూర్చుండుము కాలజ్ఞానములోని కొన్ని సంగతులను మాత్రమే వివరింతుననగా నవాబు పద్మాసనము వేసి కూర్చుండెను. స్వామి ఇట్లు చెప్పదొడంగెను. నీ దేశమున నీవారే అల్లరుల రేపి గోబ్రాహ్మణ స్త్రీ శిశు నరహత్యలను చేయుదురు. మత కలహములు ప్రబలును, అధికారులు

అన్యాయకార్యముల జేసి నీ రాజ్యమునంతమొందింతురు అని మరియనేక వింతలు జరుగుననియు వానినెల్ల మరియొక దినము బోధింతును. ఈ దినమింతటితో చాలించితి ననగా నవాబు లేచి సలామొనరించి తన అంతఃపురమునకు బోయెను.

## 6. సిద్ధయ్య గురుభక్తి

వీరబ్రహ్మస్వామి హైదరాబాదు మకామును వదలి మరలప్రధాన మఠమగు కందిమల్లయ్యపల్లెకు ప్రయాణమై పోదలచెను. అతని శిష్యులలో కొందఱు రహస్యముగ సమావేశమై స్వామిని గూర్చి ఇట్లనుకొనిరి. మన గురుదేవుడు భగవదవతారమని నమ్మి వచ్చితిమి. భగవదవతారమైనచో వారికి పక్షపాతబుద్ధియుండునా, సిద్ధయ్యతో గలిసి మనమాయన సేవజేయుచుంటిమి. మఠమున కార్యములన్నింటిని మనమే చూచుకొను చుంటిమి. కాని సిద్దయ్య ఊరక స్వామి కడ కూర్చుండియుండును. గురువు సిద్దయ్యను ప్రేమించునట్లు మనల జూచుటలేదు. అతనిని తన ప్రక్కన కూర్చుండబెట్టుకొని గౌరవించుచుండును. కనుక ఈ గురువును వదలుటయే మంచిది" అని తీర్మానించుకొనిరి.

ఆ సంగతి స్వామివారికి తెలిపిరి. ఆయన వారిని మందలించక తగిన పాఠము నేర్పదలచెను. హైదరాబాదు నుండి బయులుదేరి పోవునపుడు స్వామి దారిప్రక్కన ఒక చచ్చిక్రుళ్ళి పురుగులు పడిన కుక్కను పడియుండునట్లు చేసి యుండెను. అందరును ఆ చోటికి బోయినంతనే స్వామి సిద్దయ్యను తప్ప, తక్కిన శిష్యులజూచి, "శిష్యులారా! మీరందరూ నా ప్రియ శిష్యులుకదా నా ఆజ్ఞను జవదాటకున్నారు ఇపుడు నేను మిమ్ము

కోరిన పనిని చేయువారు నా ప్రియశిష్యులనిపించు కొందరు, తక్కినవారు కపటశిష్యులనబడుదురు. అదిగో చచ్చిన కుక్కను జూడుడు మీరు దానిని చుట్టు గూర్చుండి దాని మాంసమును తినవలెననెను.

శిష్యులామాటల విన ఒకరిమొగ మొకరుచూచుకొనుచు పలుకకుండిరి. ఒకడుకూడ ముందుకు రాడాయెను. అపుడు స్వామి సిద్ధయ్యను చూచి "సిద్దా! నా ప్రియశిష్యులు నామాటలు లక్ష్యపెట్టకుండిరి. నీవైన ఆ కుక్కమాంసమును తినుము" అనుచుండగనే సిద్ధయ్య చిత్తమని పోయి స్వామి నామమును స్మరించుచు కుక్కమాంసముసంతయుతిని మరల స్వామికడకు వచ్చెను. అపుడు గురువు ఆ శిష్యుల జూచి నాయనలారా! ఇపుడు మీరే నాకు సిద్ధయ్య ప్రియశిష్యుడో, మీరు ప్రియశిష్యులో నిర్ణయింపుడనెను. అందుకు వారందరు సిగ్గుచే తలవంచుకొని పలుకకుండిరి.

అపుడు స్వామివారు వారిని చేరబిలిచి నాయనలారా! మీ హాస్యపుటాలోచనలోని అర్థమేమి? మీరు నన్నునుమానించితిరి. సిద్ధయ్యపై అసూయతో నతని ద్వేషించుచుండిరి. తప్పులెన్నువారు తమతప్పు లెరుగరన్నట్లు మీరు సిద్ధయ్య గౌరవింపబడుటనుజూచి ఓర్వలేకుండుట కంటె, సిద్ధయ్య వంటి అచంచల గురుభక్తిమనయందున్నదాయని యోచింప పనిలేదా, సిద్ధయ్య గురుభక్తి విలువలేనిది, అతని భక్తికిని మీ భక్తికిని పోల్చిచూచిన మీది బూటకపు భక్తియని చెప్పకనే చెప్పినటులగుచుండలేదా. అట్టి మీవంటి శిష్యులు నామఠముననుండుట కంటె మీ గృహముల కేగుట మంచిది. ఇక మీదట ఇతరులను ద్వేషింపక, నా ధర్మోపదేశమును భక్తితోవిని సిద్ధయ్యను మించుటకు ప్రయత్నింపుడనెను.

# పండ్రెండవ ప్రకరణము

## 1. శ్రీ వీరబ్రహ్మం గారు మరల తన మఠమును చేరుట

హైదరాబాదును వదలిని వీరబ్రహ్మముగారు ఒక్కొక్క దినము ఒక్కొక్క గ్రామమున మజిలీచేయుచు అచ్చటిజనులకు నీతిమార్గము బోధించుచుండెను. ప్రతి గ్రామమునకు వారి ఉపన్యాసములు వినినంతనే అక్కడి జనులు స్వామివారి శిష్యులుగ మారిపోవుచుండిరి. ఆ రీతి ఉత్తరదేశమునందలి ప్రతి గ్రామములోను వారికి శిష్యు లేర్పడిరి. కొందరు తమ సంసారము వదలి బ్రహ్మముగారి శిష్యులై వారివెంట పోవుచుండిరి.

ఆరీతి ప్రయాణము సాగించుచు కుముద్వతీనది తీరమున నుండు "అల్లాటపల్లె" కు వచ్చి చేరిరి. అచ్చట సపరివార సమేతముగా కుందునదిలో స్నానమాచరించి, శ్రీ వీరభద్రస్వామిని దర్శించి కొన్ని దినములుండి తర్వాత కందిమల్లయ్యపల్లె జేరిరి.

## 2. సిద్ధయ్యకు పునర్జన్మ జన్మరాహిత్యముల వివరించుట

కందిమల్లయ్యపల్లె జేరిన పిదప ఒకనాడు స్వామి సిద్ధయ్యను పిలిచి నాయనా! ఈ దినమున నీకు పునర్జన్మ జన్మ రాహిత్యములగూర్చి వివరింతును శ్రద్ధతో వినుమని చెప్ప సాగెను.

సిద్దా! జీవకోటిలో మానవజన్మముత్తమమైనది. మానవులలో పాపాత్ములు పుణ్యాత్ములునని రెండు తెగలవారున్నారు.

అట్టి పాపాత్ములకు మాత్రమే పునర్జన్మకలదు. అనగా పాపమొనర్చిన మానవులు మరల మానవులై జన్మింతురని భ్రమింపవలదు.

మానవులై తామొనరించిన పాపకార్యముల ఫలితముగా నరకమునకు పోయి నరకబాధల ననుభవించి భూమిపై మరల నీచ యోనులయందు జన్మించి, కష్టములకు గురియై యుందురు. అట్టివారు, జీవాంకురముగల విత్తుమొలచి చెట్టై మ్రానై పడిపోయి మరల తన విత్తునుండి మొలచునట్లు పాపాత్ముడు సదాపుట్టుచు గిట్టుచుండును దీనినే పునర్జన్మయందురు.

పుణ్యపురుషులు సదా జన్మరాహిత్యము అభిలషించుచు భగవంతుని చింతనలో తమ జీవితమును గడపి దేహమును వదలినచో, మోక్షమున కేగుదురు. అట్టివారు మరల మానవయోనిన జన్మింపరు. అట్టి మోక్షసాధనకు యోగాభ్యాసమవసరము. ఆ యోగాభ్యాసమునకు కొన్ని పద్ధతులు గలవు. ఆ పద్ధతులనే యోగాసనములందురు. వాటిలో ముఖ్యమైనవి పద్మాసనము, సిద్ధాసనము, వజ్రాసనము, సర్వాంగాసనము, శీర్షాసనము.

నాయనా సిద్దా! ఇట్టి యోగసనములింకను చాలా గలవు. ఇప్పుడు నీకెఱింగించినవి ముఖ్యమైనవి. మఱియొక దినము వానిని వివరించెదను. రేపటినుండి నీవు నాతో గూడ నీవా యాసనముల జేయుచుండుము. ఇప్పటికి చాలప్రొద్దుపోయినది. నీగదికేగి విశ్రాంతి గొనుమనగనే సిద్దయ్య గురుదేవుని పాదము కన్నుల కద్దుకొని నమస్కరించి తన గది జేరెను.

# పదమూడవ ప్రకరణము

## 1. బ్రహ్మంగారు దక్షిణ ఆంధ్రదేశమున సంచారం చేయుట

ఉత్తరాంధ్ర దేశమున సంచరించు కందిమల్లయ్యపల్లెజేరిన కొన్నిదినములకు వీరబ్రహ్మస్వామికి దక్షిణాంధ్ర దేశమున సంచార మొనరింపవలెనని తలంపుకలిగెను. అతడొక దినము సిద్దయ్యతో నాయనా!

నాకు మరల దేశసంచారము వెడలు బుద్ధిపుట్టినది. ఈసారి దక్షిణాంధ్ర దేశమున పర్యటించి, త్వరగా తిరిగి వత్తము ప్రయాణమునకు సర్వము సిద్ధము చేయింపుమనెను.

గురువు ఆనతి ప్రకారము సిద్ధయ్య అన్నియు సిద్ధము చేసెను. ఒక శుభదినమున వీరబ్రహ్మము సపరివార సమేతముగ కందిమల్లయ్యపల్లెను వదలి గిద్దలూరు, కంబము మున్నగు గ్రామములో వేదాంతోపన్యాసముల నొసంగి కాలజ్ఞానమును దెలిపి మహానందికి పోవుచుండగా దిగువ మెట్టయను గ్రామమువచ్చెను. అది వేసవికాలమగుటచే అచ్చటికి వచ్చునప్పటికి స్వామివారికి దప్పిక ఎక్కువయ్యెను. సిద్ధయ్యతో ఇచ్చట త్రాగుటకు నీళ్ళు లభించునేమో చూడుమనెను.

## ౨. శ్రీ వీరబ్రహ్మం గారు మూసలోని ద్రవ్యాన్ని త్రాగుట

అపుడు సిద్ధయ్యతో దిగువ మెట్టలో విశ్వబ్రాహ్మణలుండిరాయని విచారించెను. ఒక యిల్లు మాత్రమున్నదని చెప్పిరి. ఆ యింటికి వెళ్ళి అక్కడ కొలిమిలో పెద్ద మూసయందు ఇనుమును కరిగించుచున్న విశ్వబ్రహ్మణుని జూచి“అయ్యా! మాస్వామిగారి కెక్కుడు దాహమగుచున్నది. అతడు మీ కులమువాడే కనక ఒక పాత్రలో నీళ్ళ నిమ్మని అడిగెను. అందుకతడు తాను జేయుపనిని వదలి పోజాలక, మాయింట నీట నొసగువా రెవరునులేరు. పొమ్ము” అని పలికెను. అందుకు సిద్ధయ్య అయ్యా! ఇల్లు యిదియే కదా దాహమడిగినవారికి నీళ్ళనిచ్చిన పుణ్యమేకాని పాపము కాదుకదా సద్గురువునకు దాహము తీర్చలేవా యనెను.

అందుకు కమ్మరి మాఇంట నీళ్ళులేవు కావలసిన యీ మూసనిండుగ కరిగిన లోహద్రావకమున్నది, అతడు జగద్గురువుకదా

అటులైన యీ కాగెడి యినుపద్రవమును త్రాగుమను మనెను. ఆ మాటలు బ్రహ్మంగారికి వినబడెను. ఆయన వెంటనేవచ్చి కొలిమిలోని మూసను దీసికొని లోహద్రావకము గుటగుట త్రాగి "అయ్యా! ఇది చాలదు. మీ యింటనుండిన యినుమునంతయు కరిగించి యిచ్చినగాని నా దాహము తీర"దనెను.

అది చూచిన కమ్మరి గడగడ వణకుచు స్వామి పాదముల మీద తలనుంచి "స్వామీ! క్షమింపుడు అజ్ఞానమున మీ కపచార మొనరించితిని నన్ను మీ శిష్యునిగా నెంచి క్షమింపుడు" అని ఆ దినము స్వామిని ఆ ఊరిలో నిలిపి భిక్షచేయించెను. స్వామినిపూజించి సపరివారసమేతముగా సత్కరించి, తనకు తగిన మంత్రోపదేశ మొనరించి శిష్యునిగా జేసుకొనమని ప్రార్థించెను. అందుకు స్వామి నాయనా! ఇపుడు సమయముకాదు మేము రాత్రిగుడిలో బసచేయుదుము. నీవు అక్కడికి వచ్చినచో నీకును తదితరులకును సాంఖ్య యోగమును బోధించెదననెను. ఆ విశ్వబ్రాహ్మణుడు స్వామి గారికి అతని పరివారమునకు రాత్రి విందు చేయించి, వారి ఉపదేశములను వినెను.

## 3. కక్కయ్య భార్య గర్భమును చీల్చుట

స్వాములవారు ఆనాటిరాత్రి సిద్దయ్య మున్నగువారికి దెలిపినసాంఖ్య యోగరహస్యములను గోడప్రక్క నిలిచిన కక్కయ్య అను ఒకడు విని "ఔరా! మన దేహములోని అధిదేవతలున్నారని స్వామి చెప్పుచుండెను. అది నిజమేయైయుండును కరిగిన ఇనుమును గుటగుట త్రాగిన మహానుభావుడు అబద్ధములజెప్పుడు కనుక స్వామి మాటలలోని నిజానిజములు తెలిసి కొనవలెను, ఈ ప్రయోగమును నాభార్యయందే చేసి చూచెదనని పోయెను.

కక్కయ్య ఇంటికేగునప్పటికి రాత్రి సుమారు పది గంటలుదాటెను అప్పటి అతని భార్య గాఢనిద్రలోనుండెను. అపుడతడు తగిన సమయమిదేనని తోలును కోసెడి కత్తిని గొని తన భర్య గర్భమును ఛేదించి హృదయ భాగమున నుండు అధిదేవతలను జూడదలచి, రెండు చేతులతో చర్మమును చీల్చి చూచెను అతనికి రక్తము మాంసముతప్ప తదితర మేమియు కనబడక పోయెను.

అపుడతడు "అకటా! బూటకపు స్వామి మాటలను నమ్మి ఆఖరకు నాభార్యను చంపితిని నాభార్య హృదయమున ఒక్క దేవుడు కూడ కనబడుట లేదు అకటా! దేవతలు కనబడక పోయిరి. భార్యమరణించెను. స్త్రీ హత్యాపాతకము నన్ను నరకకూపమున పడద్రోయకపోదు" అని పరిపరి విధంబుల దుఃఖించుచుండెను.

## 4. శ్రీ వీరబ్రహ్మం గారు కక్కయ్య భార్యను బ్రతికించుట

కక్కయ్య యింటిలో గోడుగోడున దుఃఖించుచుండ చుట్టుప్రక్కల వారు విని గుంపులుజేరి జరిగిన సంగతి దెలిసికొని పోయి గుడిలోనుండు స్వామివారికి తెలిపిరి. అపుడు స్వామి తనలో "ఔరా! కక్కయ్య మూఢభక్తి నేమనవలయును నామాటలనమ్మి భార్యను చంపుకొన్నాడు" అని వచ్చిన వారివెంట పోవుచూ సిద్ధయ్యను మాత్రము రమ్మనెను.

స్వామి సిద్ధయ్యతోగూడ కక్కయ్య ఇంటికి వెళ్ళెను. అతడు లోపలికి పోవునప్పటికి కక్కయ్య భార్య పీనుగ మీద బడి అకటా! కపట సన్యాసుల బోధలనువిని నిన్ను చంపితి నాకేల ఈ దుర్బుద్ధిటపుట్టెను నీ హృదయము నందొక దేవుడు కూడ కనంబడకుండెను ఎవరినితిట్టి యేమి ప్రయోజనము?

నాబుద్ధి గడ్డితిని నిన్ను చంపితిని నంతియే కాని వేరుకాదు” అని పరిపరి విధములవాపోవుచు తలగొట్టుకొనుచుండెను. అపుడు కక్కయ్యా! భయపడకుము అని స్వాములవారు అభయమిచ్చెను.

ఆ శబ్దమును విని కక్కయ్య తిరిగి చూచి లేచి “అయ్యా! నీవుగుడిలో జెప్పుచుండిన మాటలనమ్మి నాభార్య గర్భమును జీల్చి నీవు చెప్పిన అధిదేవతలను చూడదలచితిని. ఒక్క దేవుడుకూడ కనబడలేదు. నీవు వట్టి అబద్ధాల కోరువుగనున్నావు. ఇపుడు నాగతియేమి?” అని కోపముతో మాట్లాడెను.

వీరబ్రహ్మము కక్కయ్యను చూచి నాయనా! నీభార్య హృదయమున దేవతల జూడగోరి ఆమె గర్భమున చీల్చితివి కదా తొందరపడవలదు. నీకు దేవతలను జూపింతు” నని సిద్దయ్యను వెలుపలికి పొమ్మని తలుపు మూసి కక్కయ్యపై కమండలములోని జలమును ప్రోక్షించెను. అపుడతనికి జ్ఞానదృష్టి కలిగెను. అపుడు స్వామి, కక్కయ్య భార్య హృదయమున ఏ భాగమున ఏ అధిదేవతయుండు నది చెప్పి ఆ దేవతలను చూపి దేవతలు కనబడుచుండ లేదా యనియడిగెను. అందుకతడు “స్వామి కనబడుచున్నారు” అనునంతలో మరల నతనిపై జలమును జల్లె. అపుడతనికి జ్ఞానదృష్టిపోయి ఎప్పటివలెనుండెను.

అపుడు కక్కయ్య స్వామీ! మీరు నిజముగ భగవదవతారమే మిమ్ముగన్న దేవుని జూడనక్కర లేదు. అకటా ఇపుడు నాకీ స్త్రీహత్యాపాపము పోవుటెట్లు? నాకు దీనివలన నరకము తప్పదుకదా యనెను అపుడు స్వామీ కక్కయ్య! నీ భార్యపై నిండుగ గుడ్డను కప్పుమనెను. అతడు వెంటనే గుడ్డను కప్పెను అపుడు స్వామి మరల తన కమండలములోని జలము

ఆమెపై ప్రోక్షించి కక్కయ్యా! రమ్ము” అని వెలుపలకి బిలుచుకొనిపోయి తలుపును మూసెను,

ఇరువురును బయటికి తక్కినవారితో మాట్లాడుచుండగా తెల్లవారెను కక్కయ్య భార్య “అయ్యా! తెల్లవారినదే ఇంతసేపు నిద్రించితిని, నాభర్త కోపగించునేమో” అని తలుపును తెరచుకొనివచ్చెను. కక్కయ్య బ్రతికివచ్చిన భార్యను గాంచి మరల స్వామిని స్తుతించెను. ఈ చిత్రమును చూచి అందరును ఆశ్చర్యపడి స్వామి దేవుడే సుమాయనుకొనుచు పోయిరి.

# పదునాల్గవ ప్రకరణము

## 1. శ్రీ వీరబ్రహ్మం గారు అవతారమును చాలింపదలచుట

వీరబ్రహ్మేంద్రస్వామి, కందిమల్లయ్యపల్లె జేరిన తర్వాత తన అవతారమును చాలింప తీర్మానించుకొనెను. అపుడు తన పుత్రులలో జ్యేష్టుడగు గోవిందయ్యను రమ్మని “నాయనా నేను త్వరలో నా అవతారమును చాలించెదను. ఆవల నాస్థానమును నీ వాక్రమించి పీఠాధిపత్యమును వహింపవలెను. నావలెనే నీవును జనులకు తత్త్వోపదేశమొనరించు చుండుము. నాయనా! నీకు పురుషార్థముల వివరింతుము వినుము. సత్యాసత్యముల దెలిసికొని పరోపకార చింతనము కలిగియుండుట సహజ మనబడును. న్యాయమార్గానువర్తియై ధనమునార్జించు, ఆశ్రమ దీక్షను వహించి క్షమయను దానిని గలిగియుండిన పురుషార్థముల బడయనగును.

త్రిగుణ సమన్వితయగు ప్రకృతికి లోబడని సుజ్ఞానముచే గలిగిన ప్రజ్ఞతో భూతభవిష్యద్వర్తమానకాలవిషయములదెలిసికొని వర్తించువాడు పరమేశ్వరాంత సంభూతుడనబడును.

నాయనా! పరబ్రహ్మకు స్త్రీ పురుష భేదము లుండవు. ఆ పరబ్రహ్మ లోకసంరక్షణార్థమై మూర్తిత్రయ రూపములు పొందును. ఆ మూర్తిత్రయమే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. మూర్తిత్రయమునకు భేధమేమన మూర్తిత్రయము ప్రకృతితో గూడినది, పరమాత్మ ప్రకృతితో సంబంధము లేనిది. ఒక దేవాలయమున ఉత్సవ సమయములలో ఉత్సవ విగ్రహమును నూరేగింతురు. ఆ మూల విగ్రహమునకు ఉత్సవ విగ్రహములకును రూపము భిన్నమైయుండును అట్లుండినను మూలవిగ్రహమునకు ఉత్సవ మొనరింపక, వేరురూపమునను౦డు ఉత్సవ విగ్రహములకు ఉత్సవమొనరించుటకు గారణము మూలవిగ్రహమునకును ఉత్సవ విగ్రహములకును రూపభేదముతప్ప, భాన భేదములేదనియే, అట్లనే త్రిమూర్తులకును పరమాత్మకును భేదములుండవు.

కుమారా! నీ కింతకుముందే విజ్ఞాన మార్గోపదేశము గావించితిని గదా, నాయనా! కొన్ని దినములలో పరమేశ్వరియే నీకు కుమార్తెయై జన్మించును. ఆమె శక్తి స్వరూపురాలు ఆమెయు రాబోవు విషయములు తెలిసికొని, మానవులకు తత్త్వోపదేశంబొనరించి మిక్కిలి తేజస్సుతో ప్రకాశింపగలదు. తండ్రీ! నా అవతారము సమాప్త మొందించుటకుదగిన సమాధిని నిర్మింప మొదలిడుము పొమ్మని” తానుజప మొనరించుకొన లోపలికేగెను.

## ౨. సిద్ధయ్యను గ్రామాంతరం పంపుట

ఒకనాటి రాత్రి స్వాములవారు భార్య గోవిందమాంబను పిలిచి దేవీ! నీకు కొన్ని రహస్యములు దెలుపవలసియున్నది. నేను వచ్చెడి వైశాఖ శుద్ధ దశమి, భానువారము మధ్యాహ్నమున జీవసమాధి అగుదును.

నేను కడపటి సారిగా సిద్ధయ్యను పరీక్షించి వాని శక్తి సాటిలేదని లోకముగుర్తించునటుల చేయదలచినాను. ఆ దినమున సిద్ధయ్యను కందిమల్లయ్యపల్లెలో లేకుండ జేయవలెను. అతనితో నీవు బనగానపల్లెకు పోయి పువ్వుల దెమ్మంటినని చెప్పి పంపవలెను. ఇది పరమరహస్యము సుమా! అనెను. అందుకు గోవిందమ్మ అటులనేనని చెప్పెను.

అంత గోవిందమ్మ వైశాఖ శుద్ద నవమి నాటి రాత్రి సిద్దయ్యను పిలిచి నాయనా! రేపు మధ్యాహ్నమున స్వామివారు అవతారమును చాలింతురట. ఆవేళకు నిన్ను బనగానపల్లెకు పోయి పూజాద్రవ్యముల గొనిరమ్మనిరి. వేకువజాముననె ప్రయాణమై పొమ్మనెను అందుకు సిద్దయ్య యేమియు యోచింపకనే తల్లి, నా గురువు నానతి నెరవేర్తును అని వెళ్ళి విశ్రమించెను.

సిద్దయ్య పరుండెను గాని నిద్రపట్టలేదు. కడుపటిసారి గురుదేవుపదముల నర్చించుచు పువ్వులదెచ్చెడి భాగ్యముతన కబ్బెనని అపరిమితానందముతో నుబ్బిపోయెను. కడకతదు నిద్రపట్టక తనకాలమును కందిమల్లయ్యపల్లెలో గడుపుట కంటె బనగానపల్లెకు ప్రయాణమైపోయిన పువ్వుల గొనిముందే రావచ్చునని అనుకొనెను. గురుదేవుని యాజ్ఞగైకొనిపోవుదమని వీరబ్రహ్మము నిద్రించు గదికి వెళ్ళిచూచెను. అతడు నిద్రించుచుండ నిద్రాభంగ మొనరింపరాదని వారి పాదములకు నమస్కరించి ప్రయాణమై పోయెను.

## 3. శ్రీ వీరబ్రహ్మం గారు జీవసమాధి యగుట

సిద్దయ్య మరునాడనగా వైశాఖశుద్ధ దశమినాడు బనగానపల్లెకు పువ్వుల తెచ్చుటకు పోయినదే, బ్రహ్మంగారు గోవిందమాంబను,

గోవిందయ్యను పిలిచి "నేను నాప్రియ శిష్యుడగు సిద్దయ్య రాకముందే సమాధి జేరవలెను పాపము నా సిద్దడును నేను సమాధియగునపుడు దగ్గర లేకుండాచేసితిని. అదియు వాని మేలుకొరకే చేసితిని. అతనికీర్తి ఆ చంద్రతారార్కముగా నిలుచుగాత, నేను సమాధియైన గొంతసేపటికి సిద్దనివలన మీరొక విచిత్ర విషయము తెలియగల" దనెను.

ఆవల గోవిందాచారిని పిలిచి నాయనా ! నేను సమాధియైనను మీ తల్లితో పసుపు కుంకుమ తీయవలదనియు, కాళ్ళమట్టెలు గాజులు ఆమెను ధరించియే యుండుమని చెప్పుము ఆమెను యిప్పటివలెనె పూజ్యురాలుగ చూడవలెను. ఈ విషయమును గూర్చి ఎవరైన ఆమె నాక్షేపించినచో వారు నాశనమగుదురు. ఇది సత్యము.

నా మఠమునందు సూర్యచంద్రాదులుండునంత వఱకు పూజలు జరుగుచునే యుండును. ఈవిషయమై అనుమానపడవలసిన పనిలేదు. అంత కొంత కాలమునకు నా వంశము నిలిచిపోవును. కాని సహోదరియగు వీరనారాయణమ్మ సంతతి యుందురు.

నాయనా! గోవిందయ్యా! నీకు ఈశ్వరమ్మ, పార్వతమ్మ, శంకరమ్మ గోవిందమ్మ మరియు గిరిరాజమ్మయని, ఐదుగురు కుమార్తెలు జన్మింతురు. ఆ కుమార్తెలలో జ్యేష్టురాలగు ఈశ్వరమ్మ మీకొఱతలన్నిటి తీర్చగలదు. ఇక నేను చెప్పవలసిన దేదియులేదు. నాసమాధిలో పెద్ద అఖండమునిండుగ తైలమును బోసి దిట్టమగు వత్తిని తడిపి వెగించుడు సమాధి యగుటకు ముహూర్తము సమీపించుచున్నదనెను.

అపుడు గోవిందయ్యా తండ్రీ ! మీచేతి వెండి బెత్తమును ముద్దుటుంగరమును, యోగదండము, కమండలము పాదుకలను నేను

తీసికొని ఉపయోగించవచ్చునా యనెను. అందుకు స్వామివారు నాయనా! అవి సిద్ధయ్యసొమ్ము. అతడు తప్ప వానిని నుపయోగించుట కితరులనర్హులు పాపమువాడు పండ్రెండు సంవత్సరములు నా పాదసేవ చేసినందులకు నేనేమియు జేయకపోతిని, అందులకే వీనిని వానికని ప్రత్యేకించితిని. అతడు వచ్చినతోడనే వానికిండు. అపుడే ముహూర్తం సమీపించెను. ఇదిగో నేను సమాధిలో గూర్చుంటినిదీపమును వెలిగించి మూతను బిగింపుడని కలియుగము 4694 సరియగు శ్రీ.శ. 1594 వైశాఖ దశమి భానువారము నాడు శ్రీ వీరబ్రహ్మం గారు తన అవతారము చాలించిరి.

## 4. బ్రహ్మం గారు సిద్ధయ్యను బనగానపల్లెకు పోకుండ జేయుట

వీరబ్రహ్మేంద్రస్వామి తాను జీవసమాధి కాబోవు సమయమునకు సిద్ధయ్యను తనకడ నుండకుండ జేయదలచి సుమారు 8 గంటలలో ఆరు ఆమడలదూరముండిన బనగానపల్లెకు పోయి పూజకు పుష్పములదెమ్మని గోవిందమ్మతో చెప్పించెను. గురుదేవుని ఆజ్ఞయన్న అగ్నిగుండమునైన జొచ్చుటకు వెనుదీయని సిద్ధయ్య, యెనిమిది గంటలలో నూరామడ దూరము వెళ్ళి స్వామి సమాధిజేరు ముహూర్తమునకురాగలనాయను యోచనచేయక గాలి వేగమున పోవుచుండెను. అతడు ఉదయము ఎనిమిది గంటలగునప్పటికి సుమారు పదిమైళ్ళు నడువగలిగెను. ఇంకను యేబదిమైళ్ళు నడచినగాని బనగానపల్లె చేరలేడు. అక్కడ పువ్వుల గోసికొని బయలుదేరినచో మరల నలువది మైళ్ళు నడచినగాని కందిమల్లయ్యపల్లె జేర లేడు. అందుకు వీరబ్రహ్మంగారు తన శిష్యుడూరక కష్టపడకూడదని భావించి అతని బనగానపల్లె బోకుండ జేయుటయే మంచిదని తానొక ఋషి రూపమున సిద్ధయ్యపోవు దారికడ్డముగవచ్చి, “నాయనా!” బనగానపల్లె

పోయి వచ్చుటకు నూట యిరువది మైళ్ళు గదా! నీ వింకను పదిమైళ్ళు పూర్తిచేయలేదు. నీ గురువు సమాధియగు మహూర్తమునకు అంతదూరము పోయి రాజాలవు, నీకిక నాలుగైదు గంటలే వ్యవధియున్నది నేనొక మాట చెప్పెదను, వినుము. నీవు నీగురు దేవుని నమ్మినవాడనైనచో ఈ అడివిలో ముండ్లు లేని ఆకులు మూడు పిడికెళ్ళు గోసికొని మూటగట్టి గొనిపోయిన అవి కందిమల్లయ్యపల్లె జేరునప్పటికి నీ గురువు కోరిన పుష్పములుగ మారలేవా" అని చెప్పి అదృశ్యుడయ్యెను.

ఒక చేత బెత్తమును రెండు చంకలో తాటియాకుల గ్రంథమును గలిగి అదృశ్యుడైపోయిన ఋషి పుంగవుడెవరై యుండునాయని యోచించి, గురుదేవుడే ఆవిధముగ వచ్చి యుండునని తలచి బనగానపల్లెకు పోవుట మాని, అడవిలో ముండ్లులేని ఆకులను మూడు పిడికెళ్ళు కోసి మూటగట్టి శరవేగమున కందిమల్లయ్యపల్లె జేరుటకై నడచుచుండెను.

అతడు కొంతదూర మేగునప్పటికే ఎండ యెక్కవయ్యెను. ఆ దారిప్రక్కన ఒక బావి కనబడగా, సిద్దయ్య మూటను బావిగట్టున పెట్టి బావిలో స్నానముచేసి గురుదేవుని నామజపమొనరించి గట్టును జేరులోపల మూటలో నుండి సుగంధ వాయువు వచ్చెను. అతడు ఆశ్చర్యముతో మూటను విప్పి చూడగా, ఆ మూటలో నానావర్ణపుష్పములు సుగంధ వాయువులను వెదజల్లుచుండెను. సిద్దయ్య "ఔరా! ఆఋషి పుంగవుని వాక్యములు ఫలించెను" అని దానిని తీసుకొని బయలుదేర నుండగా, ఉన్నటులుండి అతనిదగ్గఱకొక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చెను.

సిద్దయ్య ఆ బ్రాహ్మణుని చూచి "స్వామీ! మీరెచ్చట నుండి వచ్చితిరి. ఎట కేగు చుంటిరి" అని ప్రశ్నించెను. ఆ బ్రాహ్మణుడు నాయనా!

నేను కందిమల్లయ్యపల్లెలో పరిసర గ్రామాలలో భిక్షకై పోయి యుంటిని. అంతలో కందిమల్లయ్యపల్లెలో వీరబ్రహ్మముగారు జీవసమాధియగుదురని విని యచటకేగి, వారు సమాధియగుట జూచివచ్చితిని" అనుచుండ సిద్దయ్య "హా గురుదేవా!" అని అరచి మూర్ఛిల్లి లేచి చూచునప్పటికి కా భూసురుండును లేకుండెను.

## 5.సిద్దయ్య కందిమల్లయ్యపల్లెకు తిరిగి వచ్చుట

ఔరా! నా గురుదేవుడు బ్రాహ్మణ రూపమున వచ్చి వెళ్ళెను. అతని లీలలసంఖ్యాకములు. నే నాలస్యము చేయరాదు. నా గురుదేవుడు నిజముగ సమాధియై యుండినచో నీ పూలమాలచే సమాధినైన పూజింపగలనని పువ్వుల మూటతో బరుగిడుచు బోయి కందిమల్లయ్యపల్లె జేరి మఠసింహద్వారమును సమీపించెను.

ఆ సింహద్వారము బంధించబడి యుండెను. అపుడు సిద్దయ్య బిగ్గరగా తలుపు తట్టినంతనే ఒక పరిచారకుడువచ్చి "అన్నా! గురువుగారు జీవసమాధియైరి అమ్మగారు నిన్ను లోపలకు రానీయవలదని ఆజ్ఞచేసిరి. ఇక నీవు నీ గ్రామమునకు పోవచ్చును అమ్మగారి ఆజ్ఞ గురువాజ్ఞగా భావించుట మన ధర్మమని" తలుపులు బంధించెను.

అపుడు సిద్దయ్య " హా గురుదేవా! నీవు భూగర్బ గృహమును చేరినప్పటినుండియు నన్ను పలుకరించువారు లేకపోయిరే, నాగతి ఇంతయేనా? నన్ను అధోగతి పాలుగావించుటకు నేనే అపరాధము గావింపలేదే, కడకు సమాధిని దర్శించుటకును నేదెచ్చిన పుష్పములచే పూజించుటకు కూడా వీలులేకుండ జేసితివే, నీవు కనుమరుగై నంతనే నాకిట్టి దురవస్థగలుగునని ఎన్నడును దలపనైతిని. అకటా! నాతల్లి

గోవిందమ్మకు నాపై యింత కనికరము లేకుండ బోవుటకు గారణమేమి? ఒకప్రక్క తండ్రిదూరమైనందులకు దుఃఖించుచుండ, రెండవ ప్రక్క తల్లియుదూరమగుచున్నది. తల్లిదండ్రులకు దూరమై నే బ్రతుకనేల?

అని పరిపరివిధముల యోచించి సిద్దయ్య ప్రాణముల వదులుటకు తీర్మానించుకొని అందున్న ఱాతిగుండునకు తలమోదుటకు ప్రయత్నించి అంతలో "ఛీ! నేనెంత అవివేకిని ఇది ఆత్మహత్యయగును కదా పిరికి పందలు ఆత్మహత్యకు గడంగవలెనేకాని, నాబోటివారికి తగదు నాగురువును కలిసికొనుమార్గము నాగురువే దెలిపియుండెను. అదియే మంచిదని సింహద్వార నెదుట పద్మాసనము వేసి కూర్చుండి పంచప్రాణముల బంధించి, మనోమారుతంబుల నొకటిజేసి షడాధారము భేదించి, సహస్రారమున నిల్పి కుంభకమున పరబ్రహ్మములో జేరుటకు నిర్ణయించెను. అతడు ఉచ్వాస నిశ్వాసముల బంధించి కూర్చుండిన సంగతి గోవిందమ్మకు అక్కడి శిష్యులు దెలిపిరి.

## గోవిందమ్మ సిద్దయ్యకు సమాధిని చూచుటకు అనుమతినిచ్చుట

సిద్దయ్య పరబ్రహ్మలో ఐక్యమగుటకు దప మొనరించుచుండెనని విన్నంతనె గోవిందమ్మ పరుగిడివచ్చి సింహద్వారమును దెరచి "నాయనా! సిద్ధా! నీ ఘోరతపమును జాలింపుము నీ గురుదేవుని సమాధిని పూజింప బొమ్ము నీ ఆత్మశుద్ధి పరీక్షింపగోరి ఇట్లు చేసితినే కాని, లేకున్న నీకిందు ప్రవేశ మొసంగకుందునా, నిన్ను అడ్డగించునంతటి వారెవ్వరును లేరు. నీ గురుదేవుడు కడపటివరకు నీ రాకకై వేచియుండెను. అంతలో సమాధియగు లగ్నమువచ్చుటచే నిక ప్రయోజనము లేదని సమాధిలో కూర్చుండెను. పొమ్ము నీవు తెచ్చిన పువ్వులచే సమాధిని పూజించిరమ్మనెను.

అపుడు సిద్దయ్య నిదురనుండి మేల్కొన్నవాని చందముగ గనుల దెరచిచూచి "తల్లీ! లోకమాతా! నీకుమారునిపై దయకలిగెనా" యని పాదములపై బడెను. అపుడు గోవిందమ్మ సిద్దా! ఏల ఆలస్యము చేసెదవు. త్వరగా లోపలికి వెళ్ళి సమాధిని పూజింపబొమ్మనగా సిద్దయ్య లేచి పుష్పముల మూటను దీసికొని లోపలికి వెళ్ళెను.

## 6. వీరబ్రహ్మం గారు సిద్దయ్యకు దర్శన మొసగుట

సిద్దయ్య సింహద్వారమునుదాటి సమాధి గృహమునకు పరుగిడి పువ్వులను సమాధిపై జల్లి సాగిలబడి "గురుదేవా నేజేసిన నేరమేమి నాకు కడసారి దర్శన మీయకుండ బనగానపల్లె కేగు కారణమును జూపి నేను వచ్చు లోపలనె నీ అవతారమును మరుగుపరచితివే కడపటకొక మాటయైనను జెప్పకపోతివే, ఇక నేనేమి చేయవలెనో నాకు దెలియకున్నది కదా. ఈ అంధకారమును బడియుండుటకంటె నీ యాత్మలో నాయాత్మను లయంబొనరించెదగాక యని పంచప్రాణముల బిగించి గురుదేవునిలో ఐక్యము కాగోరెను.

అపుడు సిద్దా! ఆ ప్రయత్నమునుండి విరమించుకొనుము సమాధిపై బిగించిన మూతను తెరువుము అను శబ్దము వినంబడెను. అపుడు సిద్దయ్య లేచి ఇది గురుదేవుని కంఠస్వరమువలె నున్నది. ఆ మహానుభావుడు నాకు దర్శన మిచ్చునేమో చూచెదగాక యని సమాధి మూతనూడదీయగా వీరబ్రహ్మముగారు బయటకి వచ్చి సిద్దా! నీకు బ్రహ్మోపదేశ మొనరించితిని. అయినను నీవీ మాయాప్రపంచమును దాటలేకున్నావు. ఈ ప్రాపంచిక సుఖదుఃఖములను మరచిపొమ్ము మీ తల్లి! గోవిందమ్మకును, నీ సోదరుడగు గోవిందయ్యకును చెప్పవలసిన

విషయములన్నిటిని చెప్పియేయున్నాను. ఇక నీకు క్రొత్తగా చెప్పవలసిన దేమియు లేదు. ఇదిగో కడపటిసారిగా నీకు దివ్యదృష్టి నొసంగితిని నా విశ్వరూప సందర్శన మొనరించుకొను మన సిద్దయ్య "రమా రమణా! ఆధిమధ్యాంత రహితా! నీ హృదయ కమలమును సర్వ ప్రపంచమును గనుచుంటిని. ఇక మీరూపము నుపసంహరించుకొనుము. నేను ధన్యుడనైతిని" అనునంతలో విశ్వరూపమును చాలించి "నాయనా! ఇదిగో నా వెండిబెత్తము శిఖాముద్రిక, యోగదండము, పాదుకలను తీసికొని పొమ్ము అనుచుండ సిద్దయ్య స్వామి పాదములపై శిరమును మోపి నమస్కరించి సిద్దా! నీ కోరికలు నెరవేరుగాక, సుపుత్ర ప్రాప్తియగుగాక" అని దీవించి సమాధిలో గూర్చుండగా సిద్ధయ్య సమాధిమూతను బిగించి బయటికి వచ్చెను.

## 7. సిద్దయ్య ముడుమాల చేరుట

సిద్దయ్య సమాధి గృహమునుండి వెండిబెత్తము, శిఖాముద్రిక, యోగదండము, పాదుకలను గొనివచ్చి గోవిందమ్మకు నమస్కరించి తల్లీ! గురుదేవుడు దర్శనమిచ్చుటయేగాక యీ నాలుగు వస్తువులనిచ్చి ఆశీర్వదించి ముడుమాలకేగుమనెను. ఇక మీరును గోవిందయ్యగారును ఆశీర్వదించి అనుజ్ఞ యిచ్చినచో నా గ్రామమున కేగెదెను అని అనగా, అంతలో గోవిందయ్య వచ్చెను. ఇద్దరును సిద్దయ్యను ఆశీర్వదించిరి. అపుడు గోవిందమ్మ లోపలికేగి కొంత ధనమును కొన్ని ఆభరణములను మూటగట్టితెచ్చి, "నాయనా! ఇదిగో యీ మూటను తీసికొనిపొమ్ము అపుడపుడు వచ్చి పోవుచుండుము" అనగా సిద్దయ్య వారికి నమస్కరించి బయలుదేరెను.

అతడు వీరబ్రహ్మముగారొసగిన వస్తువులను గోవిందమ్మ గారొసగిన కానుకలను గొనిపోవుచుండెనని తెలిసికొని గజదొంగలగు పెద్దబుచ్చినాయుడు, చిన్నబుచ్చినాయుడు అనువారు దారినడ్డగించి, ఆ వస్తువులను అపహరింపవలెనని సిద్దయ్యకడకువచ్చిరి.

అంతలో కొంతదూరమున గుఱ్ఱముపై నెక్కి వచ్చుచూ వీరబ్రహ్మంగారు కనిపించుటచే వారు భయపడి పరుగెత్తిరి. సిద్దయ్యకు వారెందులకు వచ్చిరో ఎందులకు బరుగిడిరో తెలిసికొనవలెనను ఊహజనింపలేదు. అతడు తలవంచుకొని గురుదేవుని నామస్మరణజేయుచు పోయి ముడుమాల గ్రామమును జేరి తల్లిదండ్రుల దర్శించి శ్రీ వీరబ్రహ్మం గారు చెప్పిన ధర్మములను ఆచరిస్తూ, తత్త్వాలను జనులకు ప్రబోధం చేస్తూ కాలమును గడుపసాగెను.

## 8. పోతులూరయ్యకు శాపం

ఆతరువాత తనను, పునిస్త్రీగా వుండుట ధర్మవిరుద్ధమని దూషణచేసిన మునిమడుగు గ్రామంలోని విశ్వబ్రాహ్మణులను గోవిందమాంబ శపించెను. వీరబ్రహ్మం గారి కుమారుడు పోతులూరు తల్లిమాటను కూడా లెక్కజేయక వీరబ్రహ్మం గారి సమాధిని తెరవగా అందుండి బ్రహ్మంగారు వెలుపలికి వచ్చి పోతులూరయ్యను శపించిరి. ఆ విధముగా తండ్రిచేత శపించబడిన పోతులూరయ్య తన భార్యతో కలిసి అరణ్యవాసం చేస్తూ చివరికి లింగాలకొండ అనే ప్రాంతములో ఒక పర్ణశాలను నిర్మించుకొని నివసించ సాగెను. అలా కొంతకాలం వనవాసం చేసిన తరువాత వారిద్దరూ తిరిగి తమ స్వగ్రామమైన కందిమల్లయ్యపల్లెకి చేరిరి.

## 9. ఈశ్వరమ్మ వృత్తాంతం

శ్రీ వీరబ్రహ్మం గారు సమాధియైన తరువాత బ్రహ్మంగారి మఠానికి గోవిందయ్యగారు మఠాధిపతులయ్యారి. ఈ గోవిందయ్య గారి ప్రథమపుత్రిక ఈశ్వరమ్మ. ఈశ్వరమ్మ అనిన వీరబ్రహ్మం గారికి ఎంతో మక్కువ. అందుకే ఈశ్వరమ్మకు చిన్నతనముననే జ్ఞానోపదేశమును చేసారు. ఆనాటి నుంచి ఈశ్వరమ్మ కూడా భక్తి జ్ఞాన, యోగవిద్యా ప్రవీణురాలైనది. నిరంతరం యోగాభ్యాసము చేస్తూ బాలయోగినిగా ప్రకాశించ సాగింది. కాలక్రమంలో ఈశ్వరమ్మ బ్రహ్మచారిణిగా దీక్షబూని తన తండ్రిగారైన గోవిందయ్య గారు సమాధియైన తదుపరి ఎన్నో మహిమలు చూపుతూ దేశసంచారము చేయ బయలుదేరెను. తన జీవితకాలములో ఆమె తన తండ్రి గోవిందయ్య వల్ల శాపాన్ని పొందిన బ్రహ్మరాక్షసికి శాపవిమోచనం చేయుట, నీళ్ళను నెయ్యిగా, నెయ్యిని నీళ్ళగానూ మార్చుట, గోళ్ళభావాజీ అనే క్షుద్రమాంత్రికుడికి గర్వభంగం చేయుట, పెద్దగట్ల గ్రామంలోని మంత్రవేత్తలను పరాభవించుట వంటి మహత్తర కార్యములు చేసి, చివరకు తన మఠమునుచేరి మార్గశిరమాస బహుళ నవమినాడు సమాధి పొందెను.

## 10. సిద్ధయ్య సమాధి చెందుట

ఈశ్వరమ్మ సమాధి చెందబోవుచున్నదని తెలుసుకున్న సిద్ధయ్య ముడుమాల గ్రామం నుంచి బ్రహ్మంగారి మఠానికి వచ్చి ఆమె సమాధి చెందిన అనంతరం తిరిగి తమ స్వగ్రామానికి వెళ్ళెను. సిద్ధయ్య తాను తిరిగివచ్చే మార్గంలో తిమ్మారెడ్డి అనే వ్యక్తి పాముకరిచి మరణించగా అతనిని తిరిగి బ్రతికించి, అలాగే తనను ఆశ్రయించిన గోవిందయ్య అనే

వ్యక్తికి మంత్రోపదేశాన్ని, సాంఖ్యయోగాన్ని తెలిపి మరియు అనేక మహిమలు చూపుతూ ముడుమాల గ్రామానికి చేరుకొనెను.

వీరబ్రహ్మంగారి ఆశీర్వచనము ప్రకారము సిద్దయ్యకు ఒక పుత్రుడు జన్మించగా, ఆ పుత్రుడికి పెద్దవీరయ్య అను పేరుపెట్టెను. కాలక్రమంలో సిద్దయ్య కూడా. తన అవతార పరిసమాప్తి కాలము ఆసన్నమైనదని తెలుసుకుని జీవసమాధి చెందెను. నేటికీ సిద్దయ్య సమాధికూడా ఒక దివ్యస్థలముగా విఖ్యాతి చెంది భక్తులకు దర్శనమిచ్చుచున్నది.



# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సుప్రభాత స్తోత్రమ్

ఉత్తిష్ఠోత్తిష్ఠ బ్రహ్మేంద్ర కాలజ్ఞాన ప్రబోధక ।
ఉత్తిష్ఠ పరిపూతాత్మన్ పోతులూర్వంశ పావన ॥ 1

ఉత్తిష్ఠోత్తిష్ఠ వేదంత సారమ్మర్మజ్ఞ శేఖర ।
ద్వైతాఽద్వైత విశిష్టాద్వైతామృతాంభోధి కుంభజ ॥ 2

షట్చక్రజ్ఞాన సంపన్న యోగనిద్రాం పరిత్యజ ।
ఉత్తిష్ఠ లోకరక్షార్థం భక్తాభీష్ఠ ప్రదాయక ॥ 3

ఓం కారరూప వీరార్య దేశికేంద్ర దయానిధే ।
వేద వేదాంత మర్మజ్ఞ సముతిష్ఠ తపోధన ॥ 4

ప్రాగ్దిశా భామినీఫాలే రాజతే రాగచిత్రకం ।
ప్రాతస్సంధ్యాం సముద్దిశ్య సముత్తిష్ఠ యతీశ్వర ॥ 5

అఖండానంద సామ్రాజ్య సింహాసన మహేశ్వర ।
భవబంధ వినిర్ముక్త సముత్తిష్ఠ మహామునే ॥ 6

భావాభావా కళారూప వేదవిద్యా విశారద ।
రాజయోగ సమాయుక్త సముత్తిష్ఠ మహామతే ॥ 7

భక్త జిహ్వాగ్ర సంవాసిన్ శమాది గుణదాయక ।
సంసారతాపశమన యమిశేఖర జాగృహి ॥ 8

పూర్ణజీవ సమాధిస్థ సచ్చిదానంద విగ్రహ
వాసనాత్రయ సంత్యక్త ఋషిపుంగవ జాగృహి 9

ఆత్మవిద్యోపసంలబ్ధ మనోలయ మహోదయ
జరామరణ సంశూన్య గురుపుంగవ జాగృహి 10

ఉద్గీథ ప్రణవోద్గీథ నాదబ్రహ్మమయాత్మక
ఉత్తిష్ఠోత్తిష్ఠ తత్వజ్ఞ సర్వపాప నికృంతన 11

భక్తబృంద హృదావాస మోక్షవిద్యా ప్రదాయక ।
పుణ్యశ్లోక పునీతాత్మన్ సముత్తిష్ఠ జగద్గురో ॥ 12

అష్టాంగయోగ సారజ్ఞ విద్యా వేద్య శుభాకృతే ।
సంపూర్ణ చంద్ర సంకాశ గురుదేవ హి జాగృహి ॥ 13

విశ్వాతీత విరాడ్రూప పూర్ణానంధైక విగ్రహ ।
విజ్ఞానదాన కానీన ఉత్తిష్ఠో త్తిష్ఠ దేశిక ॥ 14

అహంభావం పరిత్యజ్య జగద్భావ మనీషయా ।
సమతాజ్ఞాన సంధాతః వేదోపాధ్యాయ జాగృహి ॥ 15

పారమైశ్వర్య చిద్రూప పరతత్త్వ స్వరూపః ।
పండితాఖండల శ్రీమాన్ ప్రాణిక్షేమాయజాగృహి ॥ 16

సర్వోపనిషదర్థజ్ఞ చతుర్వేద మహెూదధే ।
సంశుద్ధ వాఙ్మనఃకాయ బ్రహ్మోపాధ్యాయ జాగృహి ॥ 17

దంభదర్పాది రహిత శాంతిదాంతి ప్రదాయక ।
జగదుద్భోధక స్వామిన్ ఈశ్వరీతాత జాగృహి ॥ 18

గురురేవ మహాదేవః గురురేవ శుభంకరః ।
ఇతి మత్వా గతాస్సర్వే బ్రహ్మన్ జాగృహి హేవిభో ॥ 19

సిద్ధాసన సమారూఢం భవంతం దృష్టుకామనాః ।
ఆగతాశ్శిష్య సందోహాః పురుషోత్తమ జాగృహి ॥ 20

గోవిందాంబా మనోవాస రాజయోగి శిఖామణే ।
పుత్రగాత్ర పరిష్వంగిన్ ముని మూర్ధన్య జాగృహి ॥ 21

జరామరణ సంతప్తాః పునర్జన్మ భయార్దితాః ।
ద్వారి తిష్ఠంతి సద్భక్తాః కరుణామయః జాగృహి ॥ 22

స్వస్వరూపాను సంధాన యోగమార్గ ప్రవర్తకః ।
శిష్యార్చిత పదాబ్జాత సముత్తిష్ఠ గురోర్గురో ॥ 23

పరిపూర్ణార్య సత్పుత్ర ధర్మ కామార్థ మోక్షద ।
ప్రకృత్యంబా గర్భమణే జగద్రక్షక జాగృహి ॥ 24

చిన్ముద్రా ముద్రితకర కోటిసూర్య సమప్రభ ।
నిగమాగమ మర్మజ్ఞ విరాడ్రూపక జాగృహి ॥ 25

సత్యానంద సదాధారః పరబ్రహ్మ విదాం వరః ।
బ్రహ్మానుభవ సందాతః సముత్తిష్ఠ మహాత్మకః ॥ 26

సత్పరానంద సద్రూపః చిత్పరానంద రూపక ।
సచ్చిదానంద రూపాత్మన్ సర్వవ్యాపక జాగృహి ॥ 27

## సుప్రభాతం

పద్మాననే బుధజనార్చిత పాదయుగ్మ
జాయా కరార్పితపరీమళ గంధమాల్య
గార్హస్థ్యధర్మ పరికల్పితజీవకార్థః
శ్రీ పోతులూరి కుశేఖర సుప్రభాతమ్ ॥ 28

శ్రీ కందిమల్లయ్య పురాచింత మందిరస్థ
పద్మాసనే సకలమానవ రక్షణార్థం

బద్ధవ్రతోరుసుతవస్లిత యోగివర్య
శ్రీ పోతులూరి గురుశేఖర సుప్రభాతమ్ ॥ 29

శ్రీ సిద్ధమూర్తి హృదయాంతర దివ్యమూర్తే
అన్నాజి విప్రతనయార్చిత పాదపద్మ
కక్కయ్య నామక మతంగ భక్తతోష
దైవజ్ఞ శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥ 30

స్త్రీ, శూద్ర, పంచమ జనౌఘ హృదంతరస్థ
మాలిన్యరూప తిమిరావళి చండభానో
సర్వప్రపంచ మతసాంఘిక సామరస్య
ధర్మప్రబోధనవిభో తవ సుప్రభాతమ్ ॥ 31

భవ్యప్రభాత సమయే నిజమందిరస్థ
ఘంటారవశ్చరతి సర్వదిగంతరాళే
ఓంకారదూర పరికల్పిత ఘోరపాప
శ్రీ రాజయోగి కులశేఖర సుప్రభాతమ్ ॥ 32

సంకల్పమాత్ర కలనేన శుభప్రదాయిన్
సంకల్పమాత్ర పరికల్పిత చిద్విలాస
సంకల్పరిక్త సుమహత్తర మార్గదర్శిన్
భో నిర్వికల్ప పదవిపద సుప్రభాతమ్ ॥ 33

జ్ఞానాగ్ని దగ్ధ జననాంతర సర్వకర్మన్
సర్వోన్నతోన్నత మహాపథ సంచరిష్ణో
దైన్యప్రలోభ మదమత్సరతా విభంగ
శ్రీ వీరసద్గురు విభో తవ సుప్రభాతమ్ ॥ 34

వేద ప్రమాణకృత శాశ్వత ధర్మరక్ష
వేదాంతకానన వినూతన పారిజాత
శృత్యుక్త ధర్మపరిపాలన సాధుపక్ష
దుర్వాదఖండన విభో తవ సుప్రభాతమ్ ॥ 35

చామీకరాభ రుచమత్తను యష్టిపుష్ట
శ్మశ్రుప్రపూత శుచివర్ణ విరాజితాన్య
ఆత్మజ్ఞదత్త మణిహంసక భూషితాంఘ్రే
బ్రహ్మోపదేశ గురుశేఖర సుప్రభాతమ్ ॥ 36

శ్రీ మద్విరాట్పద సమంచిత పోతులూరి
వంశాబ్ధిచంద్ర శివకోటయ భాగధేయ
అచ్చాంబికా దయిత వేంకటరెడ్డి చేతో
విధీవిహార కరుణాకర సుప్రభాతమ్ ॥ 37

జ్ఞానామృతేన పరిపోషిత శిష్యవర్గ
గానామృతేన పరివర్ధిత భక్త వర్గ
స్వచ్ఛంద దేశిపద సేవిత సాధువర్గ
శ్రీ వీరదేవిక విభో తవ సుప్రభాతమ్ ॥ 38

కామాది షడ్వర్గ నిరాకరిష్ణో । వేదాంత విద్యాపథ సంచరిష్ణో ।
కర్మత్రయాఖిల మృగేంద్రజిష్ణో । విష్ణ్వంశమూర్తే తవ సుప్రభాతమ్ ॥ 39

# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రపత్తి స్తోత్రమ్

కార్యకారణ భావత్మన్ కార్యకారణ వర్జిత ।
సంగాసంగ పరిత్యక్త సాధుపోషక పాలయ ॥ 1

మహావాక్యార్థ మర్మజ్ఞ భేదాభేద విమోచక ।
నాదబిందు కళాతీత దశనాదజ్ఞ పాలయ ॥ 2

శ్రీమన్నారాయణాకార ద్వాదశాక్షర బోధక ।
ఓంకార రూప లక్ష్యార్థ సర్వభూతస్థ పాలయ ॥ 3

సర్వవిద్యా రహస్యజ్ఞ రాగద్వేష వినాశక ।
జీవబ్రహ్మైక్య సందాన యోగజ్ఞానైక పాలయ ॥ 4

భ్రూయుగ్మ మధ్య సంవాసిన్ సర్వతంత్ర స్వతంత్రక ।
అంతర్లక్ష్య బహిర్లక్ష్య రూపసాధక పాలయ ॥ 5

గురో వీరాసనాసీన జ్ఞానముద్రోప శోభిత ।
శిష్యోపశిష్య సంయుక్త దేశికాగ్రజ పాలయ ॥ 6

నిశ్శేషిత జగత్కార్య ప్రాప్తాఖిల మనోరథ ।
సంసారాడంబరత్యక్త సద్గుణాలయ పాలయ ॥ 7

హర్షామర్ష మదక్రోధ కామమోహాది వర్జిత ।
ప్రాప్తా ప్రాప్త ఫలాభిజ్ఞ మదృచ్ఛాలాభ పాలయ ॥ 8

ఉద్వేగానంద రహిత పూర్ణాత్పూర్ణతరాకృతే ।
ద్రష్టృ దృగ్దృశ్య సంపూర్ణ సర్వవ్యాపక పాలయ ॥ 9

శోక శృంఖలయాబద్ధం నరనారీసమూహకం ।
తద్రక్షణసమాయుక్త వీరబ్రహ్మేంద్ర పాలయ ॥ 10

చిద్ఘనానంద సంపూర్ణ పూర్ణబోధావ బోధక ।
ప్రజ్ఞానమేవ బ్రహ్మేతి వాక్యబోధక పాలయ ॥ 11

తత్రాముత్రాత్ర సర్వత్ర సోహంభావ ప్రబోధక ।
జాగ్రత్స్వప్న సుషుప్తీనాం పరివర్జక పాలయ ॥ 12

కర్మ విజ్ఞాన వైరాగ్య నాయకాయ నమోనమః ।
ప్రాణయాత్రార్ణ మహారగ్రహణాయ నమోనమః ॥ 13

నమోవేదస్వరూపాయ గోవిందా పతయేనమః ।
శిష్యహృత్తాప హారాయ శ్రీ వీరగురవేనమః ॥ 14

వాఙ్మనఃకాయ శుద్ధాయ పరిపూతాత్మనే నమః ।
శాంతిసౌధ విహారాయ జ్ఞానరూపాయ తేనమః ॥ 15

శివకేశవ రూపాయ సర్వాంతర్యామినే నమః ।
వేదవేదాంత వేద్యాయ గురవే బ్రహ్మణేనమః ॥ 16

మనసస్సాక్షి భూతాయ బ్రహ్మణే శుభకారిణే ।
పరాపరార్థబోధాయ వీరసద్గురవే నమః ॥ 17

సహస్రార నివాసాయ గురుదేవాయతే నమః ।
నాడీత్రయాధికారాయ బోధాయనందాయతే నమః ॥ 18

నిరస్త సర్వసందేహ విగతాశేష కల్మష ।
తృణీకృత మహాభాగ ధీరధీ తే నమోనమః ॥ 19

పుత్రదార గృహారామ ధనధాన్య పరాఙ్ముఖ ।
సర్వసంగ పరాత్యాగిన్ వాసనోన్ముక్త తే నమః ॥ 20

వేదశాస్త్ర పురాణేతిహాసాభ్యాసవిదాం వర ।
అదృష్టాశ్రుత బోధజ్ఞ విశ్వతోముఖ తే నమః ॥ 21

అనంతశక్తి సంయుక్త సర్వాంతర్యామి సద్గురో ।
నిర్వికార శుభాకార ప్రత్యగాత్మన్ నమోస్తుతే ॥ 22

అహమేవ పరబ్రహ్మ బ్రహ్మేహమితి సంస్థిత ।
హృత్పుండరీక మధ్యస్థ జగచ్చక్షుర్నమోస్తుతే ॥ 23

ఉత్పత్తిస్థితి సంహార కార్యకారణ రూపక ।
భాహ్యాంతర్భాగ సంచార వీరబ్రహ్మన్నమోస్తుతే ॥ 24

కాషాయవర్ణ విభ్రాజ జ్జటా వల్కల ధారిణే ।
రత్నకుండల రారాజ ద్వదనాయ నమోస్తుతే ॥ 25

షట్కోశం బహునిర్ముక్త షడూర్మి పరివర్జిత ।
షడ్భావాభాన సంత్యక్త వీరంభట్ట నమోస్తుతే ॥ 26

కాయేన మనసా వాచా సర్వదోషాతి దూరగ ।
వేదాంతవేద్య సంపూజ్య జ్ఞానరూప నమోస్తుతే ॥ 27

విధ్యుక్త కర్మ సంయుక్త భక్తహృత్తా ప హారక ।
ఆజ్ఞానచక్రాధి సంవాస గురుదేవ నమోస్తుతే ॥ 28

సంకల్ప సంక్షయాచ్చిత్తం స్వచ్ఛందం భవతీతియః ।
ప్రోక్తవాన్ సోహమస్మీతి భావయామి నమోస్తుతే ॥ 29

సర్వసంకల్ప రహిత దుర్జయేంద్రియ వర్జిత ।
సర్వభోగేషు నిర్లిప్త బంధముక్త నమోస్తుతే ॥ 30

చింతానల శిఖాదగ్ధ మాశాపాశ సమన్వితం ।
సంసార సంకటం హిత్వా తిష్ఠన్ బ్రహ్మన్ నమోస్తుతే ॥ 31

సజాతీయ విజాతీయ భేదబుద్ధి నివారక ।
చిదానంద మయానంత నిర్వికార నమోస్తుతే ॥ 32

అనంతకోటి బ్రహ్మాండ భాండావరణ తే నమః ।
వాగగోచర సంపూర్ణ తేజోరాశే నమోస్తుతే ॥ 33

భవద్గుణ సముత్కర్షం శ్రుత్వా దృష్ట్వా సమంతతః ।
అచ్చాంబా లాలయామాస పుత్రవద్గురుశేఖర ॥ 34

గోపాలకస్య రూపేణ మాయయా మోహితంజగత్ ।
రెడ్ల్వంగనా పూజితోసి భవల్లీలా మహాద్భుతా ॥ 35

అగ్నిత్రయ కళోపేత జ్ఞానసాగర పారగ ।
చిన్మయానంద చిద్రూప నమస్తే మోక్షదాయక ॥ 36

ఆత్మాచైవాంతరాత్మాచ పరమాత్మా త్తథైవ చ ।
త్వమేవేతి వినిశ్చిత్య నౌమి బ్రహ్మాత్మ బోధక ॥ 37

జీవాశ్చ సుఖదుఃఖాతి మాయావరణ వేష్టితాః ।
తేషాం ముక్తిప్రదానార్థం వద బోధం జగద్గురో ॥ 38

గర్భ, జన్మ, జరా, మృత్యు భయ కంపిత మానవాః ।
భవ త్పాదాంబుజ ధ్యానాత్ తరంతి భరసాగరమ్ ॥ 39

యస్య నామావలి ధ్యానాత్ దుర్లభం సులభం భవేత్ ।
తస్య వీరగురోర్బోధః కురుతాత్ పాపసంక్షయమ్ ॥ 40

విశ్వరూపధరం విఙ్ఞం వీరబ్రహ్మేంద్ర మక్షరం ।
యస్స్మరే న్మనసా వాచా కర్మణా సహి పండితః ॥ 41

పారమార్థిక రూపాయ పరిపూత మహాత్మనే ।
గోవిందా ప్రాణనాధాయ బ్రహ్మణే తే నమెనమః ॥ 42

నమః కల్యాణ కారుణ్య గుణ సంవర్ధితాత్మనే ।
నమః పరహిత్యార్థాయ బ్రహ్మేంద్రాయ నమోనమః ॥ 43

సప్తాశ్వవర్ధాసుర లక్షణస్త్వం హిమాద్రివన్నిత్య వినిశ్చలస్త్వం ।
ఇతీరయింతి శ్రుతిశాస్త్ర దీరాః బ్రహ్మేంద్ర యోగీంద్ర నమోనమస్తే॥ 44

త్వమేవ బహ్మేశముకుందరూపకః త్వమేవ సర్గ ప్రతిసర్గ మూలకః ।
త్వమేవ నిర్వాణ పథప్రవక్తే త్వేవంస్తువంతి వరవీరగురో భవంతమ్॥ 45

సంసార మోహావరివర్జిత శిష్యవర్గాః దుఃఖాతిరేక పరివర్జిత భక్తవర్యాః
యష్మత్పదాంబురుహ యుగ్మ దిదృక్షమాణాః
ద్వారస్థితాః కరుణయా గురుదేవా పశ్య 46

అరక్షితం తామస దుర్గుణాన్వితం పరంపరాప్రాప్త మహాఘదూషితం ।
సరాగసంసార దావాగ్ని మధ్యగం క్షమస్వమా మాదర పూర్వకం ప్రభో॥47

పరపీడితజాతి విమోచనరీః వరయోగి జనార్చిత దివ్యగుణ ।
సకలాంధ్ర మహాజన కల్పతరో శ్రుతిధర్మనిరూపక పాలయ మామ్॥48

మతమత్త గజాంకుశ పాలయమామ్
కులభేద విభేదన పాలయమామ్
కలికల్మషఖండన పాలయమామ్
పరమేశ్వర సన్నిభ పాలయమామ్ 49

జయజయ పోతులూరికుల సాగర యజ్వపతే।
జయజయసర్వవర్ణ సమతా మమతాత్త్వవిభో ।
జయజయ కందిమల్లయ్య పుర్యోజ్జ్వలవాస మునే ।
జయజయ భక్తబృందకృత సంస్తవ పాలయ మాం 50

జయతుజయతు సర్వస్వామ్య సిద్ధాంతకర్తా
జయతుజయతు సాక్షాద్వీరనారాయణార్యః
జయతుజయతు మాతృస్వామ్య నిర్మాణదక్షః
జయతుజయతు వీరబ్రహ్మయోగీంద్ర చంద్ర 51

## మంగళా శాసనమ్

బ్రహ్మవిద్యాస్వరూపాయ బోధానందాయ మంగళమ్ ।
పరమానందనిధయే చిదానందాయ మంగళమ్ ॥ 1

శ్రీ మజ్జగజ్జనదయాకరణైక సింధో
సిద్ధేంద్ర శిష్యపరిపూజిత పాదపద్మ
సంసారసాగర నిమగ్న జనాళిపోష
శ్రీకోటయార్య తనయా ప్రియ మంగళం తే ॥ 2

తౌరుష్క మండల మహాధిప సన్నుతాంఘ్రే
రెడ్డ్యంగనా కరగృహీత మహాన్నభిక్ష
భక్తాళి మానసిక రోగభిషగ్వరేణ్య
గోవిందమాతమనః ప్రియ మంగళం తే ॥ 3

శ్రీవీరభోజముని పుంగవ హృన్నివాస
"పాపఘ్ని" పీఠ మఠ వాస మహానుభావ
శ్రీవీరపాప మహిళా నయనేందురేఖ
శ్రీపోతులూరి ఋషిశేఖర మంగళం తే ॥ 4

విశ్వోపకార పరిపోషిత భక్తబృంద
విశ్వంభరాభరణదక్ష విపక్ష శిక్ష
విశ్వాస పూర్ణహృదయాంతర శిష్యరక్ష
విశ్వాభినందిత గుణాలయ మంగళం తే ॥ 5

వేదాంతసూత్ర పఠనక్రమ పూతవక్త్ర
మందస్మితోరు రుచి సంక్రమణాతి వక్త్ర
శాంతిక్షమాకలిత సుందరి దివ్యవక్త్ర
సంత్యక్త సర్వభవబంధక మంగళం తే ॥ 6

ఏధాంబభూవిమ మహోదయ యుష్మదీయ
కారుణ్యపూర్ణ శుభవీక్షణ లేశమాత్రత్
వందారు భక్తజన వందిత పాదపద్మ
శ్రీపోతులూరి యతిశేఖర మంగళం తే ॥ 7

భక్తి ప్రమోదావృత చిత్త వృత్తా ః
బ్రాహ్మనుభావామృత పాన మత్తాః
గాయంతి యేస్తోత్ర మిదం ప్రభాతే
తే మోక్ష సామ్రాజ్యమవాప్ను వంతి ॥ 8

# శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి మంగళహారతి

1) అఖిల చరాచెరమంతా నీవగుచు సకలరూపముతోడ సంచారించి అకలంక మగుదశ యవతారములు దాల్చి సకల లోకము లేలు సద్గురు స్వామి మంగళం మంగళం మహావీరబ్రహ్మాం ।
మా గోవిందమాంబ మంగళం మంగళం ॥

2) వీరప్పయను పేరా చేరి బనగామపల్లె కారుణ్యమూర్తివై ఘనతాతోడ గరిమి రెడ్డచ్చమ్మ గారిని మన్నించి కోరి అన్నాజయ్య కోర్కె దీర్చిన స్వామిమంగళం మంగళం మహావీరబ్రహ్మాం ।
మా గోవిందమాంబ మంగళం మంగళం ॥

3) త్రైకాలికా జ్ఞాత సకల ధర్మములను శ్రీ కాలజ్ఞానమున వ్రాసికొనియు ప్రాకటముగా భక్తనీకాము బ్రోచిన సాకార సద్గురు దేవామంగళం మంగళం మహావీరబ్రహ్మాం ।
మా గోవిందమాంబ మంగళం మంగళం ॥

4) అల్లాడు పల్లెలో హరి పోతులూరయ్య కోల్లా పరి పూర్ణమా కల్లాలాడి కల్లకలి దోషము లెల్ల దూరము చేసి కలికియౌ కంది మల్లయ్య పుర నివాసామంగళం మంగళం మహావీరబ్రహ్మాం ।
మా గోవిందమాంబ మంగళం మంగళం ॥

5) గోవిందామాంబాను కోరికతో వరియించి నీవుసంసారంబున నిలిచితివి దేవాదిదేవులకు దేవా దేవుడా వగుచు భావింపగా రావా బ్రహ్మము నీకు మంగళం మంగళం మహావీరబ్రహ్మాం ।
మా గోవిందమాంబ మంగళం మంగళం ॥

6) బాలసిద్ధుని బ్రోచి భావంబు నందున అమనస్క యోగంబు నందా
జేసి నమ్మిన వారిని సమ్ముదమున బ్రోచి నిండు సమాధిలో నిలచిన
దేవా మంగళం మంగళం మహావీరబ్రహ్మం ।
మా గోవిందమాంబ మంగళం మంగళం ॥

**వీరబ్రహ్మం మంగళం మంగళం॥ సద్గురుమూర్తి॥ మంగళం మంగళం॥**

**సద్గురు మూర్తి మంగళం మంగళం మహావీరబ్రహ్మం ।**

**మా గోవిందమాంబ మంగళం మంగళం**

## శ్రీవీరబ్రహ్మం గారి మాలాధారణ దీక్షా విధానం

శ్రీ వీరబ్రహ్మంగారు మాలాధారణ దీక్షను 40, 32, 20,10 రోజులుగా వారి, వారి అనుకూలతలను బట్టి స్వీకరించవచ్చును. కానీ, 'దీక్షావిరమణ' మాత్రము కందిమల్లయ్య పల్లెలోని శ్రీ వీరబ్రహ్మంగారి మఠములో ప్రస్తుత మఠాధిపతులైన 'శ్రీశ్రీశ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి' వారి సమక్షంలో శ్రీ వీరబ్రహ్మంగారు జీవసమాధిలో ప్రవేశించిన 'వైశాఖ శుద్ధ దశమి' నాడు చేయవలెను.

కనుక 40 దినముల దీక్ష పాటించేవారు చైత్రశుద్ధ పాడ్యమి (ఉగాది) నాడు, 32 రోజులు దీక్ష పాటించేవారు చైత్రశుద్ధ అష్టమినాడు, 20 రోజులు దీక్ష పాటించేవారు చైత్ర బహుళ షష్ఠినాడు, 10 రోజులు దీక్ష పాటించేవారు వైశాఖశుద్ధ పాడ్యమినాడు మాలాధారణ చేసినచో దీక్షా విరమణను పైన చెప్పిన స్వామివారి ఆరాధనా దినము నాడు చేయవచ్చును.

**మాలాధారణ విధానం :** శ్రీ బ్రహ్మంగారు మఠాధిపతులైన 'శ్రీశ్రీశ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి'చే మాలాధారణ చేయించుకొనుట

ఉత్తమము. అందుకు వీలు కానిచో మూడుసార్లు దీక్ష పాటించిన 'బ్రహ్మంగారి' చేత మాలాధారణ చేయించుకోవచ్చును. లేదా తల్లి, తండ్రి, గురువులలో ఎవరైనా గాయత్రీ మంత్రోచ్చారణ చేస్తూ మాల వేయవచ్చును.

మాల ధరించిన వారు 'శ్రీ మాతాగోవిందమాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వాముల వారి పాదసాక్షిగా ఈ దీక్షా నియమాలను మనసా, వాచా, కర్మేణా త్రికరణ శుద్ధిగా పాటిస్తాను'. అని ప్రమాణం చేయవలెను. మాల కోసం 108 లేక 54 రుద్రాక్షలు లేదా తులసి పూసలను వాడవచ్చును. మాలయందు బ్రహ్మంగారి ప్రతిమ ఉండవలెను.

**నియమాలు :** దీక్షలో వున్న వారిని 'బ్రహ్మం' అని పిలవాలి. అలాగే దీక్ష బూనినవారు కూడా ఇతరులను 'బ్రహ్మంగారు' అని సంబోధించాలి. దీక్షలో వున్నవారు కోపము, పగ, అసూయ, ద్వేషములను చూపరాదు. మొదటిసారి దీక్ష స్వీకరించిన వారిని 'బ్రహ్మ'మని, మూడేళ్లు దీక్ష పాటించిన వారిని 'గురుబ్రహ్మ'మని అంతకు మించి దీక్ష పాటించిన వారిని 'పరబ్రహ్మ' మని గుర్తించవలెను. ఈ దీక్ష పొందుటకు కుల, మత బేధాలు లేవు.

**వస్త్రం :** మాలాధారకులు కాషాయము లేదా గోధుమరంగు ధోవతిని బిళ్ళగోచి పెట్టి ధరించవలెను. శాలువా కాని లేదా ఉత్తరీయము కానీ భుజములపై కప్పుకోవలెను. దీక్షాకాలములో ప్యాంట్లు, షర్టులు, బనీన్లు వాడరాదు.

ఉదయం నుదుట విబూది పూసి, కుంకుమ బొట్టు, మధ్యాహ్నం భోజన సమయమందు గంధము మూడు అడ్డరేఖలుగా పెట్టి మధ్యన కుంకుమ బొట్టు ధరించవలెను.

- దీర్ఘకాలంలో సాత్త్వికాహారాన్ని మాత్రమే భుజించాలి.
- మధ్యాహ్నం భోజనం రాత్రిపూట ఫలహారం భుజించాలి.
- మధ్యమాంసాలు ముట్టరాదు.
- కుక్కలు, పిల్లులు వంటి పెంపుడు జంతువులు ఆహార పదార్థాలను ఎంగిలి చేస్తే వాటిని దూషించరాదు
- పాదరక్షలు ధరించరాదు
- మంచము, పట్టుపరుపులపై పవళించరాదు.
- బ్రహ్మచర్యమును పాటించాలి.
- ప్రతి స్త్రీని 'అమ్మ' లేదా 'అమ్మాయి' అని సంబోధించాలి.
- ప్రతి దినము గాయత్రీ మంత్రమును జపించాలి.

ఈ విధంగా దీక్షలో నున్న వారు నియమ, నిష్ఠలను పాటించాలి. ప్రతిరోజూ ముడు పూటలా స్నానము చేసి శ్రీ వీరబ్రహ్మంగారి ప్రతిమను ధూపదీపనైవేద్యాలతో పూజించారి. వీరబ్రహ్మంగారి జీవితచరిత్రను మరియు వారు రచించిన కాలజ్ఞానమును ఈ దీక్షాకాలమందు చదువుతూ వాటి భావాలను మననం చేసుకోవాలి.

ఇట్టి నియమనిష్టలతో దీక్షాకాలమును పాటించినవారు శ్రీ వీరబ్రహ్మం గారి ఆరాధనా దినము నాడు కందిమల్లయ్యపల్లెలో మాలా విసర్జనచేసి శ్రీ వీరబ్రహ్మంగారి కృపకు పాత్రులై ఆయురారోగ్య, ఐశ్వర్య, భోగభాగ్యాలతో సుఖించి, తరిస్తారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి అష్టకమ్

1. శ్రీకరా శ్రీ విశ్వవందిత । చిన్మయా గురు దైవమా
ప్రాకటంబుగ రాజయోగ । విహార శేఖర బ్రోవుమా
శోక నాశక జ్ఞాన బోధక । సోహభావము తెల్పుమా
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

2. వేద వేద్య పరాత్పరా । శ్రీ విశ్వవినుత జగద్గురో
సాదరంబుగ మమ్ము నేలుము । సత్యమూర్తివి శ్రీవిభో
బోధ గురవని కీర్తి గాంచిన । పుణ్యమూర్తివి శ్రీ గురూ
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

3. భావి కాలము గతులు తెలిపిన । భావమే నీయందునా
ఆవహించిన మూర్తి త్రయుడవు । ఆదరించియు బ్రోవుమా
భావమందున నిన్ను మరువము । భక్తితో నిను గొలుతుము
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

4. సూరిజన హృత్కమలవాసా । సుస్థిరా శ్రీ శుభకరా
భూరి సద్గుణ శాలిధీవర । పూజ సేతు పరాత్పరా
కోరి వచ్చిన సిద్ధ మూర్తికి । కోర్కె తీర్చిన గురువరా
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

5. పరమ పురుషా పావనాత్మక । పాపమాంబకు ప్రియ సుతా
వరద వీర బ్రహ్మనామమే । వసుధ నిండెను జననుతా
దురిత సమితియు నిన్ను దలచిన । తొలిగి పోవును పూజితా
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

6. జాతి మతముల భేదమే । యీ జగతియందున లేదనీ
నీతి పలుకులు బోధపరచిన । నిర్గుణాత్మక గుణమణీ
జాతిహీనుడు కక్కనికినీ । జన్మమర్మము తెలిపినా
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

7. కేశవాంశము నీది యగుటను । కేవలము సిద్ధయ్యనా
శైశవంబున జేర్చి యోగము । సిద్ధి చెందక చివరకూ
ఆశ పెట్టియు పూలు తెమ్మని । అతని వెంటనే నుంటివీ
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్ను తింతుము హే ప్రభో ॥2॥

8. బ్రహ్మ విష్ణు శివరూప వీర । బ్రహ్మనామమే ధరణిలో
బ్రహ్మ జ్ఞానమే బ్రహ్మణంబని । పలికినావీ పుడమిలో
బ్రహ్మ సాక్షాత్కారమున పర । బ్రహ్మ జేరుదురవనిలో
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

9. శరణు శరణని వేడితీ । నీ చరణముల కడ చేరితీ
నిరతమున్ నీస్మరణ చేసితి । నిన్ను మనసున వేడితీ
కరుణతో శ్రీ వీరనాగా । కవిని నేలుము శ్రీపతీ
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

10. వరసతోనీ యష్టకంబును । వ్రాసి చదివిన విన్ననూ
స్థిరముగా సిరిసంపదాదులు । చెడక నిలిచియు యుండును
గురుడు వీరబ్రహ్మమే మన । కోర్కెలన్నియు తీర్చునూ
స్వామి సద్గురు వీర బ్రహ్మమ । సన్నుతింతుము హే ప్రభో ॥2॥

# శ్రీ బ్రహ్మాంగారి పూజా విధానము

శ్లో॥ ఓం శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వ విఘ్నోప శాంతయే ॥

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుసాక్షాత్పర బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః
ఓం నమో వీరబ్రహ్మేంద్ర స్వామినే నమః
(ఘంటానాదం చేస్తూ క్రింది మంత్రం చదవవలెను.)

**శ్లోకం** : ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రక్షసామ్ ।
కురుఘంటారావం తత్ర దేవతాహ్వాన లాంఛనం ॥

(క్రింది మంత్రము చదువుతూ తనపై మరియు పరిసరములపై నీళ్ళు చల్లవలెను)

**మంత్రం** : అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపివా ।
యస్మరేత్ విశ్వకర్మాణం, సభాహ్యాభ్యంతర శ్శుచిః ॥
(ఆచమనం చేయాలి) మూడుసార్లు ఉదకము త్రాగవలెను)

ఓం విశ్వ కర్మణేస్వాహా, ఓం సనాతనాయ స్వాహా
ఓం జగన్మాయాయ స్వాహా, ఓం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామినేనమః

**అని చెబుతూ అక్షతలు నాలుగు వైపుల చల్లవలెను**

**మంత్రం** : ఉత్తిష్ఠంతు భూతపిశాచాః యేతే భూమి భారకాః ।
ఏతేషామవిరోధేన బ్రహ్మ కర్మ సమారభే ॥
(అక్షతలు వేసి నమస్కరించవలెను)

**మంత్రం** : శ్రీమద్విరాట్ పోతులూరిజగద్గురు ।
వీరబ్రహ్మేంద్రజ్ఞాయ నమోనమః ॥
(అని చెబుతూ కలశంపై చేతిని ఉంచవలెను)

**సంకల్పం :** శుభే శోభన ముహూర్తే । శ్రీమహావిశ్వకర్మాజ్ఞయా ప్రవర్ధమానస్య। అద్య బ్రహ్మణః। ద్వితీయ పరార్థే। కశ్యప బ్రహ్మ కల్పే। వైవస్వత మన్వంతరే। కలియుగే।ప్రథమపాదే। జంబూద్వీపే। భరతవర్షే। భరత ఖండే। మేరోర్దక్షిణ దిగ్భాగే। శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే । కృష్ణా గోదావర్యోః మధ్యదేశే। శోభనగృహే। సమస్త దేవతా విశ్వబ్రాహ్మణ సన్నిధౌ ।అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన। ..... సంవత్సరే.... ఆయనే... ఋతౌ.... మాసే.... పక్షే.... తిథౌ... వాసరౌ.... శుభనక్షత్రే। శుభయోగే। శుభ కరణే। ఏవంగుణ విశేషణ విశిష్ఠాయాం శుభతిథౌ శ్రీమతః శ్రీమాన్.... గోత్రస్య..... నామధేయస్య మమ సహ కుటుంబానాం.... క్షేమ స్థైర్య విజయాభయ ఆయురారోగ్యాది పంచవిధ ఫల పురుషార్థ సిద్యర్థం శ్రీ గోవిందాంబా సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి దేవతా పూజాం కరిష్యే.

(కలశమునకు గంధం, పసుపు, కుంకుమ పెట్టి పూజించి, నమస్కరించవలెను)

**మంత్రం** : కలశ దేవతాభ్యో నమో నమః సకలారాధన శ్శోభనమస్తు
కలశోదకేన పూజాద్రవ్యాని దేవం ఆత్మానం చ సంప్రోక్ష్య

(అని చెప్పి కలశంలోని నీటిని పువ్వులతో తీసుకొని పూజాద్రవ్యాలపైన తనపైన చల్లుకొనవలెను)

## గణపతి పూజ

**శ్లోకం** : వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభా ।
నిర్విఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా ॥
శ్రీ మహాగణాధిపతయే నమో నమః ॥

(అని చెప్పి గణపతి ముందు అక్షతలు, పూలు ఉంచవలెను)

## బ్రహ్మంగారి పీట పూజ

**మంత్రం :** సర్వాధార పీట శక్తిభ్యో నమః

(అని చెబుతూ బ్రహ్మంగారిని స్థాపించిన పీఠంపై అక్షతలను ఉంచాలి)

## వీరబ్రహ్మం గారి ధ్యానం

వీరం వీరభయాది తత్వభరితం వీరాసనస్థం గురుం ।
వీరశ్రేష్ఠనుతం విరించినుతం వీరాధివీరం హరిం ।
వీరేంద్రం ఘనయోగిమానసచరం వేదాంతవిద్యాకృతిమ్ ।
వీరాచార్య మహం భజామి సతతం శ్రీవీరనారాయణమ్ ॥

(పై శ్లోకమును చదివి వీరబ్రహ్మం గారికి నమస్కరించవలెను)

**స్నానం** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామినే నమః
శుద్ధోదక స్నానం సమర్పయామి ।
(పుష్పముతో నీటిని బ్రహ్మంగారి పటంపై చల్లవలెను)

**వస్త్రం** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
వస్త్రం సమర్పయామి
(శ్రీ వీరబ్రహ్మంగారికి వస్త్రాన్ని లేదా అక్షతలను సమర్పించాలి)

**యజ్ఞోపవీతం :** శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
యజ్ఞోపవీతం సమర్పయామి।
(శ్రీ వీరబ్రహ్మంగారికి యజ్ఞోపవీతమును సమర్పించవలెను)

**గంధం** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
గంధం సమర్పయామి ।
(శ్రీ వీరబ్రహ్మంగారికి గంధమును సమర్పించవలెను)

**పసుపు** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
హరిద్రాచూర్ణం సమర్పయామి।
(శ్రీ వీరబ్రహ్మంగారికి పసుపును సమర్పించవలెను)

**కుంకుమ** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
కుంకుమం సమర్పయామి।
(శ్రీ వీరబ్రహ్మంగారికి కుంకుమను సమర్పించవలెను)

**పువ్వులు, అక్షతలు వేస్తూ ఈ క్రింది నామాలు చదువుతూ శ్రీ వీరబ్రహ్మం గారిని పూజించాలి.**

## శ్రీ వీరబ్రహ్మంగారి షోడశనామాలు

1. ఓం వీరాయ నమః
2. ఓం వీరసనస్థాయ నమః
3. ఓం వీరబ్రహ్మణే నమః
4. ఓం వీరాధివీరాయ నమః
5. ఓం వీరేంద్రాయ నమః
6. ఓం వేదవేద్యాయ నమః
7. ఓం వేదాంత వేద్యాయ నమః
8. ఓం వేదగోచరాయ నమః
9. ఓం వీరాగ్రగణ్యాయ నమః
10. ఓం వీరనారాయణాయ నమః
11. ఓం ఆదిమధ్యాంత రహితాయ నమః
12. ఓం సూర్యమండల మధ్యవర్తినే నమః
13. ఓం సూర్యనారాయణ నమః
14. ఓం సర్వతీర్థగోచరాయ నమః
15. ఓం పరతత్త్వాయ నమః
16. ఓం సర్వవ్యాపినే నమః

**శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః**
షోడశ నామ పూజాం సమర్పయామి ।
(అని పూజించి శ్రీ వీరబ్రహ్మంగారికి నమస్కరించాలి)

**అక్షతలు** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
అక్షతాన్ సమర్పయామి ।
(శ్రీ వీరబ్రహ్మంగారికి అక్షతలు సమర్పించవలెను)

**ధూపం** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
ధూపమాఘ్రపయామి ।
(శ్రీ వీరబ్రహ్మంగారికి ధూపము / అగరబత్తి వెలిగించి చూపవలెను)

**దీపం** : శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః
దీపం దర్శయామి ।
(శ్రీ వీరబ్రహ్మంగారికి ఆవునేతితో వెలిగించిన దీపమును చూపవలెను)

**నైవేద్యం** : ఓం భూర్భువస్సువః తత్సవి తుర్వరేణ్యం
భర్గో దేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ।
నైవేద్యం సమర్పయామి ।
(పై మంత్రం చెబుతూ వివిధ రకాల ఫలములు శక్త్యానుసారం అన్నప్రసాదాలు శ్రీ వీరబ్రహ్మంగారికి నైవేద్యముగా సమర్పించవలెను)

**దక్షిణ :** తమలపాకులో వక్క, అరటిపళ్ళు, దక్షిణ ఉంచి శ్రీ వీరబ్రహ్మం గారికి సమర్పించవలెను.

**మంగళహారతి :**

కర్పూరం గౌరం కరుణావతారం సంసార సారం భుజగేంద్రహారం।
సదా వసంతం హృదారవిందం భవం భవానీ సహితం నవామి॥

**శ్రీ గోవిందాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామినే నమః**
కర్పూర నీరాజనం సమర్పయామి ।
(శ్రీ వీరబ్రహ్మంగారికి కర్పూర నీరాజనమును సమర్పించవలెను)

**మంత్ర పుష్పం :** చేతిలో పువ్వులను ఉంచుకొని ఈ క్రింది మంత్రమును పఠించాలి.

నమస్తే అస్తు భగవాన్ విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాలాగ్ని కాలాయ కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్ మహాదేవాయ వీరబ్రహ్మ గురవే నమః

మంత్ర పుష్పం సమర్పయామి ॥


(మీ చేతిలోని పువ్వులను వీరబ్రహ్మంగారికి సమర్పించవలెను)

**ప్రదక్షిణ :** ఈ క్రింది మంత్రము చదువుతూ ఐదు ప్రదక్షిణలు చెయ్యవలెను.

**మం॥** ఓం యానికానిచపాపాని జన్మాంతర కృతానిచ
పాపోహం పాపకర్మాణాం పాపాత్మ పాపసంభవః
త్రాహిమామ్ కృపయాదేవ శరణాగత వత్సల
అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ॥

**క్షమాపణ :** మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం పరమేశ్వరా
యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుతే ॥

(పై మంత్రం చెబుతూ బ్రహ్మంగారి ముందు నిలిచి క్షమాపణ చెప్పాలి)



## మంగళహారతి పాట

ఓం జయశివ ఓంకారా
ప్రభు జయశివ ఓంకారా
అపద్బాంధవ శ్రీగురుబ్రహ్మం ॥2॥
హారతి గైకొనుమా, మంగళహారతి గైకొనుమా ॥ఓం॥
తల్లివి నీవే తండ్రివి నీవే
అంతయు నీవేలే జగమంతయు నీవేలే ॥2॥
భక్తుల బ్రోచే శ్రీగురుబ్రహ్మం హారతి గైకొనుమా
మంగళహారతి గైకొనుమా ॥ఓం॥

## శాంతి మంత్రము

ఓం సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహైః
తేజస్వినా వధీత మస్తు మా విద్విషావహైః
ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః

## వీరబ్రహ్మేంద్ర స్వామి మూల మంత్రము

ఓం హ్రీం క్లీం శ్రీం శివాయబ్రహ్మణే నమః
(పై తెలిపిన మూలమంత్రమును 108 సార్లు పఠించవలెను)

## క్షమా ప్రార్థన

ఓ అఖిలాండకోటి బ్రహ్మాండనాయక కలి కాల జ్ఞాన రచనాయ అచలా స్వరూపా శ్రీ పురస్థల సజీవ సమాధి నిష్టాయా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మీ యెడల తెలసో, తెలియకో తప్పులు చేసియున్న మమ్మల్ని క్షమించి మీ బిడ్డలవలె కాపాడవలెనని ప్రార్థించుచున్నాము.

# శ్రీ బ్రహ్మం గారి వీర నామములు

**("వీరనామము" అన్నచోట "వీరనామము వీరనామము రమ్యమైనది వీరనామము" అని చదవాలి)**

1. విశ్వమంతయు నిండిపండియు వెల్గుచున్నది వీరనామము
2. శాశ్వతంబగు జ్యోతిరూపున సత్యమైనది వీరనామము
3. ఆది మధ్యలయందు లొంగని హంసతత్వము వీరనామము
4. వేదవేద్య వికాస జీవన విష్ణు తత్వము వీరనామము
5. నిష్ప్రపంచము నిర్వికారము నిత్యగమ్యము వీరనామము
6. దుష్ప్రయత్నము లెల్ల బాపెడి దొడ్డ మంత్రము వీరనామము
7. బ్రహ్మ విష్ణు మహేశ్వరాధిక పార్శ్యమైనది వీరనామము
8. బ్రహ్మ మానస పద్మ షట్పద రాజమైనది వీరనామము
9. నమ్మి సేవ నొనర్చు వారికి నొసగు సౌఖ్యము వీరనామము
10. క్రమ్మియుండెను కర్మబంధము వమ్ము జేయును వీరనామము
11. భూమి భారము దీర్పజాలిన పుణ్యధామము వీరనామము
12. కామితార్థములియ్య రెండవ కల్పవృక్షము వీరనామము
13. దేవతామునికోటి యాత్మ స్తుతించు మంత్రము వీరనామము
14. శ్రీవిభుండిల బ్రహ్మ మంచు వచించు సూక్తము వీరనామము
15. భారతీతట జాతమైభువి వాసిగన్నది వీరనామము
16. వారిజప్రభవాండభాండము పాలిదైవము వీరనామము
17. అత్రిమునికి దత్తపుత్రత నందియున్నది వీరనామము
18. ధాత్రి పాపహరలయోర్మి విధానమైనది వీరనామము

19. వీరపాపము దేవికిన్ ప్రభువించి వెల్గెను వీరనామము
20. తారకామను బోధ తల్లికి దానెయైనది వీరనామము
21. కేశవేశ పురంబునన్ జనగేయమైనది వీరనామము
22. కాశినాబడు కంచిలో హరి గమ్యమైనది వీరనామము
23. అందమౌ ప్రమదాఖ్యయోగికి ఆత్మపూజ్యము వీరనామము
24. ఎంద భైరవ యోగి రాజునకీప్సితార్థము వీరనామము
25. దివ్యహర్షము మూలమై జగతీధ్యమైనది వీరనామము
26. భవ్యమౌ భ్రమరాద్రివాసుని భావకీర్త్యము వీరనామము
27. బాగుగా మహానంది శంకర వర్ణ్యమైనది వీరనామము
28. యోగులెల్ల నుతింప నవ్యమయోగమైనది వీరనామము
29. వాసిగా బనగానిపల్లె నివాసమైనది వీరనామము
30. భాసురంబుగ వీరపాపము బాల్యతన్ గోనె వీరనామము
31. అచ్చమాంబిక గోగణంబుల కాదిపాల్యము వీరనామము
32. మెచ్చియాకను గహ్వరంబుల మించి భాసిలె వీరనామము
33. తాళపత్రములందు వ్రాసిన కాలతత్త్వము వీరనామము
34. జాలితో మును అచ్చమాంబకు మేలొసంగెను వీరనామము
35. భూత భావిక వర్తమాన సమూల చక్రము వీరనామము
36. భూతలంబున నన్నజయ్యకు పూజితార్థము వీరనామము
37. భూప్రదక్షిణ సత్ఫలంబిడు పుణ్యమంత్రము వీరనామము
38. సుప్రతిష్ఠగ బ్రహ్మకల్పము జూడనున్నది వీరనామము
39. అందమౌ ప్రమదాశ్రమంబున కాద్యమైనదీ వీరనామము

40. పొందుగా నుపవాస శక్తికి మూలబీజము వీరనామము
41. సార్వభౌమ పదాది వైభవ సౌఖ్యదేయము వీరనామము
42. ఉర్విలక్ష్మికి అట పట్టగు చుండు తేజము వీరనామము
43. భక్తికోటికి ముక్తినిచ్చెడు పారిజాతము వీరనామము
44. రక్తితో కరవాల మంత్ర వరప్రధానము వీరనామము
45. భూమి నేలగ వీరధర్మము మూర్తిగన్నది వీరనామము
46. కామవైరి హృదంతరంబున గణ్యమైనది వీరనామము
47. కార్యకారణ కర్తయైన జగత్స్వరూపము వీరనామము
48. ఆర్యభావమునందు నిత్య మఖండమైనది వీరనామము
49. సంతసంబున వీరభోగ వసంతుడైనది వీరనామము
50. అంతరంగిక సేవకాళికనంత భాగ్యము వీరనామము
51. శిల్పమందు అనల్పకల్పన జెందు బ్రహ్మము వీరనామము
52. కల్పమందు వికల్ప మొందని కామరూపము వీరనామము
53. వీరభద్రుని సృష్టి జేసిన వేద వేద్యము వీరనామము
54. చేరి పూజలొనర్చు వారికి సిద్ధి ధామము వీరనామము
55. కందిమల్లయ్య పల్లెయందు అఖండమైనది వీరనామము
56. వందనీయ మహానుభావ స్వభావ శుద్ధము వీరనామము
57. స్థావరంబులు జంగమంబులు దానయైనది వీరనామము
58. జీవదీన దశా విపాటన శ్రీ మనోజ్ఞము వీరనామము
59. యెల్ల ప్రాణుల నుద్ధరింపగ ఇందు భాసిల్లె వీరనామము
60. తెల్లమైనది వేదవేత్తల దృష్టిరూపము వీరనామము

61. భక్తుడౌ ఘనసిద్ధయోగికి ముక్తిధామము వీరనామము
62. ముక్తసంగ జనానుషంగ ముముక్షు ధర్మము వీరనామము
63. పుత్రులేవురు దన్ను గొల్వగ పూజ్యమైనది వీరనామము
64. క్షేత్ర ధర్మ మెఱంగు వారికి చిక్కునట్టిది వీరనామము
65. పాద ధూళి మహత్తుతో శిలభామ జేసెను వీరనామము
66. వేదగుహ్య మనంత మాద్యము విశ్వదీప్యము వీరనామము
67. జ్ఞానియౌ వరసిద్దియోగికి ధ్యానమైనది వీరనామము
68. మౌనివర్యుల కాత్మసత్య సమాధి గమ్యము వీరనామము
69. దాసదాసి జనాళి బ్రోచిన దైవరత్నము వీరనామము
70. వ్యాసనారదులంతరాత్మల బల్కుగానము వీరనామము
71. పుష్పశైల ద్విజాళి కాత్మవిభూతి దృశ్యము వీరనామము
72. పుష్ప వంతులలోని జ్యోతికి మూలమైనది వీరనామము
73. మున్ను సిద్దవటినున్న నవాబుకు బోధ్యమైనది వీరనామము
74. పన్నుగా పలలంబు పండ్లగు మహిమజూపెను వీరనామము
75. కందుకూరు నవాబు నేలిన జ్ఞాన ముద్రిక వీరనామము
76. ఎందు నడ్డములేని శ్రీ ప్రణవేశ్వరాంశము వీరనామము
77. పండిత ప్రియ భావనీయ విభాసమానము వీరనామము
78. అండపిండ బ్రహ్మాండమయంబునైనది వీరనామము
79. కొద్ది గొప్పలు లేక యంతట గూడియున్నది వీరనామము
80. హద్దుమీరిన వారికెల్ల కులాంతమైనది వీరనామము
81. సిద్ధమూర్తిని లోకయాత్రను జేసినట్టిది వీరనామము

82. బోద్ధయై పరిపూర్ణ బోధకు యోగ్యమైనది వీరనామము
83. రంగరాజయి సత్యరూపున పొంగుచున్నది వీరనామము
84. సాంగవేద పదార్థ గోచరశబ్దమైనది వీరనామము
85. ధాత్రిలోన దశావతార కృతార్థమైనది వీరనామము
86. మిత్రచంద్ర హుతాశనాది సమిద్ధ తత్త్వము వీరనామము
87. సత్యమయ్యె ననంతకోటి యజావడబందున వీరనామము
88. నిత్యమై కనుచూపు దానయి నిండియున్నది వీరనామము
89. సంచితాదిక కర్మబంధము ద్రుంచివైచును వీరనామము
90. మించులో గల మేటి తేజము మీరి యుండును వీరనామము
91. ద్వాదశాక్షరి కక్షరంబగు తత్త్వమయినది వీరనామము
92. వేద వేద్య వినోద మౌచు అభేద్యమయినది వీరనామము
93. షోడశాక్షరి మంత్రకీలక చోద్యమయినది వీరనామము
94. ఈశ్వరార్థయు సర్వమై ధర వెల్గుచున్నది వీరనామము
95. పుణ్య పూరుష కోటి తానగు పుణ్యసీమయు వీరనామము
96. గణ్యమయిన తదాశ్రితాళి శరణ్యమయినది వీరనామము
97. బ్రహ్మతత్త్వము దానయై నిరవద్య మయినది వీరనామము
98. బ్రహ్మవిద్యకు మూలమంత్ర పదార్థమయినది వీరనామము
99. నమ్మి ప్రార్థన జేయ పాపవినాశ మయినది వీరనామము
100. తమ్మిచూలి జపించు తారక ధన్య నామము వీరనామము
101. నేత్రగోళములందు వెల్గెడి నిష్కళంకము వీరనామము
102. పాత్రభూతులపాల పెన్నిధి భాగ్యమయినది వీరనామము

103. నిర్మలంబగు జ్ఞానయోగము నిర్వచించెను వీరనామము

104. కర్మయోగుల చేత నర్చన గాంచు రూపము వీరనామము

105. కోటి జన్మకృతాఘకోటుల గూల్చునట్టిది వీరనామము

106. సూటి జెప్పెడు సాటిలేని విశుద్ధ తత్త్వము వీరనామము

107. విశ్వనాటక సూత్రధారి పవిత్ర వేషము వీరనామము

108. శశ్వదుత్తమ సాధు సేవ్యము సాధు గేయము వీరనామము

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి గాయత్రి

వీర నారాయణ విద్మహే। విరాట్పురుషాయ ధీమహి।
తన్నో వీరబ్రహ్మ ప్రచోదయాత్॥
వీరాచార్య విద్మహే। కాలజ్ఞానాయ ధీమహి ।
తన్నో వీరబ్రహ్మ ప్రచోదయాత్ ॥


## శ్రీ వీరబ్రహ్మం గారి జైజైలు

జై వీరబ్రహ్మ జై । గోవిందమాంబ జై ।
ఈశ్వరి దేవి జై । వీరశాంభవి జై ।
కాలజ్ఞాన కర్త జై । కలియుగావతార జై
చిద్విలాస బ్రహ్మ జై । కాలయోగి బ్రహ్మ జై
విశ్వకర్మ ప్రభువుకు జై । వీరప్పయ్య స్వామికి జై

## శ్రీ వీరబ్రహ్మం గారి పాట-1

మల్లెపువ్వుల మాలలు తెచ్చి - జాజిపూల దండలు తెచ్చి
బ్రహ్మయ్య ! నీ పాదపూజలే చేస్తామయ్యా బ్రహ్మయ్యా
ఓ బ్రహ్మయ్య! నీ పాదపూజలే చేస్తామయ్య బ్రహ్మయ్య ॥మ॥

1. ప్రొద్దుప్రొద్దున నిను ధ్యానించి - సంధ్యావందనంచేస్తామయ్యా ॥2॥
   ॥ఓ బ్రహ్మయ్య! నీ పాదపూజలే చేస్తామయ్య॥
2. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా - అందరి దైవం నీవేనయ్య ॥2॥
   ॥ఓ బ్రహ్మయ్య! నీ పాదపూజలే చేస్తామయ్య॥
3. కర్పూర ప్రియా విబూది సుందరా - విశ్వమంతటా నీవేనయ్య ॥2॥
   ॥ఓ బ్రహ్మయ్య! నీ పాదపూజలే చేస్తామయ్య॥
4. జగిత్యాల భక్తులమయ్య-నీదు పాదం విడవమయ్య ॥2॥
   ॥ఓ బ్రహ్మయ్య! నీ పాదపూజలే చేస్తామయ్య॥



## శ్రీ వీరబ్రహ్మం గారి పాట-2

ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా
పిలిచీ పిలిచీ అలసి అలసి। వేచియున్నాము నీ ముందర ।
॥ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా॥
నీపూజకర్పించె పూవులలో । నే పువ్వునై పడియున్నా చాలునుగా ।
॥ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా॥
నీపూజ చేయని దినమేలరా । నీ సేవచేయని బ్రతుకేలరా ।
॥ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా॥
నీవుండే కొలువైన కోవెలలో । నీ జ్యోతినై వెలిగిన చాలునురా
॥ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా॥
జగమెల్ల పాలించే జగదీశ్వరా। నీ భక్తుని కరుణించి కాపాడురా
॥ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా॥
మదిలోన నీ స్మరణ చేసేమయా । మనసార నీ భజన చేసేమయా
॥ఓ బ్రహ్మయ్య నీవెక్కడా నిను కొలిచేటి భక్తుల మేమిక్కడా॥




# బ్రహ్మంగారి మఠం-పరిసరాల్లోని దర్శనీయ స్థలాలు

## బ్రహ్మంగారి మఠం



శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారు 1693 వ సంవత్సరం వైశాఖ శుద్ధదశమి నాడు సజీవసమాధిలో ప్రవేశించారు. ఆ సమాధిపై తరువాతి కాలంలో భక్తులు గుడి నిర్మించారు. గర్భగుడిలో స్వాములవారి జీవసమాధి ఒక్కటే ఉంది. ఎదురుగా బ్రహ్మంగారి మూడవ కుమారుడు పోతులూరయ్య ఆయన భార్య పార్వతమ్మ చివరగా బ్రహ్మంగారి భార్య గోవిందమ్మ గార్ల సమాధులున్నాయి. గర్భగుడిలో సజీవసమాధిపై తాళపత్ర గ్రంథం ఒక వెండి పెట్టెలో భద్రపరిచారు. ప్రతిరోజు ఈ కాలజ్ఞానికి కూడా పూజ చేస్తుంటారు. బ్రహ్మంగారి పాదుకలు ఉంటాయి. సమాధివెనుక ఆనాడు స్వాములవారు మంచినీటితో వెలిగించిన జ్యోతి ఉంది. అది ఇప్పటికి ఆరిపోకుండా వత్తి నూనె మార్చుకుంటూ అఖండజ్యోతిగా కాపాడుతుంటారు. ఉదయం 6గంటల నుండి 9 గంటల వరకు ఉచిత దర్శనం. ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు అభిషేకం. మధ్యాహ్నం 12.30 గంటలకు పూజ జరుగుతుంది. 1 గంట నుండి 3 గంటల వరకు మూసివేస్తారు. 3గంటల నుండి సర్వదర్శనం ఉంటుంది. 6.30 గంటల నుండి 7 గంటల వరకు అభిషేకం చేస్తారు. రాత్రి 9 గంటల కు గుడి మూసివేస్తారు. తిరిగి ఉదయం 6 గం॥ల నుండి అందరికి సర్వదర్శనం ఉంటుంది. ప్రస్తుతం స్వామి దర్శనం అందరికి ఉచిత దర్శనం. మహానివేదన మందిరంలో మఠాధిపతులు నివసిస్తూ ఉంటారు.

## బ్రహ్మంగారి నివాస గృహం





కందిమల్లయ్య పల్లెలో బ్రహ్మంగారు నివసించారు. ఇక్కడనే ఆయన గోవిందమాంబతో కాపురం చేస్తూ భక్తులకు వ్యవసాయ పనిముట్లు చేసిస్తూ గడిపాడు. కందిమల్లయ్య పల్లెలో పూర్వపు రామాలయం ప్రక్కనే వారి స్వగృహము ఉంది. ఇది మఠమునకు దక్షిణ దిశలో ద్వారం ఎదురుగా ముఖ్య దారిగుండా 2 ఫర్లాంగుల దూరంలో ఉంటుంది.

**బ్రహ్మంగారి బావి :** గ్రామస్తులు బ్రహ్మంగారిని వెలివేసినట్లు చేయగా ఆయన స్వయంగా ఒకేరోజులో బావిని త్రవ్వించుకున్నారు. ఈ బావి నీళ్లు అతి చల్లగా ఉంటాయి. బావిని దర్శించిన యాత్రికులు తీర్థంలా ఆ నీటిని సేవిస్తారు. నెత్తిన చల్లుకొని పునీతులౌతుంటారు.

**పూజామందిరం :** బ్రహ్మంగారి స్వగృహంలో తూర్పు భాగాన బ్రహ్మంగారి పూజామందిరం ఉంది. ఇక్కడ ఆయన వాడిన పూజా పాత్రలు, వస్తువులు మనకు కనిపిస్తాయి. ఈ పూజా మందిరంలో ఒకపుట్ట ఉండేది. ఆ పుట్ట మట్టిని నీటితో కలిపి తాగితే రోగాలు నయమవుతాయని, గర్భిణీలకు సులభంగా కాన్పు అవుతుందని భావించి భక్తులు ఆ పుట్ట మట్టిని గిల్లుకుని తీసుకొని పోయేవారు. పుట్ట తరిగి పోయింది. ఆ ఆనవాలు ప్రస్తుతం మనకు కనిపిస్తాయి. స్వామి వారు వాడిన పూజా వస్తువులను భద్రపరిచారు.


## పోలేరమ్మచే నిప్పుతెప్పించిన రచ్చబండ



ఒకనాడు కందిమల్లయ్యపల్లెలో రచ్చబండ వద్ద గ్రామపెద్దలు కూర్చున్నారు. వీరబ్రహ్మం గారు కూడా అక్కడికి వచ్చి కూర్చుని చుట్ట వెలిగించటానికి నిప్పు అడిగారు. గ్రామ పెద్ద చుట్ట అంటించుకునేందుకు నిప్పుకొరకు వెతికాడు. అది గమనించిన వీరయ్య అక్కడే వున్న పోలేరమ్మ విగ్రహాన్ని చూసి పోలేరీ నిప్పు తీసుకొనిరా అన్నాడు. ఆ మట్టి ప్రతిమ బాలిక రూపంలో ప్రత్యక్షమై వైరాల మూకుడులో నిప్పు తెచ్చింది. గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. వీరయ్య మహిమాన్వితుడని తెలుసుకున్నారు. అప్పటి నుండి వీరబ్రహ్మంగా పిలువబడ్డారు. పోలేరమ్మతో నిప్పు తెప్పించిన స్థలమే రచ్చబండ. ఇది బ్రహ్మంగారు నివసించిన గృహమునకు దక్షిణ దిశలో 100 అడుగుల దూరంలో ఉంది. బ్రహ్మంగారి స్వగృహాన్ని దర్శించిన యాత్రికులు ఈ రచ్చబండను దర్శిస్తారు.

## ఈశ్వరీదేవి మఠం


వీరబ్రహ్మేంద్రస్వాములవారి ద్వితీయ పుత్రుడు గోవింద స్వాములవారు. బ్రహ్మంగారి తరువాత మఠాధిపతులు వీరి పుత్రిక ఈశ్వరీ దేవి. జేజినాయన కాలజ్ఞానాన్ని రాష్ట్రమంతటా ప్రచారము చేసిన మహాయోగిని. అవివాహితగా 100 ఏళ్ళు జీవించి మార్గశిర నవమిన



జీవసమాధి చెందింది. ఈమఠంలోని గర్భగుడిలో ఈశ్వరీదేవి తండ్రి గోవిందస్వాములవారి సమాధి ఉంది. ఈశ్వరీ దేవి జీవసమాధితో పాటు తల్లి, సోదరుడు సమాధులు కలవు. బ్రహ్మంగారి మఠమునకు తూర్పువైపున ఈశ్వరీదేవి మఠం ఉన్నది. బ్రహ్మం గారివలె ఈమెకూడా కాలజ్ఞానం వ్రాసినది. ఈమె నోటినుండి ఏ వాక్కు వెలువడినా ఫలించేది.

## కక్కయ్యస్వామి గుడి

బ్రహ్మం గారు సిద్ధయ్యకు షడ్చక్రవివరణ చేస్తుండగా చాటునుండి విన్నాడు కక్కయ్య. శరీరంలో దేవతలున్నారని విని తానుకూడా చూస్తే బాగుంటుందని ఇంటికి వెళ్ళి నిద్రపోతున్న భార్య పొట్ట చీల్చాడు. రక్తం మడుగులోపడి ముత్తెమ్మ చనిపోయిందేగాని ఆమె శరీరంలో దేవుళ్లు



కనిపించలేదు. బ్రహ్మంగారి బోధనలు అబద్ధాలని ఆయనను నిందించాడు. జరిగిన విషయం తెలుసుకొని బ్రహ్మంగారు సిద్ధయ్యతో సహా కక్కయ్య యింటికి వెళ్లి ముత్తెమ్మ శరీరంపై మంత్రజలం చల్లి ఆమె శరీరంలో షట్చక్ర వివరణను చూపించి ముత్తెమ్మను బ్రతికించాడు.

ఆదంపతులు స్వాములు వారికి శిష్యులయ్యారు. కక్కయ్య, ముత్తెమ్మ సమాధులున్న గుడి కక్కయ్య స్వామిగుడి. బ్రహ్మంగారి గుడి నండి పోలేరమ్మ గుడికి వెళ్ళే దారిలో ఒక ఫర్లాంగు దూరంలో కక్కయ్య స్వామిగుడి ఉంది. ఇక్కడ హరిజనులే ఆ గుడికి ధర్మకర్తలుగా పూజారులుగా వ్యవహరిస్తున్నారు. ఉత్సవ సమయాలలో భజనలు కార్యక్రమాలు బాగా నిర్వహిస్తున్నారు.

## శ్రీ గాయత్రీ సమేత శ్రీ విరాట్ విశ్వకర్మ వంశవృక్ష ఆలయం



కడపజిల్లా కందిమల్లాయ పల్లె యందు బ్రహ్మశ్రీ పట్నాల సన్యాసిరావు, ధర్మపత్ని శ్రీమతి రత్నంగార్ల ఆర్థిక సహకారంతో సృష్టికి సంబంధించిన 9 దేవాలయములు నిర్మించబడినవి. 17.02.2005 వ తేదిన వివిధ దేవతామూర్తులతో ప్రతిష్టించబడిన ఈ దేవాలయములో శ్రీ పంచముఖ హేరంబ గణపతి, శ్రీ గాయత్రి విశ్వకర్మభగవానులు, సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానముఖ పంచకముల నుండి ఉద్భవించిన మను, మయ, త్వష్టి, శిల్పి, విశ్వజ్ఞులు శ్రీ పార్వతీసమేత పరమేశ్వరుడు, శ్రీలక్ష్మీదేవి సమేత విష్ణుమూర్తి, శ్రీ సరస్వతీదేవి సమేత బ్రహ్మదేవుడు, శ్రీ శచీదేవి సమేత ఇంద్ర భగవానుడు. శ్రీ సంజ్ఞాదేవి సమేత సూర్యభగవానుడు. మరియు శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామివార్ల

ప్రపంచమున సర్వ మానవాళికి గోత్రముల పురుషులైన సానగ, సనాతన, అహభూన, సప్రత్న, సువర్ణులనబడు గోత్ర ఋషులు, అలాగే వీరందరికి మూలమైన శ్రీ గాయత్రి విశ్వకర్మ భగవానులు ప్రపంచమున మరెచటనులేని విధంగా మూర్తివంతముగా ఈ దేవాలయమున ప్రతిష్టించబడి ఉన్నారు.

## పోలేరమ్మ


బ్రహ్మంగారి మూడవ కుమారుడు పోతులూరయ్య బ్రహ్మంగారు సమాధిలో జీవించి ఉన్నారో లేదో నిజం తెలుసుకోవాలని సమాధి బండ తొలగించారు. బ్రహ్మంగారి సమాధి ధ్యానానికి భగ్నం కలిగించాడు. బ్రహ్మంగారు పోతులూరయ్యకు శాపమిచ్చారు. 14 సం॥లు అరణ్యవాసం చేయమని, అరణ్యవాసం కాలంలో పోతులూరయ్యకు సహాయంగా వుండమని గోవిందమ్మ కోరగా, పోలేరమ్మ యాదవ బాలికగా పోతులూరయ్యకు పాలు పండ్లు అందించి సేవలు చేసింది. తపస్సు ముగిసిన తదుపరి పోతులూరయ్య వెంట వచ్చిన పోలేరమ్మను కంది మల్లయ్య పల్లెకు తూర్పున 1కి.మీ. దూరములో ఉన్న ఒక వేప చెట్టు వద్ద ఉండమని ఆజ్ఞాపించాడు. పోలేరమ్మ ఆవేపచెట్టులో ఐక్యమైంది. ప్రతి వైశాఖశుద్ధ ఏకాదశినాడు పోలేరమ్మ జాతర జరుగుతుంది. ఆ రోజే రథోత్సవం కూడా.




ఇక్కడ జంతు బలులు ప్రభుత్వ నిబంధనల రీత్యా నిషేధము. అయినా భక్తులు ప్రతి ఆదివారం పొట్టేళ్ళను, మేకపోతులను, కోడిపుంజులను బలియిస్తుంటారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకుంటుంటారు.

## ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ

బ్రహ్మంగారి మఠంలో జేజినాన్న సమాధికి, తండ్రి సమాధికి పూజలు చేస్తూ సమీపములోని సింగరాయకొండ సమీపంలోని ఒక గుహలో ఈశ్వరీదేవి కొంత కాలం తపస్సు చేసింది. బ్రహ్మంగారిమఠం నుండి దాదాపు 4 కి.మీ. దూరములో పడమటి వైపున శింగరాయ దేవాలయము సమీపంలో ఈ గుహ ఉంది. చాలా ఇరుకైన గుహ. మోకాళ్ళపై ప్రాకుతూ లోపలకు వెళ్లాలి. టార్చిలైటు సహాయంతో కొందరు సందర్శకులు లోపలకు వెళ్లి వస్తుంటారు. అప్పుడప్పుడు కొందరు సాధువులు ఆ గుహలోకి వెళ్ళి అక్కడ తపస్సు చేసుకుంటు ఉంటారు. వచ్చే యాత్రికులకు సౌకర్యంగా ఉండేందుకు అక్కడి గ్రామస్తులు కొందరు అక్కడి గుహ వద్ద నీటి సౌకర్యం కల్పించి, కొండపైకి ఎక్కుటకు దారిని నిర్మించి అభివృద్ధి పరిచారు. మార్గం కష్టతరంగా వున్నా తప్పక దర్శించాల్సిన గుహ ఇది.




# సిద్ధయ్యగారి మఠం



బ్రహ్మంగారి ప్రియ శిష్యుడు సిద్ధయ్య పుట్టిన గ్రామమే ముడమాల, బ్రహ్మంగారిమఠం నకు 15 కి.మీ. దూరంలో ఉంది ముడమాలకు తూర్పుదిశలో సిద్దయ్యగారి జీవసమాధి ఉంది.సిద్ధయ్య పుత్రులలో పెద్దవీరయ్య తపోధనుడు. తాను జీవసమాధి అగుటకై స్థలమివ్వమని అడుగగా సిద్దయ్య సమాధి ప్రక్కకు జరిగి సమాధికి స్థలమిచ్చారట సిద్దయ్య. పెద్దవీరయ్య సమాధులున్నదే ముడుమాల సిద్దయ్య గారిమఠం. బ్రహ్మంగారి మఠమును దర్శించిన ప్రతి భక్తుడు బ్రహ్మంగారి శిష్యుడైన సిద్దయ్య గారి మఠాన్ని కూడా దర్శిస్తుంటారు.


**యోగదండం :** వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు జీవసమాధి చెందే సమయంలో సిద్దయ్యను బనగానపల్లె వెళ్లి పూలు తెమ్మని పంపించి గోవిందమ్మగారు,ఎద్దడుగు కనుమ గుండా వెళ్లిన సిద్దయ్య పూలు తీసుకొని వచ్చినా ఫలితం లేదు. ఆ సమయానికి బ్రహ్మంగారు జీవసమాధిలో ప్రవేశించారు. గురువు బ్రహ్మంగారు దర్శనమిచ్చి ముళ్ళులేని ఆకులను



మూడు పిడికిళ్లు తీసుకుంటే అవి పూలుగా మారిపోయాయి. తిరిగి వచ్చిన సిద్దయ్యకు స్వామి సమాధి కనిపించింది. ప్రాయోపవేశం చేసుకుందామని నిశ్చయించుకున్న సిద్దయ్యకు బ్రహ్మంగారు సమాధి నుంచి బయటకు వచ్చి శిఖాముద్రిక, యోగదండం, పావుకోళ్లు యిచ్చారు. అవి యిప్పటికీ వున్నాయి. యాత్రికులు దర్శించుకుంటుంటారు. స్వామివారు యిచ్చిన యోగదండం, పాదుకలు, శిఖాముద్రిక కూడా ఇక్కడ మనకు కనిపిస్తాయి.

## ముడుమాల లోని తాళపత్రాలు, పంచముఖ వేపచెట్టు

బ్రహ్మంగారు వ్రాసిన కాలజ్ఞానాన్ని అచ్చమ్మగారింట్లో పాతర వేశారు. బ్రహ్మంగారి మనమరాలు ఈశ్వరీదేవి వివాహము చేసుకోవాలని నగరిపాడు రంగరాజు వచ్చారు. కులము వేరు కావున వీలుకాదన్నారు. బ్రహ్మంగారి కాలజ్ఞానంలో మీ పెళ్లి ప్రసక్తి ఉంటే ఇద్దరికి వివాహం చేస్తామన్నారు. పోతులూరయ్య రంగరాజు బనగానపల్లె వెళ్లి కాలజ్ఞానం తెచ్చారు. ఆ కాలజ్ఞానమునకు ప్రతి యిక్కడ కూడా ఉంది. వాటితోబాటు తదితర తాళపత్రాలు కూడా ఇక్కడ ఉన్నాయి. కాలజ్ఞానం ప్రతిని అందరూ చూడవచ్చు.




బ్రహ్మంగారి శిష్యుడు సిద్ధయ్యకు గురుకానుకగా యిచ్చిన అపురూప వస్తువు శిఖాముద్రిక. ఇవి రాజముద్రిక వంటిది. దీనిపై రువాయ్యఅ. తిప్పి వ్రాస్తే అయ్యవారు అనే అక్షరాలు కనిపిస్తాయి. బ్రహ్మంగారు యిచ్చిన ఈ అపురూప వస్తువులన్నీ మూలానక్షత్రమున యాత్రికుల సందర్శనార్థం ఉంచుతారు. సిద్ధయ్యగారి మఠం వద్దే సమాధికి పడమటి భాగంలో ఒక ప్రత్యేక గదిలో వీటిని భద్రపరచి ఉంటారు. సిద్దయ్యగారి మఠం ముఖ్యద్వారమునకు కుడివైపున పంచముఖ వేపచెట్టు ఉంది. సామన్యంగా గుండ్రని ఆకారం కలిగి ఏపుగా వుంటుంది వేపచెట్టు. కానీ ఈ వేపచెట్టు అయిదు ముఖాలతో (రుద్రాక్షవలె) కనిపిస్తుంది. ఈ వింతైన వృక్షానికి భక్తులు పూజలు కూడా చేస్తారు.



## విభూతి నాగలింగేశ్వరస్వామి

బ్రహ్మం గారు యాత్రలు చేస్తూ తిరిగే సమయంలో అమగంపల్లె గ్రామానికి ఉత్తర దిశలో 3కి.మీ. దూరంలో అక్కంపేట అను గ్రామంలో ఒక విభూతి

పండును లింగాకృతిని చేసి ప్రతిష్టించారు. అదే విభూతి నాగలింగేశ్వర స్వామి. ఈ విభూతి పండు నుంచి మనం విభూతి తీసుకన్నా తరిగి పోకుండా అది యిప్పటికి అలాగే ఉంది. కొంత విభూతి గిల్లుకున్నా త్వరలోనే అదే పూరించబడుతుందని గ్రామస్తులు చెబుతారు. ఈ వార్త ప్రముఖ వార్తా పత్రికలలో కూడా వచ్చింది. చిన్నగ్రామమైనా ఒక విశ్వబ్రాహ్మణ కుటుంబం ఈ గుడికి పూజారులుగా వ్యవహరిస్తూ ఇతర సమయాలలో వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవిస్తూ ఉంటారు.

## అల్లాడు పల్లె వీరభద్రస్వామి


బ్రహ్మం గారు వీరభద్రుని శిల్పం చెక్కి కుముద్వతీ నదిలో వదిలారు. నీటి వాలుకు కొట్టుకొనిపోయి ఆ విగ్రహం అల్లాడుపల్లె వద్ద మడుగులో చేరింది. అక్కడ పశువులు మేపుకొనే బాలురతో ఈ విగ్రహం బాలునిగా మారి ఆడుకొని తిరిగి మడుగులోకి చేరుకునేది. ఈ వింతను బాలులు గ్రామంలో పెద్దలకు చెప్పగా అందరూ కలిసి మడుగులో వెదికి వీరభద్రుని విగ్రహం వెలికితీసి కుందూనదికి తూర్పు భాగాన ప్రతిష్ఠించారు. శిల్పం అద్భుతంగా ఉంటుంది. తాను శిల్పీకరించిన వీరభద్రునే గురువుగా భావించి బ్రహ్మం గారు పూజించారు. ఆ తదుపరి బ్రహ్మం గారు కందిమల్లయ్యపల్లె చేరారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయం



మైదుకూరు నుండి ప్రొద్దుటూరు వెళ్లే మార్గంలో 7 కి.మీ. దూరంలో కుందూనది ఒడ్డున ఉంది. ప్రతి సోమవారం ఉదయం స్వామికి ఘనంగా అభిషేక కార్యక్రమం జరుగుతుంది. కార్తీక సోమవారాలలో ఇక్కడ రద్దీ ఎక్కువ. పెళ్లిళ్లు, పుట్టు వెంట్రుకలు తీయించుకొని ఆ స్వామిని భక్తితో కొలుస్తుంటారు స్థానికులు. బ్రహ్మంగారిమఠం వచ్చిన భక్తులు అల్లాడుపల్లె వెళ్లి వీరభద్రుని దర్శించుకుంటారు.


## పెద్ద కొమెర్ల

పెద్దకొమెర్ల బ్రహ్మంగారు వివాహం చేసుకున్న, గ్రామం పెద్దకొమర్ల. ఇది జమ్మల మడుగు తర్వాత కోవెలకుంట్లకు వెళ్లే దారిలో ఉంది. శివకోటయాచారి కుమార్తె గోవిందమ్మను ఇక్కడే వివాహం చేసుకున్నారు. చనిపోయిన మనిషిని బ్రతికించి తన మహాత్మ్యం చూపారు. తనను పరీక్షించదలచిన ఆకతాయిలకు బుద్ధి చెప్పుటకు బ్రతికిన వానిని చనిపోవునట్లు చేసి మళ్లీ బ్రతికించారు. యిటీవల కాలంలో ఈ పెద్దకొమెర్ల గ్రామంలో ఒక ప్రత్తికాయలో బ్రహ్మంగారి రూపం ఏర్పడింది. అది తెలిసికొన్న వేలాది భక్తులు పెద్దకొమెర్లకు వెళ్లి ప్రత్తికాయలోని బ్రహ్మంగారి రూపాన్ని దర్శించుకున్నారు. అన్ని వార్తా పత్రికలలో ఈ విషయం ప్రచురించబడింది.




## బనగానపల్లె చింతచెట్టు

బ్రహ్మంగారు గరిమిరెడ్డి అచ్చమ్మ గారింట గోపాలనం చేస్తూ రవ్వలకొండ గుహలో కాలజ్ఞానం వ్రాశారు. పూర్తి చేసిన కాలజ్ఞానాన్ని ఒక నేలమాళిగ కట్టించి అందులో నిక్షిప్తం చేసి బండ మూసి దానిపై ఒక చింత చెట్టును నాటించారు. ఈ కాలజ్ఞానం కాలానుగుణంగా బయటికి రాగలదని చెప్పారు బ్రహ్మంగారు. పూర్వపు చింత చెట్టు పెద్దగాలి వానలకు పడిపోగా గ్రామస్తులు ఆ చోట మరొక చింత చెట్టును నాటించారు. దానినే చింతమానుమఠం అని కూడా అంటారు. ఇక్కడ బాగా అభివృద్ధి చేసి ప్రస్తుతం నిత్య అన్నదానం కూడా చేస్తున్నారు. బనగానపల్లె చూడటానికి వచ్చిన యాత్రికులకు చక్కని వసతి కల్పిస్తున్నారు.



## రవ్వలకొండ కాలజ్ఞానం వ్రాసిన గుహ

బనగానపల్లెకు మూడు కిలోమీటర్ల దూరములో ఉంది రవ్వలకొండ. ఇక్కడే బ్రహ్మంగారు అచ్చమ్మగారి గోవులను కాసింది. ప్రతిరోజు రవ్వలకొండలో గిరిగీచి ఆ గీత మధ్యలో ఆవులు మేస్తూ ఉండగా స్వాములవారు ప్రక్కనే ఉన్న గుహలలో కాలజ్ఞానం వ్రాసేవారు. రవ్వలకొండపై ఇప్పటికి గడ్డికూడ మొలవదు. అయినా స్వామివారి మహిమతో ఆగిరి మధ్యలోనే ఆవులకు సరిపడా పచ్చిమేత మొలిచేది. నిండుగా మేసే ఆవులు దండిగా పాలు యిచ్చేవి. స్వామి తిరిగిన కొండ రవ్వల కొండ పరమ పవిత్రమైన స్థలం. బనగానపల్లె వెళ్లిన ప్రతివారు రవ్వలకొండ వెళ్లి వస్తారు.




**కాలజ్ఞానం వ్రాసిన గుహ :** బ్రహ్మంగారు బనగానపల్లెలో గరిమిరెడ్డి అచ్చమ్మగారింట గోపాలనం చేసాడు. బనగానపల్లెకు సమీపంలోని 3కి.మీ. దూరంలో రవ్వల కొండ ఉంది. ఆ కొండ మీదే ఆవులను ఒకచోట ఉంచి చుట్టూ గిరిగీసి సమీపంలోని ఒక గుహలో ప్రవేశించి రోజూ తాళపత్రాలపై కాలజ్ఞానం వ్రాసేవాడు. ఈ గుహలోకి వెళ్లాలంటే చేదబావిలోనికి దిగినట్లు నిచ్చెన మెట్ల ద్వారా దిగి లోనికి ప్రవేశించవచ్చు. ఈ గుహలో మోకాటిలోతు నీళ్లు ఉంటాయి. కొంతదూరం వెళితే అక్కడ ఒక అరుగు ఉంది. దాని మీదనే స్వాములవారు కూర్చొని కాలజ్ఞానం వ్రాసేవారు.


**బ్రహ్మంగారి చెలమ :** రవ్వల కొండ సమీపంలో గోవులను కాసి బ్రహ్మంగారు తిరిగి వచ్చేటప్పుడు ఈ చెలమలో నీళ్లు తాగేందుకు ఉపయోగపడేది. చాలా చిన్న చెలమ అయినా సదా నీరు ఊరుతుండేది. ఎంత తోడినా తరిగేవికాదు. బ్రహ్మంగారు ఉపయోగించిన ఈ చెలమ నీరు పరమ పవిత్రంగా భావించి బనగానపల్లె నవాబు కూడా చెలమ నుండి నీరు తెప్పించుకున్నారట.

## యాగంటి బసవయ్య యాగంటి ముచ్చట్ల కొండ

బ్రహ్మంగారు, గరిమరెడ్డి అచ్చమ్మకు ఉపదేశం చేసిన చోటు యాగంటి. ఇక్కడ యాగంటేశ్వరునికి ఎదురుగా కాకుండా కొంచెం ప్రక్కగా ఒకపెద్ద నంది విగ్రహముంది. ఈరాతి నంది పూర్వము నుండి కొంచెం కొంచెం పెరిగి పెద్దదవుతున్నదని స్థానికులు చెబుతారు. పూర్వం ఈనంది చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. ప్రస్తుతం నంది పెరిగినందున నాలుగు స్తంభాల మధ్య ఖాళీ లేదు. యాగంటి బసవయ్య రంకెవేస్తాడని బ్రహ్మంగారు కాలజ్ఞానంలో  వివరించారు.




**యాగంటి ముచ్చట్ల కొండ** బనగానపల్లెకు 20 కి.మీ. దూరంలో యాగంటి ఉంది. ఇది యాగంటేశ్వరుడు నెలకొన్న ప్రసిద్ధ శివక్షేత్రం. ఇక్కడి ఎత్తైన కొండలు, జలపాతాలు సుందరమైన ప్రకృతి చూపరులను ఆకర్షిస్తుంది. ఆ క్షేత్రమున శని వాహనమైన కాకికి ప్రవేశంలేదు. ఈ గుడికి పడమటి వైపున వున్న ఎత్తైన కొండలో అనేక గుహలు ఉన్నాయి. అందులో ఒక గుహలో బ్రహ్మంగారు గరిమిరెడ్డి అచ్చమ్మకు ఉపదేశమిచ్చాడు. గరిమిరెడ్డి అచ్చమ్మకు పంచాక్షరిని బోధించి వివరించి నందున ఈ కొండకు ముచ్చట్ల కొండ అని పేరు. నిరంతరం నీరు పారుతూ జలపాతం అద్భుతంగా ఉంటుంది. యాగంటినందు ఉండే బసవన్న అతి పెద్దరాతి నంది. ఈ నందికి గురించి బ్రహ్మంగారు తనకాలజ్ఞానంలో "యాగంటి బసవన్న రంకెవేసెను" అని వ్రాశాడు. ఇది ప్రముఖ పర్యాటక కేంద్రము. పురావస్తు పరిశోధన శాఖ ఆధీనములో ఉంది.



## నగరిపాడు రంగరాజు

బ్రహ్మంగారి వరప్రసాదం వల్ల జన్మించాడు రంగరాజు. చిట్వేలికి సమీపంలో 15 కి.మీ దూరంలో నగరిపాడు కలదు. ఈ రంగరాజు గోవిందస్వాములవారి కుమార్తె ఈశ్వరీదేవిని పెళ్లాడాలని వచ్చాడు. అందుకు పెద్దలు అంగీకరించలేదు. బ్రహ్మంగారు కాలజ్ఞానంలో రంగరాజు, ఈశ్వరీదేవి పెళ్లి గురించి వుంటే అంగీకరిస్తామన్నారు. పోతులూరయ్యతో కలిసి రంగరాజు బనగానపల్లెకు వెళ్లి కాలజ్ఞానం ప్రతిని తెచ్చారు. అందులో వివాహ విషయం లేనందున తిరిగి నగరిపాడు వెళ్లి అగ్నిగుండ ప్రవేశం చేశాడు. ఈ విషయం తెలియని పోతులూరయ్య నగరిపాడు వెళ్లి రంగరాజును పిలువగా అగ్నిగుండం నుండి కంకణం ఉన్న చేయి చాపాడు. ఆయన సమాధిని నిర్మింపజేసి పూజా కార్యక్రమములు నిర్వహించునట్లు చేయించారు పోతులూరయ్య. ప్రతి ఏటా ఆరాధన నగరిపాడులో వైభవంగా జరుపుతారు. రాజంపేట, చిట్వేలు నుండి నగరిపాడు వెళ్లవచ్చు.



## పాపగ్నిమఠం

బెంగుళూరుకు దాదాపు 70 కి.మీ. దూరంలో చిక్కబళ్ళాపూర్ ఉంది. చిక్కబళ్లాపూర్‌కు 7 కి.మీ. దూరంలో ఈ పాపాగ్ని మఠం ఉంది. నంది కొండ సమీపంలో ఉంది. ఇక్కడే బ్రహ్మంగారి బాల్యం గడిచింది. ఎనమదల వీరభోజయాచార్యులు, వీర పాపమాంబల దంపతులకు దత్తపుత్రుడుగా ఈ పాపాగ్నిమఠంలోనే శ్రీ వీరబ్రహ్మంగారు బాల్యం గడిపారు. తన 12 సం॥ల ప్రాయంలోనే తల్లికి పిండోత్పత్తి వివరించారు. అక్కడ వీరభోజయాచార్యులు, వీరపాపమాంబల సమాధులు కలవు. సమీపంలో చిన్న నది ప్రవహిస్తూ పచ్చిక బయళ్లతో, ప్రశాంత వాతావరణంతో చూడ చక్కని ప్రదేశం ఈ పాపగ్నిమఠం. నిత్య అన్నదానం జరుపుతుంటారు.

## ఆరాధన, మహాశివరాత్రి

**రథోత్సవం :** ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమినాడు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన గురుపూజోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి లక్షలాది ప్రజలు భక్తులు యాత్రికులు ఉత్సాహాలతో పాల్గొంటారు. వైశాఖ శుద్ధ ఏకాదశినాడు బ్రహ్మంగారికి రథోత్సవం నిర్వహింపబడుతుంది. గోవిందమాంబ సమేతుడైన బ్రహ్మంగారికి ఉత్సవ విగ్రహాలను బ్రహ్మరథంపై ఊరేగిస్తారు. సుందరశిల్ప సౌందర్యం కలిగిన ఈరథం చెక్కలతో తయారు చేయబడింది. స్వామి గుడి ముందర రింగు రోడ్డులో ఈ రథోత్సవం నిర్వహింపబడుతుంది. వేలాది భక్తులు రథము గొలుసులు లాగుతుండగా జై వీరబ్రహ్మం జై గోవిందమాంబ జై అని భజన సాగుతుండగా అడుగడుగున కర్పూర హారతులతో రథోత్సవం సాగుతుంది. రథం చక్రాల కింద గుమ్మడికాయలు ఉంచడం, ఆ పగిలిన గుమ్మడికాయలను ప్రసాదంగా తీసుకోవటం భక్తులకు ఆచారం.





## బ్రహ్మంగారి కళ్యాణం

వీరబ్రహ్మేంద్రస్వాముల వారు పెద్దకొమెర్ల గ్రామములోని శివకోటయ్య కుమార్తె గోవిందమ్మనువివాహము చేసుకున్నారు. ఆయన కల్యాణం మహాశివరాత్రి పర్వదినాన పెద్దకొమెర్ల గ్రామములో జరిగింది. దానికి ప్రతీకగా కందిమల్లాయ్య పల్లెలోని బ్రహ్మంగారి కళ్యాణ మండపము నందు గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర కళ్యాణం ప్రతియేట మహాశివరాత్రి నాడు అద్భుతంగా జరుగుతుంది. ఈ కళ్యాణం ఏడాదికి ఒక్కసారి జరగటం విశేషం పెద్దకొమెర్ల నుండి అమ్మగారికి కుంకుమ, పసుపు, చీరసారెలు ఆ రోజు గ్రామస్తులు తీసుకొని వస్తారు. మఠాధిపతులు సకుటుంబంగా ఈ కళ్యానోత్సవంలో పాల్గొంటారు. పెద్దపుత్తావీరారెడ్డి గారు పూర్వం కళ్యాణ మండపం నిర్మించిన దాతలు కావున వారి కుటుంబం అంతా ఉభయదాతలుగా కళ్యాణములో పాల్గొంటారు. తదుపరి భక్తులకు అక్షతలు ప్రసాదంగా ఇస్తారు.

# బ్రహ్మం సాగర్

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి జీవితచరిత్ర చలనచిత్రాన్ని 1982లో యన్.టి.రామారావు గారు నిర్మించారు. బ్రహ్మంగారి వేషంలోని యన్.టి.రామారావు గారు నటించారు. బ్రహ్మంగారి వేషంలోని యన్.టి.రామారావును చూడటానికే జనం తండోప తండాలుగా వచ్చేవారు ఆ తరువాత సినీరంగాన్ని వదలి రాజకీయరంగ ప్రవేశం చేసి అతి తక్కువ కాలంలోనే ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మంగారి మఠానికి ముఖ్యమంత్రి హెూదాలో రెండుసార్లు పర్యటించారు. బ్రహ్మంగారిపై ఉన్నభక్తి విశ్వాసాలకు ప్రతీకగా ఈ ప్రాంతవాసులు కలకాలం మరచిపోని విధంగా తెలుగుగంగ ప్రాజెక్టును నిర్మింపజేసి దానికి బ్రహ్మంసాగర్ అని నామకరణం చేశారు. 1984 ఏప్రిల్ 24వ తేదీన తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ యం.జి.రామచంద్రన్ మరియు ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ యన్.టి.రామారావు వచ్చి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.



# బ్రహ్మంగారిమఠం చేరుటకు వివిధ ప్రదేశముల నుండి బస్సు, రైలు ప్రయాణ మార్గాలు

**బెంగుళూరు** నుండి - చింతామణి - మదనపల్లి- రాయచోటి-కడప- మైదుకూరు- బ్రహ్మంగారిమఠం

**బళ్ళారి** నుండి - గుత్తి - తాడిపత్రి - జమ్మలమడుగు - ప్రొద్దుటూరు- మైదుకూరు- బ్రహ్మంగారిమఠం

**చెన్నై** నుండి - రేణిగుంట - రైల్వే కోడూరు - రాజంపేట - కడప - మైదుకూరు- బ్రహ్మంగారిమఠం

**తిరుపతి** నుండి - రేణిగుంట - రైల్వే కోడూరు - రాజంపేట -కడప- మైదుకూరు- బ్రహ్మంగారిమఠం

**హైదరాబాదు** నుండి - జడ్చర్ల - కర్నూలు - నంద్యాల-ఆళ్ళగడ్డ- మైదుకూరు- బ్రహ్మంగారిమఠం

**విజయవాడ** నుండి - గుంటూరు - వినుకొండ - మార్కాపురం - కంభం - పోరుమామిళ్ళ - మల్లేపల్లి - బ్రహ్మంగారిమఠం

**విశాఖ** నుండి - రైలుమార్గము ద్వారా విజయవాడ మీదుగా గిద్దలూరు చేరుకోవచ్చును. గిద్దలూరునుండి బస్సుద్వారా పోరుమామిళ్ళ మీదుగా బ్రహ్మంగారిమఠం

**అనంతపురం** నుండి - ఉ॥ 6 గం॥లకు డైరెక్టు బస్సు ఉన్నది.

**ప్రకాశం జిల్లా పొదిలి** నుండి కూడా డైరెక్టు బస్సు ఉన్నది.


# మా ప్రచురణలు















Cell : 94411 76276
SRI BALAJI PUBLICATIONS
28-25-14/1, Arundal Pet, VIJAYAWADA-2
బాలాజీ